ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2010 Q1 జనవరి – మార్చి ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

జనవరి 5 న ఏం కాబోతోంది...?
రోశయ్య గారు అలా అనకూడదా..?
హీరోలకు యాస వుండదేం..?
సినిమాల్లో తెలంగాణావారిని రానివ్వరా...?
యాస గురించి మరికొంత..
నాకేం కడుపునొప్పి?
తాడూ వుంది, బొంగరమూ వుంది
జనవరి 5 కి ముందూ, తర్వాత
మీడియాపై జాలి పడాలా ?
చిరంజీవి మాటల్లో అనౌచిత్యం...?
కావూరి కావుకావు...
మతి చెదుర్స్..
డిపెండెంట్సా? ఇండిపెండెంట్సా?
'మేం గెలిపించుకుంటాం...'.
భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ – 1-5
గుమ్మడికి నివాళి
మహ బాగా జరిగింది!
ఇప్పుడెక్కడనుండి వచ్చాడు డిప్యూటీ సిఎం?
విధివిధానాలు..
తోచీ తోచనమ్మ...1-2
మేం రెడీ? మీరు రెడీయా..? – 1-2
కావలెను – 'సత్యపీఠం'
పట్టుచీర మార్చేయనా...?
జాయింటు వూడిపోయింది
చిదంబరం వ్యక్తిగతం గతమేనా? 1-3
'బాయిలో తోశారు..'
శ్రీకృష్ణ కమిటీకి నా లేఖ – 1-2
టార్గెట్ టిడిపి
సమైక్యవాదినా? విభజనవాదినా? – 1-2
ఫీ జో'కొట్టుడు' 1-3
జ్యోతీ – కాగడా – 1-4
ఖతార్(నాక్) హుస్సేన్ – 1-3

**జనవరి 01, 2010**

## ఎమ్బీయస్ - జనవరి 5 న ఏం కాబోతోంది...?

జనవరి 5 న ఢిల్లీ రమ్మనమని చిదంబరం గారు 8 పార్టీలకు లేఖలు రాసిన దగ్గర్నుంచీ వూహాగానసభలు జోరుగా సాగుతున్నాయి. ఈ చర్చల్లో మమ్మల్ని పిలవకపోతే వూరుకోం అంటూ తమను తామే ఆహ్వానించేసుకున్నారు విద్యార్థి నాయకులు. డిసెంబరు 31 సాయంత్రం చిదంబరం స్పష్టంగా చెప్పవలసి వచ్చింది - ఇది భవిష్యత్తు కార్యాచరణ ఎలా వుండాలో ఆలోచించే చేయవలసిన చర్చలలో తొలి అడుగు మాత్రమే నని. సరిగ్గా చెప్పాలంటే 'సమస్య పరిష్కారానికి మెకానిజం, రోడ్ మ్యాప్ నిర్ణయించడానికి రమ్మన'మని పిలిచామన్నాడు.

ఇది ఏ మాత్రం తప్పు పట్టలేని స్టేట్‌మెంట్. ఆక్షేపణ ఒక్కటే - 2004లోనే యిది మొదలు పెట్టవలసినది అని. ఈ ఆలస్యానికి సంస్థగా కాంగ్రెస్, వ్యక్తిగా సోనియా భారీమూల్యం చెల్లించవలసి వచ్చింది. 'కేంద్రం యిస్తే మేము అడ్డు రాము' (చిరంజీవి) 'కాంగ్రెస్ తీర్మానం పెడితే మేము సమర్థిస్తాం' (టిడిపి) , ఎటువంటి నిర్ణయం తీసుకుంటే ఎలాటి పరిణామం వస్తుందో తమ మనసులో మాట చెప్పకుండా 'హై కమాండ్ ఎంత చెపితే అంత' అని పైకి అంటూ 'మేం కోరుకున్నది చెప్తేనే..' అని మనసులో ముక్తాయింపు యిచ్చుకుంటూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు.. యిలాటి దోబూచులతోనే కాలం గడిచింది. .ప్రత్యేకవాదులచేత బాగా తిట్లు పడ్డాక, సోనియాకు అనిపించి వుంటుంది - బంతి నా కోర్టులో పడేసి వీళ్లంతా అక్కడ ఆడేసుకుంటున్నారు. వాళ్లని యిక్కడకు రప్పించి అదే బంతి ఎలా ఆడతారో వేడుక చూద్దాం అని. లెట్‌మీ స్టార్ట్ ద ప్రాసెస్ అండ్ బ్రింగ్ యిట్ టు ది లాజికల్ ఎండ్ అని.

రాష్ట్రవిభజనను వ్యతిరేకించే భావన ఎంత బలంగా వుందో స్పష్టంగా తెలిసింది కాబట్టి, ఇప్పుడు కేంద్రం పిలిచి అడిగేస్తుంది - మీరు ప్రాతినిథ్యం వహించే ప్రజలు ఏం కోరుకుంటున్నారు? మీ అందరినీ సంప్రదించి మెజారిటీ అభిప్రాయంతో మేం తీసుకునే నిర్ణయాన్ని మీరు ప్రజలచేత వొప్పించగలరా? అసలు ప్రజాభిప్రాయం ఎలా తెలుసుకోవాలి? రిఫరెండమా? సమాజంలో వివిధ వర్గాల నుండి అభిప్రాయ సేకరణా? ఆ అభిప్రాయం సేకరించేది కాబినెట్ కమిటీయా? లేక అధికారుల సంఘమా? విభజనతో ముడిపడిన అంశాలకు మీ వద్దనున్న పరిష్కారం ఏమిటి? ఆ కమిటీకి ఎంత సమయం యివ్వాలి?' యిలా చెడామడా ప్రశ్నలు దట్టిస్తుంది. కాబినెట్ కమిటీ వేస్తుంది అని రెండు రోజుల క్రితం వార్తలు వచ్చాయి. మళ్లీ ఆ కమిటీ వేస్తే అదేం హానో, దానికి ఏ అభిప్రాయాలు అంటగడతారో అన్న భయం కొద్దీ ఎలాటి కమిటీ వేయాలో కూడా మీరే తేల్చండి అని జనవరి 5 న అడగబోతున్నారు.

జనవరి 5 న పార్టీలవారీగా విభజనపై అభిప్రాయాలు అడుగుతారేమోనని కంగారుపడి అప్పుడే 'కాంగ్రెస్‌వాళ్లు తమ అభిప్రాయం చెప్పందే కుదరదు' అని టిడిపివాళ్లు, 'మేం పిలిచాం కాబట్టి ఆల్‌రెడీ మా అభిప్రాయం తెలిసిపోయినట్టే, యిక చంద్రబాబే నోరు విప్పాలి' అని కాంగ్రెస్‌వాళ్లూ కొట్టేసుకుంటున్నారు. అంతేం అక్కరలేదు. జస్ట్ కమిటీయో, కమీషనో, రెఫరెండమో చెప్తే చాలు. కానీ మనవాళ్ల వరుస చూస్తూంటే అది కూడా చెప్పేలా లేరు. వీటిలో ఏం చెప్పినా తెరాసకు కోపం వస్తుందన్న భయం వీళ్లది. కమిటీ లేదా కమీషన్ అంటే కాలయాపన అవుతుందని, రెఫరెండంలో తెలంగాణాలో సమైక్యవాదం ఏ మాత్రం వుందని తేలినా తమ వాదన వీగిపోతుందనీ భయం.

అందుకని ఢిల్లీ వెళ్లగానే వాయినం యిచ్చినట్టు ప్రత్యేక తెలంగాణా తాంబూలంలో పెట్టి యిచ్చేయాలని వాళ్ల అభిప్రాయం. హైదరాబాదుతో సహా తెలంగాణా యిచ్చేశాం అని ప్రకటించి ఎప్పుడిస్తారో చెప్పడానికి కావాలంటే కమిషన్ వేయండి అంటారు వాళ్లు. ఆ ప్రకటన చేయడానికే యీ కసరత్తు అంటే వాళ్లు తిరస్కరిస్తారు. తెరాస తిరస్కరించిందంటే తెలంగాణా కాంగ్రెస్ ప్రతినిధి, తెలంగాణా టిడిపి ప్రతినిధి కూడా తిరస్కరించి తీరతారు. లేకపోతే ఆటోమెటిక్‌గా తెలంగాణా ద్రోహులన్న ముద్ర పడిపోతుంది. అన్ని విషయాలూ కూలంకషంగా చర్చించందే ఎలాటి ప్రకటనా చేయదు కేంద్రం, యిప్పటికే మూతి కాలింది కాబట్టి.

అసెంబ్లీ తీర్మానం ఆరోవేలు లాటిదే నని తెలిసి కూడా మొదటినుండీ వారు అది కావాలని చెప్పడంలో అర్థం ఏమిటి? మీలో మీకే ఐక్యత లేదురా బాబూ, మీ అందరూ కలిసి మమ్మల్ని నిందిస్తున్నారు అనవసరంగా అని చాటి చెప్పడానికి. అసెంబ్లీలో ప్రాంతాల వారీగా ఓట్లు వేస్తే తెలంగాణా తీర్మానం ఎలాగూ వీగిపోతుంది. తెలంగాణా ప్రాంతం నుండి ఏ కారణం చేతనైనా కాసిని ఓట్లు తక్కువ పడ్డాయంటే తెలంగాణా వాదన కూడా వీగిపోతుంది. ఓటింగ్ అనేది ఆఖరిఘట్టం. దానికి ముందు జరిగే చర్చలో అనేక విషయాలు వెలికివస్తాయి. ఏ ప్రాంతం ఎంత వెనకపడింది, ఎందుకు పడింది యివన్నీ తేలుస్తారు. దానికి జవాబులు చెప్పుకోవలసినవారు చాలామంది వుంటారు. ఇవన్నీ కట్ చేసి పడేసి నిర్ణయం బాధ్యత మామీద పడేస్తే మేం వూరుకోం అని చెప్పడానికే అసెంబ్లీయో అంటోంది కేంద్రం.

అలా కమిట్ అవడానికి వీళ్లెవరూ యిష్టపడరు. అందువలన వీళ్లు అసెంబ్లీ సమావేశంలోలాగానే, అఖిలపక్ష సమావేశాలలాగానే జనవరి 5 చర్చల్లో కూడా మధ్యలో వాకౌట్ చేసి, బయటకు వచ్చి 'చర్చల వైఫల్యానికి కారణం కాంగ్రెస్సే, ఉద్యమం కొనసాగించి మన దృఢసంకల్పాన్ని చాటిచెపుదాం' అని స్టేటుమెంటు యిస్తారు. కాదు వైఫల్యానికి కారణం టిడిపియే అని కాంగ్రెస్ అంటుంది. 6 వ తారీకు హెడ్‌లైన్సు యిలాగే వుంటాయని నా భయం. ఈ జోస్యం తప్పి యిలా కాకుండా సజావుగా చర్చలు జరిగి, సమస్య పరిష్కారం దిశగా ఓ అడుగు పడితే నా కంటె సంతోషించేవారు మరొకరు వుండరు. **- ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 02, 2010**

## ఎమ్బీయస్ – రోశయ్య గారు అలా అనకూడదా..?

కోమటి రెడ్డి గారు రోశయ్యగారిపై పడ్డాడు. రోశయ్య కోస్తా, సీమలకే తప్ప మొత్తం రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించడం లేదట. రాష్ట్రంలో శాంతి నెలకొనకపోతే పరిశ్రమలు, పెట్టుబడులు వెళ్లిపోతాయి, వెళ్లిపోతున్నాయి అని అనడం తప్పుట. అలా వెళ్లటం లేదట.

రోశయ్యగారు అన్నా అనకపోయినా శాంతి, అభివృద్ధి కవల పిల్లల వంటివని ఒకటి లేకపోతే మరొకటి మనజాలవని అందరికీ తెలుసు. శాంతిభద్రతల సమస్య ఎప్పుడు వస్తుంది? లేనివాడు ఉన్నవాడిపై తిరగబడినపుడు, దౌర్జన్యం చేసినపుడో వస్తుంది. లేనివాణ్ని కూడా అభివృద్ధి పరచి కాస్త వున్నవాడిని చేస్తే..? సమస్యే రాదు కదా. మీరు పెద్ద మేడ కట్టుకున్నారు. నాది ఎదురుగుండా చెట్టుకింద నివాసం. మీ యింట్లో అర్ధాకలితో పనిచేసే కూలీని. చూసి చూసి ఓ రోజు ఎప్పుడో కోపం వచ్చి మీ యింటికి నిప్పు పెడతాను.

అలాకాకుండా మీరు నన్ను ఎదగనిస్తే, మీ యింటి పక్కన చిన్న గుడిసె వేసుకోనిస్తే, మీ యింటికి నిప్పు పెట్టను, నా యింటికీ వ్యాపిస్తుందన్న భయం. అందువలన మీరు శాంతితో, భద్రంగా వుండాలంటే నన్ను బాగుపడనివ్వాలి. అంతా మీరే జుర్రేసుకోకూడదు.

శాంతి లేనిచోట వుండడానికి పెట్టుబడిదారు కాదు, సామాన్యుడు కూడా వుండడు. అస్సాంకి బదిలీ చేస్తానంటే అక్కడ ఉల్ఫా వాళ్ల చేతిలో చావడం దేనికి? రిజైన్ చేస్తానంటారు మీరు. పన్నుల రాయితీ యిస్తా కేరళలో ఫ్యాక్టరీ కట్టు అంటే 'శుభమాని ఫ్యాక్టరీ శంకుస్థాపన రాయి పాతగానే అరడజను ఎఱ్ఱజెండాలు పాతుతారు. కార్మిక అశాంతితో వేగుతూ అక్కడెందుకు లెండి? దానిలో సగం యివ్వండి పొరుగున వున్న తమిళనాడులో పెట్టుకుంటా' అంటారు.

'అఫ్గనిస్తాన్‌లో బ్రహ్మాండమైన కాంట్రాక్టు. రోడ్డు వేయకపోయినా 70% కమిషన్ యిస్తే బిల్లు పే చేసేస్తారు. మాట్లాడనా?' అంటే 'తక్కిన 30% అనుభవించడానికైనా బతికి వుండాలిగా. అక్కడ రోడ్డు పడకపోతే వాళ్లే అనుభవిస్తారు, మన కెందుకు!' అంటారు. పాకిస్తాన్‌లో, ఆఫ్గనిస్తాన్‌లో, ఇరాక్‌లో... యిలాటి గందరగోళ పరిస్థితుల్లో అభివృద్ధి కాలేదంటే ఎక్కడ అవుతాయి? ఎవడు మాత్రం సుఖాన వున్న ప్రాణాన్ని దుఖాన్న పెట్టుకుంటాడు?

పాతికేళ్లగానే – ఎన్టీయార్ వచ్చాకనే – హైదరాబాదు కుదుటబడింది. అంతకుముందు మన రాష్ట్రం న్యూస్‌లో వుందంటే – ఫర్ ఆల్ రాంగ్ రీజన్స్! నెలల తరబడి వేర్పాటు వుద్యమాలనీ, ఉక్కు వుద్యమాలనీ, బంద్ లనీ, కర్ఫ్యూలనీ, మత కల్లోలాలనీ, నక్సలైట్‌లనీ.. యిలాగే! హైదరాబాదులో ఏ బిల్డింగూ నీట్‌గా కనబడేది కాదు. గోడలమీద ఎఱ్ఱసుద్దతో అమెరికాను తిడుతూ, చైనాను పొగుడుతూ రాతలు. పైన పగిలిన అద్దాలూ.. మెట్లెక్కుతూంటే గోడలమీద కిళ్లీ వుమ్ములూ...

పోనుపోను హైదరాబాద్ మహానగరంగా ఎదిగింది. రోడ్లు విశాలమయ్యాయి. కొన్ని బస్‌స్టాపులుకూడా హై టెక్కులు సంతరించుకున్నాయి. ఫారినర్సు రావడం మొదలెట్టారు. హోటళ్లు ఎన్నో మొలిచాయి. ధైర్యం చేసి బిల్డింగులకు అద్దాలు బిగించ నారంభించారు. కార్పోరేట్ కల్చర్ డెవలప్ అవుతోంది, హైదరాబాదు పేరు దేశవిదేశాల్లో మారుమ్రోగుతోంది అన్న గర్వం కూడా మనకు కలగనారంభించింది.

ఈ యిమేజ్ ఒక్కరోజులో రాలేదు, ఒక్కరితో రాలేదు. హైదరాబాదును ఒక బ్రాండ్‌గా నిలపడానికి ఎందరో ముందుచూపు వున్న రాజకీయ నాయకులు, విద్యార్థులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు శ్రమించారు. ఇండియా అంటే పాములు, మోళీవాళ్లు అనుకునే ఫారినర్స్ వద్దకు వెళ్లి అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే సంస్థలున్నాయని తీసుకుని వచ్చి చూపించారు. వాళ్లు ముగ్ధులయ్యారు. ఇక్కడి కంపెనీలలో వాటాలు పెట్టారు. ఇక్కడి శాస్త్రజ్ఞులను, పరిశోధకులను, మేధావులను, వ్యాపార కుశలురను గౌరవించారు. తమ వద్దకు వచ్చి తమ వ్యాపారాలను చక్కదిద్దమని కోరారు. ఇక్కడి వాతావరణం, వేషభాషలు, మర్యాదా మప్పితాలు, ముఖ్యంగా శాంతిభద్రతలు వాళ్లకు నచ్చసాగాయి. అమెరికన్ కాన్సులేట్ ఓ ఆఫీసు కూడా యిక్కడ తెరిచారు.

ఈ ఆందోళన మొదలయ్యాక పరిస్థితి ఏమిటి? అమెరికా, యూరోప్ తమ పౌరులను హైదరాబాదు వైపు వెళ్లవద్దంది. మనం యిక్కడ బతకడం లేదా? వాళ్ల హడావుడి కాకపోతే అని మనం అనవచ్చు. అస్సాంలో మనుష్యులు బతకటం లేదా? బిహార్, జార్ఖండ్, యుపిలలో బతకటం లేదా? కానీ మీరు ఓ పట్టాన వెళతారా? ఏ బెంగుళూరుకో, మద్రాస్‌కో ట్రాన్స్‌ఫర్ ఆర్డరు మార్చండి సార్ అని బతిమాలతారు.

అలాగే వాళ్లునూ. సరే యిండియన్స్ గొప్పవాళ్లని తెలుసుకున్నాం కాబట్టి ఇండియాలో పెట్టుబడులు పెడదాం. అయితే నిత్యం గొడవలు పడే ఆంధ్రప్రదేశ్‌లో కాదు, పక్కనే వుండి సౌకర్యాలకు ఏ మాత్రం తీసిపోని బెంగుళూరు, మద్రాసు, పుణేలలో పెడదాం అనుకోవడంలో బేసబబు ఏదైనా వుందా? అలా అనుకోరని మీరు వాదించగలరా? అబ్బే ఇక్కడ శాంతంగా వుంది, ఎఱ్ఱ తివాచీలు పరిచి వుంచాం అని మీరు అనగానే సరిపోయిందా?

కెసియార్ నిరాహారదీక్ష టైములో పంజగుట్ట సర్కిల్‌లో అద్దాలు పగిలిన భవంతులు చూస్తే వాళ్లకు తెలియదా? 30 వ తారీకు బంద్ రోజున పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ప్లాస్టిక్ నెట్‌తో తమ మాల్స్ అద్దాలను కప్పి వుంచిన సంగతి గమనిస్తే తెలియదా? ఎవర్ని

ఏమార్చగలరు? వాళ్ల యింటెలిజెన్సు సమాచారం మనదానికంటె అద్భుతంగా పనిచేస్తుంది. మన గురించి మనకంటె వాళ్లకే బాగా తెలుసు.

మీ ప్రకటనలతో, చేతలతో భయం పుట్టించకండి, పెట్టుబడి దారులను అదలగొట్టకండి, శాంతి నెలకొల్పి రాష్ట్రం పరువు కాపాడండి అని ముఖ్యమంత్రి పదవిలో వున్నవాడు అనడం తప్పా? **- ఎమ్బీయస్ ప్రసాద్**

## జనవరి 03, 2010

## ఎమ్బీయస్ - హీరోలకు యాస వుండదేం..?

సినిమా హీరోలకు తెలంగాణా యాస వుండదేం? అన్న అనుమానం వచ్చింది కె కేశవరావుగారికి. వాళ్లమీద దాడులు జరుగుతూంటే సినిమావాళ్లు భయపడి హైదరాబాదు విడిచి వెళ్లిపోదామా అనుకుంటూ వుంటే ప్రభుత్వానికి చెప్పి రక్షణ కల్పిస్తాం లేదా ఉద్యమకారులుకి చెప్పి దాడులు ఆపిస్తాం అని చెప్పడం పోయి కేశవరావు సినిమావాళ్లపై మండిపడ్డారు. పోనీ కదాని స్థలాలు యిచ్చి యిక్కడకు తీసుకుని వస్తే మా యాసను అవమానిస్తూ సినిమాలు తీస్తారా? అని నిప్పులు కక్కారు. అదే ఫ్లోలో 'ఏ సినిమా హీరోకైనా తెలంగాణా యాస పెడతారేమోనని చూస్తున్నాను. హీరోకు మా యాస తగదా?' అని నిప్పులు కక్కారు.

ఇన్నాళ్లూ అనేకమంది నాయకులు యీ యాస గురించి యాగీ చేయడం చూస్తూనే వున్నాం. మేధావిగా ముద్ర వేయించుకున్న ఒకప్పటి పత్రికా రచయిత కేశవరావు కూడా యిలాగ మాట్లాడమేమిటనిపించింది. ఆయన దీనిపై ఎప్పుడైనా దృష్టి పెట్టి ఆలోచించారా? హీరోలకు తెలంగాణా యాస వుండదా? అని గదా ప్రశ్న. అసలు ఏ హీరోకైనా ఏ యాసైనా వుంటుందా? ఏ ప్రాంతంలో తీసిన సినిమాయైనా చూడండి. హీరో ఎప్పుడూ స్టాండర్డ్ భాష మాట్లాడతాడు. సంస్కృత నాటకాలనుండి వచ్చిన పద్ధతి యిది. హీరో, హీరోయిన్లు సంస్కృతం మాట్లాడతారు. తక్కినవారు ప్రాకృతం.

హిందీ సినిమాలు చూడండి. బిహార్‌లో తీసినట్టు చూపించినా, యుపిలో తీసినట్టు చూపించినా, బొంబాయిలో తీసినట్టు చూపించినా, పంజాబ్‌లో తీసినట్టు చూపించినా హీరో, హీరోయిన్, తదితర ముఖ్యపాత్రలు ఒక స్టాండర్డ్ భాషలోనే, అందరికీ అర్థమయ్యే పదజాలంతోనే మాట్లాడతాయి. మధ్యలో మారువేషం వేసినప్పుడో, లేకపోతే ఓ పాటలోనో కాస్సేపు యాస పెట్టినా అది తాత్కాలికమే. సినిమా త్రూ ఔట్, దేశంలో అందరికీ అర్థమయ్యే భాషే మాట్లాడతాడు.

ఇంగ్లీషు సినిమాలూ అంతే. వాళ్లు ప్రపంచం మొత్తం అర్థమయ్యే జనరల్ ఇంగ్లీషు మాట్లాడతారు. ఫ్రెంచ్ యాస పెట్టి, జర్మనీ యాస పెట్టి, అలాస్కా మాండలికం పదాలు జోడించి మాట్లాడితే అర్థం కాక మనం గిలగిల కొట్టుకోవాలి.

తెలుగుకీ అంతే. అది అందాలరాముడు వంటి గోదావరి బేస్డ్ సినిమా అయినా లేదా ఇంద్ర వంటి రాయలసీమ బేస్డ్ సినిమా అయినా - చుట్టూ వున్న పాత్రలన్నీ గోదావరి లేక రాయలసీమ యాస మాట్లాడినా - హీరోమాత్రం మనకు అర్థమయ్యే మామూలు భాషలోనే యాస లేకుండా మాట్లాడతాడు. సహజత్వం లేదంటారనే అపవాదు వస్తుందని సాధ్యమైనంతవరకు మన సినిమాలు హీరో వుండే వూరిపేరు చెప్పవు. పట్నం వెళ్లాడు అంటే గతంలో మద్రాసు చూపేవారు. ఇప్పుడు హైదరాబాదు చూపిస్తున్నారు. మద్రాసు చూపించే రోజుల్లో బస్ కండక్టర్, ఇంటి ఓనరు, బెదిరించే రౌడీ, మోసం చేసే సినిమావాడు - అందరూ తమిళంలో, లేదా తమిళయాస తెలుగులో మాట్లాడేవారు. కథలు హైదరాబాదుకి షిఫ్ట్ అయ్యాక ఆ యా పాత్రలన్నీ హైదరాబాదుయాసలో మాట్లాడుతున్నాయి. దాన్ని తెలంగాణా యాస అనడానికీ లేదు. ఎందుకంటే తెలంగాణాలో కూడా జిల్లాకో యాస. ఈ సినిమాల్లో హైదరాబాదులో మాట్లాడే ఉర్దూ లేదా ఉర్దూ కలిపిన డైలాగులు పెడతారు.

పైగా కొన్ని వృత్తులకు ఒక్కో యాస అని పెట్టారు మన సినిమావాళ్లు. హిందీ సినిమాలో కర్ణాటక సంగీతవిద్వాంసుడు, లేదా ఆఫీసులో హెడ్‌క్లర్క్ అనగానే తమిళవాళ్లను చూపిస్తారు. నాటకాలవాడు అనగానే బెంగాలీవాణ్ని చూపిస్తారు. పోలీసు కానిస్టేబుల్ అనగానే మరాఠీవాణ్ని చూపిస్తారు. తెలుగు సినిమాల్లో జట్కా నడిపేవాడు అనగానే సాయిబు అంటూ మాకీ, మీకీ డైలాగు పెడతారు. ఆయుర్వేద వైద్యుడు అనగానే బ్రాహ్మణయాస పెడతారు. వ్యాపారస్తుడు అనగానే కోమటి అనకుండా బొంగురుగొంతు పెడతారు. తాకట్టు పెట్టుకునే వాడు ఎప్పుడూ మార్వాడీయే - నువ్వు హై, నేను హై అంటూ. హోటల్ నడిపేవాడు అనగానే అరవబ్రాహ్మణ్ని, టీ కొట్టు అనగానే మలయాళీ పడుచుని చూపిస్తారు - ఈ వృత్తులలో వేరేవారు ఎవరూ లేనట్టు.

ఇది సినిమా లోకం. పాత్ర త్వరగా ఐడెంటిఫై కావడమే వాళ్లకు ముఖ్యం. డాక్టర్లను ధనాశాపరులుగా, నర్సులను, కాంపౌండర్లను వెకిలివాళ్లగా, పోలీసు కానిస్టేబుళ్లను లంచగొండులుగా, పోలీసు అధికార్లను నాయకుల తొత్తులుగా చూపిస్తారు. ఎందరు అభ్యంతర పెట్టినా వాళ్లు మానరు. ప్రజలు స్పందించడం మానేశారు. తమ వృత్తివారిని కించపరిచినా సినిమాను బహిష్కరించరు. కావాలంటే లెటర్స్ టు ఎడిటర్‌కు ఓ ఉత్తరం రాసిపడేసి సకుటుంబంగా వెళ్లి చూసి వస్తారు. అందుకే సినిమావాళ్లకు యివేమీ పట్టవు.

సినిమాలలో తెలంగాణా యాస విలన్లు, కమెడియన్లు కేనా అని ప్రశ్నించేవారు గుర్తుంచుకోవలసినది - విలన్లు, కమెడియన్లకు తెలంగాణా యాస మాత్రమే పెట్టటం లేదని. ముత్యాలముగ్గులో రావు గోపాలరావుది తెలంగాణా యాసా? ఉప్పెనగా వచ్చిన రాయలసీమ రక్తపాతపు సినిమాలలో విలన్ల యాస తెలంగాణా యాసా? కమెడియన్లు కూడా అందరూ తెలంగాణా యాసే మాట్లాడారా?

లేదే! ఎవరికి వచ్చినది వాళ్లు మాట్లాడారు. రమణారెడ్డి ఏ పాత్ర వేసినా నెల్లూరు యాసే మాట్లాడారు. చదలవాడ ఏ పాత్ర వేసినా కృష్ణాజిల్లా యాసే మాట్లాడారు. రాజబాబు గోదావరి యాసే మాట్లాడారు. అంతమాత్రం చేత ఆ యా జిల్లాల వాళ్లు అఫెండ్ అయిపోలేదు. నవ్వుకుని వూరుకున్నారు తప్ప యీ సాకు చెప్పి ప్రత్యేక రాష్ట్రాలు కోరలేదు.

ఆ మాటకొస్తే తెలంగాణా ప్రజానీకమూ కోరలేదు. వాళ్లూ తమ యాసను సినిమా తెరపై ఎంజాయ్ చేశారు. యాసను కించపరచారంటూ ఒక్క సినిమానూ బహిష్కరించిన దాఖలాలు లేవు. పైగా వేణుమాధవ్ వంటి తెలంగాణా నటుడు, ఆ యాసనే తన బ్రాండ్ చేసుకున్నారు – నెల్లూరు యాసను రమణారెడ్డిని చేసుకున్నట్టు. ఆయనా, శివారెడ్డి తెలంగాణా యాసను మిమిక్రీ చేసి పేరూ, ధనమూ మూటకట్టుకుంటున్నారు. తెలంగాణాలో ఏ వేదికమీదనైనా వాళ్ల కార్యక్రమాలు ఆపించిన సంఘటన ఒక్కటైనా వుందా?

దొరికిన ప్రతీదానిని యిస్యూ చేయడం రాజకీయ నాయకులకు అలవాటు. లేకపోతే వాళ్లకు పొట్ట గడవదు. మామూలు జనాలకు యివన్నీ పట్టవు. వాళ్లకు కావలసినది వినోదం. సహజత్వం కోసం పూర్తి యాసతో రాసిన నవలలు కానీ, కథలు కానీ, ఆర్ట్ సినిమాలు కానీ ఏ ప్రాంతంలోనూ ఆదరించరు. అంతెందుకు దీన్నే నేను మా జిల్లా మాండలిక భాషలో రాసి వుంటే మీలో ముప్పావు మంది మొదటిపేరాతోనే ఆపేసి వుండేవారు.

ఇంకో మాట చెప్పనా? ఈ కేశవరావుగారు తన యింట్లో జరిగిన హత్యాకాండ వుదంతం ఆధారంగా రేపు ఓ మిస్టరీ సినిమా తీద్దామనుకున్నారనుకోండి. దానిలో హీరోకి మామూలు భాషే పెడతారు తప్ప తెలంగాణాలో జరిగింది కదాని తెలంగాణా యాస పెట్టరు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## జనవరి 04, 2010
## ఎమ్బీయస్ – సినిమాల్లో తెలంగాణావారిని రానివ్వరా...?

ఇవాళ 'రోషం' సినిమా హీరో సాకేత్ తెలుగు సినిమారంగంలో తెలంగాణావారిని పైకి రానివ్వరని ఆరోపించాడు. ఆ మధ్య విజయశాంతి కూడా యిలాటి ఆరోపణే చేశారు. ఆవిడ స్థాయిలో కూడా వివక్షత ఎదుర్కుందంటే ఆశ్చర్యంగా లేదూ!? కాస్త నిదానంగా ఆలోచిస్తే మామూలు జనాల్ని రెచ్చగొట్టడానికి, తమ లోటుపాట్లను కప్పిపుచ్చుకోవడానికి మాత్రమే యిలాటి వాదనలు చేస్తారని సులభంగా తెలుస్తుంది.

విజయశాంతి విషయమే తీసుకుందాం. 'కర్తవ్యం' 'ఒసేయ్ రాములమ్మ' సినిమాల ద్వారా విజయశాంతికి ఎంతో ఖ్యాతి గడించి పెట్టిన డైరక్టర్స్ కోడి రామకృష్ణ, దాసరి నారాయణరావు తెలంగాణా వారు కాదు కదా! తెలంగాణా అమ్మాయిగా విజయశాంతి అంత వివక్షతకు లోనైతే తన స్వంత సినిమా 'నిప్పురవ్వ'లో హీరోగా తెలంగాణావారిని తీసుకోకుండా బాలకృష్ణను తీసుకుందేం? ఎవరైనా అడ్డుపడ్డారా? అప్పుడు యిలా రాజకీయాల్లో రావలసి వస్తుందని తెలియదా? విజయశాంతికి గాని, ఆమె పిన్ని విజయలలితకు గాని ఛాన్సిచ్చిన వారందరూ తెలంగాణా వారా? ఇవ్వనివారందరూ కోస్తా, సీమల వారా?

నిర్మాతలలో, డిస్ట్రిబ్యూటర్లలో తెలంగాణా వారు వుండే వుంటారు. వారిని యీ దృష్టితో చూడం కాబట్టి ఆ వివరాలు సేకరించి పెట్టుకోము. సందర్భం వచ్చింది కాబట్టి, వారు పదే పదే చెప్పుకున్నారు కాబట్టి తెలంగాణాపై గొంతు చించుకునే ఎమ్. సత్యనారాయణరావు, ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి గుర్తుకు వస్తున్నారు. వారిద్దరూ "చివరకు మిగిలేది" సినిమా తీశారు. హీరోయిన్‌గా సావిత్రిని తీసుకున్నారు తప్ప తెలంగాణా అమ్మాయిని తీసుకోలేదు. డా౹౹ ప్రభాకరరెడ్డిని సినిమారంగానికి పరిచయం చేశారు ఆ సినిమాతో. హీరో వేషానికి అనుకుంటున్నారా? అబ్బే! డాక్టరు వేషం యిచ్చి సరిపెట్టారు. హీరో వేషం కోస్తాకు చెందిన బాలయ్యకు యిచ్చారు. పోనీ డైరక్షన్? జి. రామినీడుకి యిచ్చారు. పోనీ మ్యూజిక్? అశ్వత్థామకు. వీరిలో ఎవరూ తెలంగాణా వారు కారు.

కాంతారావుగారు తెలంగాణాకు చెందినవారు కాబట్టి పద్మశ్రీ యివ్వలేదని మరో ఆరోపణ. పద్మ ఎవార్డులకు తగినవారై వుండి ఎవార్డులు దక్కని కోస్తా, సీమవాళ్ల పేర్లు రాయడం మొదలెడితే రెండు పేరాలు పడతాయి. కాంతారావుగారు స్వంత సినిమాలు తీసినప్పుడు తారాగణాన్ని, సాంకేతిక గణాన్ని తెలంగాణావారినే ఎంచుకున్నారా? లేదే! ఆయన్ని స్వంత తమ్ముడిగా ఆదరించిన ఎన్టీయార్ కోస్తా వారే కదా!

ఎందుకిలా? ఎందుంటే ఎవరూ ప్రాంతాల కళ్లద్దాలతో చూడలేదు కాబట్టి. సామర్థ్యం, పారితోషికం యివన్నీ కుదిరితే చాలు. ఆ లెక్కలు లేకపోతే ప్రతీవాడు వాళ్ల అన్నదమ్ములతోనే సినిమా తీసేసి వుండేవారు. సినిమారంగంలో ఏ ప్రాంతం వారన్న ప్రశ్న లేదు. ఆ పాత్రకు ఫలానావారు నప్పుతారా లేదా అనే చూస్తారు. మన సినిమాకు సరిపోతారనుకుంటే ఎక్కణ్నుంచైనా పిలుచుకు వస్తాం. మతం, ప్రాంతం ఏదీ కన్సిడరేషన్ కాదు. మలయాళీ క్రిస్టియన్ ఐన దీపనూ పిలుస్తాం, ముస్లిం ఐన రఫీని పిలుస్తాం. హీరోయిన్‌గా అందచందాలు ఆరబోస్తుందంటే చాలు నోరు తిరగని పేర్లున్న నార్త్ యిండియన్ అమ్మాయిలనీ లాక్కుని వస్తాం, ఫారిన్‌నుండీ తెస్తాం. అమ్రిష్ పురి, సయాజీ షిండే, ప్రకాష్ రాజ్ వీళ్ల మాతృభాషలేమిటో మనకే కాదు, నిర్మాతలకూ తెలియకపోవచ్చు. పనికి వస్తాడా? రాడా? అంతవరకే చూస్తారు.

ఈ లాజిక్ అర్థం చేసుకోకుండా ఏవేవో ఉద్దేశాలు ఆపాదిస్తారు సినిమావాళ్లకు. ప్రస్తుతం విభజనోద్యమం సాగుతోంది కాబట్టి

ప్రాంతాల కళ్లద్దాలతో చూస్తున్నారు. మొన్న ఎలక్షన్లదాకా రెడ్డి-కమ్మ-కాపు కళ్లజోళ్లతో చూశారు. కమ్మవారే డామినేట్ చేసి తక్కినందర్నీ తొక్కేశారని ఆరోపించారు. ఎస్ వి రంగారావుగారి గురించి నేను ఆర్టికల్స్ రాసినపుడు కొందరు మెయిల్స్ రాశారు - రంగారావులో హీరో మెటీరియల్ వుందట. కానీ కమ్మవారు తొక్కేశారట. అందుకే హీరోగా రాణించలేక కారెక్టర్ రోల్స్ వేసుకోవలసి వచ్చిందట. తొలి సినిమాలో హీరోగా ఫెయిలయ్యాక రంగారావుగారే ఆ జోలికి పోలేదు. స్వంత సినిమాలు తీసినా తక్కినవారికి హీరో ఛాన్సు యిచ్చారు తప్ప తనే వేసేయలేదు. వాళ్లు కమ్మలా, రాజులా అన్నది పట్టించుకోలేదు. కాపులెవరైనా వున్నారా అని వెతకలేదు.

ఇంకోరు రాశారు - కాపులను కమెడియన్‌లుగా (అల్లు రామలింగయ్య) విలన్‌లుగా (సత్యనారాయణ) వాడుకున్నారు యీ కమ్మవారు అంటూ. ఎవరూ ఎవర్నీ వాడుకోరు. ఒక్కొక్కరు ఒక్కో రంగాన్ని పట్టుకుని తాపత్రయపడతారు. వారిలో కొందరు ఆ రంగంలో పైకి వస్తారు. ఎన్టీయార్‌గాని, చిరంజీవి గాని మరోరు కాని సూపర్ హీరోలయ్యారంటే వారు ఫలానా కులంవారని కాదు, వారిలో ఆ ప్రతిభ వుంది కాబట్టి, అదృష్టం కలిసివచ్చింది కాబట్టి అయ్యారు. హిందీ హీరోల్లో పంజాబీవారు. హీరోయిన్లలో దక్షిణాది వారు ఎక్కువమంది వున్నారంటే అర్థం తక్కిన ప్రాంతాలలో అందమైన ఆడవారు, మగవారు లేరని అర్థమా? అన్నీ కలిసిరావాలి. ఒక్కోరంగంలో ఒక్కొక్కరు ఎక్కువ శ్రద్ధ పెడతారు. తెలంగాణావారు సినిమారంగాన్ని ఎక్కువగా పట్టించుకోలేదు. సీమవారూ పెద్దగా పట్టించుకోలేదు. కోస్తా జిల్లాలలో కూడా కృష్ణా, గుంటూరు వారు ఎక్కువ పట్టించుకున్నారు. అందుకని వాళ్లే ఎక్కువమంది కనబడతారు. సినిమారంగంలో లైసెన్సింగ్ సిస్టమ్ లేదు. ఎవరు కావాలంటే వాళ్లు వెళ్లి ఏం కావాలంటే అది, ఎవరితో కావాలంటే వారితో సినిమా తీసుకోవచ్చు. ఎవరూ అడ్డుపడరు. అయినా ఏదో కారణం చెప్పి అవతలివారిని నిందిస్తే ఏమనుకోవాలి?

సినిమారంగంలో తెలంగాణావారిని చిన్నచూపు చూశారు అనడం కూడా హాస్యాస్పదంగా వుంది. తెలంగాణావారు సినిమాలలో వున్నారు అంటూ రోశయ్యగారు చెప్పిన లిస్టులోగాని, తెలంగాణా నాయకులు గాని చెప్పిన జాబితాలోగాని కీఎఎశేఎ ఆర్.నాగేశ్వరరావుగారి పేరు కనబడలేదు. అందరూ ఆయన్ని మర్చిపోయినట్టున్నారు. అద్భుతమైన నటుడాయన. 'దొంగరాముడు' సినిమా షూటింగు టైములో జరిగినది నాగేశ్వరరావుగారు గ్రంథస్తం చేశారు. ఆ సినిమాను డైరక్టు చేసిన కెవి రెడ్డిగారు నాగేశ్వరరావుగారిని 'ఆర్ నాగేశ్వరరావును చూసి నటన నేర్చుకో, ఎంత సహజంగా వుందో' అని మందలించారు. ఆ సినిమాకు నాగేశ్వరరావు హీరో, సహనిర్మాత. అయినా కెవి రెడ్డి గారి విమర్శను స్వీకరించి ఆర్.నాగేశ్వరరావు నటనను అధ్యయనం చేశారు తప్ప ఆర్. నాగేశ్వరరావును సినిమాలోంచి తీసేయమని ఒత్తిడి చేయలేదు. ఆర్.నాగేశ్వరరావును అంతగా మెచ్చుకున్న కెవి రెడ్డిగారు తెలంగాణా వారు కాదు, రాయలసీమవారు.

ఇలా ఉదహరిస్తే ఎన్నో వుంటాయి. ఏతావాతా చెప్పదలచినది - తమ వ్యక్తిగత వైఫల్యాలను కోస్తా, సీమవారిపై నెట్టి ఆ సాకుపై విభజనోద్యమానికి ఆజ్యం పోయవద్దని! ఏదైనా చెపితే సహేతుకంగా చెప్పాలి. **- ఎమ్బీయస్ ప్రసాద్**

## జనవరి 05
## ఎమ్బీయస్ - యాస గురించి మరికొంత..

సినిమాల్లో యాసల గురించి చెప్పుకుంటూ వుంటే యింకా చాలా గుర్తుకు వస్తున్నాయి. మన హైదరాబాదులో మాట్లాడే ఉర్దూ (దక్కనీ ఉర్దూ) మామూలుగా ఉర్దూ మాట్లాడేవారికి వినోదం కలిగిస్తుంది. దాన్ని గ్రహించిన హిందీ హాస్యనటుడు మెహమూద్ అనేక సినిమాల్లో హైదరాబాదు ఉర్దూ మాట్లాడేవాడు. 'గుమ్‌నామ్' సినిమాలో అతను హైదరాబాదీ వంటవాడు. 'ప్రీతమ్' సినిమాలో హైదరాబాదీ మంగలివాడు. అవన్నీ హైదరాబాదీ ఉర్దూ భాషను ఆట పట్టించేవే. అయినా ఆ సినిమాలు హైదరాబాదులో బ్రహ్మాండంగా హిట్ అయ్యాయి. ఎవరూ అభ్యంతర పెట్టలేదు. నవ్వేసి వూరుకున్నారు.

తమిళులు వాళ్ల భాష గురించి, సంస్కృతి గురించి చాలా పట్టింపుగా వుంటారు కదా. 'పడోసన్' సినిమాలో మెహమూద్ తమిళ సంగీతం మాస్టారి వేషం కట్టాడు. తమిళ భాష గురించి, వాళ్లకు హిందీ రాకపోవడం గురించి, చెంబిస్త్రీతో సహా తెగ వెక్కిరించాడు. అయినా 'పడోసన్' తమిళనాట సూపర్ హిట్. తమిళ సినిమాలంటే గుర్తుకు వచ్చింది. తమిళ సినిమాలలో తెలుగువాళ్లని హాస్యగాళ్లగా చూపిస్తారు. హీరోలు కూడా అప్పుడప్పుడు వినోదం కలిగించడానికి తెలుగు మాట్లాడేస్తూ వుంటారు. తమిళనాట తెలుగువాళ్లు ఎవరూ అభ్యంతర పెట్టరు.

తెలుగునే కాదు, తమిళ సినిమాలలో తిరునల్వేలి యాసను హాస్యానికి వాడుకుంటారు. ఆ ప్రాంతం వాళ్లు సినిమారంగంలో చాలామంది వున్నారు. వాళ్లెవరూ అభ్యంతర పెట్టరు. ఆ సినిమాలు తిరునల్వేలి ప్రాంతంలో ఆడకపోవడం వుండదు. ఆ కారణంగా అక్కడి వాళ్లెవరూ ప్రత్యేకరాష్ట్రం అడగటం లేదు. ఇప్పుడు తమిళనాడు దక్షిణప్రాంతం విడిపోవాలనుకుని కొందరు ఉద్యమిస్తున్నా యీ పాయింటుని కలపడం లేదు.

ఇప్పుడు విజయఢంకా మోగిస్తున్న త్రీ ఇడియట్స్ సినిమాలో చూపించిన చతుర్ అనే కారెక్టర్ చూడండి. సబ్జక్ట్ అర్థం కాకపోయినా, బట్టీ పడతాడు. హిందీ రాకపోయినా హిందీలో మాట్లాడి ప్రిన్సిపాల్ ఫేవర్ కొట్టేద్దామని చూస్తాడు. అహంభావి. అసూయాగ్రస్తుడు. అవసరమైతే కాళ్లు పట్టడానికి రెడీ. పైగా గ్యాస్ ఛాంబర్. అతని పేరులో రామలింగం అని పెట్టి తమిళుడని చూపించారు.

విభజనవాదులు వేసే లెక్కప్రకారం ఈ సినిమా తమిళనాడులో ఆడకూడదు. కానీ అక్కడా కలక్షన్లలో ముందు వుంది. డిఎంకె ఐడియాలజీతో తీసే తమిళ సినిమాల్లో విలన్లు ఎప్పుడూ బ్రాహ్మలే. అయినా బ్రాహ్మలు ఆ సినిమాలు చూస్తూనే వున్నారు. పైగా 1967లో డిఎంకె అధికారంలో రావడానికి బ్రాహ్మణ ఓట్లే దోహదపడ్డాయి.

కొంతమంది మెయిల్స్ రాశారు. రవితేజది గోదావరి యాస కదా అంటూ. ఏదో పల్లెటూరి యాసలో సాగదీసుకుంటూ మాట్లాడితే గోదావరి యాస అనేసుకుంటున్నారు వీళ్లు. గోదావరి జిల్లాలో మాట్లాడే టిపికల్ పదాలేవీ ఆ డైలాగుల్లో కనబడవు నాకు. అయినా 'కృష్ణ' అనే సినిమాలో విజయవాడవాసిగా చూపించినపుడు ఆ యాస పెడితే ఎలా? కృష్ణా యాస పెట్టాలిగా! డైలాగు డెలివరీ డిఫరెంట్‌గా వుండాలని ఏదో ప్రయోగం చేస్తారు వీళ్లు. అయినా మనం ముఖ్యంగా గమనించవలసినది యీ హీరోలందరూ కామెడీ సీన్లలోనే అలా మార్చి మాట్లాడతారు. సీరియస్ డైలాగులు మాట్లాడినప్పుడు స్టాండర్డ్ తెలుగులోనే మాట్లాడతారు!

అందువలన సినిమాల్లో యాస అనేది మామూలు ప్రజానీకానికి పెద్ద విషయమే కాదు, పాయింట్ల కోసం తపిస్తున్న విభజనోద్యమ నాయకులకు తప్ప! అని నేనంటే 'మీరెన్నయినా చెప్పండి. మా ఆంధ్రా ఫ్రెండ్స్ నా యాసను వెక్కిరిస్తారు.' 'నా చిన్నప్పుడు మా ఫ్రెండు తల్లి పైశాచిక భాష అని యీసడించింది' అని ఫిర్యాదు చేస్తూ ఇ మెయిల్స్ రాస్తూనే వున్నారు. ఇవన్నీ వ్యక్తిగత విషయాలు. అలా అన్నవాళ్ల లోపాలు..

ఒకరి పట్ల మరొకరు చిన్నచూపు చూడడం అనే దానికి కారణం ఏమీ వుండనక్కరలేదు. మీరు ఆంధ్ర ప్రాంతం గురించి చెప్తున్నారు. అక్కడ మాత్రం తేడాలు లేవా? రాయలసీమ యాస, కోస్తాలోనే తూర్పుయాస, పడమట యాస, ఒకే జిల్లాలో పల్లెటూరియాస, అదే పల్లెటూరిలో చదువుకున్నవారి యాస, చదువుకోనివారి యాస, అగ్రవర్ణాల యాస, నిమ్నవర్గాల యాస – యీసడించడానికి ఏదైనా చాలు.

వీటిగురించి రాష్ట్రం విడగొట్టుకుంటే రేపు ప్రత్యేక తెలంగాణా ఏర్పడినా అందరూ ఒకరి యాస నొకరు గౌరవిస్తారనుకుంటున్నారా? ఆదిలాబాదువాళ్లు ఖమ్మం వాళ్లని, ఖమ్మం వాళ్లు ఆదిలాబాదునీ వెక్కిరించుకుంటారు. అదే జిల్లాలో 'ఏమిటా లేబరు భాష, అడ్డమైనవాళ్లతో తిరగవద్దు' అని పిల్లల్ని మందలించే తల్లులు అప్పుడూ వుంటారు.

ఓ నియోగి బ్రాహ్మడు చెప్పిన చిన్న సంఘటన చెప్పి ముగిస్తాను. అతను పట్నంలో బ్రాహ్మణుల హాస్టల్లో వుండేవాడట. రూమ్‌మేట్ తన తండ్రికి ఉత్తరం రాస్తూ 'బ్రహ్మశ్రీ వేదమూర్తులైన నాన్నగారికి..' అంటూ మొదలుపెట్టడం చూసి మంచి ఘనంగా వుందని యితనికి తోచి వాళ్ల నాన్నగారికి కూడా అలాగే రాశాడట. తిరుగుటపాలో వాళ్ల నాన్నగారినుండి చివాట్లు వచ్చాయి. 'అది వైదీకుల భాష. అలాటివి నేర్చుకోవద్దు. మనం చక్కగా 'మహారాజశ్రీ నాన్నగారికి..' అని రాసుకోవాలి అని మందలించారట.

అంటే ఇంత ఫైనర్ పాయింట్ల దగ్గర్నుంచి అవతలివాళ్లని తీసిపారేయడం వుంటుంది. ఇది దొరక్కపోతే మరొకటి పెట్టి ఏడిపిస్తారు. మీరు మాత్రం వాళ్లను యాస పేరు పెట్టి, హెయిర్‌స్టయిల్ పేరు పెట్టి ఏడిపించరా? ఏడిపించకపోతే మీరు ఫ్రెండ్సే కాదు. అబ్బే ఫ్రెండ్స్ కాదండీ, వాళ్లు నా శత్రువులంటారా? జస్ట్ యిగ్నోర్ ! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 06** **ఎమ్బీయస్ – నాకేం కడుపునొప్పి?**

నా వ్యాసాలు చూసి కొంతమంది మెయిల్స్ రాస్తూ వుంటారు. తెలంగాణా వస్తే మీకేం కడుపునొప్పి? వాట్ యీజ్ యువర్ ప్రాబ్లెమ్? అని. ఇంకా కొంతమంది చిరంజీవులు 'మీరు తెలంగాణాకు వ్యతిరేకంగా రాస్తున్నారు, జాగ్రత్త' అని బెదిరిస్తూంటారు.

మొదట చెప్పవలసినది నేను తెలంగాణా ప్రాంతానికి వ్యతిరేకం కాదు. (ఆ మాటకొస్తే ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదు) దేశం చూసినవాడికి వద్దన్నా విశాలదృష్టి అలవడుతుంది. మంచీ, చెడూ అన్ని చోట్లా అన్ని వర్గాల్లో అన్ని ప్రాంతాల్లో వుందని గ్రహిస్తాం. ఫ్యూడల్ పాలన నుండి బయటకు వచ్చిన అర్ధశతాబ్దిలోనే అద్భుతమైన ప్రగతిని సాధించినవారిగా తెలంగాణా ప్రజలకు జోహార్ పలుకుతాను. విభజన – యీ దశలో, యిలా (యీ రెండూ అండర్‌లైన్ చేసుకోవాలి) – జరగకూడదని ఆశిస్తానంతే.

ఇక రాష్ట్రం కలిసివున్నా, విడిపోయినా నాకే కడుపునొప్పీ రాదు. వ్యక్తిగతంగా నా కే సమస్యా రాదు. చాలా ఏళ్లు ప్రవాసాంధ్రుడిగా వున్నవాణ్ని. అనేకమంది బంధుమిత్రులు యితర రాష్ట్రాలలోనూ, యితర దేశాలలోనూ కలవాణ్ని. విభజన జరగ్గానే అర్జంటుగా మన పెరళ్లు గులాబీతోటలుగా మారిపోతాయని కాని లేదా మిన్ను విరిగి మీద పడుతుందని కాని అనుకోను. ఏదైనా క్రమంగా జరుగుతుంది. అదంతా స్థానికంగా లభ్యమయ్యే నాయకులపై వుంది. ఆ నాయకులపై నాకు విశ్వాసం లేదు. నేటి యువతనుండి మంచి నాయకులు వచ్చాకనే ఆవేశరహితంగా నిర్ణయాలు తీసుకున్నపుడే యిటువంటి ముఖ్యమైన ఘట్టాలు జరగాలని ఆశిస్తాను.

నేను నా రాతలతో రాష్ట్రం ముక్కలు కాకుండా వుండడానికి ప్రయత్నిస్తున్నానని అపోహ పడవద్దు. (నేనంత మహనీయుణ్ని కాదన్న ఎరిక నాకు వుంది. నా రాతలు చదివేసి సోనియా తన అభిప్రాయాలు ఎడాపెడా మార్చేసుకుంటుందని కంగారు పడుతూ నాకు మెయిల్స్ రాసేవారి కోసం యిది రాస్తున్నాను) అది నా పని కాదు. నేను ఏ వుద్యమమూ నడపటం లేదు. పత్రికలు పాఠకులకు వాస్తవాలు తెలియపరచాలి తప్ప ఉద్యమాలు నడపకూడదని వాదించే నేను నా కాలమ్ ద్వారా అలాటి పని చేయను.

నా యీ శీర్షిక ప్రయోజనం – పాఠకులతో నాకు తెలిసిన విషయాలను పంచుకోవడం మాత్రమే. జ్ఞానాన్ని సంపాదించి ఒక

విధమైన రేషనల్ థింకింగ్ అలవర్చుకుంటే జీవితంలో అనేక విధాలుగా అది వుపకరిస్తుందన్న నమ్మకం నాది. నా విషయసేకరణలో దృక్పథంలో పొరబాట్లు వుండవచ్చు, అసమగ్రత వుండవచ్చు, తర్కంలో లోటుపాట్లు వుండవచ్చు. వాటిని ఎత్తిచూపిస్తే సంతోషిస్తాను. ఆ పని చేయకుండా, నేను చెప్పేది వినకుండా, ఆ దిశగా ఆలోచించకుండా 'అసలు నువ్వు రాయడం మానేయ్' అని వుచిత సలహాలు యిచ్చేవారంటే నాకు నవ్వు వస్తుంది. వీళ్లు రాయమంటే నేను రాశానా? వద్దంటే మానేయడానికి!

వెబ్‌సైట్‌లో తక్కిన ఆర్టికల్స్ గురించి నన్ను సంజాయిషీ అడుగుతారు కొందరు... (వాళ్లను ఏమందాం?) వెబ్‌సైట్ పేరు మార్చేయ్ అని కొందరు సలహా యిస్తారు, అక్కడికేదో నేనే స్వంతదారుణ్నయినట్టు. పేరు మార్చే తరుణం వస్తే వాళ్లే మార్చేస్తారు. మీరు చెప్పేదాకా ఆగుతారా?

చిన్నవాళ్లలోనే కాదు, పెద్దవాళ్లలోనూ చాలామందికి చరిత్ర తెలియదు. తెలుసుకునే ఓపిక లేదు. నాయకులు చెప్పరు. విద్వేషాలు రెచ్చగొట్టి పని కానిచ్చుకుంటారు. పాకిస్తాన్ ఏర్పరచడానికి జిన్నా ముస్లిములకు అరచేతిలో స్వర్గం చూపించాడు. నమ్మి పాకిస్తాన్ కు తరలి వెళ్లినవాళ్లు ఏం బావుకుంటున్నారో కళ్లారా చూస్తున్నాం. తన పంతం చెల్లించుకోవడానికి జిన్నా చల్లిన విషబీజాల ప్రభావం యిక్కడ యిండియాలో మనం అనుభవిస్తున్నాం.

ఈ ఏడాది చివరకు రాష్ట్రం వుండవచ్చు, వూడవచ్చు, ముక్కలు కావచ్చు, అతుకులు పెట్టవచ్చు. అది ముఖ్యం కాదు. విభజన కోరేవారు కానీ, వారిని విమర్శించేవారు కానీ అసత్యాలు, అర్ధసత్యాలు చెపుతున్నపుడు వాస్తవాలు తెలియపరచడం, వారి వాదనను మరో కోణంలోంచి చూపించడం నా పనిగా పెట్టుకున్నాను. ఒకే ధోరణిలో పడి కొట్టుకుపోతున్న వారిని ఆగి, తెలుసుకుని, పరిశీలించి, ఆలోచించి ముందుకు సాగమంటున్నాను.

సినిమాలలో యాస గురించి రాశాను కదా. సినిమాల్లో అనే కాదు, నాటకాల్లో, టీవీల్లో వుండే యాస కూడా ఎవర్నీ బాధించదు. ఎన్‌టివిలో ఓ పాప్యులర్ టీవీషో వుంది – 'లల్లూ బ్రదర్స్' అని. అందులో ఓ కారెక్టర్ తూర్పుగోదావరి జిల్లా వాడని స్పష్టంగా చెప్పారు. ఆ జిల్లా వాడు కాబట్టి వెటకారం ఎక్కువని కూడా చెప్పించారు. ఆ కారెక్టరు గోదావరి యాసలో మాట్లాడుతుంది.

ఐ న్యూస్ ఛానెల్‌లో దారినపోయే దానయ్య కారెక్టరు రాయలసీమ యాసతో మాట్లాడుతుంది. అదీ కామెడీ కారెక్టరే. ఆ యా జిల్లాలవాళ్లు ఆ ప్రోగ్రాంలపై ఫిర్యాదు చేసినట్టుకానీ, వాటివలన ఆ యా ఛానెల్స్ చూడడం మానేసినట్టు గానీ దాఖలాలు ఏమీ లేవు. ఆ యా ఛానెల్స్ యాజమాన్యం ప్రాంతాలేవో కనుగొని వాళ్లకు మోటివ్స్ ఎట్రిబ్యూట్ చేసినట్టు లేదు.

నార్త్ యిండియన్స్ దక్షిణాది భాషలన్నిటినీ కలిపి 'రండాముండా భాష' అంటారు. మనం 'రండి' అని మర్యాదగా ఆహ్వానిస్తే వాళ్లు కిసుక్కున నవ్వి, ఏం దిక్కుమాలిన భాషరా నాయనా అంటాడు. పంజాబీవాడు వాడి పిల్లవాణ్ని ముద్దుగా 'ముండా' అని పిలిస్తే మనకు నవ్వొస్తుంది. అంతమాత్రం చేత అఫెండ్ అయిపోతే అది ఆత్మన్యూనతాభావానికి దారి తీస్తుంది. అది పెట్టుకుని ఆ జాతినంతటినీ ద్వేషించడం అవివేకం.

ఓ ఫేమస్ కొటేషన్ వుంది. 'ఈ ఆడజాతి', 'ఈ మగజాతి' అని ద్వేషిస్తూ కవిత్వాలు రాసేవాళ్లంతా ఒక్క ఆడనో, మగనో దృష్టిలో పెట్టుకుని రాస్తారని. వాడు ప్రేమించినది ఛీ అవతలికి పొమ్మనమందనుకోండి, 'ఈ ఆడజాతిని నమ్మరాదు. తడిగుడ్డతో పీకలు కోస్తారు' అంటూ లెక్చర్లిస్తాడు, తన తల్లి కూడా ఆడజాతిదేనని మర్చిపోయి! మన పట్ల క్రూరంగా ప్రవర్తించిన లెక్కల మేస్టారు అరవ్వాడు కాబట్టి అరవ్వాళ్లనందరినీ ద్వేషిస్తే ఎలా?

మా కోస్తా 'స్నేహితుడు' నన్ను అవమానించాడు కాబట్టి.. లాటి కారణాలు చెప్పి విభజన కోరేవాళ్లను నేను సమర్థించాలని నేను ఎవరైనా కోరుకుంటే ఏం చెప్పగలం? సారీ బాస్, నేనింతే అని చెప్పి ఓ నమస్కారం పెట్టడం తప్ప! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 07**

## ఎమ్బీయస్ – జనవరి 5 కి ముందూ, తర్వాత

జనవరి 5 భేటీ ముగిసింది. ఆంధ్రభూమి డైలీ వాళ్లు ముందుగా జనవరి 5 హెడ్‌లైన్సులో జోస్యం చెప్పినట్లే జరిగింది. దీనిపై వివిధ పత్రికల అబ్జర్వేషన్స్ ఎలా వున్నాయో చూశారా? 'సంక్షోభం సశేషం.., ఎక్కడి గొంగళి అక్కడే.., కొండను తవ్వి ఎలకను పట్టారు.., చర్చలే శరణ్యం.., సమైక్యవాదులకు తాత్కాలిక వూరట – తెలంగాణా వాదులకు నిరాశ, ఇప్పటికింతే..,

చిదంబరం విన్నాడు తప్ప నోరెత్తలేదు. మెకానిజం తను సూచించి అభిప్రాయాలు అడగలేదు. మీరు చెప్పినది మన్‌మోహన్‌తో చెప్తా అన్నాడు. వీళ్లు కూడా తమ తమ వ్యూపాయింట్లు చెప్పారు తప్ప మెకానిజం ఏదీ సూచించలేదు. అంతా మీదే భారం అన్నారు. మెకానిజం దేనికి? తెలంగాణా ఎలా ఏర్పరచాలనా? లేక అసలు ఏర్పరచాలనా? లేదా? అనా అని సూటిగా అడిగితే చిదంబరం సమాధానం చెప్పలేదు పైగా శాంతి నెలకొంటే తప్ప ఏమీ చేయలేమన్నాడు. ఆయన తయారుచేసిన శాంతి ఒప్పందంపై సంతకాలు పెట్టి బయటపడ్డారు తెలుగు వీరులందరూ.

తర్వాత చిదంబరం ప్రెస్‌తో మాట్లాడుతూ తక్కిన వర్గాలతో చర్చలకు వీళ్లెవరూ వ్యతిరేకం కారు అన్నాడు. ఇంకా మాట్లాడవలసిన వర్గాలెన్ని వున్నాయో! ఇంకెన్ని నెలలు పడుతుందో! అన్ని వర్గాలనూ పిలుస్తామని చెప్పి ఇంకో రెండు నెలలు తాత్సారం చేద్దామన్న ఐడియాలో వున్నారని పుకారు. ఆ పాటికి ఉద్యమం చల్లారవచ్చు. చిక్కుముడులు వేసి మీరే పరిష్కారం కనుగోండని చిదంబరం

తెలుగువాళ్లపై నెట్టేశాడు.

ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. తప్పుడు సమాచారంతో మిస్‌హేండిల్ చేశాడన్న విమర్శలను చిదంబరం సహించలేకపోతున్నాడు. తనదేమీ తప్పులేదని చూపించుకోవడానికి పదేపదే డిసెంబరు 9 తర్వాత పార్టీలు మాట మార్చాయని చూపించడానికే తాపత్రయ పడుతున్నాడు. ఈ మీటింగులో పార్టీకి ఒకర్ని పిలవకుండా యిద్దర్ని పిలవడం అందుకే! తెలుగువాళ్లు ఎంత కన్‌ఫ్యూజ్ అయి వున్నారో లోకానికి చూపించడానికే యీ సమావేశం. ప్రధాన పార్టీలు నిలువుగా చీలివుండడం రికార్డు చేయించాడు. చిదంబరం ఆలోచనాసరళిని డిసెంబరు 9 నాడు జైపాల్ రెడ్డి ప్రభావితం చేస్తే, యిప్పుడు గవర్నర్ నరసింహన్ చేశాడు. ఆయన తన వద్దకు వచ్చిన పార్టీ పెద్దలకు వల్లించిన శాంతిసూత్రాలనే చిదంబరం అక్కడ రిపీట్ చేసాడు. ఉస్మానియా విద్యార్థుల్లో మావోయిస్టులు చొరబడ్డారని, ఉద్యమాలు ఆపేసి శాంతి ఏర్పడిన తర్వాతనే చర్చలు జరపగలమనీ అన్నాడు.

మావోయిస్టుల కారణంగానే ప్రత్యేక తెలంగాణా రాకుండా పోవచ్చును. ఛత్తీస్ గఢ్‌లో యిప్పటికే వేగుతున్నారు. పక్కనే వున్న తెలంగాణా కూడా మావోయిస్టు కంచుకోట అయిపోతే మరీ కష్టం. మావోయిస్టుల అణచివేతను సీరియస్‌గా తీసుకున్న చిదంబరం యింకో మావోయిస్టు రాజ్యానికి కారణభూతం కాడానికి యిష్టపడడు. ప్రత్యేక వుద్యమం బలంగా వున్న వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ (మాటవరసకి కర్నూలు, చిత్తూరును కలిపారు) జిల్లాలను వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలుగా గుర్తించాలని రాష్ట్రప్రభుత్వం చేత అభ్యర్థన తెప్పించుకుంటున్నారు. ఇక కేంద్ర పోలీసు బలగాలు అక్కడ దిగి మావోయిస్టులను అణచివేత కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వుద్యమాన్ని కూడా అదుపు చేయవచ్చు.

భేటీలో మరీ ఆవేశంగా మాట్లాడవద్దని, రెచ్చగొట్టేట్లా మాట్లాడవద్దనీ అందరికీ సూచనలు వెళ్లి వుంటాయనిపిస్తోంది. రాష్ట్రం సమైక్యంగా ఎందుకు వుండాలో పీ ఆర్పీ రామచంద్రయ్య చాలా చక్కగా మాట్లాడాడు. యనమల ఒక్కరే చిదంబరాన్ని నిలదీయగలిగాడు. మెకానిజం చెప్పమంటున్నారు కదా, అన్ని ప్రాంతాలకూ యిదే మెకానిజం వర్తింపజేస్తారా? తమిళనాడుతో సహా..? అని అడిగాడు. అబ్బే తెలంగాణాకే అని చిదంబరం అంటే అదెలా? అని గట్టిగా వాదించాడు. ఇక మిగతా పార్టీలన్నీ అనుకున్నట్టే మాట్లాడాయి. టిడిపి తెలంగాణా ప్రతినిధి హైదరాబాదే తెలంగాణాకు రాజధాని అని చెప్పబోతే చిదంబరం అది యిప్పుడు అప్రస్తుతం అన్నాడు.

విద్యార్థులను రేప్పెట్టిన నువ్వే వాళ్లను చల్లార్చమని లేకపోతే రాష్ట్రం మావోయిస్టుల పరం అయిపోతుందనీ చిదంబరం కెసియార్‌తో చెప్పారని పుకారు. తెరాస నేతలు కూడా పలకడం లేదు. 5 మధ్యాహ్నానికే భేటీపై పెదవి విరుపులు ప్రారంభమైనా ఉస్మానియాలో కూడా అల్లర్లు చెలరేగలేదు. ఇదేనేమో కారణం. విద్యార్థులపై కేసుల గురించి జయశంకర్ ప్రస్తావిస్తే చిదంబరం తన సూచన డిసెంబరు 9 వరకే వర్తిస్తుందని, తర్వాతి కేసులు విత్‌డ్రా చేయరనీ అన్నాడు. డిసెంబరు 9 వరకు వున్న కేసుల్లో కూడా వాళ్లకు యింకా ముక్తి లభించలేదు. విద్యార్థులకు గట్టి హెచ్చరిక వెళ్లినట్టుంది. హైదరాబాదులో ఎక్కడికెక్కడ టెంట్లు ఎత్తేస్తున్నారు. నాయకులతో సంబంధం లేకుండా ఉద్యమం చేస్తున్నామని విద్యార్థులు అంటున్నా నాయకుల ఆదేశాలు మన్నిస్తున్నారనే అనిపిస్తోంది. .

ఇప్పుడు అటుగానీ యిటుగానీ ఉద్యమకారులకు ఓ యిరకాటం. మళ్లీ ఉద్యమిస్తే 'ఢిల్లీ భేటీలో విఫలమయ్యావన్నమాట. ఇక్కడ ఇంత అరిచి అక్కడ ఉద్ధరించినదేమిటి?' అని ప్రజలు అడుగుతారని భయం. ఉద్యమించకుండా వూరుకుంటే ఉద్యమం పూర్తిగా చప్పబడిపోయి కావాలనుకున్నపుడు మళ్లీ లేవదేమోనని భయం. రాష్ట్రపతిపాలన భయమేమో గట్టిగా నోరెత్తకుండా కాస్త సణుగుళ్లలోకి దిగుతున్నారు.

ఈ టైములో ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెంచి నాయకుల ద ృష్టి మరల్చింది రాష్ట్రప్రభుత్వం. దానికి వ్యతిరేకంగా టిడిపి వుద్యమించాలంటే కోస్తా, సీమ, తెలంగాణా నాయకులు చేతులు కలపవలసినదే. చేతులు కలిపితే నిప్పులు కక్కడం ఆటోమెటిక్‌గా తగ్గుతుంది. శాంతి నెలకొంటే, జనాలు సర్దుకుంటే ఏ నిర్ణయమైనా సాధ్యమే! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 08** **ఎమ్బీయస్ – తాడూ వుంది, బొంగరమూ వుంది**

డి.శ్రీనివాస్ గారు అనేశారు – చిరంజీవికి తాడూ, బొంగరమూ లేదని. ఆయన మెగాస్టారని తెలుసు. ఆయన కుటుంబం మూడు తరాలుగా నటులుగా, నిర్మాతలుగా వున్నారనీ తెలుసు. వాళ్లు వేసిన సినిమాల పేర్లు తెలియకపోవచ్చు. ఇటీవల చిరంజీవి సమైక్యవాదం జండా అందుకున్నాక ప్రత్యేకవాదులు షోలు ఆపించడం వలన ఆర్య–2, మగధీర సినిమాలకూ చిరంజీవికీ లింకు వుందని తెలిసివుంటుంది. రామోజీ ఫిల్మ్ సిటీలో అల్లు అర్జున్ షూటింగుపై దాడి న్యూస్‌లో వచ్చింది కాబట్టి అర్జున్ యింకా సినిమాలలోంచి రిటైరవ్వలేదని కూడా తెలిసి వుంటుంది.

అందువలన తాడూ, బొంగరమూ లేదని ఆయన అన్నది సినిమాల చిరంజీవిని వుద్దేశించి కాదు. రాజకీయ నాయకుడు చిరంజీవి గురించి. చిరంజీవికి నిజంగా తాడూ బొంగరం, ఉప్పూ పత్రీ లేవా? 2009 ఎలక్షన్ రిజల్ట్స్ గుర్తుకు తెచ్చుకోమనండి. డియస్‌కు అత్యంత ఆత్మీయమైన తెరాసకు (కెసియార్ కాంగ్రెస్‌వాళ్లని ఎంత పడతిట్టినా ఆయన కిమ్మనడు – పిసిసి అధ్యక్షుడి హోదా వెలగబెడుతూ కూడా) తెచ్చుకున్న సీట్లు 10. మరి పీఆర్పీ తెచ్చుకున్నది ఆల్మోస్ట్ రెట్టింపు – 18! (32 స్థానాల్లో రెండో స్థానం) ఓట్లశాతం చూద్దామా! తెరాసకు 4% వస్తే పీఆర్పీకి వచ్చినది నాలుగు రెట్లు – 16%! తెరాస పోటీ చేసిన స్థానాలు తక్కువ కాబట్టి

తక్కువ వచ్చాయంటారా! సరే అలాగే కానీయండి.

మరి శ్రీవారు స్వయంగా అధ్యక్షత వహిస్తున్న కాంగ్రెస్‌కి ఎంతశాతం వచ్చాయిట? 36.5%! 125 ఏళ్ల పార్టీ, కౌరవ అక్షౌహిణులంత నాయకులున్న పార్టీ. పీఆర్పీ వయసు కాంగ్రెస్ పార్టీ వయసులో 1% లేదు. నాయకులంటారా, చిరు అన్నదమ్ములు, బావమరిదీ తప్ప ఎవరూ నిలవలేదు. తక్కినవారిని పిలుచుకు వచ్చినా ఒక్కో పోటు పొడుస్తూ వెళ్లిపోయారు. ఈయన '..యూ టూ బ్రూటస్' అనే డైలాగు వల్లిస్తూ కూచోవలసి వచ్చింది. ఆ పార్టీకి బలమూ, బలహీనతా చిరంజీవియే. మొట్టమొదటిసారి రాజకీయాల్లో వస్తూనే ఒంటిచేత్తో 16% ఓట్లు తెచ్చుకుని అనేక చోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల తాడు తెంపిన చిరంజీవికి తాడూ, బొంగరమూ లేదనడానికి ఎంత గట్స్ వుండాలి? అందునా తను స్వయంగా అసెంబ్లీ సీటు నెగ్గలేక చతికిలబడిన అనుభవశాలియై వుండి!

కేకేగారి కొడుకు తుపాకీ పేలి వుండకపోతే యీ శ్రీనివాస్‌గారికి మళ్లీ పిసిసి అధ్యక్షుడయ్యే ఛాన్సు దక్కేదే కాదని అందరికీ తెలుసు. ఎన్టీయార్ రికార్డు పక్కనపెడితే చిరంజీవి సాధించినది తక్కువ విజయం కాదు. తమిళంలో శివాజీ గణేశన్‌ను గొప్ప నటుడిగా ఆమోదించిన ప్రజలు ఆయన కాన్వాస్ చేసిన కాంగ్రెస్‌కు ఓటేయలేదు. కొన్నాళ్లకు స్వయంగా పార్టీ పెడితే ఆయన కాండిడేట్లందరినీ – ఆయనతో సహా – ఓడించేశారు. ఎమ్జీయార్ విషయంలో కూడా – వస్తూనే సిఎం అయిపోలేదు. ఎన్నో ఏళ్లపాటు రాజకీయాల్లో నలిగి నలిగి డిఎంకె కోశాధికారియై, పార్టీలోంచి బహిష్కృతుడై, ధక్కామొక్కీలు తిని, ఆ తర్వాత ఉపయెన్నికలో నెగ్గి, ఆ పైన సిఎం అయ్యాడు – అదీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని! ఇవి మీకూ నాకే తెలిసినపుడు రాజకీయాలు తప్ప వేరే వ్యాపకం లేని శ్రీనివాస్‌గారికి తెలియవా?

2009 ఎన్నికలకు ముందు చిరంజీవిని కాంగ్రెస్‌లోకి లాక్కువద్దామని ప్రయత్నించి, కుదరక, ఆ తర్వాత అతను సామాన్యుడు కాడని, టిడిపికి గండి కొట్టగల సామర్థ్యం గలవాడని, యాంటీ–ఎస్టాబ్లిష్‌మెంట్ ఓట్లు రెండు ప్రధాన ప్రతిపక్షాలూ (టిడిపి, పీఆర్పీ) చీల్చుకుని ఆఖరుకు కాంగ్రెస్‌కే లబ్ధి చేకూరుస్తాయని నమ్మి, మనల్ని నమ్మించి తన క్యాడర్‌లో విశ్వాసాన్ని పాదుకొల్పిన శ్రీనివాస్ గారికి చిరంజీవి యీనాడు కోన్‌కిస్కా అయిపోయాడా? వారెవా!

నిజం చెప్పాలంటే ఆయనకు అక్కసు. కాంగ్రెస్, టిడిపి ఆడుతున్న డబుల్‌గేమ్ కోస్తా, సీమల్లో ప్రజలు బాగా గమనించారు. చిరంజీవి తెలంగాణాలో బోట్లు కాల్చేసుకున్నారు కాబట్టి కోస్తా, సీమల్లో (2009లోనే 30% ఓట్లదాకా వచ్చాయి) ప్రతిబంధకాలు లేకుండా చెలరేగవచ్చు. పార్టీ సరిగ్గా ఆర్గనైజ్ చేసుకుంటే చిరంజీవికే అక్కడ ఫ్యూచర్. అది తలచుకునే డియస్‌కు ఒళ్లంతా మంట.

అక్కసుకి యింకో కారణం కూడా వుంది. చిరంజీవి వన్‌మ్యాన్ ఆర్మీ కాబట్టి ఆయన తాడూ, బొంగరమూ ఆయన వద్దనే వుంటాయి. కానీ శ్రీనివాస్ వంటి వారిలో అది కుదరదు. తను బొంగరమైతే తనను గిరగిరా తిప్పే తాడు సోనియా వద్ద వుంది. ఆవిడ ఎప్పుడు తాడు విదులుస్తుందో, ఎప్పుడు గుక్క పట్టిస్తుందో తెలియదు. అలాటివాడికి చిరంజీవి వంటి సర్వస్వతంత్రుడిని చూస్తే యీసునసూయలు కలుగవా మరి!

అవి వెళ్లగక్కడానికి అవకాశం యిచ్చిన చిరంజీవి స్టేటుమెంటు గురించి తదుపరి వ్యాసంలో..**– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 09**

## ఎమ్బీయస్ – మీడియాపై జాలి పడాలా ?

రిలయన్సు షాపులపై దాడి కారణంగా మీడియా, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా పాత్రపై అందరి దృష్టీ పడింది. మీడియా చేస్తున్నదేమిటి? ఎప్పటిదో వెబ్‌సైట్ న్యూస్...(తాగుబోతువాడి మాటకు ఎంత విలువ వుందో, వెబ్‌లో రాసినదానికి అంతే విలువుంది. నేను ఓ వెబ్‌సైట్‌లో రాస్తున్నానన్న స్పృహతోనే యీ వాక్యాలు రాస్తున్నాను. మన కోసం యదార్థాలు మారిపోవు. ఈ వెబ్‌సైట్‌లాటివి మావి గాసిప్స్, రూమర్స్ అని మొదటే రాసేస్తాయి కాబట్టి న్యూస్ చదువుతూనే విత్ ఎ పించ్ ఆఫ్ సాల్ట్ తీసుకుంటారు. కానీ యీ న్యూస్ ఛానెల్స్ తమది గాస్పెల్ ఆఫ్ ట్రూత్‌లా పోజు కొట్టి నిలదీస్తే పత్రికా స్వేచ్ఛ అని పెద్ద వాదిస్తారు) అది పెట్టుకుని అప్పటికప్పుడు కనిపెట్టిన విషయంలా..! ఏ మాత్రం స్వంత యిన్వెస్టిగేషన్ చేయకుండా...!!.. వెంటనే ఆన్ క్యూ.. అన్నట్టు అల్లర్లు.. మై గాడ్!!

మనకు న్యూస్ ఛానెల్స్ ఎక్కువై పోవడం వలన వచ్చిన తంటా యిది. ఇవి వచ్చాక మనకు పెరిగిన జ్ఞానం గానీ, అవగాహన గానీ శూన్యం. జాతీయ, అంతర్జాతీయ విషయాల జోలికి వెళ్లే శక్తిగాని, ఆసక్తిగాని మన వాళ్లకు లేదు. అసలు మనకు న్యూస్ ఛానెల్స్ అవసరమా? అంత న్యూస్ వుందా? ఉన్నా ఆ న్యూస్‌ను ఎనలైజ్ చేసే శక్తి వున్న వ్యాఖ్యాతలున్నారా? లోకల్ పొలిటికల్ యిస్యూస్ పైననే లోకల్ లీడర్స్‌ని, నిలయవిద్వాంసులైన వ్యాఖ్యాతలను, (అక్కడకి మేధావులంతా హైదరాబాదులోనే గూడు కట్టుకున్నట్టు) పేరంటంలా కూచోబెట్టి వాళ్ల చేత ఏదో ఒకటి అనిపించడం, ఎదుటివాళ్లను ఉసిగొలిపి వీళ్లమీద అరిపించడం, మధ్యే మధ్యే పానీయం అన్నట్టు కాలర్స్‌ను కలపడం, వీళ్లెవరూ చాలనట్టు నాబోటి, మీబోటి సామాన్యులను కూడా మన అభిప్రాయాలు చెప్పమనడం – ఇవీ టీవీ చర్చావేదికలు. సరైన విషయం సరైన కోణంలో ఎవరూ చెప్పరు, చెప్పబోతూంటే కట్ చ్టేయడానికి మోడరేటర్ ఎవరెడీగా వుంటాడు.

వీటన్నిటివలనా మనకు గందరగోళం తప్ప ఏ విషయమూ స్పష్టంగా బోధపడదు. ఎందుకంటే అక్కడి స్టాఫ్‌కీ గందరగోళమే.ఎకనామిక్స్, పొలిటిక్స్, హిస్టరీ, సైన్స్ – యిలాటి సబ్జక్టులలో ఏదైనా నిష్ణాతుడితో వన్–టు–వన్ చర్చలో పాల్గొనగలిగే

పాత్రికేయులను లెక్కించడానికి ఒక్క చేతి వేళ్లు చాలు. ఇస్యూను ఎంత కాంట్రవర్షియల్ చేద్దామా అని చూడడం తప్ప నూటికి 90 మంది టీవీ జర్నలిస్టులు ఏమీ చేయడం లేదు. దానివలన జరిగే సాంఘిక నష్టం గురించి వాళ్లు పట్టించుకోరు. వార్తలకు వాళ్లు పెట్టే కాప్షన్స్ చూడండి – అక్కడే వాళ్ల ఆలోచనాకోణం బయటపడుతుంది.

ప్రస్తుతం గొడవ ఎంతవరకూ వెళుతుందో తెలియదు. తప్పొప్పుల మాట ఎలా వున్నా కనీసం ఒకటి రెండు న్యూస్ ఛానెల్స్‌కు ఓ నెల్లాళ్లపాటు ప్రసారాలు ఆపించగలిగితే అందరూ ఒళ్లు దగ్గర పెట్టుకుంటారు. ఇన్ని పత్రికలున్నాయి, యిన్ని ఛానెల్సున్నాయి, గత రెండున్నర నెలలుగా ఉధృతంగా జరుగుతున్న తెలంగాణా మౌలికసమస్య గురించి ఎంతమంది మనను ఎడ్యుకేట్ చేస్తున్నారు చెప్పండి.

తెలంగాణా యిస్యూలో నాకు కొందరు మెయిల్స్ రాస్తున్నారు – తెలంగాణా 1956 నుండి డెవలప్ అయిందా లేదా అన్న బేసిక్ యిస్యూ వదిలేసి మీరు ముఖ్యమంత్రుల ప్రాంతం గురించి, సినిమాల్లో యాస గురించి రాస్తున్నారేమిటి? అని. డెవలప్‌మెంట్ గురించి రాయాలంటే స్టాటిస్టిక్స్ కావాలి. వాటిని ప్రెజెంట్ చేసే విధానం తెలియాలి. దానినుండి ఏది గ్రహించాలో అది సవ్యంగా గ్రహించాలి. అది ఎక్స్‌పర్ట్స్ జాబ్. దురదృష్టవశాత్తూ ఏ రాజకీయపార్టీ, ఏ మీడియా (టీవీ, పత్రికలు) పూర్తి వివరాలు యివ్వటం లేదు. ఎవరికి తోచినది వాళ్లు మాట్లాడుతూంటే చెల్లుబాటు అయిపోతోంది. అక్కడ అక్కడా దొరికినవి నేను సేకరిస్తున్నాను. ఓ స్టేజికి వచ్చాక తప్పక రాస్తాను. అంకెలు దొరికినా వాటిని గ్రాఫ్స్‌తో, చార్ట్స్‌తో ప్రెజెంట్ చేస్తే నా పాఠకులకు బోరు కొడుతుందేమోనన్న భయం కూడా వుంది.

ఆ అంకెలు దొరికేలోపున పెరిఫెరల్ యిస్యూస్ – అంచున వుండేవి స్పృశిస్తున్నాను. సభల్లో, టీవీల్లో, పత్రికావ్యాసాల్లో విభజనవాదులు అనునిత్యం ప్రస్తావిస్తున్న అంశాలే యివి. వీటిగురించి మాట్లాడడం చాలా తేలిక వాళ్లకి. నా బోటి వాడు యిలా కూడా ఆలోచించి చూడండి అని రాస్తే పాఠకుడు అర్థం చేసుకోవడమూ తేలికే. యాస గురించి, వెంగళరావు తెలంగాణాతనం గురించి రాసినది చాలామందికి నచ్చింది.

ఇక యిప్పుడు ఉపముఖ్యమంత్రి పదవి గురించి రాస్తాను. పెద్దమనుష్యుల ఒప్పందం (ఎవరా పెద్దమనుషులు అని కూడా రాస్తాను) లో అతి ముఖ్యమైన ఆ క్లాజ్ ఉల్లంఘించారని ప్రత్యేక తెలంగాణా పక్షాన వాదించేవారందరూ గత ఐదేళ్లగా మాట్లాడుతూనే వున్నారు కదా. దాని నిజానిజాల గురించి రెండు, మూడు రోజుల్లో రాయబోతాను. ఈ లోపున మీకు ఓ చిన్న ఎక్సర్‌సైజ్. ఇప్పటిదాకా మీరు వింటూ, చదువుతూ వున్నదాని ప్రకారం ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

01. ఆంధ్రప్రాంత ముఖ్యమంత్రులు తెలంగాణా ప్రాంతం నుండి ఎవరినీ, ఎప్పుడూ ఉపముఖ్యమంత్రిని చేయలేదా?

02. తెలంగాణా ప్రాంతపు ముఖ్యమంత్రులు ఆంధ్రప్రాంతం వారిని ఎవరినీ, ఎప్పుడూ ఉపముఖ్యమంత్రిని చేయలేదా?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలిస్తే మీరు నాకు 12 వ తారీకులోపున రాయండి. కరక్టుగా జవాబు రాసిన వారి పేర్లు ఈ శీర్షికలో పేర్కొంటాను. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ మెయిల్స్ పంపిన అందరికీ యీ శీర్షికద్వారా ప్రతిశుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను. విడివిడిగా పంపడం సాధ్యం కావటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## జనవరి 10 — చిరంజీవి మాటల్లో అనౌచిత్యం...?

సినిమావాళ్లు ఎవరూ భయపడలేదని విభజనవాదులు వాదిస్తున్నారు. రామానాయుడుగారు మేం యిక్కడే వుంటామని అన్నారని ఎత్తి చూపి ఆయనే మొత్తం యిండస్ట్రీ అన్నట్టు చిత్రపరిశ్రమ మాకే భయాలు లేవు అని చెపుతున్నారు అంటున్నారు. ఫిలిం ఛాంబర్, మా వంటి సంస్థలు ఎటూ ఏ స్టేట్‌మెంటు యివ్వలేదు కాబట్టి ఒకరి ప్రకటనను పరిశ్రమ మొత్తానికి అన్వయించలేం – అటు గాని, యిటుగాని. అయితే లాజిక్ చూడాలి.

అన్ని వ్యాపారాలకంటె మోస్ట్ వర్నలబుల్ సినిమా యిండస్ట్రీ. చిన్న రాయి తగిలితే చాలు లక్షల విలువ చేసే కెమెరా లెన్సు పగలడానికి! చిన్న అగ్గిపుల్ల చాలు, లక్షల విలువ చేసే సెట్టు దగ్ధం కావడానికి, చిన్న యాసిడ్ చుక్క చాలు కోట్లు విలువ చేసే తారల మొహం పనికి రాకుండా పోవడానికి. భయానక వాతావరణంలో ఎవరు పనిచేయగలరు? తెలంగాణా సినీ కార్మికుల సంఘం అంటూ ఏర్పడి మమ్మల్ని కోస్తా, సీమవాళ్లు అణిచేస్తున్నారని ఆరోపణలు మొదలుపెట్టారు. మీరే ఓ సినీ నిర్మాత అయితే వాళ్లను పెట్టుకోవడానికి భయపడరా? పెద్ద లైటు ఒకటి పైనుంచి కిందకు పడేసి 'జై తెలంగాణా' అంటే..? అన్న భయం మిమ్మల్ని వెంటాడదా?

రామానాయుడు గారు ఆ స్టేటుమెంటు యిచ్చాక వాళ్ల మనుమడి సినిమా షూటింగు సింగరేణిలో భగ్నమైంది. మనుమడు సమయానికి చాకచక్యంగా మాట్లాడి బయటపడ్డాడు. డైరక్టర్ కాలికి బుద్ధి చెప్పాడు. ఆర్య–2, అదుర్స్, లీడర్ సినిమాల తెలంగాణా డిస్ట్రిబ్యూషన్ రైట్స్ తీసుకోవద్దని ఓ సంఘం (దాని మాట ఎవరైనా వింటారో లేదో తెలియదు) ప్రకటించింది. ఏది ఏమైనా మేం యిక్కడే వుంటాం అని చెప్పిన ధీమా రామానాయుడుగారిలో క్రమేపీ తగ్గినా మనం ఆశ్చర్యపడనక్కరలేదు. ఆయన అప్పుడే వైజాగ్‌లో మరో స్టూడియో కట్టేశారు. అందువలన చెన్నయ్ వెళ్లం, యీ రాష్ట్రంలోనే వుంటామని అర్థం కాబోలు. అదీ చెప్పలేం. కాదూ

హైదరాబాదులోనే అని గట్టిగా చెప్పినా ఆయన సినిమాలో వేయాల్సిన ఆర్టిస్టులు భయపడడం మొదలుపెడితే ఆయన మాత్రం ఏం చేయగలరు?

ఇప్పటికీ మ్యూజిక్ యిండస్ట్రీ పూర్తిగా హైదరాబాదుకి రాలేదని ఎస్పీగారు అనేక వేదికల మీద చెపుతూ వుంటారు. ఇలా భయాందోళనలు రేకెత్తిస్తే వున్నవి కూడా వెనక్కి వెళితే ఆశ్చర్యపడనక్కరలేదు. చెన్నయ్ సినిమారంగంలో తెలుగువాళ్లు ఎప్పుడూ వివక్షతకు గురి కాలేదు. ఎయన్నార్ హైదరాబాదు వచ్చేసినతర్వాత కూడా ఎన్టీయార్ గాని, ఆయన బ్యాచ్ గాని మద్రాసును వదలలేదు. అక్కడ సకల సౌకర్యాలు వున్నాయి. ప్రొఫెషనల్‌గా పనిచేసే వాతావరణం వుంది. ఇక్కడైతే మనమే అన్నీ అమర్చుకోవాలి, ఎందుకొచ్చిన శ్రమ అని వాళ్ల అభిప్రాయం.

ఆ మాటకొస్తే 1953లో మద్రాసు రాష్ట్రవిభజన సమయంలో కూడా గోంగూర గోబ్యాక్ లాటి నినాదాలు, భాగో వంటి కూతలు, అల్లర్లు, ఏమీ జరగలేదు. రాష్ట్రవిభజన తర్వాత కూడా ఎంతోమంది తెలుగువాళ్లు ప్రశాంతంగా జీవిస్తున్నారు – మాతృభాష నేర్పే స్కూళ్లు తగ్గిపోయాయన్న చింత తప్ప! ఇప్పుడు తెలుగు సినిమావాళ్లు తిరిగి వెళ్లినా వాటేసుకుంటారు తప్ప, భయపెట్టరు.

అదేమాట చిరంజీవి చెప్పారు. తెలంగాణాలో తన సినిమాలను ఆదరించలేదని కాని, తన ఎదుగుదలలో తెలంగాణా ఫ్యాన్స్ పాత్ర లేదనికానీ చెప్పలేదు. ఇప్పటిదాకా అంతా సవ్యంగా జరిగిపోయింది. ఇప్పుడు మాత్రం సినిమావాళ్లను భయభ్రాంతులను చేస్తున్నారు. పరరాష్ట్రమైన తమిళనాడులో కూడా యిలాటి భయాన్ని చవిచూడలేదు అని చెప్పడంలో అవాస్తవం ఏమైనా వుందా? చిరంజీవికి తెలంగాణాలో ఓట్లు పడలేదు కాబట్టే యిలా మాట్లాడుతున్నారు అంటున్నారు. అయితే కావచ్చు. బిజెపికి కోస్తా, సీమల్లో బలం లేదు కాబట్టే విభజన అంటోంది. తెరాసకు ఆ ప్రాంతంతో పనే లేదు కాబట్టి ఆంధ్రావాలే భాగో అంటోంది.

ఇది సహజం. చిరంజీవి ప్రత్యేక తెలంగాణా ఓట్లపై ఆశ వదిలేసుకున్నారు కాబట్టే ఊగిసలాట వదిలేసి సమైక్యాంధ్ర అనేశారు. లేకపోతే కాంగ్రెస్, టిడిపిల్లా దోబూచులాడేవారు. ఏదో ఒక గట్టుకైతే చేరారు కదా. 2014 నాటికి ఏమవుతుందో ఎవరికి తెలుసు? అప్పటిదాకా రాష్ట్రం విడిపోకా వుండి, ప్రత్యేకవాదం వెనకబడితే చిరంజీవి విధానాలు నచ్చితే తెలంగాణాలో కూడా ఆయనకు ఓట్లు పడవచ్చు. ఆయన ప్రకటనపై అంత విరుచుకు పడవలసిన అవసరం లేదు.

తెలంగాణాలో గొడవ అయినపుడే రోశయ్యగారికి శాంతిభద్రతలు గుర్తుకు వచ్చాయా? అని కొంతమంది రాశారు నాకు. కోస్తా, సీమల్లో గొడవలైనప్పుడూ ఆయన మంత్రులనీ, ఎమ్మెల్యేలనూ బతిమాలుతూనే వున్నాడు. రాజీనామా చేసి పరిపాలన కుంటుపరచకండి అని. ఉద్యమాలు వద్దని చెపుతూనే వున్నాడు. కానీ ఓ మాట మనం ఒప్పుకోవాలి.

హైదరాబాదు సంక్షోభంలో పడినపుడే పెట్టుబడులకు, సినీపరిశ్రమకు భారీగా పడుతుంది. లేకపోతే ఏదో ఒక జిల్లాలో ఎప్పుడూ ఏదో ఒక గొడవ వుంటూనే వుంటుంది. హైదరాబాదు మావోయిస్టుల గ్రిప్‌లోకి వెళ్లిపోయిందని యిన్వెస్టర్లకు అనిపిస్తే మన పెట్టుబడులు ఔట్. అప్పుడే ముఖ్యమంత్రి పదవిలో వున్నవాళ్లు కంగారు పడేది. తెలంగాణా ముఖ్యమంత్రైనా, కోస్తా ముఖ్యమంత్రైనా ఎవరైనా చేసేది అదే! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 11**

## ఎమ్బీయస్ – కావూరి కావుకావు...

కెసియార్ మౌనం పాటించడానికి కారణం ఏమిటాని ఆయన అభిమానులు మథన పడుతూ వుండగా ఓ ఇంగ్లీషు డైలీ ఓ వార్త వేసింది – కెసియార్‌కు కేంద్రంలో మంత్రిపదవి యివ్వబోతున్నారని! ఆయన్ని నమ్ముకుని చదువులు వ్యర్థం చేసుకుంటున్న, ప్రాణాలు బలిపెడుతున్న విద్యార్థులకు యిది ఎంత ఆవేదన కలిగిస్తుందో వూహించండి. అదే సమయంలో గాయానిపై వుప్పు చల్లినట్టు కావూరి సాంబశివరావుగారి ప్రకటన ఒకటి – 'తెలంగాణాకు ఉపముఖ్యమంత్రి పదవి యిచ్చివుంటే యింతవరకూ వచ్చేది కాదు. ఇప్పుడైనా యివ్వాలి' అంటూ. అంటే యింత ప్రచండంగా జరుగుతున్న వుద్యమం కేవలం ఉపముఖ్యమంత్రి పదవి కోసమే అని యీసడించినట్టు కాదా? ఇటువంటి సున్నితమైన దశలో, తాత్కాలికంగానైనా ఆ విషయంలో శాంతి, మౌనం నెలకొన్న పరిస్థితిలో యిలా కాకిగోల చేయడం సబబా?

జనవరి 5 న భేటీ అయిన దగ్గర్నుంచి కెసియార్ ఏమీ మాట్లాడటం లేదు. అది వ్యూహాత్మక మౌనం కావచ్చు. 12 వ తారీకున జరిగే జెఎసి సమావేశంలో ఆయన మళ్లీ గళమెత్తి నినదించవచ్చు. కానీ యీ లోపున పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కేంద్రం వాళ్లు ఆయన్ని లాలించో, బెదిరించో తెలంగాణా సమస్యకు తెర దించేస్తున్నారని. ఆయనకు ఓడలున్నాయని, ఓడరేవు అమరబోతోందని ఓ గట్టి పుకారు వచ్చింది. అవి చూపించి బ్లాక్‌మెయిల్ చేసి వుంటారని, లేదా ఆ రేవు మేమే కట్టిస్తామని వూరించి వుంటారని అనుమానాలు కలిగేలా చూశారు కేంద్ర నాయకులు. రాజకీయ నాయకుల విశ్వసనీయత అతి తక్కువ కాబట్టి వారి గురించి ఏది నమ్మడానికైనా ప్రజలు సిద్ధంగా వుంటారు.

ప్రత్యేక తెలంగాణా రావాలని కోరుకునే తెలంగాణా ఎన్నారైలు తెరాసకు కోట్ల కొద్దీ విరాళాలు పంపారని వింటూనే వున్నాం. 2009 ఎన్నికలలో పొత్తు కుదుర్చుకోవడానికి టిడిపి నుండి, అది సాగకుండా చేయడానికి వైయస్ నుండి, టిక్కెట్లు యివ్వడానికి అభ్యర్థులనుండి కెసియార్ దండిగా వసూలు చేశారని చెప్పుకుంటున్నారు. అన్నిటికంటె ఆశ్చర్యకరమైన యిటీవలి ఆరోపణ యింకోటి

వుంది. కెసియార్ మౌనంగా వుండడానికి వైయస్ ప్రతీనెలా డబ్బిస్తూ వుండేవారట. వైయస్ పోయాక కెసియార్ వెళ్లి రోశయ్యా నడిగారట. రోశయ్య తన అలవాటు ప్రకారం 'నాకేమీ మైన్స్, ఇడుపులపాయలు లేవు, పోయి ఢిల్లీ నడుగు' అన్నాట్ట. దాంతో కెసియార్‌కి మండిపడి నవంబరులో అగ్గి రాజేశారట! ఇలాటి ఆరోపణలలో నిజానిజాలు ఎప్పటికీ బయటకు రావు. కానీ వీటిలో ఏ కాస్త వాస్తవం వుందని తేలినా అప్పటిదాకా ఆ నాయకులను ఎత్తుకుని మోసిన కార్యకర్తలు అగ్నిగోళాలై ఆ నాయకులను దహించివేస్తారు. దాని పర్యవసానం రాష్ట్రంపై చాలా భీకరంగా వుంటుంది.

ఢిల్లీలో ఏ తేలుమంత్రం వేశారో కానీ రాష్ట్రనాయకులందరూ తేలుకుట్టినవాళ్ల దొంగల్లా అయిపోయారు. ఉద్యమాలు యింకా నడుస్తున్నాయో, లేవో తెలియని స్థితికి వచ్చేం. మొన్నటిదాకా అటో, యిటో ఎక్కడో అక్కడ బంద్‌లు, నిరసనలు, రోడ్డుమీద బతుకమ్మలు లేదా గొబ్బెమ్మలు. జనవరి 4,5 తారీకుల్లో యిది పరాకాష్టకు చేరింది. అవతల భేటీకి సన్నాహాలు జరుగుతూ వుంటే యివతల బంద్‌లు, రైల్ రోకోలు! భేటీ విఫలమైతే అప్పుడు చేసినా అర్థముండేది. భేటీకి వెళుతూ బంద్‌లేమిటి?

ఇంతటి ఉన్మాదంలో వున్న నాయకులకు ఢిల్లీలో ఏ లేపనాలు పూశారో కానీ ఒక్కసారిగా అందరి మెదళ్లూ చల్లబడి శాంతి లేనిదే ఏ పనీ సాగదన్న విషయం హఠాత్తుగా గ్రహించి, మనల్ని శాంతంగా వుండమని ఉద్బోధిస్తూ జాయింటు ప్రకటన యిచ్చివచ్చారు – అక్కడి కేదో శాంతి విలువ తెలియని స్థితిలో మనం వున్నట్టు! మనల్ని రెచ్చగొట్టేది వాళ్లే, రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని కేంద్రాన్ని బెదిరించేది వాళ్లే. బంద్‌ల వలన, రోకోల వలన మనం రోజుకూలీ పోగొట్టుకుంటూ వుండగా మనల్ని చూపించి చూశారా మా బలం, మరి మా సంగతేమిటంటారు అని బేరమాడుకునేదీ వాళ్లే!

వాళ్లు ఏదో ఒకటి అఘోరించనివ్వండి, రాష్ట్రంలో ఏదో శాంతి నెలకొంది అదే పదివేలు అని వూపిరి పీల్చుకుంటూ వుండగా కావూరిగారు కావుకావుమంటూ మనల్ని రెచ్చగొడుతున్నారు. పదవుల గురించే యీ ఆందోళనంతా అని చెప్పి తూష్ణీంభావం కనబరుస్తున్నారు. చివరాఖరికి తెలంగాణా కాంగ్రెస్ నాయకులను చల్లార్చే విధానం అదే కావచ్చు. లేకపోతే ఏకంగా ముఖ్యమంత్రి పదవినివ్వడమే కావచ్చు. కానీ అది యిప్పుడే చెప్పవలసిన అవసరం లేదు కావూరికి. అష్టకష్టాలు పడి ఢిల్లీవాళ్లు శాంతి నెలకొల్పితే దాన్ని చెడగొట్టే హక్కు యీయనకు ఎవరిచ్చారు? ఈ వారంరోజుల ప్రశాంతత కూడా కావూరి ఓర్చుకోలేరా? తెలంగాణా వుద్యమాన్ని యీ విధంగా చిత్రీకరించి కోస్తాసీమల్లో హీరో అవుదామనుకుంటున్నారా? జనవరి 5 భేటీలో వాళ్ల ప్రయోజనాలను యీయన కాపాడిందేమిటి? యనమల, రామచంద్రయ్య మాట్లాడినంత ధాటీగా యీయన మాట్లాడారా? రోడ్‌మ్యాప్ ఏమైనా గీసి యిచ్చారా? మీరేం చెపితే అదే, జో హుకుమ్ అనేసి కూచున్నారు. రాష్ట్రం ఎందుకు సమైక్యంగా వుండాలో కూడా కన్విన్స్ చేయలేకపోయారు. ఇక్కడ రెచ్చిపోతున్న యీ వీరుడికి అక్కడ ఏ పదవీ తాయిలం పెట్టి వూరుకోబెట్టారో అని జనాలు అనుకుంటే తప్పుందా?

ఇంతకీ కావూరి అనేదేమిటి? పెద్దమనుష్యుల ఒప్పందంలో ఉపముఖ్యమంత్రి క్లాజ్ అమలు కాలేదు, అయివుంటే యీ చిక్కులు వచ్చి వుండేవి కావు అనే కదా. అది ఎప్పుడూ అమలు కాలేదన్న ధ్వని వినిపించింది దానిలో. ఈ విషయమై నేను అడిగిన ప్రశ్నలకు యిప్పటిదాకా పదిమంది పాఠకులు సమాధానాలు పంపించారు. వారిలో ఒకరు పూర్తి కరక్టు (నాకు తెలిసినంతవరకు) సమాధానం రాశారు కూడా! కరక్టు సమాధానం ఏమిటో మనం అందరం కలిసి తెలుసుకుందాంగానీ మరి యీ సామాన్య పాఠకులకున్న పరిజ్ఞానం కూడా ఘనత వహించిన మన ఎంపీగారికి తెలియదా? తెలిసివుంటే ఆయన ప్రకటనలో 'ఈసారి లేదా యిటీవల అమలు కాక పోవటం వలన...' లాటి పదాలు వుండి వుండేవికదా! **– ఎమ్బీయస్ ప్రసాద్**

డిపెండెంట్సా? ఇండిపెండెంట్సా? – ఆహ్వానించాం అంటారు. సినిమావాళ్లకు మేం భూములిచ్చాం అంటున్నారు. తెలంగాణా బాగు చేయలేదేం? అంటే సిఎం చెయ్యనివ్వలేదు అంటారు, యిప్పుడు మేం యిచ్చాం అంటారు. 40% మంత్రుల్లో ఒక్కడు సరైనవాడు లేడా? జీవన్‌రెడ్డి రోడ్లు జక్కంపూడి

చిదంబరం వేసిన స్టెప్పులవలన కోస్తా, సీమల్లో కాంగ్రెస్ అంటే ఏహ్యత కలుగుతుందనే భయం చేత ప్రణబ్ ద్వారా వాళ్లకు అనుకూలంగా మాట్లాడిస్తోంది సోనియా. 'తెలంగాణా ఏర్పాటు అంత సులువు కాదు, చండీగఢ్‌ను యిప్పటిదాకా పరిష్కరించలేకపోయాం. రాత్రికి రాత్రి ఏమీ కాదు. ఏకాభిప్రాయం రావాలి. కాలపరిమితి లేదు. 9 వ తారీకున కెసియార్ ప్రాణం కాపాడడానికే అలా స్టేటుమెంటు యిచ్చాం' అంటూ ప్రణబ్ టీవి ఇంటర్వ్యూలో అన్నాడు.

**జనవరి 12** **ఎమ్బీయస్ – మతి చెదుర్స్...**

కెసియార్ మౌనం ఆయన వరకే పరిమితం కాబోలు. ఇప్పుడు వాళ్ల అమ్మాయి గొంతెత్తారు – అదుర్స్ సినిమాను తెలంగాణాలో ఎవరూ కొనగూడదట. కొనుగోలు చేసి, ప్రదర్శిస్తే ఆవిడా అవిడ అనుచరులూ థియేటర్ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేస్తారట. కెసియార్ గారబ్బాయి ఎన్‌డిటివి హైదరాబాదులో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ వీసా పరిమితి అయిపోగానే తాను ఎలా అయితే అమెరికానుండి తిరిగి వచ్చేశాడో అలాగే కోస్తా, సీమ ప్రాంతాల వాళ్లు హైదరాబాదు విడిచి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఒవైసీ మందలించినా ఆయన తన మాట వెనక్కి తీసుకోలేదు.

ఇప్పుడు కవితగారు సోదరుణ్ని మించుదామని చూస్తున్నట్టున్నారు. అదుర్స్ అడ్డుకోవడానికి కారణం ఏమిటట? దానిలో తెలంగాణా సంస్కృతిని అవహేళన చేశారా? హీరోగారు తమ తాతగారు 'తల్లా? పెళ్లామా?' లో పెట్టిన మోడల్లో సమైక్యవాదాన్ని ప్రబోధిస్తూ ఓ పాట పెట్టారా? ఆ సినిమాలో 'నువ్వు విజిలేస్తే ఆంధ్రా సోడాబుడ్డి' పాట వుందా? సినిమా పేరు 'ఆంధ్రావాలా' నా? పోనీ కోస్తాలో సింహాచలాన్ని గుర్తు చేసే 'సింహాద్రి' యా?

అబ్బే! అదేం కాదు, జూ.ఎన్టీయార్ తండ్రి హరికృష్ణ సమైక్యవాదానికి మద్దతుగా రాజీనామా చేశారట, అందుకు శిక్ష యీయనికి వేశారట. ఇంతకంటె హాస్యాస్పదం వుందా? ఇదే లాజిక్ వుపయోగిస్తే మారెప్పగారబ్బాయికి, వంశీచంద్ రెడ్డి కొడుక్కి, అతనికి యింకా పిల్లలు లేకపోతే వాళ్ల తండ్రికి శిక్షలు పడాలి!

కొందరు తెరాస నాయకులు ఇంకో లాజిక్ లాగారు. జూ.ఎన్టీయార్ తెలంగాణాలో పుట్టినా, గిట్టబోతున్నా అది క్వశ్చన్ కాదట. ఆ సినిమా నిర్మాత ఎవరన్నది పాయింటట. నిర్మాత కొడాలి నాని కోస్తా వాడు. పైగా లగడపాటి నిరాహారదీక్ష చేసినపుడు ఆ శిబిరానికి వెళ్లి షేక్‌హ్యాండ్ యిచ్చివచ్చాడు! చాలు ఇంకే కావాలి. సినిమాను అడ్డుకోవడానికి! నేను నిమ్స్ నిషిద్ధులు ఆర్టికల్‌లో వ్యంగ్యంగా రాసిన ఆఖరి వాక్యాలు గుర్తుకు వస్తున్నాయి. సినిమాతో సంబంధం వున్నవారెవరూ సమైక్యవాదులు లేరని తెలంగాణా థియేటర్స్ వద్ద హామీబోర్డులు పెట్టే రోజులు వస్తాయని. అది యింత త్వరగా నిజమవుతుందని అనుకోలేదు.

సినిమా రంగం గురించి కాస్త తెలిసినా తెలిసిపోతుంది – నిర్మాత పేరు ఎవరిదున్నా నిర్మాణం సాగుతున్న కొద్దీ దానిలో పెట్టుబడి పెట్టేవారు చాలామంది వుంటారని. తెలంగాణా ఏరియా డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ లక్షలు, కోట్లు పోసి ఆ సినిమాను ఈ పాటికే కొనేసివుంటారు. వారిలో చాలామంది తెలంగాణా ప్రాంతపువారు, అయితే గియితే ప్రత్యేక తెలంగాణా వాదులూ కూడా వుండి వుంటారు. నిర్మాతకు తన డబ్బులు యీ పాటికే వచ్చేసి వుంటాయి. ఇక నష్టపోయేది వీరే అవుతారు.

ఇలాటి చేష్టల వలన రాష్ట్రం యిమేజి ఎంత ఘోరంగా దెబ్బతింటోందో వీళ్లు అర్థం చేసుకోవడం లేదు. ఎవియమ్‌వారు 'రాణా' సినిమాను నిర్మించారు. క్రిస్మస్‌కి రిలీజ్ చేద్దామనుకున్నారట, వాయిదా పడుతూ వస్తోంది. కోట్లు పెట్టుబడి పెట్టిన సినిమాకు ఆలస్యమైన కొద్దీ వడ్డీభారం పెరగదా? తెలుగులో సినిమా తీసేపని యిప్పట్లో పెట్టుకోకపోవడం మంచిది అని ఎవియం వారు అనుకుంటే తప్పు పట్టగలమా? అనిల్ అంబానీ తెలుగు సినిమాల్లో పెట్టుబడి పెడదామనుకుని 'సలీం'తో ప్రారంభించాడు. సినిమా ఫ్లాప్ అవుతూండగానే తెలంగాణా ప్రాంతంలో ఆ మాత్రం కూడా ఆడలేని పరిస్థితులు వచ్చాయి. ఇక తెలుగు సినిమా అంటే అనిల్ బెదిరితే పొరబాటుందా?

కవితగారు యిచ్చిన స్టేటుమెంటుపై విమర్శలు రావడంతో యివాళ్టి టీవీ చర్చల్లో తెరాసనాయకుడు కవితకు, తెరాసకు సంబంధం లేదని వాదించబోయాడు. ఆవిడ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకురాలు మాత్రమే అన్నాడు. వెంటనే టీవీ ఛానెల్ యాంకర్ ఆవిడ మా ఛానెల్‌కి వచ్చినపుడు తెరాస మహిళావిభాగం ప్రతినిధి అని చెప్పుకున్నారని గుర్తు చేశారు. కేంద్రం తనను మౌనంగా వుండమని కోరింది కాబట్టి కెసియార్ తన పేర స్టేటుమెంట్లు యివ్వటం లేదు. కానీ అలా అయితే ఉద్యమం చల్లారిపోతుందేమోనన్న భయంతో కవితగారు యీ స్టెప్ తీసుకున్నారేమో! సినిమావాళ్ల గురించి ఏదైనా అనడం తేలిక, వాళ్లు నివసించేది గాజు?మేడలలో కాబట్టి. పైగా అన్నదానికి విపరీతమైన ఫ్రీ పబ్లిసిటీ.

అన్నట్టు యిదే సందర్భంలో నేను రాసిన ఒక పొరబాటును సవరించుకుంటున్నాను. యాస గురించి రాస్తూ ప్రీతమ్ సినిమాలో మెహమూద్ వేసిన పాత్ర హైదరాబాదీ మంగలి అన్నాను. కానీ ఆ పాత్ర తమిళ మంగలి. పొరబాటుకి చింతిస్తున్నాను. త్రీ యిడియట్స్ మద్రాసులో హిట్ కావడం గురించి చెపుతూన్నపుడు ఓం శాంతి ఓం గురించి కూడా చెప్పవచ్చు కదా అన్నారొకరు. ఎన్నడా రాస్కేలా అంటూ షారుఖ్ ఖాన్ తమిళవాళ్లను ఆటపట్టించాడు. అయినా సినిమా మద్రాసులో హిట్టే! అందువలన సినిమాల గురించి పట్టించుకునేది మామూలు జనం కాదు, నాయకులే!

ఏది ఏమైనా కవితగారి స్టేటుమెంటు వలన కోట్ల కొద్దీ పెట్టుబడి, అనేకమంది కళాకారుల కెరియర్లు, తెలంగాణాలో వున్న థియేటర్లపై ఆధారపడిన కుటుంబాలు, డిస్ట్రిబ్యూషన్ చెయిన్‌లో యిరుక్కున్న అనేకమంది తెలంగాణావారి జీవితాలు అన్నీ దెబ్బతినబోతున్నాయి.

ఇలాటి పరిస్థితుల్లో నేనే 'అదుర్స్' నిర్మాత నైతే ఏం చేస్తానా అని ఆలోచించాను. '..దెబ్బకి తెలంగాణా అదుర్స్' అనే పేరుతో కోస్తా, సీమల్లోనూ, '...దెబ్బకి ఆంధ్రా అదుర్స్' అని తెలంగాణా ప్రాంతంలోనూ రిలీజ్ చేస్తా. అప్పుడు సినిమా రిలీజ్ కావడమే కాదు,సుడి తిరిగితే సూపర్ హిట్ కూడా అవుతుంది! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 13**

## ఎమ్బీయస్ – డిపెండెంట్సా? ఇండిపెండెంట్సా?

కన్యాశుల్కంలో గిరీశం ఓ వాదన వినిపిస్తాడు. తను దేవుడి వద్దకు వెళినపుడు ఆయన పాపపుణ్యాల చిఠ్ఠా తీస్తే అడుగుతాడట – 'ఓ దేవా! నన్ను యిండిపెండెంట్‌గా సృజించావా? లేక డిపెండెంట్‌గా సృజించావా?' అని. ఇండిపెండెంట్‌గా సృజిస్తే నా యిష్టం వచ్చినట్టు నేను చేశా. నువ్వెవరు అడగడానికి? అని అంటాడట. 'లేదు, డిపెండెంట్‌గా సృజించా' అంటే 'అయితే నేను చేసిన

పనులన్నిటికీ నువ్వే బాధ్యుడివి. ఆ పాపపుణ్యాల సంగతి నువ్వే చూసుకో. నన్నడక్కు' అంటాడట.

తెలంగాణావాదుల వాదన ప్రకారం చూస్తే ఇప్పటిదాకా పనిచేసిన తెలంగాణా మంత్రుల, ముఖ్యమంత్రుల విషయంలో యీ ప్రశ్న – డిపెండెంట్సా? ఇండిపెండెంట్సా? – అని వుదయించకమానదు. తెలంగాణా వాదులు ఏదైనా గొప్ప చెప్పుకోవాలంటే 'మేం సినిమావాళ్లను ఆహ్వానించాం, యితరప్రాంతాల వాళ్లను కడుపులో పెట్టుకున్నాం, పరిశ్రమలకు, స్టూడియోలకు స్థలం యిచ్చాం, కనురెప్పల్లా కాపాడుకున్నాం' అని చెప్తారు. అలా అంటూంటే 'దశాబ్దాలుగా అభివృద్ధి జరగలేదంటున్నారు కదా, మరి మీ ప్రాంత నాయకులు ఏం చేస్తున్నారు?' అని అడిగితే 'ఏదీ మా వాళ్లను పనిచేయనిస్తేగా.. అసలు పదవుల్లో వుండనిస్తేగా' అంటూన్నారు. వాదన వింతగా లేదూ! పనిచేయనీకపోతే స్టూడియోలకు స్థలాలు ఎలా యిచ్చారట?

విభజనవాదుల వాదనలో ప్రధానమైనది – తెలంగాణాలో జరగవలసినంత అభివృద్ధి జరగలేదు సరికదా, 1956లో వున్న పరిస్థితి కంటె దిగజారిపోయామని! దానిపై పూర్తి గణాంకాలు లభించేదాకా మాట్లాడదలచుకోలేదని చెప్పాను కదా. అందువలన వాళ్లు అన్నమాటనే మనం వాదనకోసం ఒప్పుకుందాం. ఒప్పుకోగానే ఓ ప్రశ్న వుదయిస్తుంది. మరి దానికి కారణం ఎవరు? అని. 1956 నుండి ప్రతీ కాబినెట్‌లో 40% మంత్రులు తెలంగాణావారే! ఎమ్మెల్యేలలో మూడింట రెండువంతులు తెలంగాణా ప్రాంతపువారే! ఆ మాట గుర్తు చేస్తే విభజనవాదులు 'మా వాళ్లు అమాయకులు, వాళ్లని కోస్తా, సీమవాళ్లు పనిచేయనీయలేదు' అంటున్నారు.

నిజంగా తెలంగాణా ప్రాంతం నుండి ఉద్భవించిన నాయకులందరూ నోట్లో వేలు పెడితే కొరకలేనివారా? వారిలో సమర్థులు లేరా?

1956 నుండి కాబినెట్‌లో వున్న తెలంగాణా మంత్రుల్లో కొందరు మహానుభావులను స్మరించుకుందాం. కెవి రంగారెడ్డి (ఈయన పేరనే రంగారెడ్డి జిల్లా వెలిసింది), జెవి నర్సింగరావు, నూకల రామచంద్రా రెడ్డి, పి.వి.నరసింహారావు (ఉత్తరోత్రా ముఖ్యమంత్రి, అత్యంత సమర్థుడైన ప్రధానమంత్రి అయ్యారు), డా. మఱ్ఱి చెన్నారెడ్డి (కేంద్రమంత్రి, రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు) జలగం వెంగళరావు (ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి అయ్యారు), జి.సంజీవ రెడ్డి (ప్రముఖ కార్మిక నాయకుడు), జె. చొక్కారావు (ఈయన పేర ఓ ప్రాజెక్టు కూడా కడుతున్నారు) మదన్ మోహన్ (1969 ఉద్యమంలో విద్యార్థి నాయకుడు), టి. అంజయ్య (ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి అయ్యారు), టి.హయగ్రీవాచారి, జి.వెంకటస్వామి (కేంద్రమంత్రి కూడా అయ్యారు), సి.జగన్నాథరావు, ఇంద్రారెడ్డి (నేటి హెూం మంత్రి భర్త), డి శ్రీనివాస్ (పిసిసి అధ్యక్షుడు), పి. జనార్ధన రెడ్డి, మాధవరెడ్డి,

.. కొండా లక్ష్మణ బాపూజీ, ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, కె. కేశవరావు, వి.హనుమంతరావు, జానారెడ్డి, జీవన్ రెడ్డి, దామోదర రెడ్డి, డికె సమరసింహారెడ్డి, దేవేందర్ గౌడ్, కె. విజయరామారావు (సిబిఐ డైరక్టర్‌గా చేశారు) కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస యాదవ్, పొన్నాల లక్ష్మయ్య, డి కె అరుణ, గీతా రెడ్డి... (వీళ్లంతా ఇప్పటికీ యాక్టివ్),

కొందరు మంత్రుల పేర్లు మాత్రమే రాశాను..సమర్థులైన ఎమ్మెల్యేలు ఎంతోమంది వుండే వుంటారు. వీళ్లెవరూ తమ ప్రాంతం సంక్షేమం పట్టించుకోని స్వార్థపరులనీ, ముఖ్యమంత్రితో పోట్లాడో, బతిమాలో, యిరకాటంలో పెట్టో నిధులు తెచ్చుకోలేని అసమర్థులనీ అనడం తగునా? కానీ ప్రస్తుతం విభజనవాదులు చేస్తున్నది అదే! తమ వాదన నెగ్గించుకోవడానికి తమ ప్రాంతపు నాయకులను యిలా చిత్రీకరిస్తున్నారు. ఇది అత్యంత దుర్మార్గం కాదా? ఎన్‌టివీ లో చర్చావేదికలో యీ విషయం లేవనెత్తినప్పుడల్లా కొమ్మినేని శ్రీనివాసరావుగారు యీ ప్రశ్న అడుగుతూనేవున్నారు. ఇప్పటిదాకా ఎవరూ దీనికి సమాధానం చెప్పటం లేదు. కోమటిరెడ్డికి యిచ్చిన షోకాజ్ నోటీసు (ఆ నోటీసు ఎంపీలకూ వచ్చింది) ప్రస్తావించి యిదీ తెలంగాణా మంత్రుల స్థితిగతులు అని చెప్పి తప్పించుకుంటున్నారు. (పైన చెప్పిన తెలంగాణా మంత్రులందరూ కోమటిరెడ్డి స్థాయి వారేనా!?) ముఖ్యమంత్రిపై ఆయన ఘోరమైన వ్యాఖ్యలు చేసినా ఆయన పదవి ఆయనకు దక్కింది కదా! రోశయ్య కాబట్టి అవి సహించారు. ఆయన స్థానంలో ఏ చెన్నారెడ్డో వుండి వుంటే కోమటిరెడ్డి ఎక్కడ తేలేవారో!

తమ ప్రాంతాలకు ఏమీ చేయలేదని నిందమోస్తున్న పై జాబితాలోని నాయకులలో అనేకమంది యింకా యాక్టివ్‌గానే వున్నారు. తాము పదవులలో వుండగా తన నియోజకవర్గానికి, తమ ప్రాంతానికి ఏం చేశారో వాళ్లు ప్రజలకు చెప్పుకోవాలి. వాళ్లు రాజకీయాల్లోకి వచ్చినపుడు అక్కడి పరిస్థితి ఎలా వుండేదో, తమను ఎన్నుకున్న వారి జీవితాలలో తాము ఎలా వెలుగులు నింపామో వాళ్లు స్వయంగా చెప్పుకోవాలి. లేకపోతే ప్రత్యేక రాష్ట్రంలో గాని, సమైక్యరాష్ట్రంలో గాని మళ్లీ ఎన్నికలలో నిలబడకూడదు. ఓట్లు అడగకూడదు. ఇప్పటిదాకా ప్రజాధనంతో సుఖకరమైన జీవితం గడిపినందుకు క్షమాపణ చెప్పాలి.

ప్రస్తుతం యీ లోకంలో లేని నాయకుల సంగతి ఏమిటి? వారి వారసులు వారి వారి తండ్రులు, తల్లులు తమ ప్రాంతాలకై కృషి చేశారో లేదో వాస్తవాలు తెలియపరచాలి. స్వార్థప్రయోజనాలకై ఎవరైనా వారి గురించి అసత్యాలు ప్రచారంలో పెడుతూ వుంటే ఖండించాలి. ఉదాహరణకి వెంగళరావుగారు తెలంగాణా ప్రాంతానికి చెందరని విభజనవాదులు వాదిస్తూ వుంటే వెంగళరావుగారి వారసులు మిన్నకుండడం పొరబాటు. తమ తండ్రి ఖమ్మం గురించి చేసిన సేవలను ఉగ్గడించి, వారి గురించి జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎదుర్కోవాలి.

తెలంగాణా ప్రాంతం నుండి ఉపముఖ్యమంత్రి పదవి డిమాండ్ చేసే దమ్ము ఎవరికీ లేకపోయిందని, వారు కోస్తా, సీమవారి చేతిలో ఏమారిపోయారని ప్రచారం జరుగుతున్నపుడు ఉపముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవరైనా వుంటే (ఉన్నారో లేదో త్వరలోనే

కనుగొందాం) వారి వారసులు చెప్పాలి – 'మా నాన్నగారు లేదా తాతగారు ఉపముఖ్యమంత్రిగా వున్నారు. అప్పట్లో ఆయన పవర్‌ఫుల్ రాజకీయనాయకుడు, మీ ప్రచారం యిప్పటికైనా ఆపండి' అని. లేకపోతే వారి వారసత్వానికి వారు అపచారం చేసినట్టే!

**– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 14** **ఎమ్బీయస్ – 'మేం గెలిపించుకుంటాం...'**

జెఏసిలో కాంగ్రెస్ నాయకులపై ఒత్తిడి పెరుగుతోంది, మీ రాజీనామాలు ఆమోదింపజేసుకోండి అంటూ. 'మీ కెందుకు భయం? కానీ ఖర్చు లేకుండా మిమ్మల్ని మళ్లీ మేం గెలిపించుకుంటాం' అని హామీ యిస్తున్నారు జెఏసిలో మిగతా సభ్యులు. 'మరి యింకెందుకు తటపటాయింపు..' అనిపిస్తోందా? మనది కాకపోతే అంతే లెండి!

జెఏసి నడవవలసిన తీరులో నడవటం లేదు. మొన్నటి సమావేశానికి ముందుగా ఏ పార్టీకి ఆ పార్టీ సమావేశం పెట్టుకుని ఆ తర్వాత మీటింగులో పాల్గొన్నారు. అంటే ఓపెన్‌మైండెడ్‌గా రాలేదు. కాంగ్రెస్, టిడిపి వారిపై మంద కృష్ణ విరుచుకుపడడం కెసియార్ వెనకనుండి చేయించిందేనని యితరుల అనుమానం. రేపు తెలంగాణా వస్తే ఆ ఘనతలో కాంగ్రెస్, టిడిపి పాలు పంచుకోకుండా వాళ్లు ఉద్యమానికి ఏదైనా చేస్తే అది తమ ఒత్తిడివల్లనే చేశారని చూపించడం తెరాస లక్ష్యం. అదుర్స్ సినిమా యిస్యూలోనే అది కొట్టవచ్చినట్టు కనబడింది.

అదుర్స్ సినిమాను అడ్డుకుని తమ తడాఖా చూపిద్దామని తెరాస తాపత్రయం. జెఏసిలో వుండగా తెరాస విడిగా తమ కార్యక్రమాన్ని ప్రకటించలేదు. అందువలన కవితను రంగంలోకి తెచ్చారు. అదుర్స్ అడ్డుకోమని ఆవిడ యిచ్చిన ప్రకటనతో తమకు సంబంధం లేదని తెరాస నాయకులు దొరికిన వేదిక లన్నిటిపైనా చెప్పుకున్నారు. సంబంధం లేదంటారు కానీ ఖండించరు. కోన్‌కిస్కాయిలు అనేకమంది కూసిన కూతలపై మంచిగానో, చెడుగానో వ్యాఖ్యానిస్తారు గానీ సాక్షాత్తూ తమ నేత కూతురు, తెరాస మహిళావిభాగం అధినేత అని మొన్నటిదాకా చెప్పుకున్న కవిత మాటలపై వ్యాఖ్యానించరు! అదేం విడ్డూరమో!

ఖండించరు కానీ ఆమె ఆదేశాలు పాటించారు, తెరాసవారు. కొన్నిచోట్ల ఎగ్జిబిటర్లను భయభ్రాంతులను చేసినవారు, ప్రదర్శనలను ఆపించినవారు, ఫ్లెక్సిలను తగలేసినవారు – వీరంతా ఆవిడ జాగృతి సభ్యులా? అసలంతమంది వున్నారా ఆ సంఘంలో? తెరాసవారే కవిత పేరున తక్కినవాళ్లపై సొద్దు వేయడానికి చేసిన ప్రయత్నం యిది. అదుర్స్ సినిమా బాగా లేక ఫెయిలయి వుంటే ఆ క్రెడిటంతా వీళ్లు కొట్టేసి వుండేవారు. 'మేం తలచుకుంటే అన్ని సినిమాల గతీ యింతే!' అని బోర విరుచుకునేవారు. కానీ సినిమా జనాలకు నచ్చింది. ఆంక్షలు ధిక్కరించడం మొదలెట్టారు. నిరసన సడలిపోతోంది. సడలిపోవడానికి తెరవెనుక 'సెటిల్‌మెంట్స్' కారణమని ఆరోపించేవాళ్లు వున్నారు.

అంతేకాదు, కవిత డబుల్ స్టాండర్డ్స్ అవలంబించారని ఆరోపించినవాళ్లూ వున్నారు. నితిన్ సినిమా నిర్మాత సమైక్యాంధ్రకోసం రిజైన్ చేసిన పెద్దమనిషి ఐనా ఆ సినిమాను అడ్డుకోకపోవడానికి కారణం – అతను కాంగ్రెస్ పార్టీ కావడం వలనని, అదుర్స్ నిర్మాతలు టిడిపి వారని, తెరాస టిడిపిపై ఎక్కువ కక్ష కట్టిందనీ మరో ఆరోపణ వుంది. వెంకటేష్ సినిమాను అడ్డుకోకపోవడానికి సరైన కారణం లేదని, రామానాయుడు స్టూడియోను యిక్కడనుండి తరలించే వుద్దేశం లేదని చెప్పడం తప్ప ప్రత్యేక తెలంగాణాకు అనుకూలంగా ఏం మాట్లాడలేదనీ, అయినా కవిత ఆ సినిమాపై నిప్పులు కక్కకపోవడానికి ఏదైనా డీల్ వుండవచ్చనీ ఆరోపణ వుంది. ఈ ఆరోపణలలో వేటికీ ఆధారాలు దొరకవు కాబట్టి మనం మాట్లాడలేం కానీ, యీ అదుర్స్ సంఘటన ద్వారా ఒకటి మాత్రం తేటతెల్లం అవుతోంది – జెఏసితో సంబంధం లేకుండా తెరాస కార్యక్రమాలు చేపడుతోంది అని!

జెఏసిలో పరస్పర విరుద్ధమైన పార్టీలు ఎన్నో వున్నాయి. అన్నీ ఒకతాటిపై రావడం కష్టం. తెరాస మాటే నెగ్గాలి అంటే కుదరదు. అందువల్ల జెఏసిద్వారా మెతకగా కనబడుతూనే కవిత ద్వారా తమ మిలిటెన్సీను కనబరుస్తూ, తెలంగాణాకు ఏకైక రక్షకుడిగా తన యిమేజి పెంచుకుని ప్రజల్ని ఆకట్టుకోవాలన్న ప్రయత్నంలో వుంది తెరాస. జెఏసిలో తక్కిన పార్టీలు యివి గ్రహించి కూడా నోరెత్తలేకపోతున్నాయి. అందుకే కవిత స్టేటుమెంటుపై జెఏసి ఏమీ వ్యాఖ్యానించలేకపోయింది. మాకు సంబంధం లేదని చెప్పి దులిపేసుకుంది. అది జస్ట్ ఓ సినిమా మాత్రమే కాదు, తెలంగాణా ప్రాంతంలో వున్న థియేటర్స్‌ను, వాటి నాశ్రయించుకుని వున్న కుటుంబాలను, తెలంగాణావాసులైన డిస్ట్రిబ్యూటర్స్‌ను వారి ఆర్థిక స్థితిగతులను ప్రభావితం చేసే ఓ కమ్మర్షియల్ వెంచర్. తెలంగాణాలో పెట్టుబడి పెడదామనుకునే పెట్టుబడిదారులకు ఉద్యమకారులు యిస్తున్న ఓ నెగటివ్ సిగ్నల్.

ఓ సాధారణ సాంస్కృతిక సంస్థ తెలంగాణా ప్రాంతానికి పెట్టుబడులు రావలసిన వాతావరణాన్ని కలుషితం చేసే చర్య చేపడితే దాన్ని ఖండించలేనట్టి స్థితిలో వుందంటేనే తెలుస్తోంది జెఏసి నిస్సహాయత! తెరాస ప్రయోజనాలను కాపాడడానికే కాదు, పెంపొందించడానికి జెఏసి కృషి చేస్తోందని దానిలోని తెరాసేతర పార్టీలు అనుమానిస్తున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?

ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌వాళ్లు రాజీనామాలు చేసి రాజకీయ సంక్షోభం సృష్టించాలని మిగతావాళ్లు అంటూ వుంటే కాంగ్రెస్ ఎందుకు వింటుంది? అధికారం లేనివాడు ఏదైనా చెప్తాడు. మళ్లీ ఎన్నికలు వస్తే వాళ్లకు పండగ – యీ సారైనా అధికారం దక్కుతుందేమోనని! ఎన్నికలుంటే వస్తే పార్టీ హై కమాండ్ టిక్కెట్టు యిస్తుందా? ఇచ్చినా వీళ్లంతా కలిసి గెలిపిస్తారా!? అదెలా?

అసలు సీట్ల పంపకం దగ్గరే గొడవ వస్తుంది. 2009 ఎన్నికల్లో ఎవరెవరు సీట్లు గెల్చుకున్నారో, వాళ్లకే యీ సారి సీట్లు అంటే తెరాస వూరుకుంటుందా?

'కెసియార్ చావుదాకా వెళ్లి తెలంగాణా తెచ్చారు, చచ్చు పది సీట్లు యిస్తారా' అనరూ! మొన్న ఎన్నికలలో టిడిపి-తెరాస పొత్తు చిక్కుల్లో పడ్డది యిందుకే కదా! ప్రత్యర్థులుగా పోట్లాడడం వేరు, స్నేహితులమంటూ ఒకరికోసం ఒకరు సీట్లు త్యాగం చేయడం వేరు. టిడిపికి, కాంగ్రెస్‌కు ఉప్పు నిప్పు కదా, అలాటిది కాంగ్రెస్ సీట్లలో టిడిపివాళ్లు పోటీ చేయకుండా వదిలేస్తారా? 'ఉద్యమంలో పాల్గొని మా బలం తెగ పెంచేసుకున్నాం, 2009లో నెగ్గిన సీట్లకు నాలుగురెట్ల సీట్లకు పోటీ చేసి మా శక్తి చూపిస్తాం' అని టిడిపియే కాదు, బిజెపి నుండి సిపిఐ దాకా అందరూ క్లెయిమ్ చేస్తారు. ఇవన్నీ బాగా తెలిసే కాంగ్రెస్‌వాళ్లు కిమ్మనటం లేదు. 'రిజైన్ చేయండి, మీ సీట్లు మీ కిచ్చి ఖర్చు లేకుండా మేం గెలిపించుకుంటాం' అని వాళ్లందరూ అంటే 'సర్లెండి' అని చిరునవ్వు నవ్వేసి వూరుకుంటున్నారు.
**– ఎమ్బీయస్ ప్రసాద్**

**జనవరి 22**

## ఎమ్బీయస్ – భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ – 1

ఇప్పుడు రాయబోయే వ్యాసాలు ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థుల నుద్దేశించినవి. వారిలో ఎందరు యీ వెబ్‌సైట్ చదువుతారో, ఎందరు నేను చెప్పే కబుర్లు వింటారో నాకు తెలియదు. ఆత్మహత్య చేసుకునేవారిలో 1% మందికి కూడా వీటి గురించి తెలియకపోవచ్చు, తెలిసినా, చదివినా పట్టించుకోకుండా తను చేద్దామనుకున్నది తను చేయవచ్చు. ఈ కఠోర వాస్తవం తెలిసి కూడా యిది రాస్తున్నానంటే నా గుండెల్లోని ఆవేదన నన్ను వూరకుండనివ్వటం లేదు.

ఆత్మహత్య చేసుకోబోయే తమ్ముడూ, నువ్వు నాకు ఎదురయితే –

'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ

సమిధగ మారకు బ్యాచిలరూ (ఆఫ్ ఆర్ట్స్/సైన్స్/కామర్స్/..)...' అని భుజం తడుతూ పాడతాను.

ఎందుకంటే యీ రాజకీయ యజ్ఞంలో నువ్వు ఒక సమిధవే తమ్ముడూ. అలా అన్నందుకు కోపం వచ్చిందా? రా, కాస్సేపు అలా కూచో. నేను చెప్పేది విను. నిన్ను మురిపించడానికి, మనసు మళ్లించడానికి అబద్ధాలు చెప్పను. నిష్ఠూరమైనా నిజాలే చెబుతాను. ఆ తర్వాత నిన్ను ఆలోచించమంటాను, ఎందుకంటే ఆ సృష్టికర్త నీకు బుద్ధిని, వివేకాన్ని యిచ్చాడు. నీలో ఆలోచన రగిలించడమే నా పని. నీ విచక్షణే నీకు దారి చూపుతుంది.

సమిధ అన్నందుకు కోపం వచ్చింది కదూ. సమిధ అంటే ఒక గడ్డిపోచ. ఒక మహత్కార్యం కోసం బలయ్యే ఒక చిన్న వస్తువు. విడిగా ఏ గుర్తింపూ లేనిది. చేస్తే గీస్తే నువు బలిదానం చేయాలి. అది ఎవరైనా మహానుభావులు చేసేది. పొట్టి శ్రీరాములుగారు చేసినది బలిదానం అంటాం. ఎందుకంటే ఆయన ఒక స్థాయికి వచ్చాక ఓ లక్ష్యం కోసం, నీ లాగే ప్రత్యేకరాష్ట్ర వాంఛతో, తనను తాను అర్పించుకున్నాడు. ఆయన పేరు చరిత్ర కెక్కింది. ఆయనపై పాటలు పాడారు. విగ్రహాలు స్థాపించారు. ఆయన పుట్టిన జిల్లాకు ఆయన పేరే పెట్టేశారు.

ప్రకాశం పంతులుగారికి ఆంధ్రకేసరి అనే పేరు ఎలా వచ్చిందో తెలుసా? పోలీసువాడి తుపాకీకి ఎదురెళ్లాడు కాబట్టి! అలా ఎదురెళ్లినవాళ్లందరికీ ఆంధ్రకేసరి బిరుదు యిచ్చేస్తారా? అలా వెళ్లినవాడు ప్రకాశం గారు కాబట్టి అప్పటికే ఆయన బారిస్టర్ చదివి, స్వాతంత్ర్య పోరాటంలో పెద్ద యిమేజి సంపాదించుకుని, వెనక్కాల వేలాది లక్షలాది అనుచరులు సంపాదించుకుని వున్నాడు కాబట్టి కాల్చరా కాల్చు అని ముందుకు వెళితే పోలీసువాడు కాల్చకుండా తుపాకీ దింపేశాడు. అదే నాబోటి అనామకుడు వెళితే దొరికిందే సందని కాల్చేసి చేతుల దురద తీర్చుకునేవాడు.

మరి ప్రాణం లెక్కకు వస్తే నాదెంత ప్రాణమో, ప్రకాశం గారిదీ అంతే ప్రాణం. కళ్లు, కాళ్లు, చెవులు.. ఒక్కదానిలోనూ నా కంటె ఒక్క అవయవం కూడా ఎక్కువ లేదు. అయినా ఆయన ప్రకాశం! నేను ఒట్టి ప్రసాద్. ఆయన ఛస్తానంటే జనాలు వణుకుతారు. నేను ఛస్తానంటే పీడా విరగడైంది అంటారు. ఆయన చనిపోకుండా కాళ్లా వేళ్లా పడి బతిమాలుతారు. నేను ఛస్తానంటే 'ఆ చచ్చేదేదో శ్మశానానికి పోయి ఛస్తే మాకు మోత భారం తగ్గుతుంది కదా' అని విసుక్కుంటారు. ఎక్కడుంది తేడా? అది కాస్త పరికించు.

ఇప్పుడు భగత్ సింగ్ వున్నాడు. దేశంకోసం ప్రాణం తీసుకోవడానికి సిద్ధపడ్డాడు. అలాగని పొద్దున్న ఓ జాగింగ్‌కో వెళ్లి ఓ ఎండ్రిన్ బాటిల్ తాగేసి పడిపోయాడా? అబ్బే, తన త్యాగానికి అర్థం, పరమార్థం వుండేట్లు చూసుకున్నాడు. దేశవిదేశాలలో తన త్యాగంపై దృష్టి పడేట్లు చేసుకుని తనెందుకు ఉరికంబమెక్కుతున్నాడో వాళ్లందరికీ తెలియచెప్పాడు. మనవాళ్ల పాలన మనమనుకుంటున్నంత గొప్పగా లేదన్నమాట అని బ్రిటన్ వాళ్లలోనే ఓ సంశయం కలిగించాడు.

పార్లమెంటులో వుత్తుత్తి బాంబులేసి కరపత్రాలు విసిరేడు. పోలీసులు వచ్చి అరెస్టు చేసేదాకా అక్కణ్నుంచి కదలలేదు. కోర్టులో విచారణ జరిగేకాలంలో దేశానికంతటికీ భగత్ సింగ్ ఎవరో తెలిసింది. ఆయన లక్ష్యం తెలిసింది. ఆయన త్యాగం తెలిసింది. అందుకే స్వాతంత్ర్యం వచ్చాక ఆయనను మర్చిపోకుండా విగ్రహాలు పెట్టుకున్నాం. కాలనీలకు పేరెట్టుకున్నాం.

అలాగే అల్లూరి సీతారామరాజు. అలాటి విప్లవంలో దిగినప్పుడే తెలుసాయనికి – చివరకి ప్రాణం పోతుందని. అయినా విప్లవం

లేవనెత్తి మరీ పోయాడు అంతేగాని భారతమాత దాస్యశ ృంఖాలలో వుందని బాధపడిపోయి అడవిలో ఏ చెట్టుకో ఉరేసుకుని చావలేదు. గిరిజనుల్లో విప్లవం తీసుకుని వచ్చి ఓ రెండేళ్లపాటు మన్యమంతా గడగడలాడించి, అడవిలో జరిగే దోపిడీపై అందరీ ద ృష్టీ పడేట్లు చేశాడు. తెలుగువాడి పౌరుషం ఏమిటో తడాఖా చూపించాడు. కొండప్రాంతంవారిలో యిప్పటికీ దేవుడిలా పూజలందుకుంటున్నాడు. మనమంతా ఆయనపై నాటకాలు రాశాం. సినిమాలు తీశాం. ఆయన అనుచరులను వెతికి పట్టుకుని కాళ్లకు మొక్కాం.

అందువలన నేను చెప్పదలచినదేమిటంటే ఒక మహా వుద్యమానికి ప్రాణాలు సైతం అర్పిస్తాననే ఉద్దేశం గొప్పదే అయినా ఓ స్థాయికి వచ్చి ఆ త్యాగం చేస్తే దానికి ప్రయోజనం వుంటుంది. ఊరూ పేరూ లేకుండా చచ్చి ఏం లాభం చెప్పు.

మొదట నువ్వు చేయాల్సినది ఏదో ఒక రంగంలో మంచి పేరు తెచ్చుకోవడం. పెద్దవాడనిపించుకోవడం. అప్పుడు నీ మాటకు విలువ వస్తుంది. నీ ప్రాణానికి విలువ వుంటుంది. నువ్వు ప్రాణం తీసుకుంటానంటే వద్దని జనాలు నిన్ను బతిమాలుతారు.

చావు మళ్లీ మళ్లీ రాదు కదా. వచ్చే ఒక్కసారీ గ్రాండ్‌గా రావాలి. వైయస్సార్ చావు చూడు రాష్ట్రమంతా ఒక్కటై రోదించింది. ఛస్తే ఆ లెవెల్ కెళ్లి చావాలి. లేకపోతే చచ్చినట్టు బతకాలి!

...అబ్బ యిక్కడ చోటై పోయిందయ్యా, తక్కినది రేపు చెపుతాను. నేను చెప్పేది పూర్తయేదాకా నువ్వు ఆత్మహత్య జోలికి పోకు మరి. ఒట్టేనా..?

2

భగత్ సింగ్, అల్లూరి... ఎప్పటివాళ్లో, నాకెందుకు వాళ్ల గోల అంటావా..? నువ్వు గౌరవించే కెసియార్ వున్నారు కదా! ఆయన మొన్న నవంబరు నెలాఖరులో నిరాహారదీక్ష చేస్తే ఢిల్లీ గడగడలాడింది కదా. అప్పటికప్పుడు ఆదరాబాదరా స్టేటుమెంటు యిచ్చి ఆయన ప్రాణం కాపాడుకోవాలని చూసింది కదా! ఒకవేళ యిదే నిరాహారదీక్ష తనకు మంత్రి పదవి యివ్వలేదన్న కోపంతో 2001లో చేశాడనుకో. ఢిల్లీ యిటు తిరిగి చూసేదా? పేపరువాళ్లు కూడా జిల్లా ఎడిషన్‌లో ఎక్కడో ఓ మూల న్యూస్ వేసి చేతులు దులుపుకునేవారు.

అందుకే ఆయన పదేళ్లు ఉద్యమం చేసి అప్పుడు నిరాహారదీక్ష అన్నాడు. దెబ్బకి ఆయన ఆసుపత్రిలో వున్న అన్ని రోజులూ గంట గంటకూ బుల్లెటిన్లు. ఇదిగో పోయాడంటే అదిగో పోయాడని పుకార్లు. తెల్లారేలోపున ఏదైనా చేయకపోతే మాట దక్కదని నిమ్స్ వైద్యుల బెదిరింపులు. ఢిల్లీలో వణుకులు. అదీ అలావుండాలి, మనిషంటే! ఛస్తానని బెదిరిస్తేనే యింత కల్లోలం రేగితే వుంటే నిజంగా – అమంగళం ప్రతిహతమవుగాక – చనిపోయి వుంటే ఎలా వుంటుందో వూహించి చూడు.

గాంధీగారు నిరాహారదీక్ష చేస్తే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం గడగడలాడింది. గాంధీగారు గాంధీగారుగా కావడానికి ముందు పెళ్లం మీద అలిగి అన్నం మానేస్తే, లేదా శివరాత్రినాడు ఉపవాసం వుంటే ఎవరైనా పట్టించుకున్నారా? అందువలన ఆ లెవెల్‌కి వెళ్లి యిలాటి అఘాయిత్యం ఏదైనా తలపెట్టు.

ఆ లెవెల్‌కి వెళ్లి ఏం ఛస్తానండీ? ఆ లెవెల్‌కి వెళ్లాలంటే చచ్చే చావు చావాలి అంటావా? పోనీ నువ్వు కాకపోయినా మీ నాన్నగారు ఆ లెవెల్‌లో వున్నా నీకు కాస్త గుర్తింపు వస్తుంది. ఫలానావారబ్బాయి అన్న గుర్తింపుమీద నీ చావుకి హెడ్‌లైన్సు వస్తాయి.

నీ కేసు అది కాదులే, నాకు తెలుస్తూనే వుంది. నాయకులు కొడుకులు ఎవ్వరూ చావటం లేదు. ఫలానా వాడు దీనికోసమే చనిపోయాడు కాబట్టి నేను అర్జంటుగా పదవులు సంపాందించేట్లు చేయి అని కేంద్రాన్ని కోరుతున్నారు తప్ప, నాయకులెవరూ నీలా ఉసురు తీసుకోవడం లేదు, వాళ్ల పిల్లల్నీ తీసుకోనీయటం లేదు. నాయకుల కొడుకులే కాదు, అల్లుళ్లు, మేనల్లుళ్లు, మనుమలు, యింటిపక్కవాళ్లు, తెలిసున్న వాళ్లు, వెంట తిరిగేవాళ్లు – ఒక్కరంటే ఒక్కరు కూడా చేసుకోవడం లేదు. నువ్వు చేసుకుందామనుకుంటున్నావంటే దాని అర్థం – నీకు ఏ నాయకుడూ సన్నిహితంగా తెలియదనీ, వాళ్ల నిజరూపాలు తెలుసుకునే ఛాన్సు నీకు లేదనీ!

'వాళ్లెలా పోతే నాకేం? నేను నా ఆశయానికి కట్టుబడి వున్నాను. దానికోసం ప్రాణం తీసుకుంటాను' అంటావా, సరే అలాగే కానీయ్. కానీ దానికో పద్ధతి వుందని గ్రహించు.

మొదటగా చూడవలసినది మన లక్ష్యం ఎంత గొప్పదీ అని చూడాలి, రెండు – మన త్యాగం దురుపయోగం కాదు కదా అని చూసుకోవాలి, మూడు – మనం చేసిన త్యాగంవలన ఫలితం సిద్ధించాలంటే దానికి తగిన ప్రచారం జరిగి ప్రజలను ఉత్తేజితులను చేసి ఆ లక్ష్యంవైపు వారిని నడిపించేట్లా చేయాలి.

వీటన్నిటికీ మొట్టమొదటిగా చూడవలసినది – మనం త్యాగం చేయడానికి అర్హులమా? కాదా? అని చూసుకోవాలి. ఎవరైనా సన్యాసం తీసుకుంటానన్నాడనుకో. ఇవాళ్టినుండి నేను సన్యాసిని అని ప్రకటిస్తే కుదరదు. గురువుగారి వద్దకు వెళ్లి దీక్ష తీసుకోవాలి. అప్పుడాయన 'సన్యాసం తీసుకుంటే సమాజానికి నువు మ ృతుడయినట్లే. పుత్రుడిగా, భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా, కులస్థుడిగా, పౌరుడిగా నీ బాధ్యతలనుండి తప్పుకున్నట్లే. అందువలన నీ నుండి సహజరీతిలో వాటి ప్రయోజనం పొందవలసిన వారందరి వద్దా అనుమతి తీసుకురా' అంటాడు.

బ్రహ్మచారి అనుకో, తలిదండ్రుల వద్ద అనుమతి తీసుకోవాలి. ఆదిశంకరుడి కథ వినేవుంటావు. సన్యాస దీక్ష తీసుకుంటానంటే తల్లి ఒప్పుకోలేదు. తర్వాత మొసలినోట పడి చనిపోతూంటే తప్పనిసరి పరిస్థితుల్లో అనుమతి యిచ్చింది. ఆయన దానిబారినుండి తప్పించుకుని బతికి, దీక్ష తీసుకుంటానంటే అప్పుడో షరతు పెట్టింది – నేను చనిపోయినప్పుడు నువ్వు వచ్చి అంత్యక్రియలు చేయాలి అని. 'అదేమిటమ్మా, సన్యాసికి తల్లేమిటి, తండ్రేమిటి? సర్వం వదిలేసినవాడు మళ్లీ వెనక్కి వచ్చి తల్లికి అంత్యక్రియలేమిటి?' అని వాదించాడు.

'అలా అయితే అనుమతి యివ్వను పో' అందీవిడ.

ఏం చేస్తాడు? చచ్చినట్టు ఒప్పుకున్నాడు. ఆది శంకరుడంటే మహా పండితుడు. శంకరుడి అవతారం అని చెప్పుకుంటారు. అయినా ఆయనా తల్లిమాట – ఎంత శాస్త్రవిరుద్ధమైనా – వినక తప్పలేదు. మాతృ ఋణం అంటే అలాటిది. అంతెందుకు మనం భూమాతకు ఋణపడివుంటాం అంటారు మన పెద్దలు. మనను నిరంతరం మోస్తోంది కదా అందువలన పొద్దున్న లేవగానే అమ్మా ఏమీ అనుకోకు, నీమీద పాదం పెడుతున్నాను అని క్షమాపణలతో ఓ శ్లోకం చదివి అప్పుడు మంచం దిగాలట.

సరే, భూమాత అంటే కంటికి కనబడదనుకో. కానీ మామూలు మాత కనబడుతోందిగా. ఆవిడ అనుమతి తీసుకోవద్దా?

3

తల్లంటే ఎవరు? తొమ్మిది నెలలపాటు ఆవిడ గర్భంలో వున్నావని గుర్తుందా? మామూలుగా ఓ రోజు హోటల్లో బస చేస్తేనే ముక్కుపిండి అద్దె వసూలు చేస్తారు కదా, ఆవిడ నిన్ను తొమ్మిదినెలలు మోసింది – ఒక్క పైసా అద్దె లేకుండా. పైగా తను తినే తిండిలో నీకు బోల్డంత పెట్టింది. తను ఏదో మామూలు తిండి కతికినా, నువ్వు తెల్లగా పుట్టాలని నీకోసం కుంకుమపువ్వు తింది. నువ్వు కడుపులో కదులుతూ వుంటే సంబరపడింది. ఆరోగ్యంగా వుండాలని గుడ్డు తింది, పాలు తాగింది, ఎక్సర్‌సైజులు చేసింది. నువ్వు ఏ అవకరం లేకుండా పుట్టాలని వెయ్యి దేవుళ్లకి మొక్కుకుంది.

ఆ మాటకొస్తే నువ్వు కడుపులో పడ్డదగ్గర్నుంచీ ఆవిణ్ని టెన్షన్ పెట్టావు. డాక్టర్లమీద, వైద్యపరీక్షల మీద, మందుమాకుల మీద, పూజా పునస్కారాల మీద బోల్డు ఖర్చు పెట్టించావ్.

అసలు నువ్వు కడుపులో ఓ పట్టాన పడ్డావా? ఆమె కన్నెపిల్లగా వున్న దగ్గర్నుంచీ 'గుమ్మడిపండంటి కొడుకుని యివ్వవే' అని మొక్కుతూ పాటలు పాడవలసి వచ్చింది. 'సుపుత్రాప్రాప్తిరస్తు' అని పెద్దల చేత ఆశీర్వదింపజేసుకోవడానికి వారికి సేవలు చేసి మెప్పించవలసి వచ్చింది. నోములు నోచింది, చెట్లకు ఉయ్యాలలు కట్టింది.

మీ నాన్న మాత్రం? పెళ్లాంబిడ్డలను పోషించే శక్తి సంపాదించాలని చదువుకున్నాడు, ఉద్యోగం చేశాడు, వ్యాపారం చేశాడు, వ్యవసాయం చేశాడు. రెక్కలుముక్కలు చేసుకుని తిండి సమకూర్చాడు. పెళ్లి జరగగానే శృంగారంకోసం వెంపర్లాడలేదు. చక్కటి సంతానం కలగాలనే ఆశయంతో పెద్దలు పెట్టిన గర్భాదాన ముహూర్తానే నవవధువును కలిశాడు.

పెళ్లవగానే పిల్లలు పుట్టకపోతే సంతానసాఫల్యకేంద్రాలకు తిరిగాడు. బోల్డు ఖర్చు పెట్టి మందులు మింగాడు. వంశాభివృద్ధిరస్తు అని తాతల చేత, తండ్రుల చేత ఆశీర్వాదాలు చెప్పించుకున్నాడు. పిల్లలు పుట్టి వంశప్రతిష్ట కాపాడాలని దేవుళ్లను వేడుకున్నాడు.

భార్య గర్భవతి అయిన దగ్గర్నుంచి కంటికి పాపలా చూసుకున్నాడు. పాప పుట్టాక యిద్దర్నీ కాపాడుకున్నాడు. మరింత కష్టపడతా, పిల్లవాడికి లోటు చేయవద్దని భార్యకు చెప్పాడు. టీకాలు వేయించాడు, విద్యాబుద్ధులు చెప్పించాడు. నన్ను మించినవాడవ్వాలని కోరుకుని నిన్ను దూరతీరాలకు పంపాడు. ఈ రోజు నా చిటికినవేలు పట్టుకుని నడిచిన పిల్లవాడు రేపు నా నడుం వంగాక ఆసరాకోసం తన భుజం అందిస్తాడని నమ్మాడు.

'నా ఆశయం, నా ఆశయం' అంటూ నువ్వు పరలోకానికి వెళ్లేందుకు వీసా తయారుచేసుకునే ముందు వాళ్ల అనుమతి తీసుకున్నావా? 'మీ ఆశలు వమ్ము చేసి, మీ పదిహేను పదహారేళ్ల కష్టాన్ని దుమ్ముపాలు చేసి నా దారి నేను చూసుకుంటున్నాను. మీకు ఓకేనా?' అని అడిగి చూశావా?

'నా జీవితం, నా యిష్టం. మా అమ్మానాన్నా కామాంధకారంలో పొర్లితే నేను పుట్టాను. ఏదో యింట్లో వున్నాను కాబట్టి యింత ముద్ద పడేశారు, పక్కవాళ్లు ఏమైనా అనుకుని పోతారేమోనని బడికి పంపారు. నేను చచ్చేటప్పుడు వాళ్ల పర్మిషన్ దేనికి?' అంటావా?

అంతకంటె దారుణమైన మాట మరోటి వుండదు. పోనీ వాళ్లు ఓ లక్ష్యమూ లేకుండా, ఎటువంటి సంతానమూ ఆశించకుండా రమిస్తేనే నువ్వు పుట్టావనుకో. అయినా పుట్టగానే పీక పిసికి చంపేయలేదు కదా, పోనీ ఏ బిచ్చగాళ్లకో, వేశ్యలకో అమ్మేయలేదు కదా! నిన్ను చదువుకు పంపకుండా సైకిలుషాపులో గాలి కొట్టడానికో, పత్తిచేనులో కూలికో పంపితే అడిగేవాడెవడు?

ఉన్న యిద్దరు ముగ్గురు పిల్లలతోనే సరిపెట్టుకుందాం అని వాళ్లనుకున్నారంటే అర్థం ఏమిటి? ఉన్నవాళ్లకి మంచి జీవితాన్ని అందిద్దామన్న సంకల్పమే కదా!

అది గ్రహించకుండా నా జీవితం నా మరణం నా యిష్టం అంటున్నావంటే నీ బుద్ధి సరిగా లేదన్నమాట. ఆవేశంలో వున్నావన్నమాట. కాస్త నిదానించి ఆలోచించి మరీ ఆచరణకు దిగు.

తలిదండ్రులొకరికే నువ్వు ఋణపడివున్నావని అనుకోకు. శ్రద్ధగా పాఠాలు చెప్పిన గురువులకు, ఆ పాఠశాలలు కట్టించిన దాతలకు, ఆ స్కూలుకి రోడ్డు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించిన మునిసిపాలిటీకి, అప్పుడప్పుడు వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలకు, నిన్ను సంతోషంగా వుంచాలని చూసిన స్నేహితులకు, బంధువులకు.. అందరికీ ఋణపడివున్నావు.

వీళ్లంతా వ్యక్తులు. కాస్త దీర్ఘంగా ఆలోచిస్తే నీకు గాలి, నీరు, వెలుతురు అందిస్తున్న ప్రకృతికి నువ్వు ఋణపడిలేవా? నీ శరీరం కేసి ఒక్కసారి చూసుకో. శరీరభాగాల మధ్య అమరిక చూడు, వాటినన్నింటినీ కంట్రోల్ చేసే స్విచ్‌బోర్డు బ్రెయిన్‌లో వుండడం గమనించు. ఏదైనా పాడైపోతే తనకు తాను బాగుచేసుకునే ఆ లాఘవం చూడు. మంచిది స్వీకరించి, చెడును బయటకు తోసేసే ఆ వ్యవస్థ చూడు. ఓ పన్ను వూడితే మళ్లీ పెట్టించుకోవడానికి ఐదారువేలు అవుతోందే! ఓ కాలు తెగిపోతే ప్లాస్టిక్ కాలుకి వేలవుతోందే! కిడ్నీ పాడైపోతే ఇంకోడు యిచ్చినదాన్ని పెట్టించుకోవడానికి లక్షలవుతోందే! ఇవన్నీ ఫ్రీగా – అదీ వర్కింగ్ కండిషన్‌లో – నీకు అమర్చిపెట్టిన ఆ సృష్టికర్తకు ఋణపడిలేవా?

నీ దగ్గరెవరైనా అప్పు పుచ్చుకుని ఎగ్గొట్టి పారిపోతే నీకెంత కోపం వస్తుంది? తిట్టుకోవూ? వాడు ఎప్పటికైనా తిరిగి రాకపోతాడా? నాలుగు తన్ని వసూలు చేసుకోకపోతానా? అనుకోవూ!

మరి నువ్వు వీళ్లందరికి అప్పు పెట్టి పారిపోతున్నావే! నీకెంత నీతి వున్నట్టు? పరాయివూరైతే తిరిగి వస్తావన్న కాస్త నమ్మకమైనా వుంటుంది, పరదేశమైతే ఆశైనా వుంటుంది. పరలోకానికి వెళ్లేవాడివి, యిక నిన్నేం పట్టుకుంటాం? వేస్ట్ కాండిడేట్ గాడంటూ నిన్ను తిట్టుకుంటూ కూచోవడం తప్ప మేం చేసేదేముంది?

## 4

నువ్వనుకోవచ్చు – వచ్చే జన్మలో వీళ్ల ఋణమంతా వడ్డీతో సహా మొహం మీద కొడతానని! అదంత వీజీ అనుకున్నావా? వచ్చే జన్మ మళ్లీ మనుష్య జన్మేనన్న గ్యారంటీ ఏముంది? వీళ్లంతా నీతోపాటే అదే రిలేషన్స్‌తో పుడతారన్న నమ్మకం ఏమిటి? ఇదేమైనా మగధీర సినిమానా? సరిగ్గా 400 ఏళ్లకి పొలోమని అందరూ మళ్లీ అదే యీక్వేషన్స్‌తో పుట్టడానికి!

నా అనుమానం.. భయం సుమా.. నీకు మళ్లీ మానవజన్మ దొరకదని. దేవుడు నీమీద కోపంగా వుండవచ్చు. 'వీడికి ఏ అంగవైకల్యం, బుద్ధిమాంద్యం లేకుండా చక్కగా, తీరుగా పుట్టిస్తే వాడి విధి వాడు నిర్వర్తించకుండా అర్థాయుష్షులో ప్రాణం తీసుకున్నాడు. వీడిద్వారా మరో వందమందికి ఉపాధి కల్పిద్దామనుకున్నాను. నా ప్లాను భగ్నం చేసేశాడు' అని ఆగ్రహంతో ఏ పురుగుగానో, పులుగుగానో పుట్టించవచ్చు.

నువ్వు యిది నమ్మవులే, నాకు తెలుసు. నీ ఉద్దేశంలో నువ్వు సరాసరి మేఘాల్లోకి వెళ్లిపోయి అక్కడ సినిమా దేవతల పట్టుబట్టలు కట్టుకుని, మెడలో నగలు దిగేసుకుని, దోసిలిలో పూలరేకులు పట్టుకుని, మధ్యమధ్యలో కిరీటం అలవోకగా సవరించుకుంటూ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రావిష్కరణ రోజున పైనుంచి వాటిని మంచి ఫోటోజెనిక్‌గా పోయడానికి ప్లాను వేస్తున్నావు.

కానీ బ్రదర్, మేఘాలేమీ ఖాళీగా లేవు. చచ్చినవాళ్లందరూ దేవతలో, దెయ్యాలో అయి కూచుంటే యిన్ని కోట్ల సంవత్సరాలలో చచ్చిన జీవులందరి ప్రేతాలతో అంతరాళం అంతా నిండిపోయి గాలి కూడా ఆడేది కాదు. ఈ చావుపుట్టుకల గురించి నా ఉద్దేశం చెప్పమంటావా? ఉద్దేశమే అనుకో, కరక్టుగా నాకూ తెలియదు –

మనమంతా – అంటే నువ్వూ నేనూ, చెట్టూ పుట్టా, పురుగూ పుట్రా అందరం అన్నమాట – మనమంతా ఒక చైతన్యస్వరూపంలో భాగస్వాములం. అది ఒక సముద్రం అనుకుంటే మనం అలల లాటివాళ్లం. ఇవాళ యీ అల రూపమెత్తితే, కాస్సేపటికి మరో అల రూపం ఎత్తుతాం. ఈ అలలో మనిషైతే మరో అలలో పెద్దపులి అవుతాం. ఒక్కో అల పెద్దగా వుంటుంది, ఎక్కువకాలం జీవిస్తాం, మరో అల చిన్నగా చిటుక్కుమని చితికిపోతుంది. ఏ దోమో, చీమో అన్నమాట. ఈ సారి నీకు నూరేళ్లు బతికే పెద్ద అల అయ్యే ఛాన్సు దొరికింది. నీ అంతట నువ్వే దాన్ని నీటిపాలు చేసుకుంటున్నావు. వచ్చేసారి యింతే అలగా మారుతావన్న నమ్మకం ఏమిటి?

ఎవరు చూడవచ్చారు? నువ్వు వచ్చే జన్మలో ఏ ఆఫ్రికా అడవుల్లోనో ఓ పెద్ద చెట్టు ఆకుమీద తిరిగే ఆకుపచ్చపురుగు కావచ్చు. ఒకవేళ నీకు పూర్వజన్మ స్మృతి వుందనుకో – 'ఆహా నేను కలలు కన్న ప్రత్యేక తెలంగాణా ఏర్పడి ఆ రాష్ట్రంలో కడుపులో చల్ల కదలకుండా జీవించే ప్రజలు నన్ను డిస్కవరీ ఛానెల్‌లో చూసి సంతోషిస్తారు కదా!' అనుకోవచ్చు. మేం ఆ టైముకి డిస్కవరీ ఛానెలే పెడతామో, కెసియార్‌గారి తెలంగాణా ఛానెలే పెడతామో నీకు తెలియదు కదా పాపం!

నీకు కోపం వస్తోంది కదూ! 'ఏమిటిసార్, నా చావు మీకింత వేళాకోళమై పోయిందా? నేను ఛస్తే బోల్డుమంది 'జోహార్ జోహార్, జబ్ తక్ చందా సూరజ్ రహేగా, తబ్ తక్ తేరా నామ్ రహేగా' అని నినాదాలు చేస్తారు. నేను కన్న కలలను సాకారం చేస్తామని ప్రతిజ్ఞలు చేస్తారు. నేను అమరజ్యోతిగా నిలబడిపోతాను తెలుసా' అని హుంకరిస్తున్నావా?

ఈ సూర్యచంద్రులున్నంత వరకూ నీ పేరు వుంటుందో లేదో చూడడానికి ఆ అరిచేవాళ్లు మాత్రం అప్పటిదాకా వుంటారా? ఇవన్నీ కవిత్వాలు. నమ్మకు తమ్ముడూ. ఇప్పటికే 190 మంది పోయారు. ఇంకా పేపరు చూడలేదు. ఇవాళ్టి స్కోరెంతో తెలియదు. నువ్వు ఆత్మహత్య చేసుకుంటే ఏ 195,196 నెంబరో దక్కుతుందనుకో, ఏం గుర్తింపు వుంటుంది చెప్పు? చేసుకుంటే ఫస్ట్‌వాడిగా

వుండాలి. అప్పుడు కొద్దిమందికైనా గుర్తు వుంటుంది. ఆ ఛాన్సు ఎలాగూ మిస్సయ్యావ్.

లేదా ఆఖరివాడిగా వుండాలి. కానీ అదెలా చెప్పగలవు? నువ్వు చచ్చిపోయాక ఇంకెవరూ యిలా చావకూడదని కట్టడి చేయలేవు కదా! అయినా యీ గుర్తింపులు ఎంతకాలంలే! 1969లో చనిపోయిన వారిలో ఒక్కరి పేరు చెప్పు చూదాం. గుర్తు రాలేదు కదా, సూర్యచంద్రులున్నంత కాలం.. అని నినాదాలు యిస్తారు కదా, 40 ఏళ్ల క్రితం విషయమే ఎవరికీ గుర్తు లేదు. ఇంకో తమాషా చూశావ్! అసలు అప్పుడు ఎంతమంది పోయారో ఎవడికీ సరిగ్గా గుర్తు లేదు. 350 నుండి 400 దాకా అన్ని అంకెలూ చెపుతున్నారు. అందరికీ కట్టకలిపి ఓ స్తూపం కట్టేశారు. దానిమీద వాళ్లందరి పేర్లయినా రాయలేదు, లెక్కపెట్టుకుందుము. రేపు నీ గతీ అంతే.

ఏదో నీ ఆశయంమీద నిరసనతో యిలా రాస్తున్నానని అనుకోవద్దు. నీ భావాలను నేను గౌరవిస్తాను. కానీ చావు పరిష్కారం కాదని మాత్రం చెపుతూ దాని పర్యవసానాలు చెప్తున్నా అంతే.

ఇప్పుడు వైయస్ పోయాక బోల్డుమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. సాక్షి పేపర్లో వాళ్ల పేర్లు కూడా వేశారు. నీకు ఒక్కరి పేరు గుర్తుందా? నీకే కాదు, జగన్ కూడా మర్చిపోయి వుంటాడు. పోయినవాళ్ల అందరి యింటికి పరామర్శించి వస్తానన్నాడు. ఇప్పటిదాకా కదిలాడా? ఆవేశంలో బోల్డు అంటాం. తర్వాత వేడి తగ్గిపోతుంది. కానీ పోయినవాళ్ల తాలూకు వాళ్లకు బాధ తగ్గిపోతుందా చెప్పు! ఎందుకయ్యా యిలా అనామకుడిగా చావడం? నీ చదువూ, తెలివితేటలూ నీకు నేర్పినది యిదా? నీ కుటుంబసంప్రదాయం యిదా? నీ తలితండ్రులు, గురువులు నేర్పిన సంస్కారం యిదా?

బతుకు.. పదిమందిని బతికించు. చేతనైతే ఉద్యమాలు నడిపించు. జనాలను జాగృతం చేయి. బతుకు మైదానం విడిచి పారిపోయినవాడిని పిరికివాడంటారు. ఇంత బతుకూ బతికి యింటెనకాల చచ్చినట్టు ఆ బిరుదు ఎందుకు?

నువ్వు బతికుంటే నష్టపోయేది ఏమిటి? చచ్చి సాధించేదేమిటి? రేపు మాట్లాడుకుందాం. అంతదాకా ఆ ఎండ్రిన్ సీసా గూట్లో దాచి వుంచు.

5

నువ్వు బతికుంటే నష్టపోయేదేమిటి? దాని గురించి కాస్త మాట్లాడుకుందాం.

బతికుండగా ప్రత్యేక తెలంగాణా ఏర్పడితే చూస్తావ్, సంతోషిస్తావ్. ఛస్తే వచ్చిందో లేదో నీకేం తెలుస్తుంది చెప్పు. నీ మీద జాలితో ఎవరైనా పరిహారం ప్రకటించినా అది నీ కుటుంబసభ్యులకు అందుతుందో లేదో తెలియదు. ఈ ఏడాది ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్పుల్లో 75% యింకా యివ్వనే లేదట. ఇక యివన్ని సజావుగా యిస్తారా చెప్పు. మీ నాన్నగారి పేర ఎవడో సంతకం పెట్టి డబ్బు లాగేయచ్చు. ఎన్ని అక్రమాలు చూడడం లేదు?

అలాక్కాదు, ప్రత్యేక తెలంగాణా రాదేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నాను అంటావా? సరే, దాని మీదే మాట్లాడదాం.

నువ్వు భయపడ్డట్టుగా రానే లేదనుకో... అహ.. రాలేదనుకో, అయితే ఏం కొంప మునిగిందట? తెలంగాణా వస్తే మీ అమ్మను మహారాణిని చేస్తామని ఎవరైనా చెప్పారా? నిన్ను సేనాపతిని చేస్తారని ఎవరైనా చెప్పారా? తెలంగాణా వచ్చినా రాకపోయినా యిప్పటిదాకా ఎలా నడుస్తోందో అలాగే నడుస్తుంది. మంత్రిగా ఎక్స్ గాడు పోయి వై గాడు వస్తాడు. మనకేం ఒరిగిందట? వైగాడు మనవాడు, అందుచేత మనకు నెత్తిమీద కిరీటం పెడతాడు అనుకుంటున్నావా? వెఱ్ఱివాడా, అదెన్నటికీ జరగదు.

ఎప్పుడైనా, ఎక్కడైనా చూసుకో – లోకంలో టాలెంటు వున్నవాడికే కిరీటం. ఇప్పుడు జై తెలంగాణా అంటూ కుప్పలుగా నిధులు పంపుతున్న తెలంగాణా ఎన్నారైలను చూడు. ఆ కుప్పలు వాళ్లకి అమెరికాలో ఎలా పోగడ్డాయట? మేం తెలంగాణా వాళ్లం అని చెప్పుకుంటే యిచ్చాడా బుష్షు? టేలంటు చూపించారు. ఉద్యోగాలు, వ్యాపారాల్లో సంపాదించారు. టేలంటే లేకపోతే స్వంత మేనల్లుణ్నయినా తన్ని తగిలేస్తాడు బుష్షు.

బొంబాయినిండా తెలంగాణా వాళ్లే. అన్ని స్థాయిల్లో వున్నారు. మహారాష్ట్రలో మరాఠీలే వుండాలని హుంకరించే శివసేన కూడా వాళ్లని ఏం చేయటం లేదు. ఎందుకు? మనవాళ్ల టేలంటు వాళ్లకు కావాలి కాబట్టి! ఇలా లక్షాతొంభై ఉదాహరణలు చెప్తాను, నీకు ఓపికుంటే...

అంతెందుకు, మీ బస్తీ అబ్బాయి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో సెలక్టయ్యాడుకదా. నువ్వు తెలంగాణా వాడివా, అయితే రా, అని ఉద్యోగం యిచ్చారా? నువ్వు తెలంగాణా వాడివా, అయితే ఉద్యోగం లేదు ఫో అన్నారా? ఏదైనా పొరబాటు చేసి వుద్యోగం పీకవలసివచ్చినప్పుడు పై అధికారి తెలంగాణా వాడైనా సాటి తెలంగాణా వాడని పీకకుండా వూరుకున్నాడా?

అందువలన నువ్వు గుర్తుంచుకోవలసినది – ఎవడికి టేలంటు వుంటే, ఎవడు వినయంగా వుంటే, ఎవడు తక్కువ జీతానికి వస్తే వాడికే ఉద్యోగం. అందుకే మనవాళ్లకు ప్రపంచమంతా వుద్యోగాలు దొరుకుతున్నాయి. లేకపోతే లోకల్ కాండిడేట్లు లేరనా?

'ఇది ప్రయివేటు ఉద్యోగాల గురించి సార్, ప్రభుత్వ ఉద్యోగాల గురించి, వ్యాపారాలు గురించి చెప్పండి' అంటావా? ప్రభుత్వోద్యోగాలు వున్నవి ఎన్ని? ప్రస్తుతం హైదరాబాదులో 3% మంది మాత్రమే ప్రభుత్వోద్యోగాలమీద బతుకుతున్నారట! అక్కడ కూడా ఎవరికి పలుకుబడి, డబ్బు వుంటే వాళ్లకు పనులవుతాయి.

ఉద్యోగాలు వేయించే మంత్రికి, అధికారికి వున్న అవసరాల బట్టి ఉద్యోగాలిస్తారు. వాళ్లు రికమెండేషన్స్‌కు లొంగుతారనుకో. నువ్వు ఆ నియోజకవర్గం వాడివైనంత మాత్రాన సరిపోదు. మంత్రిగారితో మొహమాటం వున్నవాణ్ని పట్టుకోవాలి. లంచగొండి అనుకో. ఎవడు డబ్బిస్తే వాళ్లకే వుద్యోగం వేస్తారు. నువ్వు పక్కింటివాడివైనా నీ కేసి చూడడు. లంచం యిస్తే చాలు ఆంధ్రావాడు కాదు, అరవ్వాడికైనా యిస్తాడు. దానికి తగ్గట్టుగా రూల్సు మార్చిపారేస్తారు.

నిష్పక్షపాతంగా ఆలోచించు. ఇక్కడివాళ్లు నిజాయితీగా వుండివుంటే యిన్ని దొంగముల్కీలు పుట్టేవా? ఇన్ని అక్రమ నియామకాలు జరిగేవా? కోటాకు మించి ఆంధ్రప్రాంతం వాళ్లకు వుద్యోగాలు వచ్చేవా? ఈ ప్రాంతం నుండి మంత్రులు లేరా? అధికారులు లేరా? అందరూ ఎందుకు కళ్లు మూసుకున్నా రనుకుంటావ్?

రేపు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక వీళ్లంతా హఠాత్తుగా మారిపోతారనుకుంటున్నావా? వాళ్లకు ముట్టచెప్పవలసినది ముట్టచెపితే చాలు, పాకిస్తాన్ వాడికి కూడా లోకల్ సర్టిఫికెట్టు పుట్టించి ఉద్యోగం యిచ్చేస్తారు. పాస్‌పోర్టు యివ్వగా లేనిది, యిదొక లెక్కా?

తెలంగాణా మంత్రులు, అధికారులు మాత్రమే యిలాటి వాళ్లని నేనటం లేదు. ఆంధ్రప్రాంతం వాళ్లూ అంతే. ఆ దొంగ పాస్‌పోర్టులు యిచ్చినవాళ్లు కర్నూలు వాళ్లు కాదూ? డబ్బిస్తే చాలు, ఒడియావాళ్లకు లోకల్ సర్టిఫికెట్లు యిచ్చేసి ఉద్యోగాలు యిచ్చేస్తారు. ఇదేమిటంటే కావాలంటే కమిటీ వేసుకుని తేల్చుకో అంటారు.

అసలీ లోకల్, నాన్-లోకల్ సమస్యే పెద్ద చిక్కుదారం. అర్ధశతాబ్దికి పైగా కలిసి కాపురం చేశారు కదా, ఆంధ్ర, తెలంగాణా బాగా కలిసిపోయాయి. భర్త ఆంధ్ర, భార్య తెలంగాణా లేదా భర్త తెలంగాణా, భార్య ఆంధ్ర. వాళ్ల పిల్లలు ఎవరో ఎలా తేలుస్తాం? పుట్టినచోటు బట్టి అంటే నూటికి నూరుపాళ్ల తెలంగాణా వాళ్ల పిల్లలు కూడా బదిలీ మీద వున్నపుడో, వేరే దానికో మరే వూళ్లో వున్నపుడు పుడితే వాళ్లు తెలంగాణా వాళ్లు కాకుండా పోతారా? ఓ పరజాబీ వ్యక్తి ఉద్యోగరీత్యా యిక్కడ వుండి పిల్లాణ్ని కంటే ఆ పిల్లాణ్ని తెలంగాణా అంటామా? కాదు, హైస్కూలు చదువు, ఇంటర్ చదువు నాలుగైదేళ్లు ఎక్కడుంటే అక్కడి వాళ్లే అంటే చాలామంది తెలంగాణా వాళ్లు వాళ్ల పిల్లల్ని విజయవాడ, వైజాగ్, నెల్లూరులలో చదివించారు. (నాగం జనార్దన రెడ్డిగారిదో ఎవరిదో యిదే కేసని విన్నాను) వారు తెలంగాణా వారు కాకుండా పోతారా? ఇలాటి కన్‌ఫ్యూజన్‌లో ఎవడికి ఎలాటి సర్టిఫికెట్టు యిచ్చినా సమర్థించుకోవచ్చు. ఇక వ్యాపారాల గురించి రేపు చెప్తా. అప్పటిదాకా ఓపిక పట్టు. **- ఎమ్బీయస్ ప్రసాద్**

## జనవరి 27, 28, 29, 30
## గుమ్మడికి నివాళి

గుమ్మడిగారు వెళ్లిపోయారు. ఈ కబుర్లలో (ఆర్కయివ్స్‌లో చూడవచ్చు) ఆయనపై రాసినపుడు నాకూ, ఆయనకు ఏర్పడిన స్నేహం గురించి రాయడానికి సిగ్గుపడ్డాను - స్వోత్కర్ష అవుతుందని. ఆయన పోయిన యీ ఘడియ ఆ అనుభవాలను అక్షరీకరిస్తున్నాను.

చాలా ఏళ్లగా గుమ్మడిగారిని సభలు, సమావేశాల్లో దూరం నుండి చూడడమే తప్ప దగ్గరకెళ్లి పలకరించినది లేదు. మా 'హాసం' తరఫున హ్యూమరథం - 1 పుస్తకావిష్కరణ సభకు రచయిత రావి కొండలరావుగారి ఆహ్వానం మేరకు వచ్చారు. అదే సభలో నేను రాసిన 'కిశోర్ జీవనఝరి' పుస్తకావిష్కరణ కూడా... నన్ను నేను పరిచయం చేసుకుని కాస్సేపు మాట్లాడాను.

తర్వాత వ(ర)ల్డ్‌స్పేస్ ఆర్‌జెగా గుమ్మడిగారిపై ఆ వ్యాసం రాసి, ప్రసంగించాను. ఎస్.వి.రామారావు గారనే నా మిత్రుడు ఆయనకు నలభై ఏళ్లగా ఆత్మీయుడు. ఆయన జీవితచరిత్రను రాయడంలో సహాయపడినవారు. నా ప్రసంగపాఠాన్ని తీసుకెళ్లి గుమ్మడిగారికి యిచ్చారు. ఆయన చేతిలోని గ్లాసును సైతం నిర్లక్ష్యం చేసేటంత పరవశంతో అది ఏకటాకీన చదివారుట. ముగించగానే 'ఆయనకు ఫోన్ చేయండి' అని రామారావుగారిని కోరారు.

ఫోన్‌లో గుమ్మడిగారు పలకరించగానే కంగారుపడ్డాను. ఆయన ప్రశంసను తట్టుకోలేక పోయాను. ఆయన సాహితీప్రియుడు. ఎదుటివాళ్లలోనే కాదు, తనలో వున్న లోపాలను సైతం గుర్తెరగగల ప్రతిభాశాలి. మితభాషి. ఆయన మాటకు చాలా విలువ వుంది. అందుకే ఆయన మెచ్చుకోగానే చాలా ఆనందించాను.

'మద్రాసులో పదేళ్లున్నారట. నన్నెపుడూ కలవలేదేం?' అని అడిగారు. 'సినిమావాళ్లతో కాంటాక్ట్ పెట్టుకోలేదండి. బాపురమణలను సినిమావాళ్లగా అనుకోను కాబట్టి ఎక్సెప్షన్..' అన్నాను. 'అయితే నేను దురదృష్టవంతుణ్ని అన్నమాట' అన్నారు. నన్ను ముఖస్తుతి చేయవలసిన అవసరం ఆయనకు ఎంతమాత్రం లేదని తెలుసుకదా! నా యితర రచనలు కూడా పంపాను. నాకు కాస్త చొరవ తక్కువ. ఆయనంత అభిమానంగా మాట్లాడినా దగ్గరవుదామని ప్రయత్నించలేదు.

2007 మే ప్రాంతంలో ఫోన్ చేశారు, ఒకసారి వచ్చి కలవమని. ఫిలింనగర్‌లో మోహన్‌బాబు యింటిపక్కనే యిల్లు. నిర్మాణం విలక్షణంగా వుంది. ఇంగ్లీషు 'యు' లా వుండి మధ్యలో లాన్‌లో కుర్చీలు వేసుకుని కూచోవచ్చు. ఇటాలియన్ ఫార్మ్ హౌస్ మోడలట. ఆర్కిటెక్ట్ కూడా యిటాలియనేట. ఇక్కడికి వచ్చేసరికే వారి భార్యకు అనారోగ్యం చేయడంతో మెట్లెక్కి దిగనక్కరలేకుండా అలా కట్టించారట.

సంగతేమిటన్నాను. తానావాళ్లు ఆయనకు లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ ఎవార్డు యిస్తున్నారు. ఆ సందర్భంగా వేసే సువెనీర్‌లో ఆయన గురించి ఓ వ్యాసం కావాలన్నారు. ఎస్‌వి రామారావుగారు ఆల్‌రెడీ ఒకటి రాసిచ్చారు. వివరాల వరకు బాగానే వున్నా, ఇంతటి ఎవార్డు యివ్వదగిన కారణాలు దానిలో కనబడలేదు గుమ్మడిగారికి. నేనైతే భిన్నంగా రాస్తానని ఆయన నమ్మకం. నాచేత మరోటి రాయిస్తానని రామారావుగారికి చెపితే ఆయన 'తప్పకుండా' అన్నారట. రాయమని గుమ్మడిగారి రిక్వెస్టు. ప్రయత్నిస్తానన్నాను.

ఆ తర్వాత ఓ గంటసేపు కూచుని అవీ యివీ మాట్లాడుకున్నాం. నా రచనావిధానం గురించి ఆయన ఒక అబ్జర్వేషన్ చేశారు. 'మీ రచనలు సావిత్రి అభినయంలా ఆత్మీయంగా అనిపిస్తాయండి. నిజానికి సావిత్రి కంటె అంజలీదేవి గారికి మంచి వేషాలు పడ్డాయి (ఆయన వుపయోగించిన పదం). అయినా సావిత్రినే అందరం ఎక్కువగా అభిమానిస్తాం, మన యింటమ్మాయి అనిపిస్తుంది. మీరు అలాగే ఏది చెప్పినా ఆత్మీయంగా చెప్తారు.' అన్నారు. దీన్ని నేను ఎక్కడా కోటబుల్ కోట్‌గా వాడుకోలేదు. ఇవాళ ఆయన వెళ్లిపోయారన్న బాధతో అది గుర్తు చేసుకుంటున్నాను.

సినిమావ్యక్తుల గురించి నా పరిశీలనలూ అవీ మెచ్చుకున్నారు. సాహిత్యం గురించి మాట్లాడారు. ఆయన థరో జెంటిల్‌మన్. నిష్కపటంగా మాట్లాడతారు. అన్యాయం సహించలేరు. ఒక పేపర్లో వార్త వేసిన విధానం సరిగ్గా లేనపుడు ఆ పత్రికా సంపాదకుడికి ఫోన్ చేసి చెరిగేశారు. తను కమిటీ సభ్యుడిగా వున్నపుడు న్యాయం కోసం తపించి, తను అనుకున్నట్టు జరగకపోతే బాధపడి అనారోగ్యం పాలయ్యారు. ఇది నిజం. చిన్నవిషయాలకు కూడా ఆయన ఎంత స్పందిస్తారో నేను ప్రత్యక్షంగా చూశాను.

రామారావు గారు ఎలాగూ సువెనీర్‌కి రాశారు కదాని గుమ్మడిగారిని తానా వేదికమీదకు ఆహ్వానించేటప్పుడు ఎలా ఆహ్వానించాలో ఓ రైటప్ రాశాను. ఆయనకు బాగా నచ్చింది. అన్ని రకాల ఋషిపాత్రలు వేసిన విషయం, పిసినారి ఎన్టీయార్‌నుండి రెండు సందులు తీసుకున్న విషయం జోడించమని కోరారు. అవి జోడించాను. ఆయన పులకించిపోయారు.

ఎస్వీ రామారావుగారికి కూడా యిది బాగా నచ్చింది. గుమ్మడిగారి జన్మదిన సంచిక ఒకటి వేస్తూ దానిలో టెయిల్‌పీస్‌గా యిది చేర్చారు. చదవండి. దీని తర్వాత గుమ్మడిగారికి నేను రాసి పెట్టిన మరో ఆర్టికల్ గురించి చెప్తాను.

తానా సభలనుండి తిరిగి రాగానే గుమ్మడిగారికి బాగా జబ్బు చేసింది. ఐసిసియులో పెట్టారని విన్నాను. ఇంతలో మా యింటికి ఫోన్ వచ్చింది. నేను లేను. మా మిసెస్ తీసుకుంది. నేను తిరిగి వచ్చాక 'గుమ్మడిగారి నుండి ఫోనండి. మీతో అర్జంటుగా మాట్లాడాలట.' అంది.

'ఆయన ఫోన్ చేయడమేమిటి? ఇవాళో రేపో అంటున్నారు. ఎవర్నీ చూడనివ్వటం లేదట. నువ్వు పొరబడివుంటావ్' అన్నాను.

'ఏమో మరి, మాట నీరసంగానే వుందనుకోండి. ఫోన్ సరిగ్గా వినబడలేదు. కానీ గుమ్మడి అన్నట్టే వినబడింది' అందామె.

'ఆ యింటిపేరు కలవాళ్లు ఎవరైనా ఫోన్ చేశారేమో' అనుకుంటూ గుమ్మడిగారింటికి ఫోన్ చేశాను. 'నాన్నగారు ఐసిసియులోనే వున్నారండి. ఎవరితోనూ మాట్లాడలేదండి. ఔటాఫ్ డేంజర్. రెండు, మూడు రోజుల్లో డిస్చార్జి చేస్తారట' అన్నారు వారి కుమార్తె.

అయితే ఆయన చేయడానికి ఛాన్సు లేదు. వేరే ఎవరో చేసి వుంటారు అనుకున్నాను. మర్నాడు మళ్లీ ఫోన్.

'నేను గుమ్మడి వెంకటేశ్వరరావునండీ, నాకొక వింత అనుభవం కలిగింది. మీతో పంచుకోవాలి, మీకే చెప్పాలనిపించింది..' అన్నారు నీరసంగా.

నేను ఆశ్చర్యపడ్డాను. మృత్యుముఖంలో వున్న వ్యక్తికి నేను గుర్తు రావడమేమిటి? నాతో మాట్లాడాలని తహతహ లాడడమేమిటి? 'మీరు క్షేమంగా యింటికి రండి. స్థిమిత పడండి. వచ్చేవారంలో మీ యింటికి వస్తాను. అప్పుడు మాట్లాడుకుందాం' అన్నాను. వెళ్లాను. అప్పుడు ఆయన తన వింత అనుభవం గురించి చెప్పారు. ఓపెనింగ్‌లో శాంతారాం అనుభవం, చివర ఉపనిషత్ వాక్యాలు, సైన్సు అవీ చేర్చి నాకు అలవాటైన చమత్కార ధోరణిలో రాసి పట్టుకెళ్లాను. ఆయనకు అంతా నచ్చింది కానీ 'ఈ ఉపనిషత్తులు అవీ నాకు తెలియవండి. ఈ తత్త్వమసి అవీ నేను రాశానని అనుకోరు' అన్నారు.

'దానికేముంది, ఇప్పుడు నేను చెపుతున్నాను కాబట్టి తెలుసుకుంటారు' అన్నాను. నేను హేతువాదిని, నాస్తికుణ్ని అని నా సన్నిహితులందరికీ తెలుసు. నేను దీన్ని ఓనప్ చేసుకోలేను. మీ పేరూ పెడతాను' అన్నారు. 'వద్దండి. అటువంటి ఘడియలలో మీరు నా గురించి ఆలోచించి, మీ ఆలోచనలను ఆవిష్కరించడానికి నేనే తగినవాణ్ని అనుకోవడమే నాకు మన్నన. నా పేరు వద్దు' అన్నాను. సరే సరే అంటూనే స్వాతికి పంపేటప్పుడు 'అక్షరబద్ధం చేసింది అంటూ నా పేరు' చేర్చేశారు. అచ్చయ్యాకనే నాకు తెలిసింది. అందుకే ఆయనకు ఔచిత్యం బాగా తెలుసంటాను.

## మృత్యోర్మా....
## గుమ్మడి వేంకటేశ్వరరావు

దర్శకనిర్మాత శాంతారాం నాయకపాత్ర వహిస్తూ తీసిన ''దో ఆంఖే బారహ్ హాత్'' సినిమా క్లయిమాక్స్‌లో ఆంబోతుతో పోరాటాన్ని చిత్రిస్తూ గాయపడ్డారు. తెరమీద ప్రాణాలు, తెర వెనుక కళ్లూ పోగొట్టుకున్నారు. దరిమిలా ఆపరేషన్ సహాయంతో కళ్లు బాగు చేయించుకున్నారు. కట్లు యిప్పబోయేముందు 'తమసో మా జ్యోతిర్గమయ' దశలో ఆయనకు అనేక రంగులు కనబడ్డాయి. వాటిని

తన ప్రేక్షకులతో పంచుకోవడానికి తన తదుపరి చిత్రం ''నవ్‌రంగ్'' తీశారు.

2007 జులైలో జరిగిన తానా మహాసభల్లో నాకు 'సమగ్ర జీవనసాఫల్య పురస్కారం' ( లైఫ్‌టైమ్ ఎఛీవ్‌మెంట్ ఎవార్డు) ప్రసాదించారు. 'నీ జీవనం సఫలమైందన్నారుగా, యిక చాలు, వచ్చేయ్' అంటూ హైదరాబాదుకి తిరిగి రాగానే మృత్యువు తన వొడిలోకి తీసుకోబోయింది. తుంటరి పిల్లాడిలా నేను ఆ వొడివిడిచి జారి పడ్డాను – సరిగ్గా 80 యేళ్ల క్రితం మాతృగర్భంలోంచి జారిపడ్డట్టే!

ఆ క్రమంలో నేను దర్శించిన వెలుగులను, స్పృశించిన ఎత్తుపల్లాలను, అనుభవించిన 'మృత్యోర్మా అమృతంగమయ' దశను, శాంతారాం గారు ప్రేక్షకులతో పంచుకున్నట్టే పాఠకులతో పంచుకోవాలన్న ఆకాంక్షే అక్షరాలుగా తర్జుమా అవుతోందిలా...

చెడురక్తాన్ని తోడివేసే పనిలో నా గుండె యిటీవల మందగించింది. దీనికి తోడు ఊపిరితిత్తుల్లో కఫం చేరింది. రెండూ చేరి నన్ను ఆసుపత్రికి చేర్చాయి. అయిదు నిమిషాలలో ప్రాణవాయువు అందకపోతే ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసే దశలో ఆగస్టు 18న ఉదయం 5 గం౦ఎలకు మా యింటి వద్ద కారు ఎక్కడం గుర్తుంది.

ట్రాఫిక్ జామ్ ఏర్పడేటంత సావకాశం యింటికి, ఆసుపత్రికి మధ్య చోటు చేసుకోకపోవడం వలన సకాలంలో నేను చేరడం, అపోలో డాక్టర్లకు పనిచెప్పడం జరిగింది.

రెండు రోజుల చికిత్స తర్వాత డాక్టర్లు అయినవాళ్లందరినీ పిలిపించుకోమని చెప్పేశారు. ఇంటికి తిరిగివెళ్లే శ్రమ బహుశా వుండదేమో అన్నారు. ఆ 'ఏమో'ను శాతాల్లో అనువదించి చెప్పమన్నారు సెలవులు పెట్టి దూరప్రాంతాలనుండి రానుపోను టిక్కెట్లు కొనుక్కోవలసినవారు.

'నూటికి ఓ ఐదు అనుకోండి' అంటూనే 'పైన దేవుడున్నాడు, చల్లగా చూడమని వేడుకోండి' అన్నారు వీరు.

గుండెపోటుతో మరణించిన సన్నివేశాల్లో రాణించి, రాణించి గుండె రాయి చేసుకున్నా ననుకున్నారేమో అసలు పరిస్థితి నాకూ చెప్పేసి, దేవుణ్ని స్మరించుకోండి అనేశారు.

రామాయణ, భారత, భాగవతాల్లోని అందరు ఋషుల వేషాలూ – వరాలిచ్చే వారినుండి శాపాలిచ్చే బాపతుదాకా – తెరమీద వేసివుండడం చేత నన్ను భక్తాగ్రేసరుడిగా పొరబడేవారుండవచ్చు.

నిజానికి చెప్పాలంటే నేను దేవుణ్ని ఎన్నడూ ప్రార్థించింది లేదు. ఈ ఎనిమిది దశాబ్దాలుగా ఆయన సంగతి తెలియకుండా, ఆయన జోలికి పోకుండా బతుకుబండి లాక్కుంటూ వచ్చాను. ఇన్నేళ్లలో దైవం వున్న దాఖలాలు కనబడలేదు కానీ, దైవత్వం వున్న మనుష్యులు కనబడ్డారు. వారిని ఆరాధిస్తూ, అనుసరిస్తూ జీవనగమనం సాగిస్తూ వచ్చాను.

ఎప్పుడైనా కొబ్బరికాయ కొట్టినా ఆత్మీయులను సంతృప్తి పరచడానికే తప్ప కానరానివాడి కనికారం కోసం కాదు. అలాటిది యీ చరమదశలో ఆయన్ని పలకరించి మొహమాట పెట్టడమెందుకనుకున్నాను.

'అలాక్కాదు, మీకోసం కాకపోయినా మీ బాధ్యతలకోసమేనా...' అన్నారు వైద్యులు.

బాధ్యతలంటే ముందుగా గుర్తుకు వచ్చేది కుటుంబమే కదా. 1944లో ఏడడుగులూ నా వెంట అడుగులో అడుగుగా వేసిన లక్ష్మీసరస్వతి పదహారేళ్ల క్రితం నన్ను దాటుకుని... అధిగమించింది. నా పిల్లలు వారి వారి జీవితాల్లో స్థిరపడ్డారు. నేను నేర్చిన కళద్వారా సమాజం పట్ల నా బాధ్యత నెరవేర్చుకున్నాను. ఇక వృత్తి అంటారా, అమెరికాకు వెళ్లడానికి ముందే ఆ బాధ్యతా పూర్తి చేశాను –

నటజీవితానికి నేను స్వస్తి చెప్పి పుష్కరమవుతోంది. ఆరేడు నెలల క్రితం ఓ సాయంత్రం కూచుని నా కెరియర్‌ను పరామర్శించుకుంటూ చివరిగా పదికాలాలు గుర్తుండే ఓ పాత్ర – తిమ్మరుసు వంటిది – వేసివుంటే బాగుండేదేమో అనుకుంటూండగా, అనుకోకుండా శౌరిరెడ్డి దంపతులు, దర్శకుడు శివరామరెడ్డి మా యింటికి వచ్చారు. ''కాశినాయన' పై సినిమా తీస్తున్నాం. మీరే ఆ పాత్ర ధరించాలి'' అన్నారు.

ఆశ్చర్యపడ్డాను., కాశినాయన గారి గురించి తెలుసుకున్నాను. అంతటి మహాత్ముడి పాత్ర ధరించడం నా నటవృత్తికి సొగసైన హంసగీతంగా, చక్కటి ముగింపుగా అమరుతుందని అనిపించింది. ''సతీ తులసి''లో జలంధరుడి వంటి రాక్షసవేషం లాటిది రాకుండా సమాజసేవ చేసిన ఆధ్యాత్మిక గురువు పాత్ర దక్కడం అదృష్టంగా భావిస్తూనే, 'మరి కంఠస్వరమో?' అని సందేహించాను.

'మీరే డబ్బింగ్ చెబుదురుగాని. ఆయన 103 యేళ్లు జీవించిన వయోవృద్ధుడు. ఇప్పటి మీ వాయిస్ చక్కగా సూటవుతుంది' అన్నాడాయన.

నిజానికి పన్నెండేళ్ల క్రితం పక్షవాతం వల్ల నా కంఠనాళాలు దెబ్బ తిన్నపుడు, తిరిగి వచ్చే అవకాశాలు దాదాపు మృగ్యం అన్నారు. కానీ ఐదేళ్ల తర్వాత సత్యసాయిబాబా పై అంజలీదేవిగారు తీసిన టీవీ సీరియల్‌లో బాబా ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో ఆయన తాత పాత్ర ధరించే ధైర్యం చేశాను. క్రమంగా నా కంఠం దాదాపుగా నాకు తిరిగి వచ్చింది – డాక్టర్లే ఆశ్చర్యపడే రీతిలో!

'కాశినాయన' పాత్ర అంతిమదశలో నాకు ప్రేక్షకులిస్తున్న వరంగా భావించి సరేనన్నాను. మండుటెండలలోనే రెండు, మూడు నెలల షూటింగు నిరాటంకంగా సాగిపోయింది. తానా సభలకు వెళ్లేముందే డబ్బింగ్ కూడా పూర్తి చేసివేశాను.

ఈ విధంగా వృత్తిపరమైన బాధ్యతలు కూడా నెరవేర్చుకున్నాను కాబట్టి యిహ యిహలోకానికి వీడ్కోలు చెప్పడమే మంచిదనుకున్నాను. వేదికనుండి సెలవు తీసుకునే కళాకారుడు టోపీ తీసి 'లాస్ట్ బౌ' చేసే రీతిలో వొంగడానికి శరీరం సహకరించలేదు కాబట్టి పక్కమీదనుండే

'ఆఖరి ఆపరేషన్' చేసే డాక్టర్లందరికీ నమస్కారాలు పెట్టాను. కృతజ్ఞతలు కూడా అర్పించి వాళ్లు యిచ్చిన మందు సహాయంతో మత్తులోకి జారుకున్నాను.

కాస్సేపటికి – ఎంతసేపయిందో నాకు తెలియదు – కళ్లు కొద్దిగా తెరుచుకున్నాయి. గోడకున్న ట్యూబ్‌లైట్ కాంతులు చిమ్ముతోంది. దానికి అమర్చిన ప్లాస్టిక్ గ్రిల్ ద్వారా సీలింగుమీద వెలుగుముగ్గులు పెడుతోంది. ఆ ముగ్గుల్లో ముగ్గుబుట్ట తలతో ఓ పెద్దమనిషి దర్శనమిచ్చాడు. పరిచితమైన మొహమే. పరకాయించి చూశా. 'కాశినాయన' వేషంలో నేను!

కళ్లు మిరుమిట్లు గొలిపేటంతటి కాంతిపుంజంలా గోచరించింది. చూడముచ్చటైన ఆ దృశ్యాన్ని చూస్తూనే వుండిపోయాను. 'కాశినాయన' సినిమాకై నేను ధరించిన గెటప్‌లన్నీ నా కళ్ల ముందుకు వస్తున్నాయి. దాదాపు పదిహేను రకాలుగా నన్ను నేనే చూసుకునే ఆ దృశ్యాన్ని అబ్బురపడుతూ వీక్షిస్తూండగా, ఆ సూత్రధారి యీ పాత్రధారి శరీరాన్ని కాంతికరాలతో నిమిరాడు.

ఆ కాంతిలో విశేషమేమిటో – ఎక్కడినుండి వచ్చిందో తెలియదు కానీ పచ్చటి, బంగారువర్ణపు ద్రవం నా శరీరమంతా అలుముకుంది. దేహం తేజోమయమైంది. ఓజోభరితమైంది.

ఇది అమృతమా? చనిపోయేముందు శరీరం యీ విధంగా శుద్ధి అవుతుందా? అన్న ఆలోచనలు ఒకదానిపై వొకటి వచ్చి పడుతూండగానే కళ్లు మూతలు పడ్డాయి. ఇక మరణించానన్నమాట అని నిర్ధారించుకున్నాను.

మరి కొంత సేపటికి కళ్లు తెరుచుకున్నాయి. గదిలోకి సూర్యకాంతి చొచ్చుకుని వస్తోంది. మరణించిన తర్వాత ఆత్మ శరీరానికి సమీపంలో మసలుతూ ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారో పరిశీలిస్తుందని ఎప్పుడో చదివిన విషయం గుర్తుకు వచ్చింది. ప్రస్తుతం ఆ దశలో వున్నానన్నమాట!

మంచం కేసి దృష్టి సారించాను. అక్కడ నా కళేబరం పడివుంది. నర్సు దుప్పటి సవరిస్తోంది. 'నలుగురూ చూడడానికి వచ్చినపుడు శవం అస్తవ్యస్తంగా కనబడకుండా 'ప్రెజంటబుల్' గా తయారు చేస్తోందన్నమాట!' అనుకుని నవ్వుకున్నాను.

'అవునూ, నా చావు గురించి పేపర్లో వచ్చిందా? పేపర్లో వేయకపోతే అందరికీ ఎలా తెలుస్తుంది పాపం?' అనుకుని పేపరుకోసం చూడబోయాను. దగ్గర్లో పేపరేదీ కనబడలేదు కానీ పేపర్లో చావు వార్త వేయలేదని మాత్రం స్ఫురించింది.

దానితో మనసు కలతపడిందేమో తెలియదు కానీ కళ్లు విచ్చుకున్నాయి. "గుడ్‌మార్నింగ్, మనం భయపడినది జరగలేదు, యూ హేవ్ కమ్‌బ్యాక్, ఆపరేషన్ సక్సెస్" అంటోంది నర్సు.

ఆ మాటలు స్పష్టంగా వినబడడమే కాదు, "థ్యాంక్స్" అంటున్నాయి నా పెదాలు అప్రయత్నంగా.

'ఇదేమిటి, శవం మాట్లాడుతోంది' అని ఆశ్చర్యపడుతూండగానే నిద్రమత్తు పూర్తిగా విడిపోయింది.

డాక్టర్ల అంచనాలు తప్పు చేస్తూ, నా 'దినాల' కోసం సెలవులు వ్యర్థం చేసుకున్నవారిని నిరాశపరుస్తూ, 'గుమ్మడి–గుండెతడి' వంటి పదబంధాలతో 'అశ్రునివాళి' రాసిపెట్టుకున్న పాత్రికేయులకు, నేను నటించిన సినిమా వీడియోక్లిప్పింగ్స్‌తో, నాతో పంచుకున్న జ్ఞాపకాలకోసం నా సహనటీనటుల ఎపాయింట్‌మెంట్స్ తీసుకుని సిద్ధంగా పెట్టుకున్న ఎలక్ట్రానిక్ మీడియావారికీ విసుగు తెప్పిస్తూ – నేను తిరిగి వచ్చేశాను.

ఛాతీలో పేస్‌మేకర్‌ను, 'యిప్పట్లో ఢోకా లేదు' అని 'కేర్' వాళ్లిచ్చిన హామీని గుండెలోనూ దాచుకుని యింటికి తిరిగివచ్చాను. వచ్చానన్నమాటే కానీ ఆనాటి అనుభవం నన్ను కలవరపెడుతూనే వుంది. క్షుణ్ణంగా అధ్యయనం చేయనిదే యిప్పటివరకూ నేను ఏ పాత్రా ధరించలేదు. మరి ఆగస్టు 22 నాటి 'కాశినాయన' పాత్ర నా ప్రమేయం లేకుండానే నన్ను పునర్జీవితుణ్ని చేసే భూమిక వహించిందే! ఆ పాత్రను డైరక్ట్ చేసినదెవరు?

నిజమైన 'కాశినాయన' కనబడి నాలో అమృతత్వాన్ని నింపినట్టు కనబడితే అదో దారి! 'కాశినాయన మహిమలు' అని పుస్తకం రాసే ఆయన నా కథను కూడా దానిలో చేర్చివుండేవాడు. దైవభక్తుల జాబితాలో నా పేరూ నమోదయి వుండేది. కానీ యిక్కడ కనబడినది నేనే!

"గైడ్" సినిమా క్లయిమాక్స్‌లో 'పాపాత్ముడు' దేవ్ ఆనంద్, 'పుణ్యాత్ముడు' దేవ్ ఆనంద్ ముఖాముఖీ, మంచీ చెడ్డా మాట్లాడుకున్నట్టు – యిక్కడ నేనే రోగిని, నేనే వైద్యుణ్ని! నేనే వ్యాధిని, నేనే ఆరోగ్యాన్ని! నేనే మృతుణ్ని, నేనే అమృతుణ్ని! నేనే గరళాన్ని, నేనే సుధను! (అవునూ.. నీటికి పర్యాయపదాల్లో అమృతం, విషం రెండూ వున్నట్టున్నాయి!)

ఇదేమిటి? నేను భగవద్గీతలో కృష్ణుడి లెవెల్లో మాట్లాడుతున్నానా? నేను నరుడినా? నారాయణుడినా? రజ్జుసర్పభ్రాంతిలా నాపై నేనే దైవత్వాన్ని ఆపాదించుకుని 'కాశినాయన' రూపంలో నాలోని జీవశక్తిని మరల రగిలించుకున్నానా? లేక భ్రాంతికి లోనై, నేను ధరించిన పాత్రద్వారా 'ఫెయిత్ హీలింగ్' చేసుకున్నానా? ఇది ఓ రకమైన సెల్ఫ్ హిప్నాసిస్సా?

సంకల్పించిన మాత్రాన యిలాటి పనులు సమకూరుతాయా? ఆ మాట కొస్తే – నేను మృత్యువుతో రాజీపడి అంతిమపయనానికి మానసికంగా సిద్ధపడేవున్నాను కానీ, జీవించి తీరాలని గట్టిగా సంకల్పించలేదే...! లేక బలీయమైన కోరికేదో నాకు తెలియకుండానే లోపల దాగుండి, నా బుద్ధితో ప్రమేయం లేకుండా, ఒక సన్నివేశాన్ని కల్పించి, నన్ను ప్రేరేపించి, నాలో జవజీవాల్ని నింపిందా?

ఆదిదేవుడు సంకల్పమాత్రాన యావత్తు సృష్టిని కల్పించాడని పురాణాలు చెప్పేది యిలాటిదేనా? మనిషిలో వుంటుందనే దైవాంశ కనీసం ఆ వ్యక్తి వరకైనా యిలాటి పరిమిత సన్నివేశాలను కల్పించగల శక్తి కలిగివుంటుందా? ఉపనిషత్తులు చెప్పే 'తత్త్వమసి' అంటే

యిదేనా? కావాలనుకుంటే ప్రాణదాతగా రూపమెత్తే నిబిడశక్తి ప్రతి శరీరంలో నిక్షిప్తమై వుంటుందా? గట్టిగా తలచుకుని, తనను తాను ప్రేరేపించుకుంటే మర్త్యుడు అమృతుడు కాగలడా?

... ఏమో, యీ ప్రశ్నలకు సమాధానం నా వద్ద లేదు. నా అనుభవం గురించి చెప్పడమే నాకు తెలుసు. దీనిపై వ్యాఖ్యానించవలసినది విజ్ఞులు మాత్రమే! (దీన్ని మార్చమంటే కింది విధంగా మార్చాను)

టీవీ ఛానెల్స్ తిప్పుతూంటే ప్రవచనాలు చెప్పేవారు అప్పుడప్పుడు కనబడుతూంటారు – ఆదిమధ్యాంతాలు లేని పరమాత్మ సంకల్పమాత్రాన యావత్తు సృష్టిని కల్పించాడని చెబుతూంటారు. ప్రతిమనిషిలో ఆ బ్రహ్మపదార్థం అంశ వుంటుందని కూడా అంటారు. ఆదిలో వున్నదంతా చేతనారహితమైన జడపదార్థమే (మెటీరియల్) అనీ, సృష్టిక్రమంలో ఒక దశలో దానిలో చైతన్యం రగిలిందని భౌతికవాదులు అంటారు.

ఆ బ్రహ్మపదార్థం శక్తి సంగతి మనకు తెలియదు కానీ యిలాటి పరిమిత సన్నివేశాలను కల్పించగల శక్తి జీవుడిలో వుందేమో! కావాలనుకుంటే ప్రాణదాతగా రూపెత్తి, నిశ్చేతన పదార్థంలో చైతన్యం నింపగల నిబిడశక్తి ప్రతి శరీరంలో నిక్షిప్తమై వుంటుందేమో!? జడపదార్థంనుండి జీవపదార్థంగా మారే దశకు ఆలంబన యిటువంటిదేనేమో!? గట్టిగా తలచుకుని, తనను తాను ప్రేరేపించుకుంటే మనిషి లోపాలను అధిగమించి, తనను తాను చికిత్స చేసుకుని, అమృతుడు కాగలడేమో!?

...ఏమో, యీ ప్రశ్నలకు సమాధానం నా వద్ద లేదు. వేదాంతచర్చ చేసేటంతటి ఘనుడను కాను నేను. నా అనుభవం గురించి చెప్పడమే నాకు తెలుసు. దీనిపై వ్యాఖ్యానించవలసినది విజ్ఞులు మాత్రమే!

స్వాతి వీక్లీ అక్టోబరు 2007లో ప్రచురణకిస్తూ గుమ్మడిగారు చేర్చినది – అనుభవాలు చెప్పినది గుమ్మడి!

అక్షరబద్ధం చేసినది ఎమ్బీయస్ ప్రసాద్!

ఇది అక్టోబరు 2007లో ప్రచురితమైంది కదా. చాలామందికి నచ్చింది. గుమ్మడిగారి ఆత్మకథను ఐ.వెంకట్రావుగారు పునర్ముద్రిద్దామని అనుకుని ఆ పని శ్రీరమణగారికి అప్పజెప్పారు. శ్రీరమణగారు యీ వ్యాసాన్ని కూడా దానిలో చేరుద్దామనుకుని అనుకుని జనవరి రెండవ వారంలో గుమ్మడిగారి వద్దకు వచ్చి అడిగారు. ఎంత వెతికినా గుమ్మడిగారికి దొరకలేదు.

నాకు ఫోన్ చేశారు. 'ఏమండీ, నా అంతిమయాత్ర ఆర్టికల్ కాపీ మీ దగ్గర వుందా?' అని నవ్వుతూ అడిగారు. ఏమిటి సంగతంటే విషయమంతా చెప్పారు.

నేను శ్రీరమణగారితో మాట్లాడుతూ గుమ్మడిగారు అంతర్జాతీయ నటుల గురించి, సినిమాల గురించి అక్కడక్కడ చెప్పినవి చేర్చవచ్చు కదా అన్నాను. వెతికి యివ్వగలరా? అని ఆయన అడుగుతూండగానే గుమ్మడిగారు పక్కనుండి 'నేను బతికుండగానే పుస్తకం బయటకు వస్తే చూసుకుంటాను. ఇవన్నీ పెడితే ఆలస్యమవుతుందేమో' అన్నారు.

'అవేం మాటలండీ. నిండు నూరేళ్లు బతుకుతారు మీరు' అన్నాను. కానీ మరో రెండు వారాలు తిరిగేలోగానే ఆయన వెళ్లిపోయారు.

ఈ మధ్యలో జరిగిన మరికొన్ని విషయాలు చెప్పి ముగిస్తాను. స్వాతిలో వ్యాసం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తర్వాత 'కాశినాయన' సినిమా ప్రివ్యూకు నన్ను పిలిచారు. ఈయన పాత్ర యింటర్వెల్ తర్వాతనే వస్తుంది. ఆ సినిమా విజయవంతం కాలేదు కానీ యీయన పాత్ర వచ్చాకనే సినిమాలో కాస్త వుత్సాహం వస్తుంది. ఆఖరి సినిమాలో తన స్వంత వాయిస్ వుపయోగించిన తృప్తి ఆయనకు మిగిలింది. నిజానికి ఆయన వాయిస్సే ఆయనకు మేజర్ ఎస్సెట్. ఆ వుచ్చారణ, పలుకుబడి అద్భుతం. సినిమాలలో మాట్లాడినంత స్పష్టంగా బయటకూడా మాట్లాడతారు.

నేను వాళ్లింటికి వెళ్లిన మొదటిసారి దాని గురించి ప్రస్తావన వచ్చింది. ఆయనే చెప్పారు – 'నాకే యీ వుచ్చారణ వచ్చింది. మా తమ్ముడికీ రాలేదు. అంతా మా గురువుగారి ట్రెయినింగ్' అని వారిని తలుచుకున్నారు.

ఆయనకు నేనంటే చాలా యిష్టం, అభిమానం అయితే మా వరప్రసాద్ అంటే ఆరాధన. స్వాతికై రాసిన ఆర్టికల్‌లో నేను 'దైవత్వం వున్న మనుష్యులు కనబడ్డారు. వారిని ఆరాధిస్తూ, అనుసరిస్తూ జీవనగమనం సాగిస్తూ వచ్చాను...' అని చదవగానే 'మన వరప్రసాద్‌గారు అలాటి వ్యక్తి. సామాన్యజనులకోసం ఆ ధరలో హెల్త్‌కేర్ ప్రోడక్ట్స్ ఎవరిస్తారు చెప్పండి' అని పొంగిపోయారు.

వాళ్లింట్లో హాల్లో ప్రవేశించగానే నిలువెత్తు సత్యసాయిబాబా ఫోటో కనబడుతుంది. ఈయన నాస్తికుడుకదా యీ ఫోటో దేనికి? అనుకున్నాను. సత్యసాయిబాబా సీరియల్‌లో వేసినప్పుడు బాబాగారో, అంజలిగారో యిచ్చి వుంటారు. కానీ యీయన దానికి పూజలు చేస్తున్నట్టు ఏమీ కనబడలేదు. చివరిదాకా హేతువాదిలాగే వున్నారు. అనారోగ్యం చేయగానే తాయెత్తులు, రుద్రాక్షమాలలు ఏవీ వేసుకోలేదు. ఇంట్లో కూడా వాస్తుమార్పులు ఏవీ చేయించలేదు.

వాళ్ల మనుమడి పుట్టినరోజుకి యింట్లో పార్టీకి పిలిచారు. తెలుగు పరిశ్రమలో హూ యీజ్ హూ లందరూ వస్తున్నారన్నారు. నేను యిబ్బంది పడ్డాను. పెళ్లికొడుకు ఒక్కడే తెలిస్తే పెళ్లికి వెళ్లడం కష్టం. ఈయన వాళ్లని ఎటెండ్ అవుతూ వుంటే మనని పట్టించుకునే వారెవరు? వాళ్లింట్లో వేరే వారు ఎవరూ పెద్దగా తెలియదు. అసలు ఎవరూ వుండరు కూడా. ఎగ్గొట్టేద్దామని అనుకుంటూనే ఎస్వీ రామారావుగారి కంపెనీని నమ్ముకుని వెళ్లాను.

తీరా చూస్తే గుమ్మడిగారే చాలా ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. అంతా కలయదిరుగుతూ అందరి యోగక్షేమాలూ కనుక్కుంటూ కుటుంబపెద్దలా వ్యవహరించారు. నా వద్దకు వచ్చి 'అట్లు మరి రెండు వేయించుకోండి. వంటవాణ్ని తెనాలినుండి తెప్పించి మరీ

వేయిస్తున్నాం' అని మొహమాటపెట్టారు. చాలా ఆత్మీయంగా అనిపించి హమ్మయ్య అనుకున్నాను.

నా వ్యాసం ఆయనకు నచ్చిందని తెలిసిన తర్వాత కూడా వాళ్లింటికి వెళ్లి కలవడానికి ఏడాది పట్టిందని చెప్పాను కదా. ఈ లోపున సభల్లో కలిసినపుడు ఆప్యాయంగా వాటేసుకునేవారు. మేం వేసిన 'విజయగీతాలు' పుస్తకావిష్కరణ సభలో వేదికపై యిద్దరం వున్నాం. 2009 ఆగస్టులో ఎస్వీ రామారావుగారికి స్వర్ణకంకణ ప్రదాన సభకు త్యాగరాయ గానసభకు వచ్చారు. ఒంట్లో ఓపిక లేకపోయినా రామారావుగారి కోసం వచ్చారు. ఆయన గేటు దాటి రాగానే సాధారణంగా జనాలు మూగుతారు. వాళ్ల నిబ్బంది పెట్టకుండా నేను దూరంగా నిలబడే చూస్తున్నాను. నాపై దృష్టిపడగానే 'ప్రసాద్‌గారూ, దూరంగా నిలబడతారేం, రండి' అంటూ పిలిచి హత్తుకుని భుజం మీద చేయివేసి లోపలకు తీసుకెళ్లారు. పక్కనే కూచోబెట్టుకున్నారు.

పాటలు వింటూ మధ్యమధ్యలో నాతో నవ్వుతూ కామెంట్స్ చేస్తున్నారు. వెనక్కాల వరుసలో కూచున్న ఒకామెకు అనుమానం వచ్చింది. నా భుజం మీద తట్టి 'గుమ్మడిగారికి ఏమవుతారు?' అని అడిగింది. 'అంత పెద్దాయన నా ఫ్రెండ్ అంటే బాగుండ'దని ఆలోచిస్తూండగానే ఆవిడ 'వాళ్లబ్బాయా?' అంది. నేను కంగారు పడుతూ 'అబ్బే, మీలాటి అభిమానినే' అన్నాను.

'పోలికలు కనబడితేనూ..' అంటూ ఆవిడ సాగదీసింది.

ఆవిడ యిమాజినేషన్‌కు నాకు నవ్వు వచ్చింది. 'గుమ్మడిగారు అఖిలాంధ్ర ప్రేక్షకులకూ ఆత్మీయుడైన తండ్రి కదా' అనుకున్నాను. ఆయన ఎన్ని పాత్రలు ధరించినా ఆ పాత్రలో మన మనస్సుల్లో నిల్చిపోయారు.

ఆ మహానుభావుడికి హృదయపూర్వకమైన అశ్రుతర్పణం అర్పిస్తూ.. సెలవ్. **– ఎమ్బీయస్ ప్రసాద్**

## ఫిబ్రవరి 03 ఎమ్బీయస్– మహా బాగా జరిగింది!

అదుర్స్ మళ్లీ ఆగింది. ఈ సారి ఆగడంలో న్యాయం కనబడుతోంది నాకు. అదుర్స్‌ని ఆపమని కవిత పిలుపు నిచ్చినపుడు యిది చాలా తప్పు అని అన్నవాణ్ని యిప్పుడిలా అనడానికి కారణం – కొడాలి నాని 'అట్టరెన్స్'. దాన్ని ప్రకటన అనడానికి మనసు రావడం లేదు. వాగుడు, పేలుడు అని అంటే ఆయన ఫీలవ్వచ్చు. ఫీలయి వూరుకోకుండా నేను ఆయన్నే కాకుండా గుడివాడ ప్రజలందర్నీ (అంటే ఓట్లున్నవారినీ, లేనివారినీ – ఉన్నా ఆయనకు ఓట్లేయనివారినీ కూడా) అవమానించినట్టు క్లెయిమ్ చేయవచ్చు. ఇంకా కోపం వస్తే మొత్తం కృష్ణాజిల్లా వారినీ, ఆంధ్ర ప్రాంతం ప్రజలనూ, గట్టిగా మాట్లాడితే యావదాంధ్ర ప్రజలనూ అగౌరవపరచానని కేసు పెట్టవచ్చు. ఆయన దళితుడైతే కులవివక్షతతో నేను దూషించానని ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టవచ్చు.

మీరు బొత్తిగా ఓవర్‌గా మాట్లాడుతున్నారు అని కొట్టి పారేయకండి. తను వ్యక్తిగతంగా మాట్లాడాడు తప్ప యావదాంధ్ర ప్రజలకు ప్రతినిధి అని నాని ఎన్నటికీ అనుకోరు అని వాదించకండి. తెలంగాణా వుద్యమకారుల కంటికి కొడాలి నాని ఒక వ్యక్తి కాదు, సామూహిక శక్తి. యావత్ ఆంధ్ర ప్రాంత వ్యాపారుల, పారిశ్రామిక వేత్తల సినిమా నిర్మాతల ప్రతినిధి. మూర్తీభవించిన 'వలసవాదుల, తరతరాల దోపిడీకారుల' అహంకారం. ఆయన పలికితే కోస్తా, సీమల్లోని ఆబాలగోపాలం పలికినట్టే! ఇవన్నీ విని విని నాని 'తను నిజంగా అంతటివాడేనేమో' అనుకుని నాపై పైన చెప్పిన పరువునష్టం కేసు పెట్టవచ్చు.

నేను తెలంగాణా వుద్యమకారుణ్ని కాను. ఎన్నికలకు వెళ్లినప్పుడల్లా సీట్లు పోగొట్టుకునే కెసియార్ మాటను కెటసియార్ అన్నట్టుగానే అనుకుంటాను తప్ప 'హోల్‌మొత్తం' తెలంగాణా ప్రాంతం ముక్తకంఠంతో పలికినట్టుగా అనుకోను. తన స్వంత జిల్లాలోనే తన పార్టీ అధ్యక్షుణ్ని గెలిపించుకోలేని హరిరామ జోగయ్య మాట్లాడితే అది అతని మాటే అనుకుంటాను తప్ప ఆంధ్రప్రాంతం వారి వాయిస్‌గా అనుకోను. అందుకే తిరుపతి సభలో కరుణాకర రెడ్డి వర్గం తన వైరిపక్షమైన రమణ వర్గం కొమ్ము కాస్తున్నారన్న అనుమానంతో పిసిసి అధ్యక్షుడి ఉపన్యాసాన్ని అడ్డుకుంటే దానికి వేరే రంగు పూయలేదు. డి శ్రీనివాస్ తెలంగాణా వారనీ, నిజామాబాద్ వారనీ, బిసి వర్గాల వారనీ.. యిటువంటి ఆలోచనలు పోలేదు.

'డి యస్ గో బ్యాక్ అని నినాదాలు చేసినపుడు 'తెలంగాణా వాది ' అన్న పదాన్ని చేర్చేరని ఆంధ్రజ్యోతి ఒక్కటే రాసిందెందుకు? తక్కిన పేపర్లు ఎందుకు రాయలేదు? ఇది ఆంధ్రజ్యోతి కల్పనా చాతుర్యమా? లేక తక్కిన పేపర్లు పాటించిన సంయమనమా?' అని సందేహించాను తప్ప మరోలా ఆలోచించలేదు. కానీ తెలంగాణా వుద్యమకారులు అక్కడ డి శ్రీనివాస్‌ను తెలంగాణావాసిగానే చూసి పెద్ద గొడవ చేశారు.(రేపు ఏదో స్థానిక ఎన్నికలలో టిక్కెట్లు దక్కని నిజామాబాద్ నాయకులే ఆయన్ని ఘొరావ్ చేయవచ్చు. అప్పుడు వీళ్లేమంటారో? ఘొరావ్ చేసినవాళ్లలో ఓ అగ్రవర్ణం వాణ్ని వెతికి పట్టుకుని 'బిసిలపై మనువాదుల అత్యాచారం' అని ఖండిస్తారేమో)

అలాగే అందర్నీ రిజైన్ చేయమంటున్న కోదండరామ్ తనెందుకు రిజైన్ చేయడు? అని సమైక్యవాదులు అడిగితే 'బాగానే వుంది లాజిక్, రాజకీయ నాయకుడి రాజీనామా అంటే ఉత్తుత్తి రాజీనామా. ఈయనేమో పాపం వుద్యోగి. రాజీనామా చేసి యింట్లో కూచుంటే వీళ్లొచ్చి అన్నం పెడతారా?' అని నవ్వుకుని వూరుకున్నాను. కానీ 'ప్రొఫెసర్' జయశంకర్‌గారికి దానిలో యింకో అర్థం స్ఫురించింది – కోదండరాం వుద్యోగం పీకేయమని ఆయన పనిచేసే కాలేజీవాళ్లను కోరినట్టుగా! దాంతో 'కోదండరాం వుద్యోగం పీకమను చూద్దాం' అంటూ ఛాలెంజ్ విసిరారు.

ప్రొఫెసర్లు పాఠాలు చెపుతూంటే అర్థంకాని విద్యార్థులను చూశాం. ఇపుడు మామూలు మాటలే అర్థంకాని ప్రొఫెసర్లను చూస్తున్నాం.

చాలా పెద్దమనిషిలా కనబడే మాజీ కేంద్రమంత్రి విద్యాసాగరరావుగారు కూడా హైదరాబాదులో సమైక్యవాదం కార్యకలాపాలు ఎవరైనా నడిపితే ఖబడ్దార్ అనేశారు. ఎంత ఆవేశంగా, అర్థరహితంగా మాట్లాడితే అంత తీవ్ర తెలంగాణావాది అనుకుంటూ ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు.

వాతావరణం యింత వుద్వేగభరితంగా వుంటే యివేమీ చాలవన్నట్టు 'నా సినిమానే ఆపలేకపోయినవారు ఉద్యమం ఏం చేస్తార'న్న కొడాలి నాని యీసడింపు ఒకటి. సినిమాకు, రాజకీయాలకు సంబంధం లేదని తెలంగాణా ప్రజలు గట్టిగా నమ్మారు కాబట్టే యీ ప్రాంతాల్లోనూ ఆ సినిమాను హిట్ చేశారు. కవితగారి పిలుపును పెడచెవిన పెట్టారు. సినిమా హిట్ కావడంతో నానికి కళ్లు బైర్లు కమ్మినట్టున్నాయి. ఆయన నోరు అదుపు చేసుకోకపోవడం వలన యిక్కడి ఎగ్జిబిటర్స్‌కు, డిస్ట్రిబ్యూటర్స్‌కు ఎంత నష్టం వాటిల్లుతోందో స్పృహ లేనట్టుంది. తెరపైన, తెరవెనుక వున్న కళాకారుల నైపుణ్యం ప్రజలకు అందకుండా పోతుందన్న ధ్యాస లేనట్టుంది. ఆయనకేం అక్కడెక్కడో కూచున్నాడు. నా బోటివాడు హాల్లోకూచుని సినిమా చూస్తున్నపుడు ఆ స్టేటుమెంటు వచ్చిందనుకోండి, యాసిడ్ బాటిల్స్‌తో ఉద్యమకారులు దాడి చేస్తే నష్టపోయేది నేనా? నానియా?

పైగా పెద్ద ప్రజా ప్రతినిధిట కూడా! ఇంత బాధ్యతారాహిత్యమా? శాంతి నెలకొల్పాలని కేంద్రం నానా ప్రయాసా పడుతోంది. బంద్‌లు, నిరసనలు ఆగితే బాగుండునని సామాన్యుడు దేవుడికి దండాలు పెట్టుకుంటున్నాడు. అల్లకల్లోలం చేసి వేడుక చూద్దామనుకునే యిలాటి వారిని ఏం చేసినా పాపం లేదు. ఈ మాట నానిని ఒక్కరినే వుద్దేశించి అనటం లేదు. సమైక్యవాదులు కానీయండి, విభజనవాదులు ఎవరు యిలా మాట్లాడినా తప్పే. విభజనవాదులు ఎప్పటినుండో వాడుతున్న పల్లవి యిటీవల సమైక్యవాదులు కూడా అందుకున్నారు. ఇది మరింత గందరగోళానికి, కోలాహలానికి దారి తీయడం తప్ప సమస్య పరిష్కారానికి వుపయోగపడదు. పైగా సామరస్యంగా జీవించడానికి పెద్ద అవరోధంగా పరిణమిస్తుంది. **-ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 04** **ఎమ్బీయస్- ఇప్పుడెక్కడనుండి వచ్చాడు డిప్యూటీ సిఎం?**

రంగారెడ్డి జిల్లాకు ఆ పేరు రావడానికి కారణభూతుడైన కెవి రంగారెడ్డి గారి ఆత్మకథ ఇంగ్లీషు అనువాదం రిలీజైంది. ఆయన నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణాలో ప్రముఖులలో ఒకరు. బూర్గుల వారి మంత్రివర్గంలో వున్నారు. 1956 పెద్ద మనుషుల ఒప్పందంలో తెలంగాణా తరఫున సంతకాలు పెట్టారు. 1956 తర్వాత సంజీవరెడ్డి, సంజీవయ్య మంత్రివర్గాలలో పనిచేశారు. ఆయన అల్లుడే చెన్నారెడ్డి.

ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే కెసియార్, జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ వున్న ఆ సభలో మాట్లాడుతూ కెవి రంగారెడ్డి గారిని తొలి ఉపముఖ్యమంత్రిగా కీర్తించారు వక్తలు. 1956 పెద్దమనుషుల ఒప్పందాన్ని అక్షరక్షరమూ ఉల్లంఘించారని, ఒక్క క్లాజ్ కూడా అమలు చేయలేదని, ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి పదవిని సంజీవరెడ్డిగారు 'ఆరో వేలు' గా అభివర్ణించి ఆ పదవిని తీసిపారేశారని చెప్తూ వచ్చిన విభజనవాదులు కూడా సభలో వున్నారు. వారెవ్వరూ ఈ ఉపముఖ్యమంత్రి వర్ణనకు అభ్యంతరం చెప్పలేదు.

ఇంతకీ కెవి రంగారెడ్డి గారు ఉపముఖ్యమంత్రిగా వున్నారా? లేరా? ఉంటే తెలంగాణావాదులు అబద్ధం చెప్పినట్టు లెక్క. లేకపోతే ఆ సభలో వక్తలు అబద్ధం చెప్పినట్టు లెక్క. అంతేగా?

ఈ ఉపముఖ్యమంత్రి పదవిపై మీకెంత తెలుసో రాయమని నేను పాఠకులను కోరానని గుర్తుండే వుండవచ్చు.

నేను అడిగినది ఆంధ్రప్రాంతం ముఖ్యమంత్రి (ఆ.ము.) వున్నపుడు నియమించిన తెలంగాణా ప్రాంతపు ఉపముఖ్యమంత్రు (తె.ఉ.ము.) లెవరు? తెలంగాణా ప్రాంతపు ముఖ్యమంత్రి (తె.ము.) వున్నపుడు నియమించిన ఆంధ్రప్రాంతపు ఉప ముఖ్యమంత్రులెవరు? (ఆ.ఉ.ము.) అని.

సరైన జవాబు ఏమిటంటే – 01. డి సంజీవయ్య (ఆ. ము.) కె వి రంగారెడ్డి (తె.ఉ.ము.)

02. కె.బ్రహ్మానంద రెడ్డి (ఆ.ము.) – జె వి నర్సింగరావు (తె.ఉ.ము.)

03. పి వి నరసింహారావు (తె.ము.) – బివి సుబ్బారెడ్డి (ఆ.ఉ.ము.)

04. భవనం వెంకట్రామ్ (ఆ.ము.) – సి.జగన్నాథరావు (తె.ఉ.ము.)

సమాధానాలు రాసినవారిలో శ్రీయుతులు రత్నబోతు భిక్షా్మ రెడ్డి, గోళ్లమూడి తారకరామ్, సేగిరెడ్డి, తుమ్మల జగన్నాథ్, శాలికంటి సత్యనారాయణ, టిజె రావు (శ్రీ జగన్) శ్రీనివాస రెడ్డి, సైకం రాజు, చరపనంజేరి మనోజ్, కర్రా ఎస్. ఫణి, ఇర్ఫాన్ ఖాన్ వున్నారు. (ఇంటిపేర్లు తప్పుగా స్పెల్ చేసి వుంటే మన్నించాలి. ఇంగ్లీషు లిపిలో చదువుతాం కదా, సరిగ్గా తెలియదు) వీరందరిలో శాలికంటి సత్యనారాయణ గారు ఒక్కరే కరక్టుగా రాశారు. ఆయన కూడా జగన్నాథరావు గారు ఎవరి వద్ద ఉపముఖ్యమంత్రిగా వున్నారో కరక్టుగా తెలియదని రాశారు. తక్కినవారు కొన్ని పేర్లు కరక్టుగా రాశారు. కొన్ని తప్పు రాశారు. మరికొందరు 2,3 పేర్లు రాసి వూరుకున్నారు. ముఖ్యంగా సి జగన్నాథరావుగారు ఆంధ్రప్రాంతం వారో, తెలంగాణా ప్రాంతం వారో చాలామంది నిర్ధారించుకోలేకపోయారు. విజయభాస్కరరెడ్డిగారు కోనేరు రంగారావుగారికి ఉపముఖ్యమంత్రి పదవి యిచ్చారు కానీ యిద్దరూ ఆంధ్రప్రాంతం వారే కాబట్టి మనం లెక్కలోకి తీసుకోనక్కరలేదు.

దీన్ని బట్టి చూస్తే తెలిసేదేమిటి? ఒప్పందాన్ని అమలు చేసినవారు నలుగురైతే వారిలో ముగ్గురు ఆంధ్రప్రాంతం వాళ్లే. తెలంగాణా వాళ్లు ఒకరే. పెద్దమనుష్యుల ఒప్పందంపై సంతకం పెట్టిన సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి పదవి విషయంలో ఉల్లంఘించారని తిట్టిపోస్తున్నారు కదా. అదే ఒప్పందంపై సంతకం పెట్టిన చెన్నారెడ్డి రెండు సార్లు ముఖ్యమంత్రి ఐనా ఆయనా ఆంధ్రప్రాంతం వారికి ఉపముఖ్యమంత్రి పదవి యివ్వలేదు కదా! మరి ఆయన్ని యీ విషయంలో తప్పుపట్టరేం? ఆయనే కాదు, వెంగళారావు, అంజయ్య ఎవరూ ఒప్పందాన్ని ఖాతరు చేయలేదు. ఉపముఖ్యమంత్రి పదవి క్లాజ్‌ను ఉల్లంఘించడంలో తెలంగాణా ప్రాంతపు ముఖ్యమంత్రులు ఆంధ్ర ప్రాంతంవారికి తీసిపోలేదని అర్థమైంది కదా!

సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి పదవి ఎందుకు యివ్వలేదో, ఆనాటి రాజకీయ పరిస్థితులు ఏమిటో యింకో వ్యాసంలో రాస్తాను. కానీ వున్న విషయం ఏమిటంటే – ముఖ్యమంత్రిగా వున్నవారెవరూ ఉపముఖ్యమంత్రి పదవిని సృష్టించడానికి యిష్టపడరు. అది మరొక అధికారకేంద్రంగా మారుతుందని. ఇటీవలి కాలంలో జగన్‌ను ఉపముఖ్యమంత్రి చేస్తారని వార్తలు వచ్చాయి. రోశయ్య పడనిచ్చారా? డిసెంబరు 9 కి ముందు దాకా కాబినెట్‌లో సగం మంది జగన్ యింట్లో కూచుంటున్నారు. ఇక అధికారికంగా ఉపముఖ్యమంత్రి పదవిలో కూచోబెడితే ఎవ్వరూ ముఖ్యమంత్రిని లక్ష్యపెట్టేవారు కారు. ఇప్పుడే కాదు, అప్పుడూ యిలాటి పరిస్థితులే వుంటాయి. సంకీర్ణ ప్రభుత్వంలో ఒప్పందాల మేరకు ఒక పార్టీకి ముఖ్యమంత్రి, మరో పార్టీకి ఉపముఖ్యమంత్రి అంటే గత్యంతరం లేక భరిస్తారు తప్ప ఒకే పార్టీలో ఉపముఖ్యమంత్రి అంటే వద్దంటారు. రాష్ట్రాల చరిత్ర తరచి చూడండి. ఉపముఖ్యమంత్రులు ఎక్కడున్నారు? తమిళనాడులో స్టాలిన్‌ను చేశారంటే కరుణానిధికి వారసుడు కాబట్టి చేశారు. అదీ స్వంత కొడుకు కాబట్టి. కేంద్రంలో ఉపప్రధాని ని పెట్టినప్పుడల్లా గొడవలే. ఇందిరా గాంధీ కింద మొరార్జీ పనిచేసినపుడు కానీ, మొరార్జీ కింద చరణ్‌సింగ్, జగ్జీవన్ పనిచేసినపుడు కానీ ఎప్పుడూ తగాదాలే.

అందుకే యీ పోస్టుని యివ్వకుండా వుండాలని చూశారు. అంతేగానీ యీ పేరుతో తెలంగాణాప్రాంతం వారిని కించపరచాలని ఆంధ్రప్రాంతంవారు చూడలేదు, ఆంధ్రప్రాంతం వారిని కించపరచాలని తెలంగాణాప్రాంతం వారూ చూడలేదు. మీరైనా నేనైనా ఎవరైనా సరే కాస్త గట్టిగా ఆలోచిస్తే యీ విషయాలు సులభంగా తెలుస్తున్నాయి కదా. మరి యీ విషయాన్ని తెలంగాణావాదులు ఒక్కరైనా చెపుతున్నారా? వారికి తెలియదనుకోవాలా? తెలిసి కూడా దాస్తున్నారనుకోవాలా? వారి ఆరోపణలు ఒక్కొక్కటి యిలా విశ్లేషించుకుంటూ పోతే ఎక్కడకు తేలతామో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 12**

## ఎమ్బీయస్ – విధివిధానాలు...

ఆరేళ్లక్రితం చేయవలసిన పని కేంద్రం యిన్నాళ్లకు చేసింది. అదే – కమిటీ వేయడం! అమ్మయ్య అనుకుని ఆ కమిటీముందు మన వాదనలు ఎంత ప్రతిభావంతంగా పెట్టాలి అన్న దానిపై ఒక్కరు ఆలోచిస్తున్నారా? ఎంతసేపూ విధివిధానాలు విధివిధానాలు, అనే పాటే. సంపాదకీయాల్లో ముదావహరలా ఆ మాట వినివిని విసుగుపుట్టేసింది. కమిటీ అంటూ వేసినవాళ్లు గైడ్‌లైన్సు యివ్వకుండా వుంటారా? ఆ యిచ్చినవి నచ్చకపోతే అప్పుడే గోల చేయవచ్చు అని ఆగారా?

ఈ లోపునే అవి యిలా వుండాలి. మాకు నచ్చాలి, ఫలానా తారీకులోపున యిచ్చి తీరాలి అంటే ఎలా? నీ నియోజకవర్గాల ప్రజలు నీకు యిలాటి నిబంధనలే పెడితే నువ్వు ఎక్కడ వుండేవాడివి? నువ్వు ప్రామిస్ చేసిన రోడ్డు నేను చెప్పినట్టు మా యింటిమీదనుండి వారం రోజుల్లో రాకపోతే కిరోసిన్ పోసుకుని తగలబెట్టుకుంటా అని ఓ ఓటరు బెదిరిస్తే ఏం చేస్తావ్?

నువ్వు గట్టిగా బెదిరించిన కొద్దీ కమిటీ సభ్యులకు చికాకు వేసి యీ దిక్కుమాలిన పేచీకోరు కమిటీలో నేను వుండనండీ అని ఎవరైనా తప్పుకుంటే అప్పుడేమవుతుంది? మీ గోల చూసి ఆయన పారిపోయాడు. ఇంకోణ్ని వెతకడానికి టైము పడుతుంది అని కేంద్రం అంటే అప్పుడు లబోదిబో మనాల్సింది నువ్వే కదా. కమిటీని స్వాగతిస్తున్నాం అని పైకి అంటూనే అది యిలా వుండాలి, అలా వుండాలి అంటూ ఆంక్షలు పెడితే ఆ కాడికి కమిటీ ఎందుకు? నువ్వు చెప్పినదే జీవో అని ప్రభుత్వం అనేస్తే పోలా?

ఇది సృష్టిలో మొదటి కమిటీ కాదు. ఆఖరిది అంతకంటె కాదు. కమిటీ అన్నాక దానికో పద్ధతీ పాడూ వుంటాయి. అవేవో వాళు చూస్తున్నారు. చూడనీయండి. ఈ లోపునే హుంకరింపులు, బెదిరింపులు ఎందుకు?

ఇది మీరూ, నేనూ అనుకునేది. కానీ నాయకులు అలా అనుకోరు. ఏదో ఒకటి పేలుతూ వుండకపోతే ప్రజలు మర్చిపోతారేమో, వేడి చల్లారిపోతుందేమోనని భయం. అందువలన రోజుకో కార్యక్రమం చేపడతారు. కార్యక్రమం అంటే జన్మభూమి లాటి నిర్మాణాత్మకమైన కార్యక్రమం అనుకునేరు. 'పదండి, మన రాష్ట్రం వచ్చేలోపున ఓ నాలుగు కాలువలు తవ్వేసి పెట్టుకుందాం' అని ప్రజల్ని కదిలిస్తారేమో అనుకునేరు. అబ్బే అదేం కాదు.

వాళ్ల దృష్టిలో కార్యక్రమం అంటే నినాదాలు, భోజనాలు. టీవీలో సొల్లు కబుర్లు. చెప్పినదే చెప్పి, మళ్లీ చెప్పి, ఇంకా చెప్పి, ఇంకా అరిచి చెప్పి... (టీవీ స్వంతదై పోయింది కాబట్టి కానీ పార్కులో రేడియోలాటి టీవీ అయితే బెడ్డలేసి బద్దలు కొట్టేవాణ్ని.) ఈ యిస్యూలో ఏదైనా కదలిక వుంటే, ఏదైనా కొత్తగా జరిగితే దానిమీద వ్యాఖ్యానించవచ్చు. ఢిల్లీ వాళ్లు ఆచి, తూచి... తూచి, ఆచి.. అడుగులు వేసి వేయక.. ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి. యిలా కదలికే లేకుండా వుంటే వీళ్లకు మాట్లాడడానికి

ఏముంటుంది? ఏమీ లేనప్పుడు నోరు మూసుకుని కూచుంటే పోతుంది. కానీ వూరుకోరుగా!

ఈ లోపున వుద్యమానికి అంకితం అయిపోయినట్టు పోజు కొట్టాలి. నిన్న నిజామాబాద్ జిల్లా సమీక్షా సమావేశంలో ఓ టిడిపి ఎమ్మెల్యే 'జై తెలంగాణా' అని అరిచాడు. మరికొంతమంది గొంతు కలిపారు. దాంతో రోశయ్యకు ఒళ్లు మండి - దాని గురించి నువ్వూ నేనూ చేసేదేముంది? కేంద్రం చూస్తోందిగా, మన చేతిలో వున్నది మనం చేదాం అన్నారు. అప్పుడు ఆ ఎమ్మెల్యే 'మా నియోజకవర్గ ప్రజలు తమ భావాలు చెప్పమని కోరారు. అందుకని అరిచా' అని సంజాయిషీ యిచ్చాడు.

నియోజకవర్గ ప్రజలు కోరేది - నీరు, విద్యుత్, రోడ్డు, స్కూలు, ఆసుపత్రి వంటి వసతులు. అవి ప్రత్యేక తెలంగాణా వచ్చేదాకా యివ్వవద్దని చెప్పరు. తక్షణం యిస్తే మహదానందం అంటారు. ఒకవేళ మేమందరం ప్రత్యేక వాదానికి కట్టుబడి వున్నామని వాళు చెప్పినా సమయం, సందర్భం లేకుండా చెప్పమనరు. జిల్లా అభివృద్ధి ఎలా అఘోరిస్తోందో సమీక్షిద్దామని పిలిస్తే జై తెలంగాణా అంటే ఎలా?

రేపు ఆయనింటికి పేపరు రాకపోతే పేపరువాణ్ని అడిగాడనుకోండి - వాడు జై తెలంగాణా అంటే! అలాగే పాల పాకెట్లు వేసే కుర్రాడు, పనిచేసే పనిమనిషి, కారు తోలాల్సిన డ్రైవర్, ఆయన వ్యాపారంలో పని చేసే వుద్యోగులు - పని చేయలేదేమ్రా అంటే జై తెలంగాణా అంటే యీయన వూరుకుంటాడా?

ఆయన ప్రజా ప్రతినిథి. ప్రజల కష్టసుఖాల గురించి దొరికిన వేదికపై చెప్పి తీరాలి. అది ఆయన డ్యూటీ. అసెంబ్లీ లాటి అద్భుతమైన వేదికను ఎలాగూ ఉపయోగించుకోవడం లేదు. అక్కడకు వెళ్లేదే వాకౌట్లకు, మైకులు విరగకొట్టడానికి. ఇది మీ జిల్లాపై ఫోకస్ చేస్తూ సంగతులు ఏమిటని కనుక్కోవడానికి మీటింగు పెడితే దాన్నీ దుర్వినియోగం చేస్తే ఎలా?

ఆయన అలిగి వెళ్లిపోయాడు కదాని జాలి పడి వూరుకుంటా రనుకుంటున్నారా? అబ్బే, రేపు కోస్తా, సీమల్లో జిల్లా సమావేశం జరిపినపుడు ఏ శాసనసభ్యుడో 'ఝై సమైక్యాంధ్ర' అనక మానడు. ఆయనకు మాత్రం పబ్లిసిటీ వద్దా? అసలు యీ పబ్లిసిటీయే సమస్యను యింత దూరం తెచ్చింది. ఇదే లేకపోతే యీ విరామ సమయంలో అందరూ ఎవరి పనులు వాళ్లు చూసుకునేవారు.

కమిటీ అంటూ వేశాక వాళ్లు రిపోర్టు యిచ్చి రిపోర్టుపై చర్చ జరిగేసరికి కనీసం ఏడాది పడుతుంది కదా. (90 రోజుల్లో యివ్వకపోతే కెసియార్ వూరుకోరుటండీ అని జస్టిస్ శ్రీకృష్ణగారికి చెపితే ఆయన నవ్వి 'మరి ఆయన మూడునెలల్లో తెలంగాణా వస్తుందని చెప్పి ఆరేళ్లయింది కదా, తెచ్చాడా? అలాగే యిదీనూ' అని చెప్పి నోరు మూయించగలడు.) ఆ కమిటీ వచ్చి తన పనులు తను చేస్తూండగానే యీ ప్రజాప్రతినిథులు తమతమ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెడితే ఎటుపోయి ఎటువచ్చినా, ఏ రాష్ట్రంలో వున్నా ప్రజలు సంతోషిస్తారు. **- ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 13** **ఎమ్బీయస్ - తోచీ తోచనమ్మ**

తోచీతోచనమ్మ తోడికోడలు పుట్టింటికి కెళ్లిందని సామెత. ప్రస్తుతం మన రాష్ట్రనాయకుల పని అలాగే వుంది. మామూలుగా పేపర్లలో జిల్లా ఎడిషన్ న్యూస్‌కు కూడా అర్హత లేనివాళ్లు ఉద్యమాల ధర్మమాని కాగితం పులులయిపోయారు. కాగితాలేం ఏం ఖర్మ, టీవీపులులు కూడా..! ఇక్కడివాళ్లయితే అక్కడివాళ్లను తిట్టడం, అక్కడివాళ్లయితే యిక్కడివాళ్లను తిట్టడం. అక్కడి కెళ్లి యిక్కడి మాట మాట్లాడే ధైర్యం ఒక్కడికీ లేదు. పాయింట్‌వైజ్ మాట్లాడి వాదన నెగ్గడం ముందే రాదు. అసలు పాయింటు అంటూ తెలిస్తేగా? పోనీ ఎలాగూ అవసరం, అవకాశం వచ్చాయి కాబట్టి కూర్చుని చరిత్ర చదువుదామనో, ఆ స్టాటిస్టిక్సే ఏవో తెప్పించి చూద్దామనో ఒఖ్ఖడూ అనుకోడు.

వీళ్లకు వచ్చిందల్లా నిరసన ప్రదర్శనలు చేయడం. అరెస్టు కావడం. అదొక అరెస్టా? టీవీవాళ్లు వచ్చేదాకా పోలీసులను దగ్గరకు రావద్దని బతిమాలుకుంటారు. వచ్చాక వ్యానులోకి విసిరేయవద్దని బతిమాలతారు. కెమెరాకు ఎదురుగా తమని మోసే పోలీసుల్లో కాస్త దుక్కగా వున్నవాళ్లని ఎంచి చూసుకుంటారు. (నేనే డియస్పీ నైతే కావాలని నీరసప్రాణులను మోయమని చెప్పి మధ్యలో కింద పడేయమంటాను. మంచమెక్కి కనీసం వారం రోజులదాకా మనకు న్యూసెన్సు తప్పుతుంది)

అరెస్టయ్యారని స్క్రోలింగ్ ప్రారంభమైన అరగంటకు 'సిద్ధము సుమతీ' అన్నట్టు టీవీ స్టూడియోలో తయారు - పోలీసులు తమ పట్ల చూపిన దురుసుతనాన్ని ఖండిస్తూ. (పోలీసుల అసలు దురుసుతనం రుచిచూస్తే స్టూడియోకి వచ్చే వోపిక వుండేదా?) అన్నిటికన్నా మించిన జోక్ ఏమిటంటే - దీని కంతటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేయడం! ఇంతకింత మూల్యం చెల్లిస్తుందని బెదిరించడం!

ఇవన్నీ చేసి చేసి విసుగెత్తాక యిక నిరసనల్లో వెరైటీ గురించి చూపిస్తారు. అరగుండు లేదా ఫుల్ గుండు కొట్టించుకోవడం, బూట్లు పాలిష్ చేయడం, మారువేషాలు వేయడం, పన్నులు ఎగ్గొట్టడం, రోడ్లు తుడవడం, రోడ్డు మీద పాకడం, దేకడం, వెనక్కి నడవడం, గాంధీ లేదా అంబేద్కర్, (యీ మధ్య పొట్టి శ్రీరాములుకీ యీ భాగ్యం పట్టింది) విగ్రహాన్ని పాలతో, నీళ్లతో, నీళ్లపాలతో కడగడం, మొక్కడం, అవతలివాళ్లకు బుద్ధి నిమ్మని ప్రార్థనలు చేయడం, (అదే సమయంలో వీళ్లకు బుద్ధి గరపమని అవతలివాళ్లు ప్రార్థనలు చేస్తూ వుంటారు)

ఇంతే కాదు.. అర్ధనగ్నంగా అంటే చొక్కాలిప్పి నడవడం (ఇది మగవాళ్లకే ప్రత్యేకం – యీ వివక్షతను ఖండించాలి!)... దిష్టి బొమ్మల దహనాలు, శవయాత్రలు, పిండప్రదానాలు (ఇది ముదిరితే తద్దినం బ్రాహ్మలు దొరక్కుండా పోతారు) .. ప్రత్యర్థి వేషం కట్టి తన అనుచరులచేతనే చీపుళ్లతో కొట్టించుకోవడం.. బంగి అనంతయ్య నడిగితే బోల్డు ఐడియాలు చెప్తాడు. (మేయర్‌గా కొంతకాలం పని చేసిన వ్యక్తి యిన్ని వెకిలివేషాలు వేయగలడని ఎవరూహించగలరు? ఆయనకు యివి తప్ప వేరే ఏ ఆలోచనలూ రావని నాకు ఓ గట్టి నమ్మకం).

ఇవే కాకుండా కేసులు వేసే బాపతు కొందరు వుంటారు. అసలు ఏ వుద్యమమైనా చూడండి. పని ఎగ్గొట్టి రోడ్డెక్కడానికి లాయర్లు ముందువరుసలో వుంటారు. డాక్టర్లు డ్యూటీ ఎగ్గొట్టి రోడ్డెక్కితే రోజుకి పదిప్రాణాలు పోతాయి. లాయర్ల విషయంలో ఆ భయం లేదు. కోర్టులో మరో వాయిదా అడగవచ్చు. వేలాది కేసులు, వందలాది వాయిదాలు. ఒకసారి కేసులో యిరుక్కున్న పార్టీ ఎక్కడికి పోతాడన్న ధైర్యం లాయర్లది. లాయరు ముందు నోరెత్తితే కేసు చెడగొట్టేస్తాడన్న భయంతో వణుకుతూంటాడు పార్టీ. ఇక కేసు వాయిదా అడగ్గానే యివ్వడానికి జడ్జిగారూ రెడీయే. వాళ్లకు రోజుకి యిన్ని పూర్తి చేయాలనీ, ఫలానా కేసు ఫలానా యిన్ని రోజుల్లో ఫైసల్ చేయాలనీ టార్గెట్లు వుండవు.

ప్రజా ప్రతినిధులకు అసెంబ్లీ, పార్లమెంటులాగ లాయర్లకు కోర్టు ఓ పెట్టని కోట. అక్కడ మన ప్రధానిని చంపినవారి పుట్టినరోజు పార్టీలైనా చేయవచ్చు. కేసు పెట్టడానికి వచ్చినవారిపై, సాక్ష్యం చెప్పడానికి వచ్చినవారిపై దాడి చేయవచ్చు. కులం పేరుతో వర్గాలుగా విడిపోయి వారిలో వారు ముష్టియుద్ధాలు చేయవచ్చు. కోర్టు అద్దాలు పగలకొట్టవచ్చు. జడ్జిలను భయభ్రాంతులను చేయవచ్చు. ఏం చేసినా పోలీసులు మాత్రం కోర్టు ఆవరణలోకి రాకూడదు. వస్తే యిజ్జత్ కా సవాల్. పోలీసులను కోర్టు కాంపౌండ్‌లోకి చీఫ్ జస్టిస్‌లు సాధారణంగా అనుమతించనే అనుమతించరు. ఒకవేళ అనుమతిస్తే దానిపై కేసు వేయడానికి వీళ్లు రెడీ.

కాబట్టి పనికి ఎగనామం పెడితే లాయర్లను మందలించేవారు ఎవరూ వుండరు. పైగా నల్లకోటు వేసుకుని ఊరేగింపుకి బయలుదేరితే టీవీల్లోనే కాదు, పేపర్లో బ్లాక్ అండ్ వైట్ ఫోటోల్లో కూడా రంజుగా పడతారు. నినాదాలు యివ్వడానికి వాగ్ధాటి ఎలాగూ వుంటుంది – అది వృత్తిపరమైన లక్షణం కాబట్టి. వీళ్లు తెలంగాణా యివ్వాలనీ, యివ్వకూడదనీ, కమిటీ వేయాలనీ, వేయకూడదనీ, వేసినా ఫలానావాడు వుండకూడదనీ, ఉన్నా ఫలానా వూళ్లో మీటింగు పెట్టకూడదనీ – ఏ విషయం మీదనైనా ఓ 'పిల్' పడేసి కూచుంటారు. దరిమిలా న్యాయాధిపతి అక్షింతలు వేయవచ్చు. అది వేరే విషయం. ఈ లోపున రావాల్సిన పబ్లిసిటీ వచ్చేస్తుంది కదా. ఖుష్! ఇలాటివాళ్లు ఉద్యమంలో పాల్గొన్నారని చంకలు గుద్దుకుంటే దానికంటె పిచ్చిపని మరోటి లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న లాయర్ల లాటి వాళ్లు కారు యీనాటి లాయర్లు.

2

ఇక నిరాహారదీక్షల సంగతి చెప్పనే అక్కరలేదు. ఆ కాన్సెప్ట్ మొదలు పెట్టిన గాంధీ గారు యీ కాలపు పూటల వారీ రిలే నిరాహారదీక్షల గురించి వినివుంటే యివి నిషేధించాలని మరో నిరాహారదీక్ష చేసి వుండేవారు. సెలైన్ నిరాహారదీక్షల గురించి చెప్పాలంటే నాకు కడుపు చెక్కలయ్యే నవ్వు వస్తుంది. నాకే ఏదైనా ఆరోగ్యం చెడి ఆసుపత్రిలో పడి సెలైన్ తీసుకోవలసి వస్తే డాక్టర్లకు చెప్పేస్తాను – గాలికి పోయే పేలపిండి కృష్ణార్పణం అన్నట్టు నా సెలైన్ సేవనం వూరికే ఎందుకు పోవాలి? నా కాబిన్ అద్దం మీద ఓ పోస్టర్ పెట్టండి –

'విశ్వశాంతి కోసం..', లేదా 'బళ్లారిని ఆంధ్రప్రదేశ్‌లో కలపాలని కోరుతూ..'

'ఒడిస్సాలోని గంజాం, కోరాపుట్ జిల్లాలను తెలుగు ప్రాంతాలని డిక్లేర్ చేయాలని కోరుతూ..',

'తమిళనాడులో మూసేసిన వేలాది తెలుగు పాఠశాలలను మళ్లీ తెరవాలని కోరుతూ..', ఇలా ఏది పెట్టినా ఫర్వాలేదు. అని చెప్తాను.

పెయిడ్ న్యూస్ వేయడం తెలుగు పత్రికలకు అలవాటే అని నిర్ధారణ కూడా అయిపోయింది కాబట్టి ఓ రిపోర్టర్ ద్వారా పత్రికతో బేరం పెట్టుకుంటాను.

'ప్రసాద్ పరిస్థితి విషమం, తిరిగివచ్చే అవకాశం మృగ్యం'

'ఈ దినం గడిచేనా..? ఈ దీపం మలిగేనా..?'

'కొడిగడుతున్న ఆరతి... పాలకులకు పట్టని ప్రసాద్ ఆరోగ్యం'

'ఈ బుద్బుదం రాష్ట్రానికే అంకితమంటూ త్యాగధనుల జాబితాలో చేరబోతున్న ప్రసాద్'

'ఈ ప్రాణం నిలిచేనా? ప్రసాద్ ఆత్మబలిదానం వ్యర్థమేనా..'

యిలా హెడింగ్‌లు పెట్టించి న్యూస్‌లో ప్రసాద్ ప్రసాద్ అని పదిసార్లు రాయించి పాఠకుల మెదడులో నా పేరు పొజిషన్ చేయించేసుకుంటాను. (రేపు నేనేదైనా రియల్ ఎస్టేట్ వెంచర్ మొదలెట్టి 'త్యాగమూర్తి ప్రసాద్ ప్రారంభిస్తున్న 'కర్పూరహారతి' లో నేడే మెంబర్లుగా చేరండి' అని యాడ్ యిస్తే పాఠకుడికి మెదడులో ఛట్టున కొవ్వొత్తి వెలగాలన్నమాట!)

ఇక టీవీ ఛానెల్స్‌కూడా బొచ్చెడున్నాయి. ఉంగరాలు, తావీజుల యాడ్స్ కోసం అరగంట కేటాయించగలిగే ఛానెల్స్ ఒకదాన్నీ, 'ఈ అరగంట దాటేదాకా ఏ మాటా చెప్పలేం..' అని విషణ్ణవదనంతో చెప్పగల తెల్లకోటు హాస్పటల్ ఉద్యోగి ఒకర్నీ సెట్ చేసుకున్నానంటే చాలు.

అరగంట గడుస్తుందా లేదా? అని ఓ ఎస్సెమ్మెస్ పోల్ బార్ గ్రాఫ్ టీవీ స్క్రీన్‌కి కింద కుడిపక్క, ఎడం పక్క ఇసుక గడియారం యానిమేషన్‌తో ఓ గ్రాఫిక్, ఇసుక రేణువు కిందకు జారినప్పుడల్లా భయంకరమైన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో డిజిటల్ గడియారం (స్క్రీన్ పైన మధ్యలో ) టిక్ టిక్.. సరిపోకపోతే కాస్త సౌండు పెంచి.. ఠిక్ ఠిక్.. సరిగ్గా సెంటర్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టులాడుతున్నట్టున్న నేను, గోడమీద నేను పూలరంగడిలా టీ షర్టులో వెలిగిపోతున్న ఫోటో – ఎలాటి వాడు ఎలా అయిపోయాడో చూడండి అన్నట్టు దానిమీదకూ దీనిమీదకూ కెమెరా మార్చి మార్చి జూమ్.. – వాహ్! అద్దిరిపోతుంది కదూ!

ఈ పగటికల సరే, యింతకీ నేను ఎక్కడున్నాను? తోచీ తోచనమ్మల గురించి చెపుతున్నాను. వీళ్లు యీ నిరాహారదీక్షలతో బాటు చేసేదేమిటంటే రాస్తా రోకోలు. రోడ్డు బ్లాక్ చేసి వూరుకుంటారా? చెడుగుడు ఆడతారు, క్రికెట్ ఆడతారు, బతకమ్మ ఆడతారు, గొబ్బెమ్మలు పెడతారు. వంటా, వార్పూ, సామూహిక భోజనాలు అన్నీ చేస్తారు. మాంచి పండగ వాతావరణం క్రియేట్ చేస్తారు.

అన్నీ చేసి మేమంతా దుఖ్ఖపడిపోతున్నాం, మా డుపులు తరుక్కుపోతున్నాయి అంటూ స్టేటుమెంట్లు యిస్తారు. మా బతుకులు బుగ్గయ్యాయి, మా ఆత్మలు ఘోషిస్తున్నాయి, మా పిల్లలు కిరోసిన్ పోసుకుని ఛస్తున్నారు అంటారు. అని మళ్లీ యీ విందు భోజనాలేమిటి?

నేను ఏ ఒక్క ప్రాంతం వారినీ అనటం లేదు. అన్ని ప్రాంతాల్లోనూ యివే చేష్టలు. తెలంగాణాలో చేసినదాన్ని ఆంధ్రప్రాంతంలో కాపీ కొడుతున్నారు, ఒక్కోప్పుడు రివర్స్‌లో చేస్తున్నారు. కాస్త వివరంగా చెప్పాలంటే – ఆంధ్రప్రాంతం నుండి వచ్చిన వాహనాలను ఓ సారి హైవే మీద సూర్యాపేట దగ్గరో ఎక్కడో అడ్డుకున్నారు. దానికి ప్రతిగా నెల్లూరు వద్ద తెలంగాణా రిజిస్ట్రేషన్ వున్న లారీలను ప్రత్యేకంగా ఆపి ఆ డ్రైవర్స్‌కు విందు భోజనాలు పెట్టి, సమైక్యాంధ్ర ఆవశ్యకత గురించి కరపత్రాలు యిచ్చి పంపారు.

అలాగే యిక్కడ అదుర్స్ ఆపినపుడు, అక్కడ నితిన్ (హీరోని బట్టి సినిమాకు ముద్ర వేయడం జాడ్యం ఎప్పుడు ఆగుతుందో) సినిమాను ఆపకపోగా మొదటిరోజు ప్రేక్షకులకు స్వీట్లు పంచారు. పేపర్ల కెక్కాలన్న ఆలోచన తప్ప వీటిలో మరేదీ నాకు కనబడటం లేదు.

ఇవాళ తెలంగాణాలో జెఎసి ఆధ్వర్యంలో కలక్టరేట్ ముట్టడి అని చదివితే మర్నాడు సమైక్యాంధ్ర జెఎసి ఆధ్వర్యంలో కలక్టరేట్ ముట్టడి న్యూస్ వచ్చి తీరుతుంది. అసలే అలాటి ఆఫీసుల్లో పని చేయరు. ఎప్పుడో పని చేద్దామని బుద్ధి పుడితే యిలా ముట్టడించి చెడగొట్టడమేమిటి? వీటి వలన రాష్ట్రం కలిసి వుండడం గానీ, విడిపోవడం గానీ జరుగుతుందా? **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 15, 2010**

## ఎమ్బీయస్ – మేం రెడీ? మీరు రెడీయా..? – 1

యాడ్స్‌లో చూస్తూంటాం చూడండి. ఓ హీరో కనబడి అడుగుతాడు – 'నేను రెడీ, రెడీయా? అని. కేంద్రం యిప్పుడు అలాటి ఛాలెంజే విసిరింది. 'ఐదారేళ్లగా వూహూ సతాయించేస్తున్నారు. మాటిమాటికీ ఢిల్లీ వచ్చి కూచుంటున్నారు. మీ గొడవేమిటో తేల్చేస్తాం, పట్టండి. ఇదిగో ఓ కమిటీ వేశాం. మీ గోడంతా చెప్పుకోండి. తర్వాత తర్వాత మాట మారిస్తే బాగోదు. చెప్పాల్సినవన్నీ చెప్పేసుకోండి. వాడు ఫలానా రాష్ట్రంవాడు. అందుకనే అలా అన్నాడు, యిలా నవ్వాడు అంటే కుదరదు, అనేక రాష్ట్రాలనుంచీ నిష్ణాతుల్ని వేశాం. మీ పాయింట్లు వాళ్ల ముందు పెట్టండి' అని.

ఇప్పుడు మనం యావన్మందీ – అంటే సమైక్యవాదులు, ప్రత్యేక (తెలంగాణా, ఆంధ్ర, రాయలసీమ, ఉత్తరాంధ్ర, గ్రేటర్ రాయలసీమ.. కొత్తగా ఏమైనా ఐడియాలు వస్తే వాళ్లూ..) – ఆ కమిటీముందు మన వాదనలు వినిపించాలి. ఏదీ వేదికల మీదా, విద్యార్థి సభల్లోనూ, టీవీ స్టూడియోల్లోనూ మాట్లాడినట్టుగా వినిపిస్తే వాళ్లు కమిటీ సభ్యులు నవ్వుతారు.. కాదు కాదు నవ్విపోతారు. ఈ తెలుగువాళ్ల తెలివి యిలా అఘోరించిందిరా అని.

ఇప్పటికే చిదంబరంగారు ముక్క చివాట్లు పెట్టి దేశప్రజల ముందు మన మానం తీశాడు. 'ఈ తెలుగువాళ్లు ఏకగ్రీవ తీర్మానం అంటూ రాసి సంతకాలు చేసి పంపుతారు. దానిపై ఆధారపడి ఏదైనా నిర్ణయం చేస్తే మళ్లీ ఎదుటివాళ్లను తిడతారు. ఇలాక్కాదు, వచ్చి స్పష్టంగా యిప్పటికైనా మీ మనసులో మాట చెప్పండి అంటే పార్టీకి యిద్దరేసి వచ్చి చెరో వాదనా వినిపించిపోతారు' అని మన పరువు బజార్న పడేశారు. ఇప్పటికి కూడా మననాయకుల్లో సవ్యంగా మాట్లాడేవాళ్లు కనబడటం లేదు.

ఇప్పుడు కమిటీ ముందు కెళ్లి తెలంగాణావాదులు ఏమంటారు? – మరేమోనండీ తెలుగుతల్లి దయ్యమండి, (మా కృష్ణదేవరాయలు దయ్యాల భాషలో కావ్యం రాసాడా? అని (శ్రీకృష్ణగారు అదిరిపోవచ్చు) మా వూళ్లో ఆంధ్రా భోజనం అని బోర్డు పెట్టారండి (మీ వాళ్లెవరూ వెళ్లకపోతే ఆ హెూటల్‌వాడు పేరు మార్చుకుంటాడుగా, మీ వరస చూస్తే మా ఉడిపి హెూటల్స్‌కు, బెంగుళూరు అయ్యంగార్ బేకరీస్‌కు కూడా ఎసరు పెట్టేట్టున్నారే అనవచ్చు శ్రీకృష్ణగారు) తెలుగు సినిమాల్లో విలన్‌కి తెలంగాణా యాస పెట్టారండి (ఆ సినిమా తెలంగాణాలో ఆడిందంటేనే ఎవరూ పట్టించుకోలేదని అర్థం కదయ్యా – శ్రీ.), తెలంగాణా సెంటిమెంటు వుందండి (అందుకేనా తెరాసకు 10 సీట్లు వచ్చాయి – శ్రీ.) – యిలాటి వాదనలు వినిపిస్తే వాళ్ల పాయింటుకి రండి పాయింటుకి రండి అంటారు.

అలాగే సమైక్యవాదులు వెళ్లి – కెసియార్ వదరుబోతండి (అందుకేనా వంతుల వారీగా వాటేసుకున్నారు? అయినా కెసియార్ ఒక్కడే తెలంగాణా కాదు. కెసియార్ మాదీ దిక్కుమాలిన కమిటీ అన్నాడు. అయినా పని చేస్తున్నామా లేదా? – శ్రీ.) హైదరాబాదులో పెట్టుబడులు పెట్టి మేమే అభివృద్ధి చేశామండి (ఇప్పుడు వేరే చోట పెట్టి దాన్ని బాగుచేయండి, అక్కడైతే చవగ్గా దొరుకుతాయి కదా – శ్రీ.) మేం తెలంగాణావారికి నాగరికత నేర్పేమండి, వాళ్లు యిప్పుడు పొమ్మంటున్నారండి (మీరు నాగరీకం నేర్పే ఘనులా? అయితే ఆఫ్రికా వెళ్లి నరమాంస భక్షకులకు నేర్పరాదూ? – శ్రీ) తెలుగుజాతి అంతా ఒకటి, సమిష్టి కుటుంబం అన్న సెంటిమెంటుతో కొట్టుకుపోతున్నామండి (మరి కులాల కుమ్ములాటలో కొట్టుకు ఛస్తారేం? ప్రతీ ఉద్యోగిని, ప్రతీ పదవిని, ప్రతీ స్టేటుమెంటునూ, ప్రతీ కళాకారుణ్నీ కులం కళ్లతో చూస్తారే! అప్పుడేమైంది యీ జాతి సెంటిమెంటు? – శ్రీ) అంటే వాళ్లకీ పాయింటు కావాలండీ పాయింటు అంటారు.

అలాగే జోగయ్య వెళ్లి ఇప్పుడు ప్రత్యేక ఆంధ్ర ప్రకటిస్తే దుమ్ము దులిపేస్తాం అన్నారనుకోండి, చిరంజీవిని రాజకీయాల్లోకి లాక్కు వచ్చేదాకా యిలాటి కబుర్లే చెప్పావ్. చివరికి నీ స్వంత జిల్లాలోనే గెలిపించుకోలేక పోయావ్ అని వెక్కిరిస్తారు. అలాగే టిజి వెంకటేష్ వెళ్లి 'అలనాడు కర్నూలు రాజధానిగా వదులుకున్నందుకు యీనాడు రాయలసీమ అభివృద్ధికి లక్ష. పోనీ రెండు లక్షలకోట్లు యివ్వాలి' అంటే ఏ ప్రాతిపదికన లెక్కలేశావ్? ప్రాస బాగుందని చెప్పేశావా? అంటారు.

పార్టీల పరంగా వెళితే కాంగ్రెస్‌వాళ్లు 'బాబును నోరువిప్పమనండి' అని, టిడిపివాళ్లు 'సోనియాను పెదవి కదపమనండి' అని ఒకళ్లమీద మరొకళ్లు చెప్పుకోవడం. దెప్పుకోవడం తప్ప జరిగేది ఏమీ లేదు. మనమైతే అమాయకులం. ఎన్ని ఏళ్లపాటైనా యీ నాటకాన్ని గుడ్లప్పగించి చూస్తూనే వుంటాం. కమిటీ సభ్యులకు వేరే పనులున్నాయి. పైగా టైమ్ లిమిట్ వుంది. 'అవతలి వాడి సంగతి సరే, నీ మనసులో మాట చెప్పు చూదాం' అని నిలదీస్తారు.

కమిటీవారు రాజకీయ నాయకుల్నే కాదు, అన్ని వర్గాల వారినీ పిలవబోతున్నారు. కార్మిక, కర్షక, సాంఘిక, వ్యాపార, విద్యార్థి వర్గాల వారందరినీ పిలుస్తున్నారు. నేను అన్ని వాదాల వారినీ ముకుళిత హస్తాలతో ప్రార్థిస్తున్నాను. కమిటీ ముందు పసలేని వాదనలు వినిపించి తెలుగువాళ్ల పరువు తీయకండి. మాకు గతి లేక మేం యిన్నాళ్లూ మీ ప్రేలాపనలు విన్నాం, నవ్వుకున్నాం. కానీ వాళ్ల ముందు గంభీరంగా మాట్లాడండి.

కెసియార్ యీ కసరత్తు చేశారో లేదో తెలియదు. ఆయన ప్రస్తుతం రాజీనామా చేశారు. చేయించారు. కమిటీని బహిష్కరిస్తారేమో తెలియదు. ఆయన బహిష్కరించినా, ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు వేరెవరినైనా పంపవచ్చు. జయశంకర్, కోదండరామ్ , విద్యాసాగర్ ఆయన పార్టీ సభ్యులు కాదు కదా. వాళ్లు వెళ్లి వినిపించవచ్చు. వాళ్లయినా చేయవలసినది యివే.

2

కమిటీ ఎదుట మాట్లాడడానికి ముందు – 01) మొదట వాస్తవాలు సేకరించండి. గణాంకాలు కావాలి, గాలి కబుర్లు కాదు.

02) వీటిని మీ వాదనకు తగ్గట్టుగా వాటిని మలచుకోండి. గణాంకాలను ప్రెజెంటు చేయడంలోనే వుంది అసలైన మెళకువ. దానికి గాను ఆధునిక పద్ధతులైన గ్రాఫ్‌లు, పవర్ పాయింటు ప్రెజెంటేషన్సుతో కమిటీ సభ్యులను యింప్రెస్ చేయండి. బిల్ గేట్స్‌ను రాష్ట్రానికి పిలవాలంటే చంద్రబాబు ల్యాప్‌టాప్ పట్టుకుని వెళ్లారని గుర్తు చేసుకోండి. కమిటీ సభ్యులు కూడా ఎకడమీషియన్సే!

03) మీరు లక్షల్లో మెజార్టీ తెచ్చుకున్న ఎంపీయే కావచ్చు, జనాలను ఉద్రూత లూగించే వాగ్ధాటి కలిగి వుండవచ్చు. కానీ మీకు ఇంగ్లీషు సరిగ్గా రాకపోవచ్చు, క్లుప్తంగా ఆకర్షణీయంగా చెప్పలేకపోవచ్చు. అందువలన మీ తరఫున మంచి వక్తను, కమిటీ సభ్యులకు నచ్చేవిధంగా వాదించేవారినీ తగిన పారితోషికంతో నియమించుకోండి.

ఒక్కటే గుర్తు పెట్టుకోండి – ఇది మూకబలంతో, రూకబలంతో గెలిచే యుద్ధభూమి కాదు. బుద్ధిబలంతో గెలవాలి. పాకిస్తాన్ యివ్వడానికి ఇంగ్లీషువారు ఒడంబడ్డారంటే కారణం – జిన్నా వంటి అద్భుతమైన వాదనాపటిమ గల బారిస్టర్ పాకిస్తాన్ ఏర్పాటును సమర్థించడం! బయట కోట్లాది ప్రజలు విడిపోవడానికి యిచ్ఛగించకపోవచ్చు గాక. కానీ జిన్నా తన వాదాన్ని సమర్థవంతంగా వినిపించి తను అనుకున్నది సాధించాడు.

వ్యక్తిగతంగా చూసినా మనం కేసు నెగ్గాలంటే ఏ సొరాబ్జీనో, జెత్మలానీనో పెట్టుకుంటాం, వాళ్లకు యిన్‌పుట్స్ అన్నీ యిస్తాం. కేసుపోతే మనం కోల్పోయేది మన, మన బిడ్డల భవిష్యత్తు. అందువలన మనం దీని విషయమై నిర్లక్ష్యంగా వుండడానికి వీల్లేదు.

అసలు నన్నడిగితే కమిటీ ఎదుట హాజరయ్యేవారు ఓ ఎక్సర్‌సైజ్ చేయాలి. తమలో ఒకణ్నే డెవిల్స్ ఎడ్వోకేట్‌గా పెట్టుకుని వాదించి చూసుకోవాలి. అంటే అతగాడు మన ప్రత్యర్థుల వాదనను వినిపిస్తాడు. వారి తరఫున వాదిస్తాడు. మీరు అతని వాదనను సమర్థవంతంగా ఖండించగలగాలి. ఇప్పుడు అది జరగటం లేదు. ఆంధ్రప్రాంతంలో కెసియార్‌ను తిట్టి, తెలంగాణా ప్రాంతంలో రాజగోపాల్‌ని తిట్టి చప్పట్లు కొట్టించుకుంటున్నారు. ప్రతికూలమైన చోట నెగ్గుకు వచ్చినవాడే మొనగాడు. అది అభ్యాసంతోనే వస్తుంది.

కమిటీవారు అడగబోయేది ఏమిటి – 1956 తర్వాత మీకు జరిగిన అన్యాయాలేమిటి? 1956లో మీ పరిస్థితి ఏమిటి? ఇప్పటి

పరిస్థితి ఏమిటి? అభివృద్ధి జరిగిందా లేదా? జరగకపోతే కారణాలేమిటి? పరిస్థితి చక్కదిద్దడానికి విభజన ఒక్కటే మార్గమా? విభజిస్తే వచ్చే మార్పులేమిటి? దాని పర్యవసానాలు ఏమిటి? దానికి మీ పరిష్కారాలేమిటి?.. యిలాగే వుంటాయి ప్రశ్నలు.

దీనికోసం 1956 నుండి జిల్లాల వారీగా ప్రతీ రంగంలోనూ గణాంకాలు కావాలి. ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల ఛ్టేయాలి.. ఛ్టేయడం లేదు. అవి బయట పెట్టిందాకా వుండి 1956నుండి యితర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణాలో అభివృద్ధి బాగానే జరిగింది అని తేలితే 'మరైతే టిడిపి అధికారంలో వుండగా మీ ఎమ్మెల్యేలు ప్రత్యేక తెలంగాణా కోరితే ఎందుకు సమర్థించారు?' అని సమైక్యవాదులు అడుగుతారు. జరగలేదు అని తేలిందనుకోండి 'చూశారా, మాకు అన్యాయం జరిగినా ఆంధ్రప్రాంతంవారి ఒత్తిడికి లొంగి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు' అని విభజనవాదులంటారు.

శ్వేతపత్రం విడుదల చేయమని టిడిపివారు ప్రభుత్వాన్ని అడిగి వూరుకున్నారు కానీ పార్టీ పరంగా వారు ఏ సమాచారాన్నీ విడుదల చేయడం లేదు. మంత్రుల అవినీతి గురించి దస్తాల కొద్దీ డాక్యుమెంట్లు చూపిస్తారు కానీ దీని గురించి ఏమీ చెయ్యరు. ఎర్రన్నాయుడు తన కమిటీ యిలాటి ఎక్సర్‌సైజ్ ఏమీ చేయలేదని, తెరాసతో పొత్తుకోసం తెలంగాణా ఏర్పాటుకోసం సై అన్నామని బహిరంగంగా ఒప్పేసుకున్నారు. టిడిపి వివరాలు సేకరించి ప్రకటిస్తే వారికీ  కాంగ్రెస్‌వారికి వచ్చే సమస్య వచ్చిపడుతుంది.

ఈ వివరాలన్నీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తన వద్ద వున్నాయి అంటున్నారు. కమిటీకి యిస్తామనంటున్నారు. ఎంత చెడ్డా ఆయనా రాజకీయ నాయకుడే. 'ప్రత్యేత తెలంగాణాకు ఫర్‌గా వుండబోతున్నాను. నువ్వు అవన్నీ యిచ్చి యిస్యూను కన్‌ఫ్యూజ్ చెయ్యమోక' అని నాయకురాలు సోనియా గాంధీ అంటే ఆయన గప్‌చుప్.

ఇది పని గాదని అహ్లూవాలియాగారు గత 8 ఏళ్లగా జిల్లాలవారీగా ఆదాయాలు, ఖర్చులు తీయమన్నాడట. 610 జీవో అమలు గురించి లెక్కలు తీద్దామంటేనే మన ప్రభుత్వ సిబ్బంది ఏళ్లూ, పూళ్లూ పట్టించారు, యిస్తే మన పీకలకు చుట్టుకుంటుందేమోనని. ఫిబ్రవరి 17 లోగా ఎనిమిదేళ్ల లెక్కలంటే మాటలా? అని నీళ్లు నములుతున్నారు. వాళ్లని అదలించాల్సిన రోశయ్యగార్ని చూడబోతే – ఆయనసలే చికాకుగా వున్నాడు. ఆయన కాబినెట్ మొదటి నుండి సరిగ్గా లేదు. సహచర పార్టీ శాసనసభ్యుడ్తే ఖబడ్దార్ అంటున్నాడు. పక్కకుర్చీలో కూచున్న మంత్రి రేపు నీతో వుంటానో లేదో అంటున్నాడు. పొద్దున్న పదిమంది, సాయంత్రం పదిమంది జగన్ వద్దకు పోయి కూచుంటున్నారు. రోశయ్య వేస్ట్ కాండిడేట్ అనే అభిప్రాయం కలిగించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

తుమ్మకపోయినా వూడే ముక్కులాటి సిఎం పదవిని పట్టుకుని నా బొందో అని తన్నుకులాడుతున్నాడాయన. ఖజానాలో డబ్బు లేదు. నాయకుల్లో, ఉద్యోగుల్లో వుత్సాహం లేదు. పని చేయాలనే ధ్యాస లేదు. తెలంగాణా వస్తుందా రాదా అంటూ పొద్దూకులా అప్టే డిస్కషన్స్. (వచ్చాక ఏం చేయాలి? అన్నదాని బ్లూ ప్రింట్‌పై కసరత్తు లేదు) ఇలాటి మూకతో వేగడమంటే సుగ్రీవుడికి కూడా అలవికాని పని. సుగ్రీవుడంటే ఆయన ఆజ్ఞ దాటేవాళ్లు లేరు. రోశయ్యగారి విషయంలో ఆ ఆజ్ఞకూడా హస్తినాపురం నుండి రావాలి. ఇలాటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధిస్తే బాగుండునని ఆయన రోజూ దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్నాడు. నాకు ఒక కన్నే పోతుంది గానీ వీళ్లందరికీ రెండు కళ్లు పోతాయి కదాన్న ఆలోచన ఆయనది. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 17, 2010** **కావలెను – 'సత్యపీఠం'**

ఇలాటి పరిస్థితుల్లో వాస్తవాలు పోగు చేసే పని రాష్ట్రాభివృద్ధిపై శ్రద్ధ వున్నవారందరూ చేపట్టాలి. దీనికి నా వద్దనున్న యాక్షన్ ప్లాన్ ఏమిటంటే ప్రతీ జిల్లాలో 'సత్యపీఠం' నెలకొల్పాలి. ఈ మోడల్ కరపత్రం చూస్తే అన్నీ అర్థమౌతాయి.

కావలెను – 'సత్యపీఠం'

'మాయాబజార్'లో శకునిమాయను విచ్ఛిన్నం చేసి సత్యాన్ని వెలార్చినది – సత్యపీఠమే!

అలాటి సత్యపీఠం యిప్పుడూ కావాలి! శకునిని మించిన నాయకులు – ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక ఆంధ్ర, ప్రత్యేక ఉత్తరాంధ్ర, ప్రత్యేక రాయలసీమ, సమైక్యాంధ్ర – అంటూ అనేక అసత్యాలను, అర్ధసత్యాలను ప్రచారంలోకి తెస్తున్నారు. ఒక ప్రాంతంవారే అన్ని అనర్థాలకు కారణమని పదేపదే చెప్తున్నారు. దశాబ్దకాలంగా పత్రికలలో, టీవీమాధ్యమాలలో ఆ ప్రచారం అప్రతిహతంగా సాగిపోతోంది. ఆ ఆరోపణలు ఒకవేళ అసత్యమైనవైతే వాటికి నైతికబలం సమకూరి జనాభాలో సగం మంది నీటిదొంగలుగా, దోపిడిదారులుగా చరిత్రలో మిగిలిపోవడం అత్యంత విషాదకరం! తామేదో తప్పు చేసి వుంటామనే అపరాధభావన ఆ ప్రాంతం వారిలో వీరు ఒకపక్క నింపుతుంటే, విడిపోతే బాగుంటామని నచ్చచెపుతున్నారు మరికొందరు. ఒకవేళ ఆ ఆరోపణల్లో నిజాలు వుంటే వాటిని సవరించవలసిన బాధ్యత కూడా రాష్ట్రప్రజలందరిపైనా వుంది.

ప్రభుత్వ కర్తవ్యం – నిజానిజాలు పూర్తిగా బయటకు వచ్చినపుడు యిప్పటివరకు జరిగినదీ, యికపై జరగబోయేదీ విచక్షణ నుపయోగించి ప్రజలే నిర్ణయించుకోగలరు. 1956 నుండి జిల్లాలవారీగా జరిగిన అభివృద్ధి ఏమిటో, అభివృద్ధి జరగకపోతే దానికి గల భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంకేతిక కారణాలేమిటో ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించిననాడే నిజాలు వెలుగులోకి వస్తాయి. కానీ ప్రభుత్వం ఆ పని చేయటం లేదు.

నాయకులు – తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకోసం ఏ రోటి వద్ద ఆ పాట పాడే నాయకులు పరస్పర నిందలతో, ఆవేశపూరితమైన

ప్రసంగాలు చేయడంతప్ప, వాస్తవాలను తెలుసుకుని, వాటిని వెలుగులోకి తెచ్చి ఆలోచన రేకెత్తించే ప్రయత్నం చేయటం లేదు. ఎన్నికల వేళ నిజాల కంటె, సెంటిమెంటుకే ఎక్కువ ప్రాధాన్యమని వారి అంచనా. 'యదార్థవాదీ – అధిష్టాన విరోధీ' అనే వెరపుతో రాజకీయ నాయకులు తర్కబద్ధంగా మాట్లాడటం లేదు.

మీడియా – మీడియా యావత్తు హైదరాబాదు కేంద్రంగా నడుస్తూ, వార్తలను ఏకపక్షంగా వెలువరిస్తూ, హైదారాబాదులో అందుబాటులో వుండే కొందరినే మేధావులుగా ప్రొజెక్టు చేస్తూ, చర్చావేదికలును రచ్చబండలుగా మార్చి గందరగోళాన్ని మరింత పెంచుతున్నాయి తప్ప ప్రచారంలోకి వస్తున్న అసత్యాలను సంపాదకీయాలద్వారానైనా ఖండించటం లేదు. ఇతర సెంటర్లలో చర్చావేదికలు పెట్టినా అక్కడ అనేకమంది చేత మాట్లాడించడం తప్ప నిర్ణయాలకు, తీర్మానాలకు దారి తీసేట్లు చేయడం లేదు.

దీనికి పరిష్కారం – సత్యాన్వేషులైన ప్రజలే నిజాలు వెలికిదీయాలి. గణాంకాలను సేకరించి, సమన్వయపరచి, అన్వయించి సరైన దృక్కోణంలో వాటిని విశ్లేషించాలి. కరపత్రాల ద్వారా, కాసెట్లు/సిడిల ద్వారా, కళాప్రదర్శనలద్వారా వాటిని సామాన్యజనాలకు సైతం అందేట్లు చేయాలి. అప్పుడు వారు యిన్నాళ్లగా పట్టిన మౌనవ్రతాన్ని వదలి, తమ న్యాయబద్ధమైన హక్కుల పరిరక్షణకు నాయకులపై ఒత్తిడి తెస్తారు.

ఇది జరగకపోతే…? – అరకొర సమాచారాన్ని ఆధారం చేసుకుని వెలువరించే ఏకపక్ష నిర్ణయాలు జరుగుతాయి. రాష్ట్రం విడిపోత్తే, పంపకాల వేళ అనేక అన్యాయాలు జరుగుతాయి. ఇప్పటి పరిస్థితుల ప్రకారం చూస్తే రాష్ట్రం విభజించరని గట్టిగా చెప్పడానికి లేదు. అలాగే విభజించి తీరతారనీ చెప్పడానికి లేదు. విడదీయకపోయినా కొన్ని ప్రాంతాలకు కొన్ని వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించవచ్చు. అవసరమైనచోట, అవసరమైన విధంగా ఖర్చు పెడితే ఎవరికీ అభ్యంతరం వుండదు. కానీ అసత్యాల ఆధారంగా యిటువంటి నిర్ణయాలు తీసుకుంటే అది బాధాకరమే!

మనం ఏమీ చేయకుండా కదలక మెదలక కూర్చుంటే మనకు నచ్చేవిధంగా కాగల కార్యం గంధర్వులే తీరుస్తారని అనుకోవడం అవివేకం కాదా!

కార్యాచరణ – నిజాల సేకరణ, వ్యాప్తి లక్ష్యాలుగా "సత్యపీఠం" అనే సంస్థ నెలకొల్పుదాం. సమాజంలోని అన్ని వర్గాల వారు – ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలపై పరిశోధనలు చేసిన, చేస్తున్న యూనివర్సిటీ అధ్యాపకులు, పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు– వారికి తెలిసిన వాస్తవాలను, సేకరించిన గణాంకాలను, విశ్లేషణలను సమీకృతం చేద్దాం. కలంద్వారా, గళంద్వారా, కుంచెద్వారా ప్రతి ఒక్కరం వీటిని వ్యాప్తి చేద్దాం.

కానీ యిది జరిగేదెలా? – ఏ రాజకీయ పార్టీ ముద్ర లేకుండా సంస్థ ఏర్పాటు చేయడానికి, నిర్వహించడానికి అర్థబలం కంటె అంగబలం ఎక్కువగా కావాలి. తమ వ్యక్తిగత సమయాన్ని దీనికై వెచ్చించే వుదారహృదయులు ముందుకు రావాలి. వారిని కనుగొనడానికి, అవగాహనా సదస్సు ఒకటి ఏర్పాటు చేస్తున్నాం. సదస్సు పూర్తయాక వచ్చిన స్పందన బట్టి ఒక వేదికగా ఏర్పడాలో లేదో అందరం కూచునే నిర్ణయిద్దాం. చీకట్లో చిరుదివ్వె వెలిగించడం వరకే మా వంతు. ఆ చిరుదివ్వెను జ్యోతిగా ప్రజ్వలింపజేయడం మనందరి వంతు. (సదస్సు గురించి తదుపరి వ్యాసంలో రాస్తున్నాను) **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 18** **సత్యపీఠం' సదస్సు**

కరపత్రంలో ప్రస్తావించిన సదస్సు జరిపేందుకు ఓ మోడల్ కింద యిస్తున్నాను. కరపత్రం వెనుకవైపు దీన్ని ముద్రించవచ్చు.

సదస్సు వివరాలు – . తారీకున … హాలులో అయిదు సెషన్స్‌గా యీ సదస్సు జరుగుతుంది. ఒక్కో సెషన్‌కు గంటన్నర. ముగ్గురు వక్తలు. ఒక్కొక్కరు 20 నిఎఎలు మాట్లాడతారు. ఆవేశాన్ని కాక ఆలోచన రగిలించేట్లా, ప్రసంగపాఠాలతో, అకడమిక్ ధోరణిలో ప్రసంగిస్తారు. సెంటిమెంటుకు కాదు, తర్కానికే ప్రాధాన్యం. సభలోనివారు తమ ప్రశ్నలను కాగితాలపై రాసి పంపవచ్చు. సదస్సు అనంతరం వక్తల ప్రసంగపాఠాలను పుస్తకరూపంలో తెచ్చే ఆలోచన కూడా వుంది.

మొదటి సెషన్ – ఉఎఎ 9.30 నుండి 11.00

| | |
|---|---|
| 01. సత్యపీఠం ఆవశ్యకత | వక్త : |
| 02. 2001 నుండి రాజకీయ నాయకులు సృష్టిస్తున్న గందరగోళం | వక్త : |
| 03. 2001 నుండి మీడియా సృష్టిస్తున్న గందరగోళం | వక్త : |

రెండవ సెషన్ – ఉఎఎ 11.00 నుండి 12.30

| | |
|---|---|
| 01. 1969 వరకు వున్న భిన్నస్వరాలు – కారణాలు | వక్త : |
| 02. 1969 ఉద్యమం– నేటి ఉద్యమం : పోలికలు, తేడాలు | వక్త : |
| 03. 1972 ఉద్యమం – నేటి ఉద్యమం : పోలికలు, తేడాలు | వక్త : |

మూడవ సెషన్ – మఎఎ 2.00 నుండి 3.30

| | |
|---|---|
| 01. పెద్ద మనుష్యుల ఒప్పందం – భూమిక | వక్త : |

02. పెద్ద మనుష్యుల ఒప్పందం ఉల్లంఘన కారణాలు – రాజకీయపరమైనవి వక్త :

03. పెద్ద మనుష్యుల ఒప్పందం ఉల్లంఘన కారణాలు – పరిపాలనాపరమైనవి వక్త :

నాల్గవ సెషన్ – మ.ఎ 4.00 నుండి 5.30

01. ఇరిగేషన్ ప్రాజెక్టులు : ఆరోపణలు– వాస్తవాలు వక్త :

02. ఉద్యోగ నియామకాలు : ఆరోపణలు– వాస్తవాలు వక్త :

03. ఇతర ఆరోపణలు (భాష, సంస్కృతి, సినిమాలు, చరిత్ర) ఆరోపణలు – వాస్తవాలు వక్త :

ఐదవ సెషన్ – మ.ఎ 6.00 నుండి 8.00

01. హైదరాబాదు సంగతేమిటి? వక్త :

02. ఎదుటివారి వాదనను న్యాయపరంగా ఎదుర్కోవటం ఎలా? వక్త :

03. విభజన జరిగితే ఆస్తుల పంపకాలు వక్త :

ముక్తాయింపు – సత్యపీఠం ఏర్పాటు కార్యాచరణ

(ప్రాక్టికల్ సజెషన్స్ – వక్తకు 20 ని.ఎలు మాత్రమే సమయం. ఎట్టి పరిస్థితిలోనూ దాటరాదు. అలా అయినా గంట అవుతుంది. ప్రశ్నలు– సమాధానాలకు ఓ అరగంట కుషన్ వుండాలి కాబట్టి సెషన్‌కు గంటన్నర పెట్టాలి. సెషన్, సెషన్‌కు అధ్యక్షుడు అంటూ ఎవరూ వుండరు. మొత్తానికి మోడరేటర్ వుంటాడు. అతనే సదస్యుల నుండి కాగితాలపై ప్రశ్నలు రాయించి వక్తలకు యిస్తాడు. సదస్యులకు మైకు యివ్వకూడదు. వాళ్లు ప్రశ్న అడిగేబదులు తమ అభిప్రాయాలు చెప్పడం మొదలెడతారు.

సభకు వచ్చినవారికి మీ ఎవేరెనెస్ లెవెల్ యింత అని తెలియపరచడానికి సదస్సు మొదట్లో క్వశ్చనీర్ యివ్వవచ్చు. సదస్సు పూర్తయాక వాటి ఫలితాలను తెలిపి సత్యపీఠం ఆవశ్యకత యిది అని చెప్పవచ్చు. మొత్తమంతా వీడియో తీయించి యితర ప్రాంతాలకు పంపవచ్చు. వాళ్లూ యీ లైన్స్‌లో చేయవచ్చు.

వక్తకు కొద్దిపాటి పారితోషికం, రానూ పోనూ ఖర్చులు, బస యివ్వడం సముచితంగా వుంటుంది. సాధ్యమైనంతవరకు ఆ జిల్లా, పక్కనున్న జిల్లాల వారినే చూస్తే మంచిది. వక్తలందరూ ప్రసంగపాఠాలు తెచ్చి యివ్వవలసినదే అని గట్టిగా చెప్పాలి. లేకపోతే సబ్జక్ట్ లేకుండా గ్యాస్ కొడతారు. హాలులో పవర్ పాయింట్ ప్రెజంటేషన్ యివ్వడానికి సౌకర్యం వుంటే మంచిది. ఇరిగేషన్, ఆదాయవ్యయాలు వంటివి గ్రాఫుల ద్వారా చూపిస్తేనే అర్థమౌతుంది. నినాదాలు, ఎమోషనల్ ఎప్పీల్స్ వద్దు. ఉద్వేగ రహితంగా ఎకడమిక్‌గా మాట్లాడాలి. 16 మంది వక్తలు దొరకడం కష్టం కావచ్చు. ఒక్కొక్కరికి రెండేసి టాపిక్స్ యివ్వవచ్చు. రాజకీయనాయకులను పిలవకపోతేనే మంచిది. వాళ్లకు హై కమాండ్ భయం. ఎదుటిపార్టీ వారిని నిందించడంతో పొద్దు పుచ్చుతారు.

ఇక ఖర్చుల గురించి – ప్రస్తుతం పెళ్లిళ్లు లేవు కాబట్టి ఏ కళ్యాణమండపం వారినో కన్సెషనల్ రేట్‌కి అడగవచ్చు. సభకు 300 నుండి 500 మంది రావచ్చు. వారినుండి విరాళాలు తీసుకోవచ్చు. లేకపోతే యీ వుపన్యాసాలతో వేయబోయే పుస్తకానికి పూర్వప్రచురణ మూల్యం అని తీసుకోవచ్చు.

నా కాలమ్ చదివేవారిలో ఎవరైనా యిలాటి సదస్సు ఏర్పాటు చేస్తేనో, చేసేట్లా చూస్తేనో నేను చాలా సంతోషిస్తాను. నా వంతు సహాయం నేను చేస్తాను. వక్తగా రావడానికైనా సిద్ధం. అది ఏ వాదమైనా కావచ్చు, నాకు అభ్యంతరం లేదు. ఏ వాదమైనా సరే, నిజానిజాలు వెలికి తీసి పాయింటు వైజ్ మాట్లాడాలని నా కోరిక. అదే చెప్తాను. నిజాల పట్ల నిర్లక్ష్యంగా వుండకండి అని గట్టిగా చెప్తాను. నా ప్రసంగపాఠం ముందుగా  పంపి నిర్వాహకులు అనుమతిస్తేనే మాట్లాడతాను. ఈ ఆఫర్ ఎందుకంటే యిది యావత్తు తెలుగువారి కమ్యూనికేషన్ స్కిల్స్‌కు, విషయపరిజ్ఞానానికి సంబంధించిన ప్రశ్న. మనవాళ్లు వాళ్లముందు తెల్లమొహం వేయడం భరించలేని విషయం కదా! **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 19** **ఎమ్బీయస్ – పట్టుచీర మార్చేయనా...?**

శ్రీవారికి ప్రేమలేఖ సినిమాలో క్లయిమాక్స్ గమ్మత్తుగా వుంటుంది. హీరో, హీరోయిన్‌లకు పెళ్లవుతుందా? లేదా? అన్నది సస్పెన్సు. కథ ఒక్కో మలుపు తిరుగుతున్న కొద్దీ పెళ్లి ఆగిపోయింది.., కాదు కాదు, జరుగుతుంది .. మళ్లీ ఆగిపోయింది – యిలా నడుస్తుంది. పెళ్లి పందిట్లో అందరూ కంగారు పడుతూ వుంటారు. వాళ్లలో ఒక ముత్తయిదువుకి ఒకటే ఆరాటం – పట్టుచీర మార్చాలా అక్కర్లేదా అని. పెళ్లి వుంది అంటే పట్టుచీర కట్టుకుంటుంది, లేదు అంటే అది మార్చేసి మామూలు చీర.. పెళ్లి ఆగిపోయి పెళ్లికూతురు ఏమైపోయినా ఆవిడకు ఫర్వాలేదు. ఆవిడ చింత ఎంతసేపూ పట్టుచీర కట్టాలా? వద్దా అన్నదాని గురించే.

మన తెరాస మిత్రుల రాజీనామాలు చూస్తూంటే నాకు ఆ ఘట్టమే గుర్తుకు వస్తుంది. వీళ్లు గడువు పెట్టిన టైముకి ప్రకటన వెలువడకపోతే రాజీనామా, వెలువడితే రాజీనామా.. కమిటీ వేస్తామంటే రాజీనామా.. వేశాక విధివిధానాలు అనుకున్న సమయానికి వెలువరించకపోతే రాజీనామా... కాలపరిమితి లేకపోతే రాజీనామా..తెలంగాణా యిచ్చేస్తాం యీ కమిటీ వూరికే సరదాగా వేశాం అని చెప్పకపోతే రాజీనామా...

పట్టుచీర మార్చేయనా? అని ఆ ముత్తయిదువు అడిగినట్టే తెరాస శాసనసభ్యులు వారి నాయకుల్ని 'రాజీనామా యిచ్చేయనా?' అని మాటిమాటికీ అడుగుతూ వుంటారేమో! తెరాస, రాజీనామా అనే పదాలు సమానార్థకాలు అయిపోయాయి. ఇకపై ఎన్నికల్లో నామినేషన్ పడేసేటప్పుడే ఎన్నికైతే నా రాజీనామా యిదిగో అంటూ ఇంకో అప్లికేషన్ కూడా అదే చేత్తో యిచ్చేస్తే భేషుగ్గా వుంటుంది.

తెరాస అస్తిత్వంలోకి వచ్చినదగ్గర్నుంచి రాజీనామా రాజీనామా అంటూనే వుంది. మంత్రిపదవులకు రాజీనామా, అవి లేకపోతే శాసనసభ్యత్వానికి రాజీనామా. నిజానికి రాజీనామా చేసినప్పుడల్లా నానాటికి తీసికట్టు నాగంభొట్లూ అయిపోతున్నారు. అయినా ఆ మంత్రం మానకుండా పఠిస్తూనే వున్నారు. పిడుక్కీ బియ్యానికీ వారికి వచ్చినది అదే మంత్రం. పోనీ రాజకీయాల్లోంచి రిటైరై పోయి దేశసేవకు అంకితం అయిపోతారా అంటే అదీ లేదు. గతంలో నానాజీ దేశ్‌ముఖ్ అనే బిజెపి నాయకుడు 60 యేళ్లకు పదవులు వదిలేసి ప్రజాసేవలో మునుగుతానని ప్రకటించి అక్షరాలా అమలు చేశాడు. (వైయస్సార్ 60 యేళ్లు వచ్చాక మాట మార్చబోయాడు. అబ్బే నీది మాట తప్పని, మడమ తిప్పని వంశం కదాని గుర్తు చేసి దేవుడే తీసుకుపోయాడు) వీళ్లు అలా కాదు, రిజైన్ చేసి మళ్లీ అదే చోట నామినేషన్ పడేస్తారు.

ఇది మామూలు జీవితానికి అప్లయి చేసుకుని చూస్తే కోపం వచ్చినప్పుడల్లా భార్యకు విడాకులు యివ్వడం, మళ్లీ కొన్నాళ్లాగి ఆవిణ్నే కట్టుకోవడం లాటిది. లేదా లీవు యివ్వనప్పుడల్లా ఉద్యోగానికి రిజైన్ చేయడం, మళ్లీ నెల తిరక్కుండా అదే పోస్టుకి అప్లికేషన్ పట్టుకుని క్యూలో నిలబడడం. సరే ప్రజలకు మాత్రం తిక్కలుండవా? మళ్లీ కట్టుకుంటానంటూంటే 'నువ్వు వుద్ధరించింది చాల్లేవయ్యా, యీ లోపున మరో మంచి మొగుడు కంటికి నదురుగా ఆనాడు. నువ్వు దయచేయ్' అనేస్తున్నారు. అలాగ ప్రతీసారీ సగం మంది మళ్లీ పెళ్లీ గిళ్లీ లేకుండా డ్వెటవోర్సీలుగా మిగిలిపోతున్నారు. అయినా తక్కినవాళ్లు నదురూ బెదురూ లేకుండా మళ్లీ విడాకులకు ఎగబడుతున్నారు.

ఎన్నాళ్లు నిలిచే కాపురమో తెలియదు కాబట్టి యింటి గొడవ పట్టటం లేదు. గత అర్థశతాబ్దిగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురయ్యామని గుండెలు బాదుకోవడం తప్ప గత ఆరేళ్లగా తమను ఎన్నుకున్న ప్రజలను తామెంత నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పటంలేదు. వీరందరిలో హరీశ్ రావు ఒక్కరే నియోజకవర్గాన్ని పట్టించుకోవడంలో బెస్టు. అందుకే ఆయన విన్నింగ్ మార్జిన్ పెరుగుతూ పోతోంది. ఆయన నియోజకవర్గం వున్న పార్లమెంటు స్థానం కోసం అగ్రనాయకులు పోటీ పడుతున్నారు. ఆ క్రెడిట్ సాక్షాత్తూ కెసియార్‌కు కూడా దక్కలేదు. ఆయన దృష్టిలో నియోజకవర్గం పట్టించుకోవడం అంటే అక్కడో భవనం కట్టిపారేయడం! అందుకే ఆయన మెజారిటీలు తగ్గుతూ వస్తున్నాయి.

అయితే యీ రాజీనామా స్వైన్ ఫ్లూ క్రమంగా రాష్ట్రనాయకులందరికీ పట్టుకుంది. డిసెంబరు 9 తర్వాత కోస్తా, ఆంధ్రలలో, డిసెంబరు 23 తర్వాత తెలంగాణంలో ఊహూ తెగ రాజీనామాలు చేసి పడేశారు. అయితే తెరాసవారి లాటివి కావవి. ఉత్తుత్తి రాజీనామాలు. 'గవర్న్ చేయడం ఎలాగూ రాదు, రిజైన్ చేయడం కూడా రాదు వీళ్లకు' అని మనకు అప్పుడు తెలియదు కదా అబ్బో అబ్బో ఎంత ప్రాంతీయభక్తో అనుకున్నాం. అంథా మన కళ్లల్లో దుమ్ము కొట్టడానికే అని తర్వాత తెలిసింది. ఈ నాటకంలో తెరాసకూడా పాలు పంచుకుంది. లేకపోతే రాజీనామా చేయడంలో చేయి తిరిగిన తెరాసవారికి సవ్యంగా రాజీనామా చేయడం రాదంటే ఎలా నమ్ముతాం చెప్పండి. తక్కినవాళ్లయితే ప్రజలో అధిష్టానమో పొమ్మనేదాకా చూరు పట్టుకుని వేళ్లాడే రకం.

మరి తెరాస వాళ్లంటే ఎవరు? తాళి కడుతూనే విడాకుల లాయరు వచ్చాడా? అంటూ పెళ్లిపందిట్లోకి కలయజూసే రకం. తలాక్ తలాక్ అని రెండున్నర సార్లు అనేసే కాపురం మొదలెడతారు. వేణ్నీళ్లు తోడడం ఆలస్యమైతే చాలు ఆ మిగతా ముక్క కూడా అనేసి, జందాలు తెంపుకుని సన్యాసుల్లో కలిసిపోతారు. అమ్మయ్య అనుకుంటూండగానే మళ్లీ కాశీయాత్ర అంటూ మనింటికే వస్తారు. మరి వాళ్లు కూడా ఉత్తుత్తి రాజీనామాలు యిచ్చారు డిసెంబరు 23న బంతిలో పాలపక్షం చేయకూడదని. ఈ సారి మాత్రం నికార్సయినవి యిచ్చారు. **– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 19** **ఎమ్బీయస్ – జాయింటు వూడిపోయింది**

అయింది, ఆ ముచ్చటా తీరింది. కాంగ్రెస్ జెఎసిలోంచి బయటకు వచ్చేసింది. జెఎసిని 'జాయింట్ల యాక్షన్ కమిటీ' అని నేను ఓ సారి వర్ణించాను. ఆ అతుకు యిప్పుడు వూడిపోయింది. అతుకుల బొంతలో పెద్ద ముక్క చిరిగిపోయింది. ఆ ఘనత నిశ్చయంగా కెసియార్‌కే దక్కుతుంది.

అందరి కంటె ముందుగా రిజైన్ చేస్తేనే అసలైన తెలంగాణా యోధుడు అని ప్రజలెవరైనా అన్నారా? అందరం కలిసి పోరాడతాం అంటూనే పక్కవాడి కంటె ముందుకు ఉరకడం ఎలాటి టీమ్‌వర్క్? కావాలంటే తెలంగాణా వచ్చాక కాంగ్రెస్ వాళ్లనే ఏలుకోమనండి, మాకు తెలంగాణా ఏర్పడితే చాలు అంటూ పలుకులు వల్లించిన కెసియార్ 'అతని కంటె ఘనుడు' అనిపించుకోవాలనేగా ముందుగా రిజైన్ చేసింది. 'ఈ కాంగ్రెస్, టిడిపి వాళ్లకు నిజాయితీ లేదు, మేమే ఉద్యమానికి అంకితం అయినవాళ్లం' అని చాటుకోవాలన్న తాపత్రయమేగా! కాంగ్రెస్, టిడిపి వాళ్లకు నిజాయితీ నేను అనటం లేదు. రాష్ట్రప్రజలూ అనుకోవడం లేదు. కానీ వాళ్లతో కలిసేగా మీరు గత రెణ్నెళ్లగా వూరేగినది!?

అసలు జెఏసి పెట్టినదెవరు? కెసియార్ కాదా? ఆయన భాషలో 'దిక్కుమాలిన' కాంగ్రెస్ పార్టీ తాలూకు ఓ నాయకుడు జానారెడ్డి యింటికి వెళ్లి అందరూ కలిసికట్టుగా పోరాడదామని నచ్చచెప్పి జెఏసి ఏర్పాటు చేసి, దానిలో చేరడానికి టిడిపి తటపటాయిస్తే దాన్ని అల్లరిపెట్టి, బద్నామ్ చేసి, చేరక తప్పని పరిస్థితి కల్గించలేదా? మరి యిప్పుడు ఆ జెఏసి అంత పనికి రానిదై పోయిందా?

పురిట్లోనే సంధి కొట్టినట్టు అప్పుడు కూడా జానారెడ్డి, యితరులు ప్రకటించడానికి ముందే తన రాజీనామా ప్రకటించారు కెసియార్. అప్పుడే తెలియాల్సింది తెరాసేతర పక్షాలకు యిది నడిచే కాపురం కాదురా అని. కానీ ఉద్యమంలో దూసుకుపోతున్న తెరాస చొక్కా పట్టుకుని వేళ్లాడదామని వాళ్లూ సై అన్నారు. తెరాస రాజీనామా రాజీనామా అంటే మేమూ మేమూ అన్నారు కాంగ్రెస్, టిడిపివాళ్లు. అంతా కలిసి ఏం చేశారు?

రాజుగారూ పాలూ అనే కథ వుంది వినేవుంటారు. ఓ రాజుగారు ఓ రోజు ఆర్డరేశాట్ట. రాజ్యంలో వున్నవాళ్లందరూ తలో చెంబుడు పాలూ ఓ గంగాళంలో పోయాలి అని. ఆ గంగాళం చీకటి గదిలో పెట్టాట్ట. ప్రతీవాడూ 'అందరూ పాలు పోస్తారు కదా, నేనొక్కణ్నీ నీళ్లు పోస్తే ఏం తెలుస్తుంది?' అనుకుంటూ నీళ్లే పోశారట. తెల్లారి లేచి గంగాళం చూసి రాజుగారు ఘొల్లుమన్నాట్ట. ఒక్క చుక్క పాలు లేవు. అన్నీ నీళ్లే. ఇదా నా ప్రజల నిజాయితీ అని రాజుగారు ఆ గంగాళంలోనే వురికి ఆత్మహత్య చేసుకోబోయాట్ట.

ఆ పని యిప్పుడు మనం చేయాలి. మన రాష్ట్రంలో యిచ్చిన వందలాది రాజీనామాల్లో చెల్లేది ఒక్కటే ఒక్కటి. ఆయన కూడా దరిమిలా సందిగ్ధంలో పడ్డాడు. మొన్నటిదాకా ఆమోదింపజేసుకోలేదు. ఇదీ మన నాయకుల చిత్తశుద్ధి! మన చెవుల్లో పూలు పెట్టి పెట్టి పూల్సు చేశారు వీళ్లు.

అలాటి నాయకులలో తెరాసవారు యిప్పుడు మాత్రం నికార్సయిన రాజీనామాలు ఎందుకిచ్చారు? ఇలాటివాళ్లు రేపు ఉపయెన్నికలలో తమ పది స్థానాలకు మాత్రమే పోటీ చేసి నోట్లో వేలు వేసుకుని కూచుంటారని అనుకోగలమా? తక్కిన పార్టీల వాళ్లను రిజైన్ చేయమని బహిరంగ ప్రకటనలు చేసి, కార్యకర్తల చేత వాళ్ల యిళ్లపై పిడకలు కొట్టించి, వాళ్ల కార్ల అద్దాలు పగలకొట్టించి.., (రేపో మాపో గుండు కూడా కొట్టించవచ్చు) యిదంతా వాళ్లందరినీ ఎన్నికలలో దగ్గరుండి ఓటేయించి గెలిపించడానికా? పొత్తు పెట్టుకున్న మహామహా రోజుల్లోనే కెసియార్ వాటిని ఖాతరు చేయలేదు. ఇప్పుడు చేస్తారా? కాంగ్రెస్, టిడిపి నాయకులను అల్లరి పెట్టి, ఉపయెన్నికలు రప్పించి, అన్ని స్థానాల్లో పోటీ చేయడమే తెరాస లక్ష్యమనే అనిపించడం లేదా? ఏవైనా మినహాయింపులుంటే దామోదరరెడ్డి వంటి కాంగ్రెస్‌ముసుగులోని తెరాసీయులకు వుండవచ్చు. హీనపక్షం 100 స్థానాలకు తెరాస పోటీ చేసి తీరుతుంది, చూస్తూ వుండండి.

జెఏసిలోని తక్కిన రాజకీయపక్షాలతో సంప్రదించలేదు సరే తెలంగాణాకై పోరాడే రాజకీయేతర సంస్థలున్నాయి కదా, వాళ్లూ పనికి రాలేదా? అంటే యీ మేధావుల వేదిక, దళితవేదిక.. యివన్నీ తెరాసకు వుపయోగపడవలసినవే తప్ప, తెరాస వాళ్లకు కనీసగౌరవం కూడా యివ్వదా? తెరాస వామనుడు త్రివిక్రముడై తమ నెత్తిమీద పాదం మోపబోతూ వుంటే చూస్తూ వూరుకోవడానికి కాంగ్రెస్, టిడిపివాళ్లు అంత బలిచక్రవర్తి వంటి త్యాగమూర్తులు కారు. అందుకే కాంగ్రెస్ బయటకు వచ్చింది. రేపో మాపో టిడిపి కూడా వచ్చేసినా ఆశ్చర్యపడనక్కరలేదు.

టిడిపివాళ్లు పాపం ఏదో డ్రామా ఆడబోయారు. తెరాస చెప్పినమీదట రాజీనామాలు యిచ్చినట్టూ వుండాలి. ఉపయెన్నికలు వచ్చి వారితో తలపడనూ కూడదు. 'అసలు ఎన్నికలు జరిగి ఎవరి స్థానాల్లో మళ్లీ వాళ్లే గెలవడం వలన ఏం నిరూపించినట్టు? చేస్తే గీస్తే పార్లమెంటు సభ్యులు చేయాలి కానీ' అన్న అర్థవంతమైన వాదన ఓ పక్క చేస్తూనే తెరాసతో పరుగుపందెంలో వెనకపడిపోతామన్న భయంతో రాజీనామాల గురించి పెద్ద యెత్తు ఎత్తారు. రాజీనామాలు పట్టుకెళ్లి స్పీకర్‌కు కాకుండా కోదండరామ్‌కి యిచ్చారు. (కోదండరామ్ అలాగే పట్టుకెళ్లి స్పీకర్‌కి యిచ్చేస్తే..? అన్న చిలిపి వూహ వచ్చింది నాకు. అంతలోనే గుర్తుకు వచ్చింది. స్పీకర్ తమను వ్యక్తిగతంగా అడిగినప్పుడు అబ్బే వుత్తుత్తినే అనేయవచ్చుగా అని) కాంగ్రెస్ మీద సొద్దు వేసినట్టు అనుకుని భుజాలు చరుచుకున్నారు. ఈ దివ్యమైన ఐడియా దేవేందర్ గౌడ్ గారిదని చదివాను. ఆయన నవ తెలంగాణా పార్టీ (పేరు కరక్టుగా చెప్పానా లేదా అన్న ఆలోచన వేస్టు. దేవేందర్‌గారికే గుర్తుండి వుండదు) ఐడియాలాగానే యిదీ చీదేసింది. కోదండరామ్ నాకెందుకు యివ్వడం? నా కిస్తే అది తెల్లకాగితం యిచ్చినట్టే అనేసి కుండ బద్దలు కొట్టేశారు. ఇప్పుడు టిడిపికి మళ్లీ యిరకాటం. దీనిలోంచి బయట పడడానికి దాని వద్దనున్న దగ్గరిదారి – జెఏసినుండి యివతలకు రావడం. ఇంకో అతుకు వూడే ఆ ఘడియ ఎప్పుడో వేచి చూద్దాం.

**– ఎమ్బీయస్ ప్రసాద్**

**ఫిబ్రవరి 32** ఎమ్బీయస్ – చిదంబరం వ్యక్తిగతం గతమేనా?

చిదంబరం గారు మళ్లీ ఓ స్టేటుమెంటు యిచ్చారు. కమిటీ చట్టబద్ధమేనని క్లారిఫై చేశారు. దాంతో బాటు చిన్న రాష్ట్రాల ఏర్పాటుపై తను పదవిలో లేనప్పుడు రాసిన వ్యాసాలు వ్యక్తిగత అభిప్రాయాలనీ, ప్రస్తుతం యుపిఏ ప్రభుత్వ ప్రతినిధిగా సమిష్టి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అంటూనే తన వ్యక్తిగత అభిప్రాయాలు మార్చుకోనని ముక్తాయించారు. పదవిలో లేనప్పుడు రాసిన వ్యాసాలను పుస్తకరూపంలో 'అవి మార్చుకోవలసిన అభిప్రాయం కనబడలేదు' అని ఉద్ఘాటించిన ముందుమాటతో వేసి

ప్రచురించినపుడు ఆయన పదవిలోనే వున్నాడు.

కమిటీ చట్టబద్ధమేనని యిన్నాళ్లకు చెప్పడమేమిటసలు? ఆ చెప్పేది ముందే చెపితే టిడిపివారికి, బిజెపివారికి బోల్డు ప్రకటనలు యిచ్చే శ్రమ తప్పేదిగా! పైగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వ్యాసం తన వ్యక్తిగతం అని అది బయటపడిన నెలన్నరకు చెప్పడమేమిటి? డిసెంబరు 9 అంత ఆదుర్దాగా ప్రకటించిన పెద్దమనిషి తర్వాత బొత్తిగా తాపీ అయిపోవడమేమిటి? (శ్రీశ్రీ జోక్ గుర్తు వస్తోంది. ఓ సినిమాకు సహరచయితలుగా తాపీ ధర్మారావుగారిని, ఆరుద్ర గారిని పెట్టుకున్నారట. 'ఒకరు తాపీ, మరొకరు ఆదుర్దా' అని చమత్కరించారు శ్రీశ్రీ)

డిసెంబరు 9 ప్రకటన తర్వాత కోస్తా, సీమ నాయకులు చిదంబరాన్ని తెగ తిట్టిపోశారు. అరవ్వాడు కక్ష కట్టి ఆంధ్రదేశాన్ని చీల్చబోయాడంటూ. (గవర్నరు నరసింహన్‌కూడా అదే ప్రాంతం వారైనా ఎవరూ నోరెత్తడం లేదు. ఆయన తరహా నచ్చింది కాబట్టి ఆయన జాతి గుర్తుకు రావటం లేదు). చిదంబరం రహస్యం అంటూ టీవీ న్యూస్ కాప్షన్ల విసుర్లు ఒకటి. సెటైర్ వేయడానికి మన తెలుగువాళ్లకు సందు దొరికితే చాలు వేసేస్తారు. జస్టిస్ శ్రీకృష్ణగారికి ఆ పేరు వుండడం మన టీవీవాళ్లకు ఎంతో లాభించింది. నాలుగురోజుల పాటు కృష్ణగారడీ, కృష్ణమాయ, కృష్ణలీల.. యిలా వాయించేశారు. జస్టిస్‌గారికి కృష్ణుడి గెటప్ వేసేసి 'హే కృష్ణా ముకుందా పాట' దంచేశారు. మనవాళ్లకు పెద్దంతరం చిన్నంతరం లేదు. కలాం గారి హెయిర్‌స్టయిల్‌ను కూడా ఓ సినిమాలో బ్రహ్మానందం చేసి ప్యారడీ చేయించేశారు. ఉత్తినే.. ఏ సందర్భమూ లేదు. అతనేదో సైంటిస్టనో మరోటనో అలాటి పాత్రేమీ కాదు. రాష్ట్రపతిగారు దొరికారు, వెక్కిరించేయ్ యిదే తంతు.

ఇండియాకు స్వాతంత్ర్యం యిద్దామని ఉబలాటపడిన క్లెమెంట్ అట్లీ భారత్ పట్ల సానుభూతి గలిగిన సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌ను చర్చలకై యిండియా పంపితే (పూర్తి వివరాలకు నా 'అట్లీ' వ్యాసం చదవండి) క్రిప్స్‌ను వెక్కిరిస్తూ ఆదిభట్ల నారాయణదాసు గారు 'క్రిప్స్ రాయబారం-కృష్ణ రాయబారం' అని హరికథ రాసి ప్రదర్శించేవారట. కృష్ణరాయబారంలో కృష్ణుడు పైకి చెప్పేది ఒకటి, లోపల వున్నది ఒకటీ. అలాగే క్రిప్స్ కూడా అని తీసి పారేశారు. ఇప్పుడు జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ అతి సీరియస్‌గా, నిజాయితీగా తన ప్రయత్నాలు మొదలెడితే అప్పుడే గారడీ అంటూ 'రన్ డౌన్' చేసేస్తున్నారు టీవీవాళ్లు. దుగ్గల్ పేరు మీద యింకా ఏదీ కుదిరివుండదు. మీడియా వీరులందరూ కసరత్తు చేస్తూనే వుంటారు యీ పాటికి. 'దుగ్గలు...పిల్లిమొగ్గలు..' దుగ్గలు- వాచిన బుగ్గలు'.. లాటి రసగుళికలు తయారవుతూనే వుంటాయి.

చిదంబరాన్ని తిట్టేటప్పుడు మొదట్లో కాస్త అన్యాయంగానే అంటున్నారనిపించింది. తర్వాత చిదంబరం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వ్యాసం బయట పడిన తర్వాత వార్నీ అనిపించింది. ఫిబ్రవరి అసెంబ్లీ ముట్టడి ప్రయత్నం తర్వాత నిజమే అనిపించింది. అందుకే యీ వ్యాసం.

మొదటగా చర్చించవలసినది డిసెంబరు 9 ప్రకటనకు చిదంబరం కేవలం నిమిత్తమాత్రుడేనా? తన స్వంత తెలివితేటలు వుపయోగించాడా? అన్నది. కోర్ కమిటీ రాసి యిచ్చినదాన్ని చదవడం తప్ప ఆయన చేసేదేముంది? అని వాదించవచ్చు. ఇదే కాదు, ఏ విషయంలోనైనా పర్సనల్ స్టాంప్ అనేది ఎప్పుడూ వుంటుంది. అది లేకపోతే వ్యక్తిత్వానికి అర్థమే వుండదు. ఫలానా న్యూస్ రీడర్ బాగా చదువుతారు అంటే అర్థం ఏమిటి? అదే న్యూస్ మరొకరు చదివితే అంత యింపుగా వుండదు అని. సినిమాలో పాత్ర కూడా అదే ఆహార్యం, అదే సెటింగ్, అవే సంభాషణలు, అదే డైరక్టర్ కావచ్చు – బాలకృష్ణ వేస్తే ఒకలా వుంటుంది, వెంకటేష్ వేస్తే మరోలా వుంటుంది. అంతెందుకు యివే భావాలు నేను రాస్తే ఒకలా వుంటుంది, మీరు రాస్తే యింకోలా వుంటుంది.

శివరాజ్ పాటిల్‌ను తీసేసి చిదంబరం గారిని ఎందుకు హెూం మంత్రి చేశారు? అదే సెటప్, అదే బ్యూరాక్రసీ, అదే మావోయిస్టులు, అదే ఉగ్రవాదులు, అదే యుపిఏ ప్రభుత్వం, అదే మన్‌మోహన్, అదే సోనియా. అయినా శివరాజ్ పాటిల్ శివరాజ్ పాటిలే, చిదంబరం చిదంబరమే. మావోయిస్టులను తన హయాంలోనే దుంప తెంపడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనిచేస్తున్నారు చిదంబరం. ఆపరేషన్ గ్రీన్ హంట్ పెట్టి, అన్ని రాష్ట్రాలతోనూ సమన్వయ పరచి, మావోయిస్టులను కవ్వించి... యిలా ఏదో గేమ్‌ప్లాన్ వుంటుంది. ఎప్పుడూ ఎలాటి స్టేటుమెంటు యివ్వాలో, దానిలో ఎలాటి ధ్వని పలికించాలో తనదంటూ ఓ ముద్ర వేసుకుని అంత గంభీరంగానూ చెప్తారు.

కోర్ కమిటీ ఆ స్టేటుమెంటు తయారుచేసిందే అనుకుందాం. దాన్ని జస్ట్ చదివి పెట్టు అని వాళ్లు చెప్పినంత మాత్రాన చిదంబరం చదివేస్తారా? అదే చేత్తో తమిళనాడు కూడా విడగొట్టేద్దామనుకుంటున్నాం అని రాసి వుంటే చదివి వుండేవారా? హెూం మంత్రిగా తన కంటూ ఓ ప్రతిపత్తి లేదా? 'రోశయ్యగారికి ఒక వెర్షన్ చూపించి మనం మరొకటి రిలీజ్ చేస్తే బాగుండదు. పైగా కాబినెట్‌లో పెట్టకుండా యింత తీవ్రమైన నిర్ణయం తీసుకోకూడదు. తెలంగాణా యిస్తామంటే తక్కిన రాష్ట్రాలు ఎఫెక్టవక మానదు. ఆ యా రాష్ట్రాలలో వున్న మన యుపిఏ భాగస్వాములతో ఓ మాట చెప్పి చూదాం' అని కూడా అనలేడా? అలా అనలేకపోతే ఆయనెందుకు ఆ స్టేటుమెంటు చదవడం? చక్కగా మన సాయికుమార్‌కి యిస్తే యింకా పదింతలు గంభీరంగా చదివేవాడుగా!

చిదంబరంగారు పెద్ద స్థాయి లాయరు. ఏ మాటకు ఎంత 'యింపోర్టు', ఎంత 'తూకం' వుంటుందో తెలియకుండా వుంటారా? లాయరు మాత్రమేనా? రాజకీయాల్లో దశాబ్దాలుగా నలుగుతున్నారు. కాంగ్రెస్‌లోంచి ఓ సారి బయటకు వెళ్లి కూడా చూశారు. ఎత్తుపల్లాలన్నీ తెలుసు. ఇప్పటిదాకా అవకతవక స్టేటుమెంట్లు యిచ్చిన చరిత్ర లేదు. మరి ఆ రోజు ఎందుకలా యిచ్చినట్టు?

ఒకటి – డిసెంబరు 10 నాటి అసెంబ్లీ ముట్టడి పిలుపు వలన ఏదో అనర్థం జరిగిపోతుంది కాబట్టి ఆపాలని అదావుడిగా యిచ్చారు అన్నారు. ఫిబ్రవరి 20 నాటి ముట్టడి చూశాం. అది ఎలా విఫలం అయిందో చూశాం. డిసెంబరు 10 నాడు కూడా యిదే జరిగివుండేది. అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ఆఫీసులు, దుకాణాలు వున్నవాళ్లు అవస్థ పడేవారు. అంతేగా!

ఇక్కడో విషయం చెప్పాలి. అసెంబ్లీ ముట్టడి విఫలమైందని ఫిబ్రవరి 21 నాటి పేపర్లు రాయలేదు, అదేమిటో గాని. యాదయ్య చావు గురించే హెడ్‌లైన్స్. ఆత్మహత్యలు యింత కామన్ అయిపోయినా దాన్నే హెడ్‌లైన్సుగా తీసుకున్నారు తప్ప పోలీసులు గట్టిగా వ్యవహరించి ప్రభుత్వం పరువు కాపాడారు అని రాయలేదు. కొన్ని టీవీ ఛానెల్స్ పనిలోపనిగా యాదయ్యను విద్యార్థి చేసి పారేశాయి, అతను చదువుకి పంగనామం పెట్టి చాలా రోజులైనా. విద్యార్థి అంటే ఎఫెక్టివ్‌గా వుంటుందన్న ఫీలింగేమో మరి.

ఫిబ్రవరి 18 నుండే అసెంబ్లీకి రెండు కిలోమీటర్ల పరిధిలో రాళ్లన్నీ ఏరేస్తూ, వ్యాన్‌లో పడేస్తూ కనబడ్డారు పోలీసులు. 'నాలుగురాళ్లు వెనకేసుకుంటున్నారు పాపం' అనుకుని నవ్వుకున్నాను. తీరా చూస్తే 20 న ఆ రాళ్లే పోలీసువాళ్లు విద్యార్థులమీద విసిరేశారని తెలిసి తెల్లబోయాను. 'ఈంట్ కా జవాబ్ పత్థర్ సే' అని సామెత. ఇటుక విసిరిన వాళ్లకు జవాబుగా అంతకంటె ధాటీదైన రాయి విసురుతారని అర్థం. వీళ్లిన్నాళ్లూ 'పత్థర్ కా జవాబ్ గోలీ (తుపాకీగుండు)సే' యిస్తూ వచ్చారు. అలా అయితే విమర్శలు చేస్తున్నారని, యిప్పుడు పత్థర్ కా జవాబ్ పత్థర్‌సే యిచ్చి లెక్క సరిపెట్టేశారు.

ఏం విసిరితేనేం లెండి, పాపం అసెంబ్లీ జరగనిచ్చారు కదా. డిసెంబరు 10 న కూడా యిలాగే జరిగి వుండేది. ఆ మాత్రానికి చిదంబరం గారు కంగారు పడాలా? హెూం మంత్రి అయివుండి తన పోలీసుల మీద ఆ మాత్రం నమ్మకం లేదూ!? మరి మావోయిస్టు సమస్య వద్దకు వచ్చేసరికి మా దళాలు యింతటివి అంతటివి, వాళ్ల పీచమణిచేస్తాం, మీకేం భయం లేదు అని చెప్తాడు! ఆ రోజు మావోయిస్టులు కలిసిపోతారన్న సమాచారం వుందంటాడా, మరీ మంచిది – అడవుల దాకా వెళ్లకుండా అసెంబ్లీ ఎదుటే వాళ్లకు చెప్పాల్సిన పాఠాలు చెప్పేస్తే మరీ సులువు కదా! మరి ఆ అవకాశం ఎందుకు జారవిడుచుకున్నట్టు?

రెండో పాయింటు – కెసియార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా వుందంటారా? టీవీలో నిమ్స్ డాక్టర్ల హావభావాలు చూసి మీరూ నేనూ ప్రభావితం ఐనా హెూం మంత్రిగారికి ఇంటిలెజెన్సు సమాచారం లేకుండా వుంటుందా? ఒకవేళ దాన్ని ఎవరైనా మేనేజ్ చేసారనుకుంటే అదీ ఆ శాఖ వైఫల్యమే అనాలి. ఇక యిలాటి వ్యవస్థతో నువ్వు మావోయిస్టుల డొక్కెం చీలుస్తావ్? డోలేం కడతావ్? ఊరికే మమ్మల్ని వూరించడం కాకపోతే!

కెసియార్ నిమ్స్ రికార్డులు రాజగోపాల్ పార్లమెంటులో ఆవిష్కరిస్తానంటున్నారు. వెంటనే హరీష్‌రావు 'నువ్వు చెప్పేదేమిటి? నేనే చెప్తా' అని రికార్డులు బయటపెడతారేమో ననుకున్నాను. అబ్బే, దానికి బదులు ఆయన 'రాజగోపాల్ అర్ధరాత్రి విజయవాడనుండి అదృశ్యం కాలేదా? నిమ్స్‌లోకి నవ్వులతో పరిగెడుతూ లేక పరుగులతో నవ్వుతూ వెళ్లలేదా?' అంటూ మొదలెట్టారు. రాజగోపాల్ కథ ఎప్పుడో తెలిసిపోయింది కదా, అందునా ఆసుపత్రిలో చేసిన నిరాహారదీక్ష ఎక్కవుంటులో వేయకండి, అలాటివి నిరాహారదీక్షలే కాదు అంటూ ఆయనే చెప్పేశాడు.

మాకు తెలియవలసినది కెసియార్ నిమ్స్ రికార్డుల కథ. అది కెసియారే బయటపెడితే అందంగా, హుందాగా వుంటుంది. వేరేవాళ్లు బయటపడితే రచ్చ అవుతుంది. నా మట్టుకు నాకు డిసెంబరు 9 రాత్రి వరకూ వున్న రికార్డుల కంటె ఆ తర్వాత రెండు రోజుల్లో కెసియార్ వాడిన మందుల రికార్డు మీదనే యింట్రస్టు. డిసెంబరు 9 సాయంత్రం వరకు 'ఈ గంట గడిస్తే చాలు' అన్నట్టున్న మనిషి రెండు రోజులు తిరక్కుండా మాంచి హుషారుగా అయిపోవడానికి ఏ లేహ్యం సేవించారో తెలుసుకుందామని మహా కుతూహలం.

మూడో పాయింటు – అన్ని పార్టీలు తెలంగాణా యిచ్చేయమని చేసిన తీర్మానం వుందని చిదంబరం ధైర్యం అంటారా? అదెంత అర్ధమనస్కంగా యిచ్చారో చిదంబరం వంటి రాజకీయ వేత్తకు తెలియదా? ఆరేళ్లగా ఆడిన ఆట ఆడకుండా ఆడుతున్న ప్రణబ్‌ని ఫోన్ చేసి అడిగినా తమ పార్టీ చిత్తశుద్ధి (?) గురించి చెప్తాడే! తెలంగాణా యిచ్చేస్తే హైదరాబాదు వెళ్లడానికి వీసా కావాల్సి వస్తుందని చెప్పి ఎన్నికలు గెలిచి యుపిఏను మళ్లీ అధికారంలో కూచోబెట్టి తనను హెూం మంత్రి పదవి కాపాడిన వైయస్ స్పిరిట్‌ను సంప్రదించినా తెలిసేదే! తెలంగాణాలో జై ఆంధ్రప్రదేశ్ అని నినదించిన సోనియాను అడిగినా చెపుతుందే!

చిదంబరం అంత అమాయకుడని అనుకోవడానికి వీల్లేదు. ఆయన కూడా ఆంధ్రప్రదేశ్‌ను విడగొడదామని అనుకుంటున్నాడని అనుకుంటున్నాడు కాబట్టే, ఆ ఐడియాకు ఎమోషనల్లీ ఎటాచ్‌డ్ కాబట్టే ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు. తెలంగాణా డిమాండ్ అర్ధశతాబ్దిగా వుందని (మధ్యలో చల్లబడిందని చెప్పకుండా) చెప్పాడు. (మరి మావోయిస్టు డిమాండూ వుంది దానికో పదేళ్లు తక్కువగా.. దాని మాటేం చేద్దాం? వాళ్లకీ సై అంటావా?) ఎందుకిదంతా అంటే – 2003 నాటి ఆయన వ్యాసంలో స్పష్టంగా రాశాడు – మంచి పరిపాలన కోసం చిన్న రాష్ట్రాలుండాలి, తెలంగాణా, విదర్భ విడగొట్టాలి అని. (ఇప్పుడు మాత్రం విదర్భ గురించి యిప్పటికీ ఏమీ చెప్పడట. తెలంగాణా ఒక్కటే తేరగా దొరికింది) చిన్న రాష్ట్రాలుండాలి సరే, యిలా ప్రాంతాల వారీగా ఎందుకు? కొట్టుకు చావడానికా? **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్**

3

సరే ఆయన తర్కమే ఒప్పుకుందాం. 2003లో ఆంధ్రప్రదేశ్ జనాభా స్థాయికి 2009 నాటికి తమిళనాడు చేరి వుంటుందిగా! ఆ లెక్క ప్రకారం 2009లో తమిళనాడును కూడా చిన్న రాష్ట్రాలుగా విడగొట్టవలసిన అవసరం పడుతుందిగా! ఆ మంచి పరిపాలనాభాగ్యం మన ఒక్కరికే అబ్బాలా? పాపం తమిళులు ఏం పాపం చేశారట? వాళ్లకీ అందిద్దాం చిన్న రాష్ట్రాలు – అంటే చిదంబరం అంతెత్తున లేచారు. 'నో వే, 5 వేల సంవత్సరాలుగా అది ఒకే జాతి. ఎప్పటికీ కలిసి వుండాల్సిందే. అటువంటి ఆలోచనలు మొగ్గలోనే తుంచేయాలి' అని.

ఇక్కడ నిన్ను జాతి గురించి ఎవడు అడిగాడయ్యా? ఆంధ్రప్రదేశ్ దగ్గరకు వచ్చేసరికి మంచి పరిపాలన పాయింటు ఎత్తుతావు. తమిళనాడుకి వచ్చేసరికి జాతి మాట ఎత్తుతావ్? ఇదేం న్యాయమయ్యా న్యాయవాదీ! తమిళులదేనా జాతా? తెలుగువాళ్లది జాతి కాదా? మేమంతా సంచార జీవులమా? సభ్యతా, సంస్కృతీ ఎరగనివారమా? మీదెంత ప్రాచీనమో మాదీ అంతే ప్రాచీనం. ఎటొచ్చీ మీరు  అప్పటి పుస్తకాలు దాచుకున్నారు, మేం పారేసుకున్నాం. అంతే తేడా!

ఆంధ్రప్రదేశ్‌ను విడగొడితే తమిళనాడుకి పరిశ్రమలు తరలించవచ్చన్న దుర్బుద్ధి ఆయనకు వుంది అనేదానిపై నేను యితమిత్థంగా చెప్పలేను. ఎందుకంటే ఆయన తన నియోజకవర్గానికే ఏమీ చేయలేదట. అందుకే యింత గొప్ప మేధావీ మొన్న ఎన్నికల్లో చచ్చిచెడీ చాయంగల విన్నపములై, ప్రత్యర్థితో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో గట్టెక్కాడు. నియోజకవర్గానికే చేయనివాడు రాష్ట్రానికి చేస్తాడా? ఏమో!

మన రాష్ట్రం విడగొడితే వాళ్ల రాష్ట్రానికి మేలు జరుగుతుందన్న స్పృహ వుండకపోయినా  పక్క రాష్ట్రాలను విడగొట్టి పాలించాలనే తన థియరీ ప్రయోగించడానికి మనం గినీ పిగ్స్‌లా దొరికాం. విదర్భ విడగొట్టమని అసెంబ్లీ తీర్మానం పంపి ఇరవై ఏళ్లయినా దాన్ని పక్కను పడేసి మనమీద పడ్డాడు. ఆయన్ను అనడం దేనికి లెండి, మనంతట మనమే కొట్టుకుని వాళ్ల దగ్గర చేతులు నలుపుకుంటూ నిలబడ్డాం. చంద్రబాబు హయాంలో, వైయస్ హయాంలో ఢిల్లీని పట్టించుకోకుండా కేరేజాట్‌గా బతికాం. ఇప్పుడు మళ్లీ ఢిల్లీకి సామంతులవడంతో వాళ్లు తమ తడాఖా చూపించారు.

ఇంత చెప్పినా మీరు నమ్మకపోవచ్చు, చిదంబరం స్థానంలో వేరెవరున్నా అంతే అనవచ్చు. ఓ విషయం చెపుతా చూడండి. మాటవరసకి నేనో మంత్రిని, యిప్పుడో యిసుక కుంభకోణం జరిగిందనుకోండి, దానిలో నా అనుయాయి యిరుక్కున్నాడు. ప్రతిపక్షాలు విచారణకి కమిషన్ వేయమన్నాయి. సరేననక తప్పలేదు. అప్పుడేం చేస్తాను? 2010లో జరిగిన కుంభకోణం మాత్రమే కాక అసలు రాష్ట్రం పుట్టుకనుండి జరిగినవన్నీ అనో, లేదా ఇసుక, కంకర, సిమెంటు కుంభకోణాలు అన్నీ కలిపి అనో, లేక గోదావరీ నదీతీరంలో జరిగిన యిసుక కుంభకోణమే కాక, కృష్ణా, తుంగభద్రా, మహానది, మూసీనది యితరత్రా పుష్కరాలు జరిగే నదులన్నిటి తీరాల్లోనూ జరిగిన యిసుక కుంభకోణాలన్నీ కమిషన్ పరిశీలించాలి అని ఓ క్లాజ్ పెట్టేస్తాను గుట్టుచప్పుడు కాకుండా. అంతే ఆ రిపోర్టు తేలేటప్పటికి ఓ దశాబ్దం పడుతుంది. ఈ లోగా నా అనుయాయి ముఖ్యమంత్రి అయిపోయి ఆ కమిషన్నే రద్దు చేసేస్తాడు.

నేనే చిదంబరం స్థానంలో వున్నాననుకోండి. విభజనపై నా వుద్దేశాలు మీకు తెలుసుగా? శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు కూర్చేటప్పుడు 'రాష్ట్రాన్ని ప్రాంతాలవారీగా కాక అడ్డంగా చీల్చే సావకాశాలు కూడా పరిశీలిస్తూ అది యిప్పుడు చేయాలో, 2016 నవంబరు 1 ఆంధ్రప్రదేశ్ అవతరణ డైమండ్ జూబిలీ నాటికి చేయాలో కమిటీ ఆలోచించవచ్చు' అని పెట్టేస్తానన్నమాట. దానిలోనే కమిషన్‌కి వాళ్లనుండి ఏం ఆశిస్తున్నానో తెలిసిపోతుంది. ఆపాటి సావకాశం కూడా లేకపోతే మంత్రి కావడం దేనికి?

చిదంబరం గారికి రాష్ట్రాన్ని చీల్చాలన్న మహోద్దేశ్యం లేకపోతే డిసెంబరు 9 నాటి స్టేటుమెంటును 'క్వాలిఫై' చేసి వుండేవారు. ఈ కమిటీ ఏర్పాటు గురించి ఎనౌన్సు చేసి వూరుకునేవారు. ఎవరూ అడక్కుండానే విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తామని ప్రకటించి ప్రభుత్వం హింసను సహిస్తుందని చాటిచెప్పేవారు కారు. మహానుభావుడు డిసెంబరు 9 ప్రకటనతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి వదిలిపెట్టాడు. ప్రత్యేకరాష్ట్రం వస్తే సరేసరి, లేకపోయినా సరే అనుకుని తటస్థంగా వున్నవారిలో సైతం ప్రత్యేక బీజాలు నాటి రాష్ట్ర చరిత్రను మలుపు తిప్పిన వ్యక్తిగా చరిత్రలో స్థానం సంపాదించుకున్నాడు.

బజెట్ గురించి రాయమని కొందరు అడిగారు. నిజం చెప్పాలంటే కొన్ని సంవత్సరాల క్రితం దాకా నేను బజెట్‌ను తెగ స్టడీ చేసేసేవాణ్ని. తర్వాత తర్వాత ఇంట్రెస్ట్ పోయింది. బజెట్ అనేది ఓ ఏడాది ప్రణాళిక. దానిలో చేయబోయే పనులు, వేయబోయే పన్నులు అన్నీ వివరంగా వుండాలి. దానికి కట్టుబడాలి. కెవి రెడ్డిగారు స్క్రీన్ ప్లే రాసుకుని దాని నుండి అక్షరం జరగకుండా వుండేవారంటారు చూశారూ, అలా వుండాలి. ఇప్పుడు జరుగుతున్నదేమిటి? బజెట్‌కి ముందే పన్నులు వడ్డించేస్తారు. బజెట్‌లో పన్నులు లేవని చంకలు గుద్దుకుని మనను నమ్మమంటారు. అలాగే ఏడాది మధ్యలో ముఖ్యమంత్రో, ప్రధానమంత్రో చటుక్కున ఓ స్కీము ఎనౌన్సు చేసేస్తారు. దానికి బజెటరీ ఎలాట్‌మెంట్ వుందా లేదాన్న పట్టింపే లేదు. ఇలా ఎనౌన్సు చేసేకాడికి బజెట్ ఎందుకు?

ఏ బజెట్ వచ్చినా ప్రతిపక్షాలవారు పెదవి విరుస్తారు. ఇంకేం విరగదీయలేక కాబోలు. పొజిషన్‌లో వున్నవారు చాలా 'ఇమాజినేటివ్' బజెట్ అని మెచ్చుకుంటారు. స్థానాలు మారినపుడు వారు వీరవుతారు. విరుపు పక్షం మెరమెచ్చుపక్షం అవుతుంది, అండ్ వైసీ వెర్సా.

ఇక బజెట్ ఎలాట్‌మెంట్స్ పెద్ద బోగస్. ఏడాది సగం గడిచేదాకా పైసా విదల్చరు. ఆ తర్వాత ప్రతిపాదనలు తొక్కి పెడతారు. చివరకు మార్చి నెలలో అడ్డగోలుగా శాంక్షన్‌లు, కొనుగోళ్లు, జేబుతడుపులు. ఎంత తొడతొక్కిడైనా చివరకు నిధులు ఖర్చు చేయలేకపోతారు. అందువలన వచ్చేఏడాది కేటాయింపుల్లో కట్ అంటారు. ఎందుకీ గేమ్? ఏడాది పొడుగునా ఖర్చు చేసేట్లా ఎందుకుండదు మెకానిజమ్? అందుకే బజెట్ గురించి పైపైన చదవడం తప్ప స్టడీ చేయడం మానేశాను.**– ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 10** **ఎమ్బీయస్ – 'బాయిలో తోశారు..'**

'వాళ్లు గద్దన పడి, మమ్మల్ని బాయిలో తోశారు..' అని వాపోయారు కెసియార్.

మిమిక్రీ ఆర్టిస్టులు చేసే ఐటమ్ ఒకటుంది – ఒక సినీతార స్విమ్మింగ్‌పూల్‌లో పడిపోయి ఆర్తనాదాలు చేస్తోంది. గట్టుమీద వున్న మగతారలందరూ నువ్వంటే నువ్వు అంటున్నారు తప్ప ఎవరూ దూకి ఆమెను రక్షించటం లేదు. ఇంతలో ఒక నటుడు దబ్బున పూల్‌లో పడి కాస్సేపటికి ఆమెతో సహా బయటకు తేలాడు. అందరూ అభినందిస్తూ వుంటే అతనడిగిన ప్రశ్న యిది – 'ఇంతకీ నన్ను స్విమ్మింగ్ పూల్‌లో తోసినవాడెవడు అది చెప్పండి ముందు..' అని.

కెసియార్ కథ అలాగే వుంది. తెరాస రాజీనామాలు చేయాలని ఎవ్వరూ అడగలేదు. తామే ఎక్కువ నిజాయితీపరులమని చూపించుకోవాలనే వుబలాటంతో తనతో బాటు రాజీనామా ప్రకటించిన క్రెడిట్ కూడా యితర పార్టీలకు దక్కనీయకుండా, తనూ, జానారెడ్డీ కలసి ప్రారంభించిన జెఎసికి మాటమాత్రం చెప్పకుండా, రాజీనామాలు ప్రకటించినది కెసియారే. శ్రీక ృష్ణ కమిటీ విధివిధానాలను యిప్పుడున్న విధంగా కూర్చడం తెలంగాణాను మళ్లీ మోసగించే ప్రయత్నమే అని ఆరోపిస్తూ తమ పార్టీ శాసనసభ్యులూ, పార్లమెంటు సభ్యులూ రాజీనామా చేయబోతున్నాం అని అందరికంటె ముందే ప్రకటించారాయన. ఇతర పార్టీల వాళ్లు రాజీనామా చేయబోతే ప్రజలే వారి భరతం పడతారన్నారు.

ఇలా పెద్ద మాస్టర్ ప్లాన్ వేసి కేసియార్ తన లెజిస్లేటర్ల చేత రిజైన్ చేయించాడు. తక్కిన పార్టీల వాళ్లు చేయరని ఆయనకు ముందే తెలుసు. తెలంగాణాకై కంకణం కట్టుకున్న ఏకైక వీరుడిగా తనను తాను ఎస్టాబ్లిష్ చేసుకుని, తక్కినవాళ్లు మాటమార్చే దొంగలని అందరికీ తెలిసిన సత్యాన్నే మళ్లీ మళ్లీ నిరూపించదలచుకున్నాడు. తన సైన్యం చేత, ఎబివిపి వారి చేత కాంగ్రెస్ టిడిపివారిచేత దాడి జరిపించారు ఆయనా, కోదండరామూ. ఒత్తిడికి లొంగి వాళ్లు రాజీనామా చేసినా ఆ క్రెడిట్ తెరాస ఎక్కవుంట్లోనే పడుతుంది తప్ప వాళ్లు స్వచ్ఛందంగా చేసినట్లు వుండదు కదా. అంటే పదవుల క్షవరం వాళ్లకు, పట్టం వీరికి. తెరాసకు కూడా పదవుల క్షవరం జరిగినా, వాళ్లది చిన్నపాటి క్షవరం. టిడిపి, కాంగ్రెస్‌లది తిరుక్షవరం.

ఈ ప్లాను అమలులో చీదేసింది. ఓ వారంపాటు పిడకలు, కార్లమీద రాళ్లు, యింటిముందు ధర్నాలు పనిచేశాయి కానీ త్వరలోనే దాడి చేయబడినవారు కోలుకున్నారు. తమ నియోజకవర్గంలో, తమ చేత ఓడింపబడిన పార్టీలు కుర్రకారు ఓ ఏభైమందిని పోగేసుకుని వచ్చి యింటిమీదపడి తమ పరువు తీస్తూంటే చేతులు ముడుచుకుని కూచోవడమా? అనుకున్నారు. ఏ హెచ్చరికలు వెళ్లాయో, ఎందుకు వుత్సాహం జారిందో తెలియదు కానీ దాడులు చప్పబడ్డాయి. కాంగ్రెస్, టిడిపిలు రాజీనామా జాన్తానై అని చెప్పేశారు. కాంగ్రెస్ నిర్మొగమాటంగా చెప్తే, టిడిపి డొంకతిరుగుడుగా చెప్పింది.

ఇక తెరాస వట్టిచేతుల్లో మిగిలింది. తామనుకున్న రాజకీయ సంక్షోభం రాలేదు, ఉపయెన్నికలు వస్తున్నాయి. పోనీ వాటిలోనైనా గ్యారంటీగా నెగ్గుతామన్న ధైర్యం వుందా? ఓయూ జాక్‌వాళ్లు మీరు నిలబడవద్దు, అమరవీరుల కుటుంబాల కాండిడేట్స్‌ని పెట్టండి అంటున్నారు. వాళ్లను నిలబెట్టడానికా యింత ప్లాను వేసినది!? రేపు ఉపయెన్నికలలో ప్రతి నియోజకవర్గం నుండి తెరాస, కాంగ్రెసు, టిడిపి, కాండిడేట్లు ఖచ్చితం.

కాలం కర్మం కలిసి రాకపోతే ఓయూ జాక్ మద్దతుతోనో లేక తమంతట తామో ఆత్మహత్యల కాండిడేట్ కూడా నిలబడవచ్చు. ఈ ఓట్ల చీలికలలో ఎవరు గెలుస్తారో? ఎవరు ఓడతారో? కొంపదీసి తెరాసకు రెండు సీట్లు పోయినా – తెలంగాణావాదం చప్పబడింది, సన్నగిల్లింది, నీరసించింది వంటి వ్యాఖ్యలు తప్పవు. ఎన్నికల కెళ్లినప్పుడల్లా బలం క్షీణింపజేసుకునే ఓ ఆనవాయితీ తెరాస పాటిస్తోంది. ఈ సారీ ఆ ఆనవాయితీ నిలబెట్టుకుందంటే పరువు పతనమై పవళించడం ఖాయం.

ఒక్క ఓటు– రెండు రాష్ట్రాలు అని హోరెత్తించేస్తూ, తెరాస తోక పట్టుకుని యీదుతున్న బిజెపి పరిస్థితి కూడా అంత గొప్పగా లేదు. ఉన్న యిద్దరిలో ఒకతనిచేత రిజైన్ చేయించారు కానీ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఫ్లోర్ లీడర్ కిషన్‌రెడ్డి చేయలేదు. ఎందుకంటే ఆయన నియోజకవర్గం జంటనగరాల్లో వుంది. అక్కడ విభజనవాదానికి నూకలు చెల్లవని తెలుసు కాబట్టి ఆయన ఆ వాదంపై మళ్లీ నిలబడి గెలవడని పార్టీ హై కమాండ్‌తో సహా అందరికీ తెలుసు. అందుకే చేయవద్దన్నారు. టిడిపివాళ్లు కిషన్‌రెడ్డి చేయలేదేం? అని విద్యాసాగరరావుని అడిగితే, మా సంగతి మేం చూసుకుంటాం అని పెడసరంగా సమాధానం చెప్పాడు.

రిజైన్ చేసిన బిజెపి కాండిడేట్ మళ్లీ నెగ్గుతాడా లేదాన్న వర్రీ వాళ్లది. కితం సారి పిఆర్పీ అభ్యర్థి రంగంలో వుండి ముస్లిం ఓట్లు పట్టుకుపోతే నెగ్గాడు. ఈ సారి తెలంగాణాలో పీఆర్పీ పార్టీయే లేదు. వీళ్లే ఎవరైనా ముస్లిం కాండిడేట్‌ను బతిమాలి పెట్టుకోవాలి, ఓట్లు చీల్చరా నాయనా అని. ఇలాటి పరిస్థితిలో కిషన్‌రెడ్డి కూడా చేజారిపోతే ఎలా? అందుకే విభజనవాదాన్ని నమ్ముకున్న తన

స్టేటుమెంట్లతో రెచ్చిపోతున్న విద్యాసాగరరావు పార్టీ కూడా వుపఎన్నికల తర్వాత తెరాస చూపిన మార్గంలో తన బలాన్ని సగానికి సగం చేసుకోవచ్చు.

ఈ గోడమీద రాత చూసే తెరాస భయపడుతోంది. తాను మోసపోయానని వాపోతోంది. మా అమ్మాయి చిన్నప్పుడు పక్కింటివాళ్ల కుర్రాళ్లను పిలిచి వాళ్ల నెత్తిమీద యిసుక పోసేది. వాళ్లు పోయించుకోకపోతే తనకేదో అన్యాయం జరిగిపోయినట్టు ఏడుపు లంకించుకునేది. కెసియార్ వరస అలాగే వుంది. తను తీసిన గోతిలో టిడిపి, కాంగ్రెస్ పడకుండా తప్పించుకున్నారన్న ఉక్రోషంతో వాళ్లే తమను నూతిలో తోసేశారని ఆక్రోశిస్తున్నారు.

నీతి – దూకుడు అన్నివేళలా మంచిది కాదు – **ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 11** **ఎమ్బీయస్ – టార్గెట్ టిడిపి**

ఇందిరాపార్కు సంఘటన గమనించినవాళ్లకు తెలంగాణాలో టిడిపి ఎదుర్కొంటున్న యిబ్బంది కళ్లకు కట్టినట్టు కనిపించింది. వాళ్ల మానాన వాళ్లు సభ జరుపుకుంటూ వుంటే వీళ్లు వెళ్లడమేమిటి? చంద్రబాబును తిట్టడమేమిటి? దెబ్బలాట జరిగితే చంద్రబాబు క్షమాపణ చెప్పాలనడమేమిటి?

తెలంగాణా సమస్య ఎప్పటికీ తేలటం లేదు. కమిటీ రిపోర్టు వచ్చేవరకు దాని గురించి మాట్లాడేందుకు ఏమీ లేదు. ఏం మాట్లాడితే ఎవరితో ఏం చిక్కో తెలియదు. అందువలన దాని గురించి పన్నెత్తి పలకకుండా ఈ లోపున ప్రధాన ప్రతిపక్షంగా కాస్తయినా హడావుడి చేయకపోతే ఉప్పూ పత్రీ లేకుండా పోతామని టిడిపి ఆరాటపడడం సహజమే. అందుకని 'సహజమిత్రులు' (ఇలాటివాటిల్లోనే సుమండీ, రేపు సీట్ల పంపిణీ వద్దకు వచ్చేసరికి మీకు బలం లేదు రెండివ్వడమే ఎక్కువ అంటాడు బాబు) లెఫ్ట్‌ను వెంటేసుకుని ఇందిరా పార్కులో తన పని తను – అదే, ప్రభుత్వాన్ని తిట్టిపోయడం – చేసుకుంటున్నాడు.

ఇంతలో దిగారండీ, న్యాయవాదులంటూ. ఎఱ్ఱచీర కట్టుకున్నవాళ్లందరూ నా పెళ్లాలు కానట్టే నల్లకోటు వేసుకున్నవాళ్లందరూ న్యాయవాదులు కారు. స్వతంత్ర భారత పౌరుడికి ఆ మాత్రం హక్కు లేదా? అనవచ్చు మీరు. ఉంది, కానీ నల్లకోట్లు వేసుకుని వెళ్లడం ఎందుకండీ బాబూ! వెళ్లి గోలచేసి నలుగుర్ని తన్ని, వాళ్లొకటి తగిలించగానే 'న్యాయవాదులపై అమానుష దాడి' అంటూ రెచ్చిపోవడానికా? లాయర్లకు సమాజం గోడు ఎక్కువగా పట్టించుకుంటారు, స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నవారిలో కూడా లాయర్లు ఎక్కువ అని లాజిక్ లాగకండి. వాళ్లెవరూ కర్రలు పట్టుకుని ఎదుటివాళ్ల మీటింగుకి వెళ్లలేదు. దెబ్బలు తిని జైళ్లకు వెళ్లారు.

టిడిపిపై, మీదుమిక్కిలి చంద్రబాబుపై దాడి చేసినవారికి తెరాస, కాంగ్రెస్ మద్దతు వుందని చంటిపాపైనా చెప్పగలుగుతుంది. దాడి తర్వాత బాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన వాళ్లు వాళ్లే కాబట్టి! దీన్ని సమర్థిస్తే రేపు వాళ్ల మీటింగులపై ఏ మజ్లిస్ వాళ్లో లేదా టిడిపివాళ్లో వచ్చిపడవచ్చన్న యింగితం కూడా లేదు వీళ్లకు.

ఇంత అక్కసుకి కారణం – టిడిపికి తెలంగాణాలో వున్న బలం! తెలంగాణా బాగుకైచిత్తశుద్ధితో శ్రమించినవారిలో అగ్రస్థానం ఎన్టీయార్‌దే. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు, బిసిలకు రాజకీయప్రాబల్యం, మతసామరస్యం, హైదరాబాదులో సుస్థిరత, ఎదుగుదల – యివన్నీ ఆయన పుణ్యమే. అందుకే టిడిపికి గ్రాస్‌రూట్ లెవెల్‌నుండి తెలంగాణాలో కార్యకర్తలు, సమర్థకులు వున్నారు. ఎన్టీయార్ తర్వాత బాబుకి కూడా ఆ బలం వారసత్వంగా వచ్చింది. ఆయన నిలబెట్టుకున్నాడు.

అయితే 2004లో చంద్రబాబును ఓడిద్దామని రాష్ట్రప్రజలందరూ మూకుమ్మడిగా నిర్ణయించుకోవడంతో తెలంగాణాలోనూ ఓడిపోయింది టిడిపి. ఆ ఓటమికీ, సమైక్యవాదానికీ ముడిపెట్టి 2009 కల్లా ప్రత్యేకవాదానికి మొగ్గు చూపారు బాబు. ఆ లెక్క తప్పని 2009 ఎన్నికలు తేల్చేశాయి. టిడిపి తెలంగాణాలో 59 స్థానాల్లో పోటీ చేసి 65% స్థానాలు అంటే 39 నెగ్గింది. తెరాస 10 స్థానాల్లో అంటే పోటీచేసిన వాటిల్లో 22% స్థానాల్లో మాత్రం గెలిచింది. గ్రేటర్ హైదరాబాదులో బలంగా వున్న సమైక్యవాదం వలన టిడిపి ఘోరంగా దెబ్బతింది కానీ లేకపోతే కాంగ్రెస్‌తో సమానంగా గెలిచేదే!

ఈ విషయాన్ని అర్థం చేసుకున్న బాబు ప్రత్యేకవాదంపై మరీ అంత జోరు అక్కరలేదని తేల్చుకున్నారు. కానీ మాటమారిస్తే పరువుపోతుంది. అందువలన పైకి ప్రత్యేకవాదం పఠిస్తూ, లోపల సమైక్యవాదానికి మొగ్గు చూపుతూ నెగ్గుకొస్తున్నాడు బాబు.

ఆ మాటకొస్తే కాంగ్రెస్ చేస్తున్నదీ అదే. ప్రత్యేకవాదానికి బలమెంతో తేలకుండా నోరువిప్పడానికి భయపడుతోంది. జస్టిస్ శ్రీకృష్ణ కూడా యీ యిబ్బంది గమనించే ఒక్కో పార్టీ ఎన్ని అభిప్రాయాలైనా చెప్పుకోవచ్చు. మీ మనుసులో భావాన్ని మేమే గ్రహిస్తాం అని చెప్పారు. ఇప్పటికిప్పుడు చంద్రబాబు మనసులో మాట తెలుసుకునీ ప్రయోజనం లేదు. వ్యవహారం కమిటీ ఎదుట వుంది. కమిటీ దోపిడీ గురించిన నిజానిజాలు వెలికి తీస్తుంది. ఆ వాస్తవాల వెలుగులో ఏ పార్టీ ఐనా తూనాబొడ్డు అంటే అనవచ్చు, లేదా మా కుందేటికి మూడు కాళ్లనవచ్చు. వాళ్ల యిష్టం.

కమిషన్ రిపోర్టు వచ్చేలోపున బాబును రాజకీయంగా ఫినిష్ చేయాలన్న ఆరాటమే తెరాసవర్గాల్లో కనబడుతోంది. దీనికి వారికి కాంగ్రెస్‌వారి మద్దతు తోడవుతోంది. లేకపోతే హెరిటేజి సంస్థలపై దాడులేమిటండీ? హెరిటేజి వస్తువులు కొనగూడదన్న హుకుంలేమిటి? బాబును ఆర్థికపరంగా కూడా దెబ్బతీద్దామన్న కుట్రే కనబడుతోంది దీనిలో.

ఉస్మానియాలో పరామర్శ కెళితే ఆగం ఆగం చేసి నాగంను పడవేసి తొక్కినపుడే తెలిసింది – టిడిపిని తొక్కివేద్దామనే ప్రయత్నిస్తున్నారని. ఉస్మానియా జాక్ వాళ్లు చేసిన సూచన బాగుంది, నేను రిజైన్ చేస్తా అని మైనంపల్లి అన్నపుడు మెచ్చుకోకపోగా అతన్ని విమర్శించినప్పుడే తెలిసింది టిడిపిని వదలటం లేదని. మైనంపల్లి ఆఫర్‌లో రాజకీయపు ఎత్తు వుంది. ఎత్తులు వేయనిదే రాజకీయం ఎక్కడుంది? అంతమాత్రం చేత తిట్టనక్కరలేదు. బాగుంది అని వూరుకోవచ్చు. టిడిపి వాళ్లు ఏం చేసినా తప్పే. అదే తప్పు కాంగ్రెస్‌వాళ్లు చేస్తే మాత్రం గప్‌చుప్.

వ్యవహారం చూస్తూంటే తెరాస టిడిపిని తెలంగాణానుండి తరిమివేసి కాంగ్రెస్ సాయంతో ఆ స్థానం ఆక్రమిద్దామని చూస్తోందని అర్థమౌతోంది. అప్పుడు కాంగ్రెస్‌తో నేరుగా తలపడవచ్చని దాని ప్రణాళిక కావచ్చు. అలా బలపడిన రోజున ఈ కడియం, ఎర్రబెల్లి, అయితే గియితే నాగం అటు చేరినా ఆశ్చర్యపడనక్కరలేదు. నా యీ అనుమానానికి కారణం ఇందిరా పార్కు ఘటనపై కడియం క్షమాపణ చెప్పడం – తప్పు టిడిపివాళ్లదైనట్లు. బాబును తిడితే అతనికి నొప్పి కలగలేదు కానీ, దాడికి వచ్చినవాడు గాయపడితే మాత్రం గుండెల్లో ముల్లు గుచ్చుకుంది. కోదండరామ్ బాబును తిడుతున్నా జెఎసి చూరు పట్టుకుని వదలని ఎర్రబెల్లి, నాగంలపై కూడా నాకు డౌటే. కాంగ్రెస్‌లో వుండి 'చిరు'గీతాలు వల్లించి, వైయస్‌ను అసమర్థుడిగా, అవినీతిపరుడిగా అందరిముందూ చిత్రీకరించి ఆ తర్వాత చిరు పార్టీలోకి దూకిన కోవర్టు హరిరామజోగయ్య కథ యింకా పాతబడలేదు కాబట్టి నాబోటివాడికి యీ అనుమానాలు వస్తే తప్పేముంది? **– ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 12, 2010** **ఎమ్బీయస్ – శ్రీకృష్ణ కమిటీకి నా లేఖ – 1**

శ్రీకృష్ణకమిటీకి నేను లేఖ రాస్తానని యీ కాలమ్‌లో రాసిన తర్వాత చాలామంది అడిగారు. ఏదీ రాశారా? మాకూ కాపీ పంపండి అంటూ. మార్చి 22 వరకు గడువున్నా యివాళే పూర్తి చేసి పంపేశాను. దాన్ని మన గ్రేట్ ఆంధ్రా ఇంగ్లీష్ వెర్షన్‌లో 'ఎమ్బీయస్– టు శ్రీకృష్ణ కమిటీ' అనే పేర అప్‌లోడ్ చేయించాను. నా అభిప్రాయాలతో ఏకీభవించినవారు దీన్ని శుభ్భరంగా కాపీ పేస్టు చేసుకుని నా పేరుకు బదులు వారి పేరు పెట్టుకుని పంపించేసుకోవచ్చని చెప్పాను. (కమిటీవారి ఈ మెయిల్ కూడా యిచ్చాను). కమిటీవారికి నా పేర పంపించే వుత్తరంలో 'నేను ఫలానా కాలమిస్టును. నాలా ఆలోచించే పాఠకులను యిదే లేఖ పంపమని చెప్పాను. ఇలాటి లేఖలు మీకు వందలాది చేరితే అది మా అందరి సామూహిక ఆలోచన అని గ్రహించండి' అని రాశాను.

అలా పంపేవారిని నాకు కాపీ పెట్టమని చెప్పలేదు కానీ రెండు గంటలు తిరిగేసరికి 50 మందినుండి నాకు మెయిల్స్ వచ్చాయి. వాళ్లు కమిటీకి యీ లేఖ పంపుతూ నాకు కాపీ ఎండార్స్ చేశారు. కొందరు అభ్యంతరాలు తెలిపారు కూడా. అవన్నీ చెప్పేముందు అసలు లేఖలో ఏం రాశానో చెప్తాను.

కమిటీవాళ్లకు ఇప్పటికే ఏడువేల మెమోరాండంలు వచ్చాయట. వాటిలో చాలాభాగం ఒక పేజీవట.(నాది రెండు పేజీలకు కాస్త మించింది). అవన్నీ చదువుతారో లేదో నన్న బెంగ మనకు వుండడం సహజమని గ్రహించిన దుగ్గల్ గారు అన్నీ చదువుతున్నాం, దానికోసం మనుష్యులు పెట్టాం అన్నారు. తెలుగులో రాస్తే దాన్ని అనువదించే సమస్య వుంది, మనకొచ్చిన ఇంగ్లీషులోనే రాసేస్తే మంచిది కదా అనుకున్నాను.

సాధారణంగా విషయమంతా రాసి, అందువలన.. అని పాయింటు రాస్తారు. కమిటీవాళ్ల ఓపిక ఎంతో తెలియదు కాబట్టి నేను చెప్పబోయేది ముందే సబ్జక్ట్‌లోనే రాసేశాను – 'రాష్ట్రవిభజన ఇప్పుడు కాదు – తర్వాతికాలంలో అడ్డంగా (హారిజాంటల్)గా విభజించాలి' అని. తర్వాత ముచ్చటగా మూడే పాయింట్లలో విషయం రాశాను. 01) ప్రస్తుత పరిస్థితుల్లో విభజన వద్దు. 2) జనాభా అలవికానంత స్థాయికి చేరినపుడు విడగొట్టాలి 3) అలా విడగొట్టినపుడు వనరులు సవ్యంగా విభజించబడడానికి, సర్వతోముఖ అభివృద్ధికి అడ్డంగా విడగొట్టాలి. అని. తర్వాత ఒక్కో అంశం కింద బుల్లెట్స్‌తో కారణాలు చెప్పుకుంటూ వచ్చాను.

మొదటి పాయింటు కింద – వెనుకబాటుతనం స్థానిక నాయకత్వలోపం వలన ఏర్పడుతుంది. అది విభజనకు సవ్యమైన కారణం కాదు. వికేంద్రీకరణ చేయకపోవడం వలన, దుష్పరిపాలన వలన రాష్ట్రమంతా వెనుకబడిన ప్రాంతాలు ఏర్పడ్డాయి. దూరదృష్టిలేని నాయకుల వలన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు హైదరాబాదులోనే ప్రభుత్వ పెట్టుబడులు కుమ్మరించారు. దానివలన రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారే కాదు, యితర రాష్ట్రాలవారు కూడా హైదరాబాదులో పెట్టుబడులు పెట్టారు. పరిసర ప్రాంతాలలో జరిగిన అభివృద్ధి కారణంగా హైదరాబాదు యిరుప్రాంతాల మధ్య వివాదాస్పద అంశంగా తయారై దశాబ్దాల తరబడి సాగే లిటిగేషన్‌కు కేంద్రంగా మారుతుంది.

చేసుకున్న ఒప్పందాల ఉల్లంఘనకు స్వార్థపరులైన ఒక ప్రాంతపు రాజకీయనాయకులను, వారికి తందానతాన అనే యితర ప్రాంతపు నాయకులను, గుడ్లప్పగించి చూసిన కేంద్రప్రభుత్వంలను నిందించాలి కానీ సామాన్యప్రజలను యిలా శిక్షించకూడదు. అనేక అసత్యాలు, అర్ధసత్యాలు ప్రాచుర్యంలోకి వచ్చి విద్యార్థులను, కొన్ని ఉద్యోగి వర్గాలను భావోద్వేగాలకు గురిచేయడం జరుగుతోంది. ఇటువంటి ఉద్రేక స్థితిలో విడగొడితే విభజన గాయాలు రాష్ట్రప్రజలను పలుసంవత్సరాల పాటు పట్టి పీడిస్తాయి. మీ కమిటీ ఏర్పడిన తర్వాతనే రాజకీయపక్షాలు సమాచార సేకరణకు ఉద్యమించాయని గ్రహించాలి. నీరక్షీరన్యాయంతో మీరు నిజానిజాలు గ్రహించి

అన్ని జిల్లాలను సమానస్థాయికి తెచ్చేందుకు వెనుకబాటుతనాన్ని రూపుమాపే యంత్రాంగాన్ని సూచిస్తారని నా గట్టినమ్మకం.

ఇక రెండో పాయింటుకు కారణాలు ఏం రాశానంటే – తెలుగువారిది ఒకే సంస్కృతీ వారసత్వం. ఒకటే భాష 156 సం॥ఎలు (1800–1956) తప్ప విడిచి వేలాది సంవత్సరాలుగా కలిసి వున్నారు. 20 వ శతాబ్దపు తొలినాళ్లనుండీ కోస్తా, సీమలనుండి అనేక కుటుంబాలు మెరుగైన అవకాశాలకోసం, ఉద్యోగాల కోసం తెలంగాణా ప్రాంతాలకు తరలివచ్చాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ యీ ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. ఇప్పుడు 'నేటివ్' (అసలైన) తెలంగాణావాసి ఎవరో, ఎవరు కాదో తెలియనంతగా కలిసిపోయారు. ఆంధ్రప్రాంతంనుండి వచ్చిన అనేకమంది సాంకేతికంగా చూస్తే యిప్పుడు తెలంగాణావారు. వివిధ ప్రాంతాల మధ్య సమైక్యత ఎంత గాఢంగా జరిగిందంటే ప్రాంతాలవారీగా వారిని విభజించడమనేది అత్యంత క్లిష్టమైన వ్యవహారం. ఒకే కుటుంబంలోని సభ్యులు వేర్వేరు ప్రాంతవాసులుగా నిర్వచించబడే సందర్భాలు కోకొల్లలు.

అందరూ కలిసి వుండడమనేది ఒక ఆదర్శప్రాయమైన పరిస్థితి. కానీ జనాభా 10 కోట్లకు చేరినపుడు అప్పుడు సుపరిపాలనకై రాష్ట్రాన్ని 5 కోట్ల జనాభాగల రెండు రాష్ట్రాలుగా చీల్చడం మంచిది. అలాటి విభజన చేపట్టినపుడు అది ప్రాంతాలవారీగా జరగకూడదు ఎందుకంటే అది ప్రాంతీయవాదాన్ని పురికొల్పి కొత్తరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆ భూతం దాన్ని సతాయిస్తుంది. అందువలన సెంటిమెంట్ల జోలికి పోకుండా, పాలనాసౌలభ్యాన్ని ద ృష్టిలో పెట్టుకుని రాష్ట్రాన్ని రెండు భాగాలుగా చేయాలి.

2

ఇక మూడోపాయింటు కింద యిచ్చిన కారణాలు – రాష్ట్రవిభజన చేపట్టినపుడు అది అడ్డంగా (హారిజాంటల్‌గా) ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లు, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లుగా ఏర్పడేట్లు చేయాలి. రెండింటిలోనూ సమాన జనాభా, సమాన విస్తీర్ణం వుండేట్లు చేయాలి. రెండింటికి పొడవైన తీరప్రాంతం వుండాలి. రాబోయే కాలంలో ఇంధనాన్ని పొదుపు చేసే జలరవాణా వూపందుకుంటుంది. ఈ రెండు రాష్ట్రాలలో ఏదీ కోస్తా సౌలభ్యాన్ని కోల్పోకూడదు.

ఈ రెండు రాష్ట్రాలకు హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా వుండవచ్చు. లేదా రెండు భాగాలుగా విభజించి రెండు రాష్ట్రాల మధ్య పంచవచ్చు. హైదరాబాదు వంటి మరో రాజధానిని నిర్మించడానికి ఎంతో సమయం, మరెన్నో నిధులు వెచ్చించాలి. ఈ విధంగా చేయడం వలన మిగిలే నిధులను జలయజ్ఞం పూర్తి చేయడానికి వుపయోగించవచ్చు.

రెండు రాష్ట్రాలలోనూ అభివ ృద్ధి చెందిన జిల్లాలు కొన్ని, చెందని జిల్లాలు కొన్ని వుంటాయి. వాటి రెండింటినీ జోడించడం వలన రెండు ప్రాంతాలూ వేగంగా అభివ ృద్ధి చెందుతాయి. అభివ ృద్ధి చెందిన జిల్లాలలోని చురుకైన వ్యక్తులు విస్తరించడానికి అభివ ృద్ధి చెందని జిల్లాలు అవకాశాలు కల్పిస్తాయి. వారిని చూసి స్థానికులు ఉత్తేజం పొంది పోటీ పడి పైకొస్తారు.

ఆంగ్లేయుల పాలనలో తక్కిన తెలుగువారు పొందిన సౌకర్యాలు నిజాం ఫ్యూడల్ పరిపాలన కింద నలిగిన తెలంగాణావాసులకు దక్కలేదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినతర్వాత కోస్తా, సీమవాసుల సాంగత్యంలో తెలంగాణాలోని సామాన్యప్రజలు అతి త్వరగా నేర్చుకుని అతితక్కువ కాలంలో ఎంతో ప్రగతిని సాధించగలిగారు. అణగారిన వర్గాలనుండి కొత్త నాయకత్వం పుట్టుకుని వచ్చి పాత జమీందారీ తరహా నాయకులను సవాలు చేస్తోంది. ప్రాంతాలవారీ విభజన ఈ ప్రక్రియకు అవరోధంగా మారుతుంది.

అడ్డంగా విభజించడం వలన ఏర్పడే ఉత్తర ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర తెలంగాణా జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలతో బాటు సారవంతమైన భూమిగల జిల్లాలు కొన్ని వుంటాయి. దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ, దక్షిణ తెలంగాణా జిల్లాలతో బాటు కొన్ని సారవంతమైన జిల్లాలు వుంటాయి. రెండింటికీ అభివ ృద్ధి చెందిన నౌకాశ్రయాలు వుంటాయి.

జనాభా 10 కోట్లకు చేరి ఈ విభజన అవసరం పడడానికి కొంత సమయం పడుతుంది. ఈలోపున మీరు సేకరించి నిర్ధారించిన సమాచారం ప్రకారం ప్రాంతాల మధ్య అసమానతలను సరిదిద్దే చర్యలు రాష్ట్రప్రభుత్వం చేపట్టవచ్చు. వివిధ ప్రాంతాల మధ్య ఏదైనా ఒప్పందం జరిగే మాటయితే దాని అమలును పర్యవేక్షించే యంత్రాంగం కేంద్రప్రభుత్వం అజమాయిషీలో వుండాలి. మెట్రో ప్రాజెక్టుతో సహా హైదరాబాదులో యికపై పెట్టుబడులు ఆపివేసి రాష్ట్రమంతా ఆ పెట్టుబడులను పంచి అన్ని జిల్లాలు సమానంగా అభివ ృద్ధి చెందేట్లు చూడాలి.

మీ కమిటీ మాకు వెలుగు చూపించే ఆశాకిరణం వంటిది. ప్రాంతాల వెనుకబాటుతనాన్ని, దానికి కారణాలను మీరు సమర్పించే నివేదిక వెలుగులోకి తెచ్చి మా అందరి కళ్లు తెరిపిస్తుందని విశ్వసిస్తున్నాం. తెలంగాణా సమస్య గురించి నిజాయితీగా పట్టించుకుని చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థ మీదొక్కటే అనే నమ్మకంతోనే యీ లేఖ రాస్తున్నాను.

నేను గ్రేట్ ఆంధ్రా డాట్‌కామ్ అనే ఒక ప్రజాదరణ పొందిన వెబ్‌సైట్‌లో కాలమిస్టును. నాలాగానే ఆలోచించేవారందరినీ యీ లేఖ కాపీలను వారివారి అడ్రసులతో పంపమని కోరుతున్నాను. ఇదే లేఖ యొక్క వందలాది కాపీలు మీకు చేరితే విద్య, విశాలద ృక్పథం, సామాజిక స్ప ృహ కలిగిన తెలుగువారి సామూహిక అభిప్రాయంగా దాన్ని స్వీకరించగోర్తాను.

ఇదీ నా లేఖ సారాంశం. నా అభిప్రాయమే మీ అభిప్రాయమైతే క్రింది లింక్ మీద కొట్టి చూడండి. నా ఇంగ్లీషు ఆర్టికల్ వస్తుంది. దానిలో నా పేరు బదులు మీ పేరు అడ్రసు రాయండి. ఇటాలిక్స్‌లో రాసిన 'నేను కాలమిస్టును..' తీసేయండి. (కొందరు తీయడం

మర్చిపోతున్నారు) దుగ్గల్‌గారికి పంపడానికి రెండు నిమిషాలు పట్టదు. కమిటీవాళ్లు చూస్తారో లేదో తెలియదు కానీ మన సామాజిక బాధ్యత మనం నిర్వర్తించామని తృప్తి మనకుంటుంది.

ఇది ఇంగ్లీషులో అప్‌లోడ్ చేశాక కొందరు అభ్యంతరం తెలిపారు. 'మీ అభిప్రాయమే వందలాది అభిప్రాయమని ఎలా చెప్తారు? నేనొక్కణ్నే వెయ్యి కాపీలు పంపితే వెయ్యిమంది అభిప్రాయం అవుతుందా?' అని ఒకరు ప్రశ్నించారు. నేను పంపినది ఒక్కటే లేఖ. కానీ నా లేఖనే వందమంది వారి వారి వ్యక్తిగత ఈమెయిల్స్‌నుండి వారి అడ్రసులతో పంపితే అది వందమంది వ్యక్తిగత అభిప్రాయం అవుతుందిగా. పదిమందే పంపితే పదిమంది అభిప్రాయం అవుతుంది. కానీ ఆయన ఒక్కరే వెయ్యికాపీలు పంపితే రజనీకాంత్ డైలాగులా వుంటుంది.

మరికొందరు డేటా పంపలేక పోయారా? అన్నారు. డేటా ప్రభుత్వం వద్దనే లేదు. నా దగ్గరేముంటుంది? నా దగ్గర వున్నది అరకొర సమాచారం. అక్కడో పుల్లా, యిక్కడో పుల్లా సేకరించి కాకిగూడు కట్టినట్టు కడుతున్నాను. ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. ఒకవేళ డాటా సేకరించినా దాన్ని విశ్లేషించే, అన్వయించే నేర్పు వుండద్దా? ఇప్పుడు తెలంగాణాపై ఫలానా స్కీములో యిన్ని వేల కోట్లు ఖర్చు పెట్టాం అంటారు. దానిలో 80% హైదరాబాదు మీదనే పెట్టారనుకోండి. రాజధాని కాబట్టి హైదరాబాదుమీద ఖర్చు పెట్టారు తప్ప అది తెలంగాణాను ఉద్ధరించినట్టా? ఇప్పుడు నాగార్జునసాగర్ మీద కొన్ని లక్షల కోట్లు ఖర్చు పెట్టాం అది నల్గొండ జిల్లాలో వుంది కాబట్టి తెలంగాణాపై ఖర్చు పెట్టినట్టే అని లెక్కలు చూపించారనుకోండి. మరి దాని ఫలం కోస్తా, సీమ జిల్లాల వాళు ్ల అనుభవిస్తున్నారే! అది ఎలా లెక్కలోకి తీసుకుంటాం?

ఇవన్నీ నాబోటి సామాన్యుడికి వచ్చే సందేహాలు. ఇలాటివి ఎలా లెక్కవేయాలో స్టాటిస్టీషియన్స్ వద్ద ఓ ఫార్ములా వుండవచ్చు. తెలిసీ తెలియకుండా మనం చెప్పడం తప్పు. కమిటీ వేసినదే దానికోసం. ఆ అవస్థలు వాళ్లనే పడనీయండి. ఫైనల్‌గా వచ్చిన నివేదిక చదివి ఓహెూ అనుకుందాం. ఇక అర్ధసత్యాలు, అసత్యాలు ప్రచారంలో వున్నాయి అన్నమాటకు ఒకాయనకు కోపం వచ్చింది. వీటి గురించి నా ఆర్టికల్స్‌లో రాస్తూనే వున్నాను. ఉపముఖ్యమంత్రి పదవి, వెంగళరావును కోస్తావాడనడం, ఉద్యమం వయసు, హైదరాబాదులో ఆంధ్రప్రాంతీయుల పెట్టుబడులు.. యిలా యిరువైపుల వారు ప్రచారం చేస్తున్నవాటి గురించి రాస్తున్నాను. రాయబోతున్నాను.

నీ వన్నీ అబద్ధాలు, వితండ వాదనలు. నిన్ను వ్యతిరేకిస్తూ నేను రాస్తాను అని కొందరన్నారు. నిక్షేపంలా రాయండి. ఆ కమిటీ వేసిందే అందుకు! సాటి తెలుగువాడిగా నా ప్రార్థన ఏమిటంటే ఏది రాసినా కాస్త తార్కికంగా, పద్ధతిగా రాయండి. 'అంతేకానీ మా వూళ్లో ఆంధ్రా హెూటల్ అని పెట్టారు. ఆంధ్రాలో తెలంగాణా హెూటల్ అని పెట్టలేదు... సినిమాలో హీరోకి తెలంగాణా యాస పెట్టలేదు..'లాటి వాదనలు రాయకండి. డేటా యిచ్చేటప్పుడు మీకు ఫార్వార్డ్‌లలో వచ్చినది పంపకండి. వాటిల్లో నాలాటి అజ్ఞానికే తప్పులు కనబడుతున్నాయి. కమిటీ వాళ్ల దగ్గర బోల్డంత డేటా పోగుపడుతోంది. మీరు తప్పుడు సమాచారం యిచ్చి మిస్‌లీడ్ చేయబోయారని వాళ్లకు అనిపించిందంటే మీ క్రెడిబిలిటీ పోతుంది. రాయడానికి మీరు వెచ్చించిన టైమంతా దండగవుతుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 14** **ఎమ్బీయస్ – సమైక్యవాదినా? విభజనవాదినా? – 1**

ఇప్పటివరకు 200 కు పై చిలుకు మంది నా లేఖను కాపీ, పేస్ట్ చేసి దుగ్గల్ కమిటీకి పంపుతూ నాకు కాపీ మార్క్ చేశారు. నేను కాపీ పెట్టమని అడక్కపోయినా యిన్ని వచ్చాయంటే ఓ మూడు వందల మంది దాకా పంపి వుండవచ్చు. చాలామంది మనసులో మెదలుతున్న భావాలే యిది. వ్యక్తీకరణకోసం ఆగారు. నాది కనబడగానే 'మీ అభిప్రాయమే మా అభిప్రాయం' అంటూ పంపేశారు. కమ్యూనికేషన్ యింత సులభతరం చేసిన శాస్త్రజ్ఞులకు, ఇంటర్నెట్‌కు, ఇంతటి వేదిక కల్పించిన గ్రేట్ ఆంధ్రా వారికీ కృతజ్ఞతలు.

ఇన్ని వందల మెమోరాండంలు ఒకేలా వెళుతున్నాయి కాబట్టి వీటిల్లో కనీసం ఒకటైనా కమిటీవారు చదువుతారని ఆశిద్దాం. నిన్ననే జస్టిస్ శ్రీకృష్ణగారు యిలాటివి 17 వేలు వచ్చాయన్నారు. ఏప్రిల్ 10 దాకా గడువు పెంచారు కాబట్టి ఇంకో ఇరవైవేలు పోగుపడవచ్చు. 9 ఏళ్లగా నలుగుతున్నా డిసెంబరు 9 వరకు తెలంగాణా సమస్య అనేదే వుందని గుర్తించని యిరుప్రాంతాల రాష్ట్రప్రజల్లో యింత చైతన్యం వుందా? అని కమిటీవారు గుండెలు బాదుకుంటారు.

కొందరు పంపేటప్పుడు తమ పోస్టల్ ఎడ్రసు యివ్వకుండా వట్టి ఈమెయిల్ ఎడ్రసు యిస్తున్నారు. పోస్టల్ ఎడ్రసు యిస్తే మరింత ఆథెంటిక్‌గా వుంటుంది. ఏదో ఒకే మనిషి వంద దొంగ ఐమెయిల్ ఐడీలు సృష్టించి పంపేడు అనుకోకుండా వీళ్లంతా నిజమైన మనుష్యులే ఫలానా ఫలానా వుద్యోగాల్లో వున్నారు అని తెలియపరిస్తే వాళ్లు కాస్త సీరియస్‌గా తీసుకుంటారు. నాకు వచ్చిన మెయిల్స్ అన్నీ చూస్తున్నాను. మంచి హెూదాల్లో వున్నవారి నుండి విద్యార్థుల వరకు అందరూ రాసి పంపుతున్నారు. చాలా సంతోషం.

అందరూ నన్ను మెచ్చుకున్నారని చెప్పను. కొందరు తీవ్ర విభజనవాదులు తిట్టిపోశారు విభజన యిప్పుడు వద్దన్నందుకు. కొందరు సమైక్యవాదులూ తిట్టిపోశారు –ఎప్పటికో అప్పటికైనా రాష్ట్రం విడిపోవాలన్నందుకు. ప్రస్తుతం సమైక్యంగా ఎందుకుండాలో అనేకసార్లు రాశాను. ఎప్పటికైనా ఎందుకు విడిపోవాలో కాస్త విశదంగా రాస్తాను.

కుటుంబం పెద్దదవుతున్నకొద్దీ విడిపోవడం సహజం. ఉమ్మడికుటుంబం సినిమా తీసిన రామారావుగారి కుటుంబంలో

కుమారులందరూ కలిసి వుండడం లేదు. పండంటి కాపురం సినిమా తీసిన కృష్ణగారి కుటుంబమూ కలిసి లేదు. నన్ను తిడుతూ రాసేవాళ్లు కూడా అన్నదమ్ములతో, బాబాయి పెదనాన్నలతో, పెదతాత పినతాతలతో ఒకే చూరు కింద నివసిస్తూ వుంటున్నారని నేననుకోను. పదికోట్ల మాజికల్ ఫిగరొచ్చాక విడిపోవడమేమిటి, అతి తెలివి కాకపోతే అన్నారు కొందరు. పోనీ పన్నెండు కోట్లా? పధ్నాలుగు కోట్లా? పోనీ పదేళ్ల తర్వాతనా? ఇరవై యేళ్ల తర్వాతనా? ఏదో ఒకటి అనుకోవాలి కదా! దానికి సిద్ధమవ్వాలి కదా! విస్తీర్ణం పెరగలేదు కాబట్టి జనాభా పెరుగుదల అన్నాను.

కంపెనీ ఐతే యింత టర్నోవర్ తర్వాత సబ్సిడియరీ పెడదామంటారు. అలాగ మనమూ యింత బజెట్ దాటాక అందామా..? ఏదో ఒక గమ్యం పెట్టుకోవాలంటాను. ఆ గమ్యం కనుక తెలిస్తే యిప్పటినుండీ జాగ్రత్తలు పడతారంటాను. మా నాన్నపోయాక నాకు ఇంట్లో తూర్పువైపు వాటా వస్తుందంటే అటువైపు కాస్త చెట్టూ చేమా వుండేట్టు చూసుకుంటాను. చూరు ఒరుగుతూంటే బాగు చేయించేట్టు చూసుకుంటాను. ఉమ్మడి ఆస్తిలోంచే తూర్పుప్రహరీగోడ పెంచేట్టు చూస్తాను. కనీసం ఇవేమీ చేయించలేకపోయినా నా వాటాకు అన్యాయం జరగకుండా కాపు కాసుకుంటాను.

ఎన్ని యుగాలైనా తెలుగువారు కలిసి ఒక రాష్ట్రంలోనే వుండాలని పద్యాలు, పాటలు పాడేవారిని పాడనివ్వండి. రాష్ట్రాల పరిధుల కంటె నాకు సంస్కృతి మీదనే మక్కువ. రేపు తెలంగాణా విడిపోయినంత మాత్రాన అక్కడ పుట్టాయి కదాని పోతనగారి భాగవతం చదవడం మానేయం. సుమతీ శతకం, దాశరథీ శతకం కట్టకట్టి అటకమీద పారేయం. రామదాసు కీర్తనలు పాడడం మానేయం. 'మా సంస్కృతి వేరు, ఆంధ్రుల సంస్కృతి వేరు' అని తెలిసీ తెలియని తెలంగాణావారు అంటే అనవచ్చు గాక. తెలుగువారందరూ నెత్తిన పెట్టుకునేవే యివి. ఈనాటి భౌగోళిక విభజన ప్రకారమైతే త్యాగరాజ కీర్తనలు, మైసూరు వాసుదేవాచార్యుల కీర్తనలు యీ గడ్డమీద పుట్టినవి కావు. మనం వాటిని ఆలపించడం లేదా? పాండిచ్చేరిలో ప్రభవించినంత మాత్రాన సుబ్రహ్మణ్య భారతి పాటలు తమిళనాడు తమిళులు పాడుకోవడం లేదా? అంతెందుకు ఎన్నారైలు రాసిన కథలు మనం మన్నించడం లేదా?

తమిళులకు తమిళనాడు, పాండిచ్చేరి వుండగా కొంపమునగనిది తెలుగువారికి రెండు రాష్ట్రాలుంటే మునుగుతుందా? ఇవాళ్టికి కాకపోతే ఏనాటికైనా విభజన తప్పదని గుర్తించండి. అయితే అది ఎంత స్మూత్‌గా జరిగితే అంత మంచిది. విద్వేషాలతో కాకుండా సజావుగా జరిగాలంటే కోస్తా, సీమ, తెలంగాణా .. యిలా కాకుండా జిల్లాల వారీగా విడాలి. అప్పుడు యీ ఫీలింగ్స్ వుండవు. హైదరాబాదులోని కోస్తా, సీమ వాసుల గురించే అందరూ మాట్లాడుతున్నారు. తెలంగాణాలో అన్ని జిల్లాల లోనూ వారున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణాలో స్కూళ్లు ఏర్పరచి, చదువులు చెప్పడానికి కోస్తా, సీమవారిని ఎఱ్ఱతివాచీలు పరిచి పిలుచుకుని వచ్చారు. దొంగముల్కీలు ఏర్పాటు చేసి మరీ వుద్యోగాలు కల్పించారు. ఎందుకంటే అప్పట్లో తెలంగాణా గ్రామాలలో అక్షరాస్యత కంటె కోస్తా, సీమల్లో అక్షరాస్యత అయిదారు రెట్లు ఎక్కువ. వైషమ్యంతో విడిపోతే వారందరి బతుకులూ దుర్భరం అవుతాయి.

2

పోనీ జిల్లాలవారీ విభజనేదో అప్పుడెందుకు ఇప్పుడే ఎందుకు కాకూడదు? అంటే ఇప్పుడు సంపదంతా ఒకేచోట మేటవేసుకుని వుంది. ఇకనైనా అక్కడ డంప్ చేయడం మానేసి, రాబోయే నిధులు అన్ని ప్రాంతాలకూ సర్దాలి. పల్లపు ప్రాంతాలను ఎత్తు చేయాలి. అప్పుడు ఏ భాగం ఎటు వెళ్లినా తక్కినవారికి క్షోభ వుండదు. ఇప్పుడు కోస్తా, సీమవాసుల బాధ ఏమిటి? '1972లో విడిపోతామన్నపుడు పోనిస్తే యీ పాటికి మాకూ ఓ రాజధాని ఏర్పడేది కదా! ఉన్నదంతా హైదరాబాదులో పోసి ఇప్పుడు వట్టి చేతుల్తో పొమ్మంటే ఎలా? 'ఇదెలా వుందంటే 50 ఏళ్ల కాపురంలో యిద్దరం కలిసి సంపాదించినదంతా పెట్టి బంగారం రూపంలో పెడితే ఆవిడ యిప్పుడు విడాకులు కావాలంటోంది. మరి బంగారంలో నా వాటాయో అంటే బంగారం స్త్రీధనం, చెయ్యి వేస్తే వూరుకోను అన్నట్టుంది' అంటున్నారు.

తెలంగాణావారిలో కోస్తా, సీమవాసుల నుద్దేశించి దుర్భాషలాడేవారు ఐదు శాతం మందే కావచ్చు. కానీ అది మాటపడినవారిని రగిలిస్తోంది. ఇది తాత్కాలికమే అని కొందరు వూరడిల్లుతున్నా మరి కొందరు 'ఇలా దొంగలనిపించుకుంటూ, వాళ్ల చేత నడ్డిమీద తన్నించుకుంటూ, మొగం మీద వూయించుకుంటూ ఎంతకాలం వుండాలి? ఏదో హైదరాబాదు మనదే అనుకుని మన ప్రాంతాలన్నీ పాడుపెట్టి అక్కడ పెట్టుబడులు పెట్టాం. అది స్టాక్‌మార్కెట్‌లా కుప్పకూలింది. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మన ప్రాంతాలను వృద్ధి చేసుకుందాం. హైదరాబాదు వున్నంతకాలం రాష్ట్రంలో మరే వూరినీ బాగు చేయరు. అది లేదని గట్టిగా అనుకుంటే యిప్పటినుండైనా మనవూళ్లు కళకళలాడతాయి. అందరూ హైదరాబాదుకి పరుగులు పెట్టి, ఇక్కడ యిండిపెండెంటు యిళ్లు వదలి అక్కడ యిరుకు ఫ్లాట్లలో బతుకుతూ, సగం ఆయుర్దాయం ట్రాఫిక్ జాముల్లో వెచ్చిస్తూ, ఏ క్షణాన ఏ కెసియార్ వుధ్భవిస్తాడో అని బిక్కుబిక్కుమని బతుకుతూ ఎందుకు బతకాలి?' అంటున్నారు.

'ఆర్థిక, అధికార వికేంద్రీకరణ జరిగితే మంచిదే కానీ ఎక్కడ జరుగుతోంది? అధికార వికేంద్రీకరణ గురించి కేంద్రంతో పేచీలు పెట్టుకునే రాష్ట్రప్రభుత్వాలు స్థానిక సంస్థలకు అధికారాలు యిస్తున్నాయా? జిల్లా పరిషత్, మండల పరిషత్తులకు అధికారం యివ్వటం లేదనే కదా వాళ్లు వుద్యమిస్తున్నారు! ఎక్కడుంది వికేంద్రీకరణ? అధికార పార్టీలో వుందా? ప్రతిపక్షాలలో వుందా? పార్టీలో ఎన్నికలుండవు.

ఉన్నా ఓ ప్రహసనంగా నడుస్తాయి. అందరూ కలిసి సర్వాధికారాలు పార్టీ అధ్యక్షుడికి కట్టబెట్టడమే చూస్తున్నాం. కార్పోరేషన్ కౌన్సిలర్ టిక్కెటు దగ్గర్నుంచి ఢిల్లీ నుంచి ఆమోదం రావలసినదే! పార్టీలో అన్నీ నామినేటెడ్ పోస్టులే. నాయకుడికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడితే షోకాజ్ నోటీసు కూడా యివ్వకుండా పీకి పారేస్తారు.

'పెద్దమనుష్యుల ఒప్పందంలో ప్రాంతీయ మండళ్ల గురించి ఒప్పుకున్నారు. నడిపారా? రాయలసీమ ముఖ్యమంత్రులూ నడపలేదు, కోస్తా ముఖ్యమంత్రులూ, తెలంగాణా ముఖ్యమంత్రులూ ఎవ్వరూ వాటిని సవ్యంగా నడవనివ్వలేదు. నిధులు యివ్వరు, అధికారాలు యివ్వరు. అనుమానాలుంటే వైయస్ హయాంలో నిరసన తెలిపిన ఉప్పునూతలను, గాదె వెంకటరెడ్డిని అడగండి. ఇప్పుడు మళ్లీ ప్రాంతీయ మండళ్లు అంటూ సూచించడం ఖాయం. వాటిని పడుక్కోబెట్టడం ఖాయం. అందువలన మా ప్రాంతాలకు నిధులు రావు.

'హైదరాబాదు ఎవరికి చెందుతుందాని మీమాంస నడుస్తున్న యీ రోజుల్లో యిప్పుడు అక్కడ మెట్రో ప్రాజెక్టు అవసరమా? ఆ డబ్బు పెట్టి మా ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చుగా! హైదరాబాదునుండి ఫోకస్ తప్పిస్తే తప్ప మా ప్రాంతాలకు మోక్షం లేదు, రాదు. హైదరాబాదు నెత్తిమీద మేకు కొట్టి, మా వైపు చూపు సారించండి. ఏం హైదరాబాదు చుట్టుపక్కల వున్నవాళ్లే బాగుపడాలా? మా స్థలాలకు మంచి రేటు పలకకూడదా? మా వైపు పరిశ్రమలు రాకూడదా? ఇక్కడ మేం బావుకుంటున్నదేమిటి? ఇక్కడ గడవకే కదా అక్కడకు వచ్చేది? అయినా మేమేదో దోచుకుతింటున్నట్టు ఆ బిల్డప్పేమిటి? ఇంకా ఎంతకాలం?

'హైదరాబాదు ఫ్రీజోన్ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు యిచ్చాక కూడా కాదన్నారే! అసెంబ్లీలో వాదోపవాదాలకు తావిచ్చారా? ఎక్కడ తెలంగాణావారికి అలక వస్తుందోనని పాలకపక్షం, ప్రతిపక్షం కలిసి దడిసిపోయి ఏకవాక్య తీర్మానం చేశాయే! బాధితుల గోడు విన్నారా? వారి బాధను అర్థం చేసుకునే ప్రయత్నం చేశారా? పోనీ చేసుకున్నట్టు నటించారా? వారి పక్షాన ఒక పాయింటైనా వుందేమో చెప్పనిచ్చారా? ఇలాటి బుజ్జగింపు చర్యలు, అవమానాలు తుడిచేసుకుని యిలాగే సర్దుకుపోయినా యింకో పదేళ్ల తర్వాత ఎవడికో మంత్రిపదవి దక్కకపోతే మళ్లీ మాకు శాపనార్థాలు తప్పవు కదా! రక్తాభిషేకాలు, నాలుకలు చీరేయడావు వంటి బెదిరింపులు తప్పవు కదా!'

ఈ విధంగా వాదించే కోస్తా, సీమ వాసులను సమైక్యవాదం పేరుతో ఎంతకాలం గొంతు నొక్కగలరు? ఎప్పటికీ కలిసివుండాలని వాదించేవారు వీరికి సమాధానాలు చెప్పగలరా? రెండునెలల క్రితం బొత్స వాదన వేరు. ఈనాటి వాదన వేరు. డిసెంబరు 31 లోపున ఎంతమంది బొత్సలు తేలతారో తెలియదు. కరడుకట్టిన సమైక్యవాదులు సైతం పోనుపోను కరగవచ్చు. శ్రీకృష్ణ కమిటీ సమైక్యంగా వుండాలని సూచించి, ప్రాంతీయ అసమానతలు రూపుమాపడానికి సూచించే చర్యలు అమలు కాకపోతే వచ్చే ఏడాది చివరకు ప్రత్యేక ఆంధ్ర వుద్యమం రూపుదిద్దుకోవచ్చు.

ఇవన్నీ వూహించే నేను ఎప్పటికైనా చీలకతప్పదని అనేది. ఫలానా పదేళ్ల తర్వాత అనుకుని యిప్పటినుండీ పరిశ్రమలు, పెట్టుబడులు అటూ యిటూ సర్దుతూ పోతే బాలన్స్‌డ్‌గా వుంటుంది. ఒకాయన రాశారు. మీరు చెప్పిన పద్ధతిలో ప్రాజెక్టులన్నీ దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని. అలా అయితే నిపుణుల నడిగి రాష్ట్రాన్ని ఐమూలగా (డయాగ్నల్‌గా) చీల్చమందాం. ఎలా చీల్చినా హైదరాబాదు రెండు రాష్ట్రాలకూ మధ్యలో వుండాలి. చండీగఢ్‌లా ఉమ్మడి రాజధానిగా వుండాలి. అదే నా కోరిక. మళ్లీ యింకో హైదరాబాదు కట్టడం శుష్క దండగ. దానికి ఎలాట్ చేసిన నిధుల్లో 75% కాంట్రాక్టర్లు దిగమింగేస్తారు. నాసిరకం కట్టడాలు తయారవుతాయి. (అసెంబ్లీ మాత్రం కూలకుండా గట్టిగా కట్టించుకుంటారు లెండి. ఎమ్మెల్యేలు కూచుంటారుగా).

చాలా పెద్దగానే రాశాను కానీ తప్పలేదు. ఎందుకంటే నాది గుడ్డి సమైక్యవాదం కాదు. క్వాలిఫైడ్ (దీన్ని తెలుగులో అనువదిస్తే విశిష్ట అనాలి, విశిష్టాద్వైతం అన్నట్టు. ఆ మాట ఉపయోగిస్తే జనాలు మండిపడతారు, నువ్వేం పెద్ద పుడింగివా అని. ఇప్పటికే కమిటీకి రాసిన లేఖలో నేను ఒక పాప్యులర్ వెబ్‌సైట్‌లో కాలమిస్టును అని రాసినందుకు మండిపడుతున్నారు. పాప్యులర్ విశేషణం కాలమిస్టుకు వుపయోగించలేదు కదా అని చెప్పినా వినడం లేదు.) **– ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 16** **ఎమ్బీయస్ – ఫ్రీ జో'కొట్టుడు' – 1**

ఫ్రీ జోన్ వ్యవహారంలో పార్టీల ధోరణి చాలా చికాగ్గా వుంది. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కాపీ అందకుండానే, తీర్పు పూర్తిగా చదవకుండానే అడావుడిగా దాన్ని తిరగదోడడానికి రాష్ట్రపతి ఉత్తర్వులో సవరణ చేయమంటూ తీర్మానం చేసి పంపేశారు. నామ్‌కే వాస్తే చర్చకూడా జరగలేదు. పీఆర్పీ వాళ్లు చర్చ కావాలని పట్టుబడితే జరగనివ్వలేదు. రాజకీయ అవసరాల గురించి పార్టీలు ఎంత అస్తవ్యస్తంగా ప్రవర్తిస్తున్నాయో యీ వ్యవహారం అద్దం పడుతోంది.

మొట్టమొదట నా అభిప్రాయం చెప్పనీయండి – ఇదేదో భూగోళం బద్దలయ్యే సమస్య అని నేను అనుకోను. నేను చేసినది ఆల్ ఇండియా క్యాడర్ వుద్యోగం కాబట్టి రాష్ట్రంలోపలే జరిగే బదిలీల గురించి వర్రీ అయ్యేవాళ్ల బాధ నాకు అర్థం కాదు. 'ప్రస్తుత వుద్యోగుల వుద్యోగం పీకేయటం లేదు కదా, వేరే జిల్లాలకు బదిలీ చేస్తారు. దానికోసం యింత హంగామానా? అసలు వుద్యోగంలో చేరేటప్పుడు ఎక్కడ డ్యూటీ వేస్తే అక్కడకు నోరుమూసుకుని వెళతాం అని రాసిస్తాం కదా, మరి యిప్పుడు నస పెడితే ఎలా?' అనుకుంటాను.

ఇకపై వచ్చే వుద్యోగాల మాటంటారా? ప్రభుత్వోద్యోగాలు ఎన్ని రాబోతాయి, వాటిలో రిజర్వేషన్‌కి ఎన్ని పోతాయి, ఎంతమంది జీవితాలు ప్రభావితం అవుతాయి.. యివన్నీ పెద్ద యిస్యూలు కావు.

అందువలన అల్టిమేట్‌గా యీ తీర్మానం యిలాగే వున్నా నాకు ఏమీ అనుకోను. అయితే దానికి ముందు దానికి సంబంధించిన విషయాలన్నీ కూలంకషంగా చర్చించాలి. సంబంధిత ప్రజలకు దీనివలన మీకు జరిగే మేలు యిది, కీడు యిది అని స్పష్టంగా చెప్పాలి. అసలు దాని గురించి పన్నెత్తి పలకడానికి అదలిచచ్చేవాళ్లు నాయకులా? అలాటి వారా మన భవిష్యత్తు నిర్ణయించేది? నా నియోజకవర్గ ప్రజలకోసం ప్రాణాలైనా అర్పిస్తామని ప్రతిజ్ఞలు చేసే యీ నాయకులు కనీసం వారికి మంచీ చెడూ చెప్పడానికి కూడా జంకితే ఎలా? ఇదే నాకు నచ్చనిది.

ఓ సారి పీలూ మోదీ అనే స్వతంత్ర పార్టీ నాయకుడు అన్నాడు. 'నేను సిగరెట్ తాగకుండా బతకగలను, కానీ సిగరెట్ తాగే హక్కు లేకుండా బతకలేను' అని. అసెంబ్లీ వున్నదే చర్చలు జరపడానికి. చర్చలు లేకుండా తీర్మానాలు పాస్ చేసేకాడికి అసెంబ్లీ ఎందుకు? సెక్రటేరియట్‌నుండే లేఖలు పంపేస్తే పోలా?

ఏమిటీ ఫ్రీ జోన్ సంగతి? స్థానికులకు వుద్యోగాలు కల్పించాలనే సదుద్దేశంతో పెట్టారు. మంచిదే! ఫలానా క్యాడర్ వరకు యింత పెర్సంటేజి, ఫలానా క్యాడర్ వరకు యింత పెర్సంటేజి అని పెట్టారు. న్యాయమే! ఇది చూడడానికి న్యాయంగానే వున్నా ఎక్కువ వుద్యోగాలకు అవకాశం వున్న రాజధాని నగరంలో అదే రూలు గుడ్డిగా వుండడంలో న్యాయం లేదు. అలా అని కొందరు వాదించేట్టు ఫ్రీ జోన్ చేయమని అనడం కూడా న్యాయం కాదు. అలా అయితే రాజధానిలో వున్న ఉద్యోగార్థులకు రక్షణ లేకుండా పోతుంది కదా. తక్కిన జోనుల్లో వున్న సౌకర్యం యిక్కడ లేకుండా పోతే ఎలా?

రాజధానిలో జనాభా ఎక్కువ వుంది కాబట్టి వుద్యోగార్థులూ ఎక్కువ వుంటారు. అయితే వుద్యోగాలూ పెద్ద సంఖ్యలో వుంటాయి కాబట్టి ఏదో ఒక రేషనేల్ వుండాలి. అంటే ఫలానా క్యాడర్ వరకు 70% రిజర్వేషన్ అని తక్కిన జోన్లలో వుంటే, రాజధానిలో మాత్రం 60% పెడితే సరిపోతుందేమో!

సరిగ్గా యివే లెక్కలు కావు. వాటికేవో స్టాటిస్టిక్స్, యిండెక్సులు పెట్టుకుని తర్కబద్ధమైన అంకెను నిపుణులు నిర్ణయిస్తే న్యాయంగా వుంటుంది. ప్రభుత్వం ఆ కసరత్తు చేయలేదు. హైదరాబాదు ఫ్రీ జోన్, అందరూ అప్లయి చేసేసుకోండొహోయ్ అని కొంతకాలం చెప్పింది. తర్వాత కొంతకాలం 'తూనాబొడ్డు హైదరాబాదు ఆరోజోన్‌లో భాగమే! తక్కిన జోన్‌వాళ్లందరూ మూటా ముల్లె సర్దుకోవాలి' అని చెప్పింది. ఏం చెప్పినా ఎఫెక్టయ్యేవాళ్లుంటారు కాబట్టి కోర్టు కెళ్లి స్టేలు తెచ్చేసుకుంటారు. మొత్తం ప్రాసెస్ ఆగిపోతుంది.

ఏ ఉద్యోగైనా సరే, ఒకసారి హెడాఫీసుకి వచ్చేడంటే వెనక్కి వెళ్లడానికి యిష్టపడడు. అందులో హైదరాబాదులో అయితే పిల్లలకు విద్యాసౌకర్యాలు, మంచి జీవనప్రమాణాలు దొరుకుతాయి. అవి అలవాటు పడ్డాక, తన్ని తగిలేస్తే తప్ప, వెళ్లబుద్ధి కాదు. అక్కడే వుండిపోవడానికి ఏ అడ్డదారైనా వెతుకుతారు. సెక్రటేరియట్ వున్నదే పైరవీలకు.

వీళ్లు యిక్కడ వుండిపోవడానికి ఎంత ప్రయత్నిస్తారో, యిక్కడికి రావడానికి తక్కిన వూళ్ల వాళ్లూ అంత ప్రయత్నిస్తారు. అందువలన డిప్యుటేషన్ అనో, స్పెషల్ కేస్ అనో, తలిదండ్రుల వైద్యమనో, ఏదో చెప్పుకుని, టెంపరరీగా వచ్చి ఆ తర్వాత స్థిరపడిపోదామని ప్రయత్నిస్తారు. ఉన్నవాడిని లేపకపోతే మనం రావడం కష్టం అనుకుంటే ఏదో ఒక గొడవ రేపి లేపేయడానికి చూస్తారు. అవి అవినీతి ఆరోపణలు కావచ్చు, ఆంధ్రా-తెలంగాణా గొడవలు కావచ్చు.

ఉద్యమాలలో చాలాభాగం యీ వుద్యోగుల గొడవల వలన వచ్చినవే. మనలాటి మామూలు జనాలకు ఆ సీట్లో ఎవడున్నా ఒకటే. అస్సలు పనిచేయని బాపతు కొందరు. కానీ లంచం యివ్వకపోయినా సిన్సియర్‌గా పనిచేసే బాపతు కొందరు. చేయి తడిపితే తప్ప ఫైలు ముట్టని బాపతు కొందరు. ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలుసుకుని పని చేయించుకుంటాం తప్ప వాడు ఆంధ్రావాడైనా, తెలంగాణా వాడైనా మనకు అనవసరం. అందువలన రాష్ట్రం విడిపోతే ఫలానా డబ్బులు కిట్టే సీటు వస్తుందనో, ప్రమోషన్ వస్తుందనో.. ఆ బాధలన్నీ ఉద్యోగులవి తప్ప, మనవి కావు. అందువలననే యీ ఫ్రీ జోన్ గొడవలన్నీ మనకు పట్టవు.

2

ఆ మాటకొస్తే కెసియార్‌కు పట్టలేదు యిన్నాళ్లూ. 'ఈ 610 జీవో, గీవో ఎందుకు? ఆర్నెలల్లో తెలంగాణా వస్తూంటే...!' అని తీసి పారేశారు. ఈ మాట హైకోర్టు తీర్పు నాటిది. అప్పటికీ యిప్పటికీ తెలంగాణా రాలేదు. హైకోర్టు కేసులో కాని, సుప్రీంకోర్టు కేసులో కాని తెరాస ఒక పార్టీగా యింప్లీడ్ అవలేదు. కేసు పోయినప్పుడల్లా ప్రభుత్వాన్నే నిందించింది – సరిగ్గా వాదించలేదంటూ.

ఈ జోన్ పద్ధతి వలన సగం తెలంగాణా జిల్లాలకు హైదరాబాదు అందుబాటులోకి రాకుండా పోయింది. ఫ్రీజోన్ అంటే వాళ్లూ గంతులేస్తారు. కాదు, ఆరో జోనే అందుకని మీ అందర్నీ వెనక్కి పంపించేస్తున్నాం అంటే గోల పెడతారు. అందువలన ఏదో మొహమాటానికి అభ్యంతరం తెలిపి వూరుకున్నారు కెసియార్.

తెలంగాణా ఏర్పడ్డాక అంతా ఒకే జోన్ చేసేస్తాం అని తెరాస నాయకులు అంటూ వుంటారు. తెలంగాణా ఎప్పుడు ఏర్పడుతుందో, ఈ ప్రతిపాదన అప్పటికి గుర్తుంటుందో లేదో, వుంటే ఎప్పుడు రూపు ధరిస్తుందో తెలియదు కానీ హైదరాబాదు ఆరో జోన్‌లో

వుండడం చేత లబ్ధి పొందుతున్న ఐదు జిల్లాలవారూ పరిస్థితి మార్పుకి ఒప్పుకుంటారా? ఒక్కనాటికి ఒప్పుకోరు. మీది తెనాలి, మాది తెనాలి అనేది తెనాలి బయట వున్నంత సేపే. తెనాలికి రాగానే మీదో పేట, మాదో పేట అంటారు.

కంపార్టుమెంటాలిటీ అని ఒకటుంది. రైల్లో జనరల్ కంపార్టుమెంటులో ఎక్కబోతూ వుంటే దానిలో అప్పటికే వున్నవాళ్లు అడ్డుకుంటారు. భయపడి ఎక్కలేనివాళ్లు ప్లాటుఫాం మీదే వుండిపోతారు, వేరే రైలు పట్టుకుందాంలే అని. దబాయించి ఎక్కినవాళ్లు ఎక్కిన కాస్సేపటిదాకా పోట్లాడి ఆ తర్వాత స్నేహం కడతారు. తర్వాతి స్టేషన్ వచ్చేసరికి వీళ్లిద్దరూ కలిసిపోయి కొత్తగా ఎక్కదలచినవాణ్ని అడ్డుకుంటారు! కితం స్టేషన్‌లో ఎక్కినవాడికి 'అయ్యో అరగంట కితం నేనూ వీడిలాటివాడినే కదా' అని అనుకోడు. అప్పటికే వాడు వ్యవస్థలో భాగం అయిపోయాడు. మార్పును అడ్డుకుంటాడు.

ఉద్యోగులూ అంతే. చొరబడేవరకే ఈ జోన్లు, జిల్లాలు, ప్రాంతాలూ అంటారు. తర్వాత మనకు పనికి వచ్చేవాడయితే చాలు, వాడితో జట్టు కట్టేస్తారు. కొత్తగా వచ్చినవాణ్ని ఎదిరిస్తారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడగానే అయిదు, ఆరు జోన్లు ఏకమై పోవడం ఎంత కష్టమో చెప్పడానికి యిది చెప్పాను. ప్రభుత్వం ఏదీ స్పష్టంగా చెప్పదు. జీవోలో అన్ని రూల్సూ రాసి, చివర్లో అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపు యిస్తుంది.

వడ్డించేవాడు మనవాడయితే వడ్డించదలిస్తే మినహాయింపు చూపిస్తాడు. లేకపోతే రూలు చూపిస్తాడు. వాణ్ని మనవాణ్ని చేసుకోవడం ఎలా? అన్నదే తెలుసుకోవాలి. మీదీ మాదీ ఒకే వూరు అంటే వాటేసుకోడు. ఉత్తరమో, దక్షిణమో ఏదో ఒక అస్త్రం మనవద్ద వుండాలి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే ఆంధ్రావాళ్లందరినీ తరిమేసి తమకు వుద్యోగాలు పంచిపెట్టేస్తారని కొందరు నిరుద్యోగులు అనుకుంటున్నారు పాపం. ఆన్ పేపర్ ఎలా వుండాలో వడ్డించేటప్పుడే ఆ జాగ్రత్తలు పడతారు.

దొంగ ముల్కీలు యిదివరలో యథేచ్ఛగా దొరికేవి. దొంగ ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు కూడా చలామణీలో వున్నాయని యిప్పటికీ ఆరోపణలు వున్నాయి. రిటైర్‌మెంట్ వాయిదా వేయించుకోవడానికి బర్త్ సర్టిఫికెట్లు దిద్దేయడాలు, దానిపై కోర్టు కెళడాలు ఉద్యోగులకు ఆశ్చర్యం కలిగించే అంశాలు కావు. ఉద్యోగులకు సంబంధించిన ఏ అంశమైనా వివాదాస్పదం. సాధారణంగా రాజకీయ పార్టీలు వాటిలోకి దిగవు. ఎగదీస్తే గోహత్య, దిగదీస్తే బ్రహ్మహత్య అన్నట్టు ఏం చేసినా, ఏం చేయకపోయినా ఎవరికో ఒకరికి అన్యాయం (వారి దృష్టిలో) జరగక తప్పదు. వారు విరుచుకు పడక తప్పదు.

అందువల్లనే ఆ మధ్య యీ యిస్యూ వచ్చినపుడు కెసియార్ కొట్టి పారేశారు. కానీ యిప్పుడు ఫ్రీజోన్ అంటే మిన్ను విరిగి మీద పడుతుందంటున్నారు. దానంతట అది పడకపోతే పడేస్తామంటున్నారు. దెబ్బకి యీ నాయకులంతా గజగజ వణికారు. అడావుడిగా తీర్మానం చేసేశారు. కోర్టు కేసు నడిచినది కొంతమంది పోలీసు వుద్యోగాల గురించి. రాజధానిలోని పోలీసులంతా ఒకే ఏరియా వాళ్లు వుండకూడదనుకుని కాబోలు అలాటి రూలు పెట్టారు. ఉంటే వాళ్లలో ప్రాంతీయభావం పుట్టుకుని వచ్చి పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తారేమోనన్న భయం కాబోలు. వాళ్లు వ్యవహరించకపోయినా ఎదుటివాళ్లు ఆరోపణలు చేయవచ్చుగా.

రేపు సమైక్యాంధ్ర అంటూ యిక్కడ మీటింగు పెట్టి గోల చేస్తే పోలీసులు నాలుగు తగిలించారనుకోండి. వెంటనే సమైక్యాంధ్ర జెఎసి ఓ ఖండన విడుదల చేస్తుంది – తెలంగాణా పోలీసుల దౌష్ట్యానికి సమైక్యనాయకులు బలై పోయారు అని. ఇప్పటికే తెలంగాణా నాయకులు మొదలెట్టారు – ఎసిబి దాడుల్లో తెలంగాణా వారినే పట్టుకుంటున్నారు అని. ఇంకోళ్లు దళితులను మాత్రమే పట్టుకుంటున్నారు అని ప్రారంభించారు. రేపు వీళ్ల నేరం రుజువై, చర్లపల్లి జైలుకి వెళ్లినా అక్కడ ఆంధ్ర వంటకాలే పెట్టి మా తెలంగాణా సంస్కృతిని భ్రష్టు పెట్టిస్తున్నారు అని ఆందోళన చేస్తారేమో.

ప్రతీదీ ప్రాంతీయ కోణంలో చూడడం ఎక్కువై పోతోంది. తెలంగాణా కాంగ్రెస్ కమిటీయో మరోటో కృష్ణకమిటీకి యిచ్చిన రిపోర్టులో మావోయిస్టు నాయకులపై కూడా ఆరోపణలు చేశారు. కొండపల్లి సీతారామయ్య నుండి నేటి రామకృష్ణవరకు మావోయిస్టు నాయకులందరూ ఆంధ్ర ప్రాంతం వారట, అందుకే ఆంధ్రప్రాంతపు భూస్వాములకు, గుత్తేదార్లకు నష్టం కలగకుండా చూస్తున్నారట. పాపం కార్యకర్తలు చూడబోతే తెలంగాణావారు. వారిని సమిధలుగా మార్చి పోలీసులకు పట్టిచ్చి, చంపించి.. అలా కూడా దోపిడీ చేస్తున్నారట! ప్రపంచ కార్మికుల గురించి మాట్లాడే తీవ్రవాద కమ్యూనిస్టులకు సైతం ప్రాంతీయతా బురద పట్టించేశారు మన వాళ్లు.

3

పోలీసులకు కూడా అలాటి ముద్రలు కొడితే మరీ కష్టం. అందువలన కాబోలు పోలీసు వుద్యోగాలలో జోన్లు చెల్లవని వుంటారు. ఇలాటి చర్చలు అనేకం జరపవచ్చు. ఫైనల్‌గా యిప్పుడు వచ్చిన నిర్ణయానికే రావచ్చు. కానీ చర్చ జరపడానికి కూడా భయం వీళ్లకు. తెరాసకు అలక వస్తుందని. 'జెఎసి ముక్కలు కావడంతో ప్రస్తుతం కెసియార్ అణిగి వున్నారు. ఇప్పుడు ఫ్రీజోన్ అంటే ఆయన చేతికి మనమే స్వహస్తాలతో అస్త్రం అందించినట్టవుతుంది. అందువలన ఆయన అడగడానికి ముందే, జగడం పెట్టుకోవడానికి ముందే మనమే తీర్మానం చేసేద్దా'మని కాంగ్రెస్, టిడిపి రెండు ఒకరితో ఒకరు పోటీపడి చేసేశాయి.

ఫ్రీ జోన్ చేయకపోయినా నష్టం ఏమీ లేదని ఆంధ్రప్రాంతంలోని వారిని, ఆరోజోన్‌లోనే హైదరాబాదును పెట్టాలని పట్టుబడితే వచ్చే నష్టాలను తెలంగాణాలోని ఐదో జోన్‌వారికి నచ్చచెప్పి చేస్తే అదో అందం. టిడిపిలో ఆ ఆలోచన వచ్చిందట. 'లేదు, లేదు

యిటువంటి సాంకేతిక విషయాలు సామాన్య ప్రజలు అర్థం చేసుకోలేరు. తీర్మానం చేసి పడేస్తే మంచిది' అంటూ ఆదరాబాదరాగా చేసి పడేశారు. కెసియార్‌కు దీనిపై ఆందోళన చేసే అవకాశం యివ్వలేదు కదాని చంకలు గుద్దుకున్నారు.

నాకో జోక్ గుర్తొస్తోంది. ఒకతను చెంబు పట్టుకుని బహిర్భూమికి వెళ్లాడట. ఓ కుక్క దారంట పోతూ పోతూ యిటుగా వచ్చి కాలితో చెంబును తన్నేసింది. నీళ్లు ఒలికిపోయాయి. అతను తిట్టుకుంటూ వెళ్లి నీళ్లు నింపుకుని మళ్లీ కూచున్నాడు. రెండో సారీ అంతే. తరిమేసే లోపున కుక్క చెంబును తన్నేసింది. ఇతనికి పిచ్చి కోపం వచ్చేసింది. మళ్లీ వెళ్లి నింపుకుని కూచుని, కుక్క మళ్లీ వచ్చి కాలు చాచబోతూండగానే తనే తన్నేసి, 'చూశావా ఇప్పుడు తన్నడానికి నీకు ఛాన్సు లేకుండా చేశాను' అని చంకలు గుద్దుకున్నాట్ట.

రోశయ్యకి అలా చంకలు గుద్దుకునే అవకాశం లేకుండా చేద్దామని కొందరు ఆంధ్రప్రాంతం ఎమ్మెల్యేలు మడతపేచీ పెట్టబోయారు. వెంటనే రోశయ్య జగన్ బూచిని చూపించారు. 'మీరు ఎందుకు అడ్డుపడుతున్నారో నాకు తెలుసు, ఇదంతా జగన్నాటకంలో భాగం' అని అలక ప్రదర్శించారు. 'ఈయన హై కమాండ్‌కు యిలా రిపోర్టు చేస్తే కాబినెట్‌లో ఛాన్సు దక్కకుండా పోతుంది' అని భయపడి, వాళ్లంతా 'మీ అభిప్రాయమే మా అభిప్రాయం' అనేశారు. పూజార్లు దేవుడి పేరు చెప్పి మనను హడలేసినట్టు, రోశయ్య హై కమాండ్ పేరు చెప్పి అందర్నీ బెదిరిస్తారు తప్ప న్యాయాన్యాయాల గురించి చెప్పరు. గట్టిగా అడిగితే ఇది వైయస్ తీసుకున్న లైనేగా, ఆయన హయాంలో ఎందుకు నోరెత్తలేదు? అని లాజిక్ లాగుతారు, అక్కడికి వైయస్ యుగమే అన్ని మంచి నిర్ణయాలకు బెంచ్‌మార్క్ అయినట్టు! అంత గొప్పగా వుంటే 2009లో సీట్లెందుకు తగ్గాయట? పిడుక్కీ, బియ్యానికీ రోశయ్యకొచ్చిన మంత్రం ' వైయస్సోనియా'! ఆ మంత్రం పఠిస్తే ఎంతటివాడూ అవాక్కయిపోతాడు.

టిడిపిలోనూ యిలాటి తంతే. ఎటొచ్చీ అక్కడ జగన్ లేడు. చంద్రబాబులోనే రోశయ్య, జగన్, ఆంధ్ర, తెలంగాణా, ధైర్యవంతుడు, పిరికివాడు, 'టూ బీ ఆర్ నాట్టూ బీ' హేమ్లెట్టూ - అందరూ వున్నారు. ఒకప్పుడు ఢిల్లీ చక్రవర్తిలా వుండే ఆయన ఈ మధ్య ఏ నిర్ణయమూ తీసుకోవడం మానేసి సామంతరాజులపై వదిలేశారు. కొత్తగా వచ్చిన అధికారంతో సామంతులు మబ్బు విడిచిన ఎండల్లా పేట్రేగిపోతున్నారు. జెఎసిలో ఓ మూలైనా కాస్త చోటివ్వండి, చతికిలపడతాం అంటారు ఎఱ్ఱబెల్లి. అంతలో పోటీ జెఎసి వెలిస్తే దానిలో చేరతామన్నాడు.

ఇవన్నీ వ్యక్తిగత నిర్ణయాలో, పార్టీ నిర్ణయాలో తెలియవు. అడుగుదామంటే బాబు నోరు విప్పరు. కృష్ణ కమిటీ ఎదుట కూడా నోరు విప్పరట. పార్టీలో ఎవరికి కావలసినది వాళ్లు చెప్పేసుకోవచ్చు. పార్టీకి అధికారిక నిర్ణయం అంటూ ఏమీ లేదు. ప్రత్యేక తెలంగాణా కావాలని తీర్మానం చేసిన పార్టీగా అదే తమ విధానంగా కమిటీకి చెప్పాలి. లేకపోతే ఆ తీర్మానానికి అర్థం లేకుండా పోతుంది. 'తెలంగాణా కావాలంటాం, కానీ దాని కోసం ఉద్యమించం' అని అప్పటి పార్టీలైను. కమిటీకి ఉత్తరం పంపడం కూడా ఉద్యమం చేయడం కింద లెక్కకు వస్తుందా?

ఈ ఫ్రీజోన్ విషయంలో ఆంధ్రప్రాంతం వాళ్లు కాస్త గొణిగారట. తెలంగాణావాళ్లు రిజైన్ చేయకుండా ఆపాను, మిమ్మల్ని ఆపలేనా అనుకున్న బాబు 'కాంగ్రెస్‌ను అనుక్షణం తిడుతూనే వాళ్లని అనుకరించే మనం యీసారి మాత్రం స్వతంత్ర ధోరణెందుకు కనబరచాలి? కాంగ్రెస్‌వాళ్లు తీర్మానానికి ఓకే అన్నారు, మనమూ అందాం అన్నారు. అనేశారు. అనేసి పాస్ చేసిన యీ తీర్మానం వుత్తుత్తిదే. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు గురించి పాస్ చేసిన యిలాటి తీర్మానం ఢిల్లీలో బూజు పడుతోంది. ఇదీ దాని చెంతన చేరుతుంది. రాష్ట్రపతి ఆదేశాలకు సవరణ - అదీ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా - అంటే సాదాసీదా వ్యవహారం కాదు. అది తెలిసినా తెలంగాణా (నిజానికి ఐదుజిల్లాల) ప్రయోజనాల పరిరక్షకుల్లా పోజు కొట్టడానికి కాంగ్రెస్, టిడిపిలు కలిపి నాటకం ఆడేశాయి.

అయితే కాంగ్రెస్సూ, టిడిపి రెండిటిని కంగు తినిపించింది పీఆర్పీ. మొదట్లో మొహమాటపడి వాళ్ల దారిలోనే నడవబోయి, ఎమ్మెల్యేల పట్టుదల వలన చిరు తాను తీర్మానికి వ్యతిరేకం అన్నారు. స్పీకరు పోడియం వద్దకు దూసుకుపోవడం (ఈ సందర్భాల్లో దూసుకుపోవడం తప్ప మామూలుగా నడవడం వుండదదేమిటో) వంటి 'అతి' చేష్టలు చేసినా మొత్తానికి తీర్మానాన్ని వ్యతిరేకించిన సంగతి ఆంధ్రప్రాంత ప్రజల్లో గాఢంగా నాటుకుపోయేట్టు చేసింది పీఆర్పీ. ఆ విధంగా ఆంధ్రప్రాంత ప్రజల ఛాంపియన్‌గా అవతరించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తెలంగాణాలో పోయేందుకు ఏమీ లేదు కదానుకున్నారు. అదే కంటగింపయింది ఆంధ్రజ్యోతికి. దాని గురించి వచ్చేవ్యాసంలో! **- ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 18** **ఎమ్బీయస్ - జ్యోతీ - కాగడా - 1**

అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే విజ్ఞానానికి ప్రతీక జ్యోతి. కాగడా యింకా ఎక్కువ వెలుగు నివ్వవచ్చు కానీ అది ఉద్యమానికి సంకేతం. ఆంధ్రజ్యోతి దినపత్రిక లోగోలో జ్యోతికి బదులు కాగడా వేయడం సముచితంగా వుంటుందని యీ వ్యాసంలో వాదించబోతున్నాను. పత్రికలు ఎలా వుండాలని ఆశిస్తానో యింతకుముందు నేను అనేకసార్లు చెప్పాను. పత్రికలు అన్నిరకాల వార్తలూ, యథాతథంగా యివ్వాలి. వాటిపై తన వ్యాఖ్యలను సంపాదకీయాల్లో చెప్పవచ్చు. సంపాదకుడి అభిప్రాయాలతో ఏకీభవించే, విభేదించే కాలమిస్టుల వ్యాసాలను ఎడిట్ పేజీలో వేయవచ్చు. వార్తలను విశ్లేషిస్తూ, ఒక పీరియడ్‌లో జరిగిన ఘటనలను సమీక్షిస్తూ,

వ్యాఖ్యాసహితంగా యిచ్చే కథనాలను ఒక్కొక్కప్పుడు పత్రిక స్టాఫే రాయవచ్చు. వాటిని విడిగా చూపాలి. నాకు తెలిసి 'హిందూ' పత్రిక మాత్రమే యీ సంప్రదాయాన్ని యిప్పటికీ పాటిస్తుంది.

తెలుగునాట ఈనాడుతో కొత్త జర్నలిజం పుట్టుకువచ్చింది. దానిలో అనేక సుగుణాలు వున్నా, వార్తలను, వ్యాఖ్యలను కలిపివేసే దుష్టసంప్రదాయం కూడా మొదలైంది. ఏదో ఒక 'కాజ్', ఒక లక్ష్యాన్ని భుజాన వేసుకోవడం యిక దాని గురించి దట్టించి వ్యాసాలు రాయడం ఎక్కువైంది. అది మద్యనిషేధం కావచ్చు, ఎన్టీయార్ కావచ్చు, మరోటి కావచ్చు.. పత్రిక పాప్యులారిటీ వలన ఆ వుద్యమాలు సఫలం కావడంతో 'వి కెన్ మేక్ అండ్ అన్‌మేక్ మెన్ అండ్ మేటర్స్' అనే ధైర్యం ప్రబలిపోయింది పత్రికలకు. నచ్చినవాడిని ఆకాశానికి ఎత్తివేయడం, లేకపోతే అధ:పాతాళానికి తొక్కివేయడం, ఈ క్రమంలో అతిశయోక్తులు, అబద్ధాలు రాయడానికి వెరవకపోవడం ఎక్కువైంది.

వీటి వెనక్కాల రాజకీయ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలు వున్నాయో లేదో మనకు తెలియదు. తెలియనప్పుడు ఏదేదో వూహించుకుని రాయడం కూడా ధర్మం కాదు. అయితే నా వుద్దేశం ఏమిటంటే యిలా రాజకీయ వుద్యమాలు నడిపేటప్పుడు పార్టీ పెట్టుకుని తర్వాత దానికి అనుబంధంగా పత్రిక పెట్టుకుంటే బాగుంటుంది. విశాలాంధ్ర పేపరు కొనేవాడికి ముందే తెలుసు దానిలో సిపిఐ కార్యకలాపాల గురించి ఆకాశానికి ఎత్తేస్తారని. ప్రజాశక్తి పేపరు కొనేవాడికి తెలుసు దానిలో సిపిఎం సిద్ధాంతాలను మెచ్చుకుంటారనీ, బిజెపిని తిడతారనీ. పాంచజన్యం కొనేవాడికి తెలుసు అది ఆరెస్సెస్, బిజెపి భావాలనే వ్యాప్తి చేస్తుందని. సాక్షి కాంగ్రెస్ పార్టీ పత్రిక అని దాని మొహం మీదనే ముద్రలు కొట్టి వున్నాయి. అయితే ఈనాడు, జ్యోతి వంటి పత్రికలు పార్టీలకు అనుబంధంగా వెలసినవి కావు కాబట్టి అవి నిష్పక్షపాతంగా వుంటాయని ప్రజలు ఆశిస్తారు, ఎదురుచూస్తారు. అలా లేనప్పుడు నొచ్చుకుంటారు.

ప్రస్తుతం జ్యోతి గురించి మాట్లాడుతున్నాం కాబట్టి మార్చి 27 నాటి సంచికలో దాని పబ్లిషర్ రాధాకృష్ణగారి వ్యాసం – 'జ్యోతి'కి మసి పూయగలరా! – గురించి పరిశీలిద్దాం. ఆంధ్రజ్యోతికి బలహీనుడి పక్షం వుండాలనే స్వంత ఎజెండా వుందని, ఆ క్రమంలో ఆయా అంశాలు, వ్యక్తులు, పార్టీలకు మద్దతు యిచ్చిన సందర్భాలు వున్నాయని ఆయన చెప్పుకున్నారు. ఎవరు బలహీనులు అన్నది తేల్చేదెవరు? ఏ పక్షాన న్యాయం వుంది అని తేల్చెదెవరు? రాజకీయాల్లో ప్రవేశించేనాటికి చిరంజీవి బలహీనుడా? దానికి వాళ్లెలా సమర్థించుకున్నారంటే – కాంగ్రెస్, టిడిపిలు బలహీన, బడుగువర్గాల వారిని పట్టించుకోవడం మానేశాయి కాబట్టి చిరంజీవి కొత్త పార్టీ పెడితే ఆ వర్గాల వారికి అవకాశం లభిస్తుందని ఆశించి ఆ పార్టీకి మద్దతు యిచ్చారట!

బలహీన, బడుగు వర్గాల వారికి అవకాశం యిప్పించడానికి మీరు పత్రిక పెట్టారా? బిసిలకు న్యాయం చేస్తామని అనని పార్టీ ఏదైనా వుందా? కాసాని జ్ఞానేశ్వర్ ఆ నినాదంతోనే పార్టీ పెట్టారు. ఆ పని కోసమే పత్రిక పెట్టామని బాహాటంగా చెప్పి నడుపుతున్నది 'సూర్య' పత్రిక! జ్యోతి వాళ్లను కూడా సపోర్టు చేయవచ్చుగా! సమాజంలో తక్కిన వర్గాలు జ్యోతి కంటికి ఆనవా? సామాజిక తెలంగాణా వంటి అయోమయ నినాదం (సమాజంలో బిసిలు తప్ప వేరెవరు వుండకూడదని అర్థం స్ఫురించేట్లు) కూడా చిరంజీవిచేత యిప్పించినది వీళ్లేనేమో! 'మీరు అధికారంలోకి వచ్చాక మా విద్యుక్తధర్మానికి కట్టుబడి ప్రజలపక్షం వహిస్తాం జాగ్రత్త' అని చిరంజీవికి ముందే చెప్పేసామని రాసుకున్నారు. అధికారంలోకి తెచ్చేవరకూ మాత్రం ప్రజల పక్షం కాదన్నమాట, చిరంజీవి పక్షమన్నమాట. ఎందుకయ్యా అంటే ఆయన బిసిలను ఉద్ధరిస్తాడన్నాడు కాబట్టి!

చిరంజీవి పక్షం వుండడమంటే ఏమిటి? ఆయన యింతటివాడు, అంతటివాడు అని మనను నమ్మించడం. ఆయన తప్పులు కప్పిపుచ్చడం. ఆయన సభలకు జనం వేలల్లో వస్తే, లక్షల్లో వచ్చారని రాయడం, ఆయన ఎంపిక చేసిన కాండిడేట్లు ఆణిముత్యాలనడం, ఆయన బావమరిది రాజకీయ దురంధరుడనడం, తమ్ముడు దుర్నిరీక్ష్యుడనడం యిత్యాది... తమకు కావలసిన వాణ్ని పత్రికలు ఎంత అద్భుతంగా ప్రొజెక్టు చేస్తాయో ఓ చిన్న వుదాహరణ చెప్తాను.

జ్యోతి చిరంజీవిని కొంతకాలం భుజాన వేసుకున్నదాని కంటె ఎక్కువగా ఈనాడు ఎన్టీయార్‌ను వేసుకుంది. కాంగ్రెస్ పరిపాలన నచ్చని రామోజీరావుగారు ప్రత్యామ్నాయం కోసం వెతికి రామారావు రాజకీయాల్లోకి రాగానే సూపర్‌మాన్ లెవెల్లో మన కళ్లముందు ఆవిష్కరించారు. రామారావు గారి రాజకీయ విజ్ఞానాన్ని పాఠకులకు పరిచయం చేయడానికి ఈనాడు నుండి విలేకరులుగా ఎంవీయార్ శాస్త్రిగారు, రామానుజన్‌గారు వెళ్లారు. వీళ్లు అడిగిన అనేక ప్రశ్నలు రామారావుగారికి అర్థమే కాలేదు. వీళ్లు ఒకటడిగితే ఆయన యింకోటి సమాధానం చెప్పారు. కానీ పత్రిక యాజమాన్యం ఆదేశం మేరకు వీళ్లు అవన్నీ కప్పిపుచ్చి ఆయన అమోఘమైన రాజకీయ పరిజ్ఞానం కనబరిచారని, తిమ్మిని బొమ్మి చేసి రాసేశారు.

2

చిరంజీవి రాజకీయ ప్రవేశం చేశాక ఆయనను, ఎన్టీయార్‌ను పోలుస్తూ ఎంవీయార్ శాస్త్రి (ఆయన యిప్పుడు ఆంధ్రభూమి ఎడిటర్) రామానుజన్ (ఆయన ఆంధ్రభూమి కాలమిస్టు) తమ అనుభవాలను గుర్తు తెచ్చుకున్నారు. ఆ విధంగా యిది బయటకు వచ్చింది. చిరంజీవిని ప్రొజెక్టు చేయడానికి జ్యోతి యిటువంటి గమ్మత్తులు ఎన్ని చేసిందో ఏమో!

మంద కృష్ణ మాదిగ విషయం కూడా రాధాకృష్ణగారు తమ వ్యాసంలో రాశారు. దళితుల వర్గీకరణ డిమాండ్ విషయంలో న్యాయం వుందని జ్యోతి భావించిందట. అందుకే మంద కృష్ణ మాదిగకు అండగా వుందట. మాదిగ పోరాట సమితి దాడి చేసినప్పుడు జ్యోతి వాపోయింది. 'నిన్ను హీరో చేసింది మేమే, నీ సభలకు జనం రాకపోయినా కిటకిట లాడిపోయారని రాసినది మేమే, మా ఆఫీసుకి సభల రిపోర్టులు నువ్వే పట్టుకుని వచ్చే స్థాయినుండి, రాష్ట్రంలో పెద్ద నాయకుడిగా అవతరింపజేసినది మేమే, మా పైననే దాడా?' అని!

ఇక్కడ స్పష్టంగా కనబడేదేమిటి? తలచుకుంటే జ్యోతి పేనును ఏనుగులా చూపించగలదు, కింద పడేయదలచుకుంటే ఏనుగును పీనుగులా చూపించగలదు. ఈ ఘటనాఘటన సామర్థ్యం ఓ పత్రికకు అవసరమా? యదార్థాలను మాకు చూపించడానికి మామూలు అద్దం వాడితే చాలదా? ఓసారి కాన్‌కేవ్, మరో సారి కాన్వెక్స్ మిర్రర్స్ వాడాలా? ఎగ్జిబిషన్‌లో మాయాదర్పణాలంటూ చూపిస్తారు చూడండి, మనను లావుగా, పొట్టిగా ఒకటి చూపిస్తే, అతి సన్నగా, పొడుగ్గా మరోటి చూపిస్తుంది. అలాటివి వాడుతుంది జ్యోతి. ఏది ఎప్పుడు వాడాలి అన్నది తీర్మానించేది వారే! వారే ప్రాసిక్యూషన్, వారిదే తీర్పు, అమలు చేసేదీ వారే. ఫలానావాళ్లు మనం న్యాయమనుకున్న రీతిగా ప్రవర్తించడం లేదు, మనకు ఆశాభంగం కలిగించారు. తీశెయ్, తీశెయ్, ఉరి వేసేయ్, వేసేయ్. ఉరి తీయడం ఎంత సబబో అప్పటికప్పుడు కథనాలు అల్లబడతాయి.

చిరంజీవి పార్టీ ఆఫీసులు డబ్బుల్లేక మూత పడుతున్నాయి అని కథనం. కరెక్టే కావచ్చు. పీఆర్పీ దిక్కుతోచని, దిక్కుమాలిన స్థాయికి వచ్చిందని అందరికీ తెలుసు. ఆ కథనం అర్జంటుగా వేయవలసినంత అగత్యం ఏమొచ్చింది? అన్నదే పాఠకుడి మెదడులో మెదిలే ప్రశ్న. ఇక్కడ జ్యోతి తెలంగాణా పాలసీని ఓ సారి పరామర్శించాలి.

మంద కృష్ణ మాదిగను సపోర్టు చేయడానికి కారణం – దళిత వర్గీకరణ డిమాండ్‌లో న్యాయం వుందని జ్యోతి భావించడం అని రాసుకున్నారు కదా. ప్రత్యేక తెలంగాణా విషయానికి వచ్చేసరికి 'ఆ డిమాండ్‌లో న్యాయం వుందని జ్యోతి భావించింది' అని రాయలేదు. చాలా గడుసుగా 'తెలంగాణకు కొన్ని విషయాలలో అన్యాయం జరుగుతున్నదని సీమాంధ్ర ప్రాంత నాయకులు కూడా అంగీకరిస్తున్న విషయమే కనుక...' అంటూ ప్రారంభించి '.. కనుక తెరాసకు జ్యోతి బాసటగా నిలిచింది' అని చెప్పుకుంది.

మొదట తెలంగాణాకు కొన్ని విషయాలలో అన్యాయం జరుగుతున్నదని అంగీకరించిన 'సీమాంధ్ర'ప్రాంత నాయకులు ఎవరు? ఉప్పుపత్రీ వున్నవారా? లేనివారా? వారి వద్ద స్టాటిస్టిక్స్ ఏమైనా వున్నాయా? లేకపోతే జ్యోతివారు చెప్పగానే అవును పాపం అని నోరు చప్పరించారా? తెలంగాణా వెనకబాటుతనం మాట రాగానే 'సీమాంధ్ర' ప్రాంత నాయకులు అందుకునే పల్లవి – 'మా ప్రాంతంలోనూ వెనుకబడిన జిల్లాలున్నాయి' అని. వేరేలా అనగా వినలేదు.

కొన్ని విషయాలలో అన్యాయం జరుగుతోంది అని ఒప్పుకున్నారే అనుకో, అంతమాత్రం చేత రాష్ట్రాన్ని విభజించమని చెప్పారా? అన్యాయం జరిగితే సవరించమంటారు కానీ, విడగొట్టమనరుగ్గా! జ్యోతి సిబ్బందిలో యాడ్ సెక్షన్‌వారికి కన్వేయన్సు సరిగ్గా యివ్వడం లేదు, వారికి అన్యాయం జరుగుతోంది అని యూనియన్ వాళ్లంటే 'అయితే జ్యోతిని 'జ్యో'గానూ, 'తి'గానూ విడగొట్టేద్దాం అనవచ్చా?

తెలంగాణాకు అన్యాయం జరిగిందని ఒప్పుకున్న కొందరు అదే వూపులో తెరాసకు సపోర్టు చేయమని చెప్పారా? తెలంగాణాకు న్యాయం చేయాలనుకుంటే ప్రభుత్వంతో పోట్లాడి ఎక్కువ నిధులు యిప్పించవచ్చు, లేదా తెలంగాణా ప్రాంత ప్రజాప్రతినిధుల మెడలు వంచి ఆ నిధులు సద్వినియోగం జరిగేట్టు చూడవచ్చు. అంతేకాని మధ్యలో తెరాసకు సపోర్టు చేయడమెందుకు? తెరాసను నెత్తిన పెట్టుకుని వూరేగమని 'సీమాంధ్ర' నాయకులు చెప్పారా? వాళ్ల బలాన్ని గోరంతలు కొండంతలు చేయమని బతిమాలారా?

తెరాసకు బాసటగా నిలిచామని చెప్తూనే రాధాకృష్ణగారు కెసియార్ వ్యవహారశైలి ఆరాచకంగా మారడంతో ఎత్తి చూపామన్నారు. కెసియార్ వ్యవహారశైలి రాచకంగా వున్నదెపుడు? అరాచకంగా మారినదెప్పుడు? జ్యోతి ఎత్తి చూపడానికి ఎంతో ముందే కెసియార్ తన పోకడలు ప్రస్ఫుటంగా చాటుకున్నారు. ఎన్నికల పొత్తు పెట్టుకున్న పక్షాలతో, తనతో బాటు నడిచిన మేధావుల పట్ల వ్యవహరించిన తీరులో ఆయన వైఖరి మామూలు జనాలకి తెలుస్తూనే వచ్చింది. తెలియనివారికి ఆయనను విడిచి వెళ్లిన వారందరూ చాటి చెప్పారు. అప్పుడు జ్యోతికి అది కనబడలేదు, వినబడలేదు. ఓ సుముహూర్తాన కెసియార్ అరాచకత్వం గోచరించింది.

వీటన్నిటి వెనుకా కనబడేది – జ్యోతి సెల్ఫ్‌రైటియస్‌నెస్. తాము నంది అంటే నంది, పంది అంటే పంది. అర్హత వున్నా లేకున్నా వాళ్లు తలచుకుంటే ఎత్తేస్తారు, తలచుకోకపోతే ఎత్తి కుదేస్తారు. ఎత్తేయడానికి, ఎత్తి కుదేయడానికి వెనుక వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు వున్నాయని అనే సాహసం నేను చేయను. నా వద్ద ఏ ఆధారాలూ లేవు. 'బ్లిట్జ్' అనే వీక్లీ ని ఆర్.కె. కరంజియా నడిపేవారు. ఆయన రాజకీయ నాయకుల అవినీతిని ఎండగడుతున్నా అంటూ అత్యంత ఘాటైన పదజాలంతో వ్యాసాలు రాసేవాడు. కొన్ని నిజాలుండేవి, బోల్డు అతిశయోక్తులు వుండేవి. ప్రజల పక్షాన పోట్లాడుతున్నాను అనే బిల్డప్ వుండేవి. అన్నీ నిష్పక్షపాతంగా చూస్తాడా అంటే అది వుండేది కాదు. ఆయన దృష్టిలో కొందరు విలన్లు, కొందరు హీరోలు వుండేవారు. నెహ్రూ ఏం చేసినా రైటే. మొరార్జీ దేశాయ్ ఏం చేసినా తప్పే. కృష్ణ మీనన్ ఏం చేసినా ఒప్పే. ఎస్.కె.పాటిల్ ఏం చేసినా నేరమే.

ఈ కరంజియాకు వేపకాయంత వెర్రి వుండేవి. కొంతకాలంపాటు మహేష్ యోగి చాలా గొప్పవాడని ఆకాశానికెత్తేశాడు. ఇంత రేషనలిస్టూ మహేష్ యోగి నీటిమీద నడవగలడని పెద్ద ప్రచారం చేశాడు. చివరకు ఓ పుణ్యదినాన ఆ నడక కార్యక్రమం ఏర్పాటు చేస్తే మహేష్ నీళ్లలో జారిపడ్డాడు. మళ్లీ ఎప్పుడూ ప్రయత్నించిన దాఖలాలు లేవు. అలాగే ఇరాన్ షాను కరంజియా దేవుణ్ని చేసేశాడు. ఆ షా అంత నియంత, దుర్మార్గుడు లేడు. అదే నియంతృత్వం ఇందిరా గాంధీలో కనబడితే చీల్చి చెండాడే కరంజియా, ఇరాన్ షా నియంతృత్వాన్ని పొగిడేవాడు. ఇన్ని వైరుధ్యాలున్నా బ్లిట్జ్‌కు వీరాభిమానులుండేవారు.

ప్రపంచమంతా ఇలాటి వీక్లీలను టాబ్లాయిడ్ అంటారు. వాటినెవరూ సీరియస్‌గా తీసుకోరు. కాస్త కిక్ యిస్తాయి కదాని సాయంత్రం యింటికి వెళుతూ లోకల్ రైల్లో చదువుతారు. పూర్తయాక రైల్లోనే పడేసి పోతారు. ఇంటికి కూడా పట్టుకెళ్లరు. ఆంధ్రప్రదేశ్ రాత ఎలా వుందంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి యిదే పని చేస్తూ దినపత్రికలుగా చెలామణీ అవుతున్నాయి. దాని ఎడిటర్లు కరంజియాల్లా ఫీలై పోతున్నారు. రాసే వార్తలు కూడా రెచ్చగొట్టేలా రాసి, దాడి జరిగాక అమరవీరుల్లా పోజు పెట్టేస్తున్నారు.

తెలంగాణా గురించి జ్యోతి తన విధానం ఏమిటో స్పష్టంగా తెలియబరచుకుంది కదా. కెసియార్ వ్యవహార శైలిని మాత్రం జ్యోతి అంగీకరించదు తప్ప తెరాస వాదమే జ్యోతి వాదం. ప్రస్తుతం తెరాసవారు, ప్రత్యేక తెలంగాణావాదులు విపరీతంగా మండిపడుతున్నది చిరంజీవి పైననే. చంద్రబాబు విభజనకు అనుకూలంగా తీర్మానం చేసినా ఎవరూ నమ్మలేదు. కానీ చిరంజీవి సామాజిక తెలంగాణా అంటూ ప్రత్యేక తెలంగాణా ప్లస్ బిసిలను నెత్తికెత్తుకోవడంతో ప్రత్యేక వాదులు, మావోయిస్టులు, దళిత, బిసివాద మేధావులు (అనగా పాత్రికేయులు, రచయితలు, ఉద్యమకారులు, తమను తాము మేధావులుగా అభివర్ణించుకునేవారు అని అర్థం) అందరూ తమవాడనుకున్నారు. ఆకాశానికి ఎత్తేశారు. కానీ మామూలు ప్రజలు (నిజమైన మేధావులు) చిరంజీవి గందరగోళాన్ని అర్థం చేసుకున్నారు. ఏదో ఒకటి నమ్ముకో, యిలాటి కసరత్తులు చేయకు అని పాఠం చెప్పేశారు.

కాస్త ఆలస్యంగానైనా చిరంజీవికి పాఠం వంటబట్టింది. ముసుగులో గుద్దులాట మానేసి నేను సమైక్యవాదినే అని చాటుకున్నాడు. దానివలన ఆంధ్రప్రాంతంలో పట్టు దొరికింది. తెలంగాణాలో కూడా సమైక్యవాదులు అనేకమంది వున్నారు కాబట్టి గణనీయమైన పరిమాణంలో ఓట్లు గెలుచుకునే అవకాశం అందిపుచ్చుకున్నాడు. గోడమీద పిల్లిలా వున్న కాంగ్రెస్, టిడిపిలకు భిన్నంగా చిరంజీవి ఏదో ఒక లైను అందుకున్నందుకు అభినందించినవారు కోకొల్లలు. ఆయన రాజకీయజీవితంలో వేసిన సరైన అడుగు యిది ఒక్కటే – యిప్పటిదాకా!

దీంతో పైన చెప్పిన మేధావులు చిరంజీవిని విపరీతంగా అసహ్యించుకుంటున్నారు. రాధాకృష్ణగారి ఆర్టికల్‌కు కింద వేసిన అల్లం నారాయణ ఆర్టికల్ చదివితే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది. అటువంటి మేధావులు కిక్కిరిసి వున్న జ్యోతి చిరంజీవిపై పగబట్టడంలో ఆశ్చర్యం లేదు. అందుకే ఫ్రీ జోన్ తీర్మానాన్ని వ్యతిరేకించి వారి దృష్టిలో తెలంగాణాకు ద్రోహం చేసిన చిరంజీవికి బుద్ధి చెపుదామనే ఆ వార్త వేశారని నా వుద్దేశం. నేను ముందే చెప్పినట్టు దానిలో నిజానిజాలను నేను ప్రశ్నించడం లేదు. టైమింగ్‌ను మాత్రమే ప్రశ్నిస్తున్నాను.

తీర్మానాన్ని వ్యతిరేకించి చిరంజీవి రాజకీయ శత్రువులను కూడా గడించుకున్నాడు. ముఖ్యంగా టిడిపి. కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్న తమకు పీఆర్పీ పోటీ రావడం వాళ్లకు రుచించలేదు. ఆ పార్టీని చిన్నా చితకా పార్టీగా తీసిపారేద్దామనుకున్నారు బాబు. కొన్నాళ్లు గడిచి వుంటే అదే జరిగేదేమో కానీ మధ్యలో విభజన వుద్యమం వచ్చిపడింది. పీఆర్పీ తీసుకున్న లైను వలన అసలైన సమైక్యవాదిగా అది ఎదుగుతోంది. ప్రత్యేక తెలంగాణావాదులకు తెరాస ఏ విధంగా దీపస్తంభమో, సమైక్యవాదులకు పీఆర్పీ అలాటి దీపస్తంభమే! ఈ ఎదుగుదల వెంటనే ఆగాలని టిడిపి కోరుకుంటుందని, తనకు సహాయకారిగా వున్న మీడియా సహాయం తీసుకుంటుందని ఎవరైనా వూహించవచ్చు. చంద్రబాబుకు జ్యోతిలో పెట్టుబడులు వున్నాయా లేవా అంటే ఏమో అంటారు కానీ జ్యోతి టిడిపికి సహాయకారా, కాదా అంటే నిస్సందేహంగా సహాయకారే అంటారు. ఏడాది క్రితం మహాకూటమిని వెనకేసుకుని వచ్చినది జ్యోతి కాదా?

ఆంధ్రప్రాంతంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, టిడిపి ఎమ్మెల్యేలు ఊగిసలాడి, ..లాడి, పార్టీ పెద్దలకు ఎదురాడలేక నోరు మూసుకున్న స్థితిలో పీఆర్పీవాళ్లు చెలరేగి తీర్మానాన్ని అడ్డుకోబోయాకు కాబట్టి వాళ్ల యిమేజి అమాంతం పెరిగిపోయి తమకు దెబ్బ తగులుతుందని టిడిపి అనుకోవడం సహజమే కదా. చిరంజీవికి అడ్డుకట్టవేయమని టిడిపివారు అడిగి వుండవచ్చు. తెలంగాణా విషయంలో చిరంజీవిపై కోపం పెంచుకున్న జ్యోతి మేధావులు ఒబ్లయిజ్ చేయనూ వచ్చు. ఇదంతా నిజం అయినా కాకపోయినా యిలాగ జరిగివుండవచ్చనే అనుమానం పీఆర్పీకి వస్తే ఎవరూ తప్పు పట్టవలసిన పనిలేదు. వాళ్లు జ్యోతి ఆఫీసు ఎదుట నిరసన జరపడంలో అసమంజసం ఏమీ లేదు.

అయితే పీఆర్పీ హద్దుమీరినది ఎక్కడంటే పత్రికాఫీసుపై రాళ్లు రువ్వడం. ఇప్పటిదాకా పీఆర్పీ చాలా హుందాగానే ప్రవరిస్తూ వస్తోంది. చిరంజీవి తెరపై ఎంత హీరోనైనా కావచ్చు. రాజకీయ జీవితంలో ఆయనను చూస్తే ఎగ్జిబిషన్‌లో తప్పిపోయిన పిల్లవాడు గుర్తుకు వస్తాడు. దారి తప్పి యిటు వచ్చాడు పాపం అనిపిస్తుంది. అయినా అతన్కిట గౌరవం ఎందుకంటే పెద్దమనిషిలా వుంటాడు. రోజాలు, విజయశాంతిలూ ఎంత రెచ్చగొట్ట జూసినా ఏమీ రియాక్టు కాడు. ఇతను రాజకీయాలకు డిగ్నిటీ తీసుకువస్తాడేమో అనిపిస్తూ వుంటుంది అప్పుడప్పుడు. (ఈ జ్యోతి లాటివాళ్లకు అది చవటతనం అనిపిస్తూ వుంటుంది. చిరంజీవి ప్రసంగాల్లో పస

తగ్గింది అని వార్తల ద్వారా పూదరగొట్టి అప్పుడప్పుడు ప్రసంగాల్లో కాస్త హద్దు మీరేట్లా చేశారు). అందువలన చిరు నాయకత్వంలోని పీఆర్పీ జ్యోతికి రాళ్లదాడికి దిగడం ఆశ్చర్యం, బాధ కలిగించాయి. జరిగినదానికి చిరంజీవి క్షమాపణ చెప్పి వ్యవహారాన్ని ముగిస్తే బాగుండేది.

4

ఈ వ్యవహారంలో జ్యోతి ధోరణికూడా చర్చకు వచ్చింది కాబట్టి మరికొన్ని విషయాలు ప్రస్తావిస్తాను. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవలసినదేమిటంటే – నాకు జ్యోతిపై ఎలాటి వ్యక్తిగత కక్షలూ లేవు. పాత యాజమాన్యంలో జ్యోతి నడిచేటప్పుడు నా చేత అనేక రచనలు రాయించినది జ్యోతే. నా 'హిస్టరీ మేడీజీ' పుస్తకాన్ని ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్ దివంగత త్రిపురనేని శ్రీనివాస్‌కు అంకితం యిస్తూ ముందుమాటలో జ్యోతితో నా అనుబంధాన్ని విపులంగా చెప్పాను. జ్యోతి సంపాదకవర్గంలో ఒక విలక్షణత వుండేది. వాళ్లందరూ వ్యవస్థకు వ్యతిరేకంగా వుండేవారు. కొత్తను అతి త్వరగా ఆహ్వానించేవారు. అయితే కొన్ని వాదనలను భుజాన వేసుకుని మోసేవారు. తాము లేకపోతే వాటికి దిక్కు లేనట్టు ఫీలయ్యేవారు. ఒక్కోప్పుడు అది వెర్రితలలు వేసేది.

నన్ను ఫీచర్స్ రచయితగా మలచినది జ్యోతే. చాలా సబ్జక్టలపై రాసేవాణ్ని. రామన్ పిళ్లయ్ అని ఒకతను హెర్బల్ పెట్రోలు అనే పేర అందర్నీ కొంతకాలం ఏమార్చాడు. అది బోగస్ అని వాదిస్తూ నేను ఆర్టికల్ రాస్తే అది జ్యోతి వీక్లీ కాని, ఆదివారం అనుబంధం కానీ వేయలేదు. నా రచనలు ఏదీ తిరస్కరించని జ్యోతి దీన్ని తిరస్కరించడానికి ఏకైక కారణం – రామన్ పిళ్లయ్ బిసి కావడం! ఆదివారం అనుబంధం 'ఒక బిసి విజయం' అంటూ అతన్ని తెగ పొగిడేసింది. వాళ్ల స్వంతవూరునుండి వివరాలు తెప్పించి అతన్ని ఒక హీరో చేసి పారేసింది. ఆ టైములో నేను అతను మోసగాడు అనడం వాళ్లకు రుచించలేదు.

'మీది సైంటిఫిక్‌గా కరక్టే కావచ్చు. కానీ యిది వేస్తే బిసిల ఆత్మస్థయిర్యం దెబ్బ తింటుంది' అని నాతో వాదించారు. అక్కడికి బిసిల ఆత్మస్థయిర్యం నా తొక్కలో ఆర్టికల్‌మీదనే ఆధారపడినట్టు, (తర్వాత దాన్ని మయూరి అనే వీక్లీ ప్రచురించింది. బ్రహ్మాండం బద్దలవలేదు!) బిసిల సంరక్షణాభారం ఆంధ్రజ్యోతే వహించినట్టు! చివరకు ఏమైంది? రామన్ పిళ్లయ్ పెద్ద ఫ్రాడ్‌గా తేలాడు. అతని గురించి అందరూ మర్చిపోయారు. జ్యోతి బహిరంగంగా నాలిక కరుచుకోలేదు. బిసిలను వెనకేసుకుని రావడం మానలేదు. జ్యోతి కొత్త అవతారం ఎత్తిన తర్వాత కూడా ఎడిట్ పేజీలో బిసిల వ్యాసాలు, తెలంగాణా వ్యాసాలు డామినేట్ చేస్తూనే వున్నాయి.

జ్యోతి ప్రస్తుత ఎడిటర్ కె.శ్రీనివాస్ వీరవిభజనవాది. తన అభిప్రాయం చాటుకోవడానికి ఆయన ఏ వేదికా వదులుకోరు. ఈ మధ్య ఆంధ్ర సారస్వత పరిషత్ వారి సభ జరిగింది. పరిణతవాణి పేర 65 ఏళ్లు దాటినవారిచేత వారి అనుభావాలు రికార్డు చేయించే ప్రక్రియ పరిషత్ అధ్యక్షులు సినారె రూపొందించారు. ఆ క్రమంలో 50 వ ప్రసంగం ఈ మధ్యనే జరిగింది. సినారె యే ప్రసంగించారు. ఆ సభకు అధ్యక్షుడిగా జ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్ వచ్చారు. అధ్యక్షోపన్యాసంలో సారస్వత పరిషత్ గొప్పతనాన్ని ఉగ్గడిస్తూనే 'ఎవరు ఎలా అనుకుంటున్నా రాష్ట్రం విడిపోవడం ఖాయం. తెలంగాణాకు యీ పరిషత్ ఎంతో ముఖ్యం..' అంటూ ప్రసంగించారు. రాష్ట్రం ఒకటిగా వున్నా, పది ముక్కలైనా పరిషత్ తెలుగువారికి ఎంతో ముఖ్యమైన సంస్థ. నిజాం పరిపాలన వంటి వ్యతిరేక పరిస్థితుల్లో తెలుగువారు నిర్మించుకున్న మహా సంస్థ అది. దాన్ని కాపాడుకోవడానికీ, రాష్ట్రం విడిపోవడానికీ సంబంధం ఏమిటో తెలియక సభలోని వారు తలలు పట్టుకున్నారు. రాష్ట్రవిభజన ఐడియా గురించి 'సాఫ్ట్ సెల్' చేయడానికి శ్రీనివాస్ ఏ వేదికా వదలరని మాత్రం తేటతెల్లంగా తెలిసింది.

సంపాదకుడికి వ్యక్తిగత అభిప్రాయాలుండకూడదని నేననడం లేదు. కానీ అవి శ్రుతి మించినపుడే ప్రమాదం. వాటిని బట్టి పత్రికకు ముద్ర పడుతుంది. సంపాదకుడికి సమ్యక్ దృష్టి వుండడం అభిలషణీయం. జ్యోతిలో భిన్నాభిప్రాయాలకు చోటు యిస్తారు. అంతవరకూ బాగానే వుంది. కానీ కృష్ణ కమిటీ ఏర్పాటు నేపథ్యంలో జిల్లాల అభివృద్ధి గణాంకాలను ఈనాడు, సాక్షి ప్రచురిస్తున్నా జ్యోతి ప్రచురించటం లేదు. తాము ప్రచారం చేస్తున్న భావాలకు దెబ్బ తగులుతుందన్న భయమో ఏమో!

నేను జ్యోతిని ఒక్కదాన్నే తప్పుపట్టడం లేదు. నిజానికి తెలుగులో మనకు వస్తున్న దినపత్రికలను చూస్తే నిరాశ కలుగుతుంది. గతంలో వారపత్రికలలో వచ్చే అంశాలన్నిటినీ దినపత్రికలలో గుప్పిస్తున్నారు – ఆరోగ్యం, అతివ, యువత, భవిత అంటూ ఎన్నో ఫీచర్లు. పైగా కలర్ పేజీలు. అసలుండవలసిన అన్‌బయాస్‌డ్ న్యూస్ కవరేజి మాత్రం పూజ్యం. ఈనాడు, జ్యోతి, వార్త, సాక్షి – అన్నీ ఏదో ఒక పక్షంగా రాస్తాయి. ఆంధ్రభూమి యాజమాన్యం కాంగ్రెస్‌వాళ్లదైనా ఆంధ్రభూమి న్యూస్ కవరేజ్‌లో పక్షపాతం చూపించదు. న్యూస్‌కి ఏ రకమైన ప్రాధాన్యత యివ్వాలో ఆ విధంగా యిస్తుంది. పేజీలు తక్కువ కాబట్టి న్యూస్ ఎక్కువ యివ్వకపోయినా, కొన్ని వ్యాసాలు బాగుంటాయి.

దాని ఎడిటర్ ఎంవియార్ శాస్త్రి చాలా చదువుకున్నవారు. విషయాలు బాగా తెలిసున్నవారు. వెటకారంలో రోశయ్యకే పాఠాలు నేర్పగలిగేవారు. వ్యంగ్యం ఎంత బాగా రాస్తారంటే ఫిక్షన్‌లోకి దిగి వుంటే ముళ్లపూడి వెంకటరమణ 'రాజకీయ బేతాళ పంచవింశతిక'కు దీటైన రచన మనకు దక్కేది. అయితే ఆయనతో యిబ్బంది ఏమిటంటే ఆయన 'హిందూ పరివార' సభ్యుడు. ఆ ఆలోచనాధోరణిలో వున్నవాళ్ల చేత ఏకపక్షమైన ఆర్టికల్స్ చాలా రాయిస్తారు. అది చికాకు కలిగిస్తుంది. ఎడిటర్‌కు వ్యక్తిగత యిష్టాయిష్టాలు వుండకూడదా

అని మీరనవచ్చు. ఇందాకా జ్యోతి శ్రీనివాస్ గురించి వాక్యాలే మళ్లీ రాయవలసి వస్తుంది.

ఏదో ఒక వాదానికో, వర్గానికో కొమ్ము కాస్తాయని తెలుగు పేపర్లంటే తెలుగువాళ్లలో చాలామందికి విసుగు. 'మీరు నిష్పక్షపాతంగా రాస్తున్నారు. ఇలా వుండీ వుడిగీ రాసేబదులు అన్ని వార్తలూ మీరే రాయకూడదా?.. మేమో వెబ్‌సైట్ పెడదామనుకుంటున్నాం, మీరు ఎడిటరుగా వుండి రాయవచ్చు కదా..' లాటి ఆఫర్లు నెలకొకటి వస్తూంటాయి నాకు. అవి ఆచరణయోగ్యమా కాదా అన్న సంగతి పక్కన పెట్టండి. పత్రికలంటే జనాలకున్న అభిప్రాయానికి అది అద్దం పడుతోంది.

అందువల్లనే ఆంధ్రజ్యోతిపై దాడి జరిగిందంటే మామూలు ప్రజలు మరీ అంత చలించలేదు. ఇది దురదృష్టకరం. ఇది క్రమేపీ ఫాసిస్టు ధోరణులకు దారి తీస్తుంది. పత్రికలను బెదిరించి తమకు అనుకూలంగా రాయించుకునే అలవాటు మప్పుతుంది. అలాటి పరిస్థితి రాకుండా చూసుకోవలసినది పత్రికలే. అతి చేస్తే గతి చెడుతుంది. జ్యోతి గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి నా కోరిక చెప్పేసి ముగిస్తాను – జ్యోతి జ్యోతిగానే వుండాలి తప్ప కాగడాగా మారి, అవసరమైనదానికంటె వెలుగు చిమ్మి, యథార్థాలను చూడలేనంతగా కళ్లు బైర్లు కమ్మించ వద్దని ప్రార్థన! **(సమాప్తం)– ఎమ్బీయస్ ప్రసాద్**

**మార్చి 22**

## ఎమ్బీయస్ – ఖతార్(నాక్) హుస్సేన్

'బ్రాహ్మల్లో కూడా మహానుభావులు లేకపోలేదు' అన్నట్టు సుప్రీంకోర్టు కూడా అప్పుడప్పుడు తెలివైన తీర్పులు యిస్తూ వుంటుంది. హుస్సేన్‌గారిపై ప్రయివేటు పార్టీలు పెట్టిన కేసులు ఎత్తేసి, ఆయన స్వదేశానికి తిరిగి రావడానికి కేంద్రాన్ని ఆదేశించాలని వేసిన 'పిల్' కొట్టి పారేసింది. ప్రయివేటు కేసులు ఎత్తేయమని కేంద్రాన్ని ఎలా అడుగుతాం? అని అంటూనే హుస్సేన్‌గారు ఖతార్‌లో వుంటే వచ్చే సమస్యలేమిటి? అని అడిగింది.

హుస్సేన్‌గారు భారతపౌరసత్వాన్ని త్యజించడంతో మిన్ను విరిగి మీదపడ్డట్టు ఓవరాక్షన్ చేస్తున్న 'మేధావు'లందరూ యిప్పటికైనా మానుకుంటే అదే పదివేలు. హుస్సేన్ ఉదంతానికి, కళాకారుడి స్వేచ్ఛకు ముడిపెట్టి వూహూ ఫీలై పోతున్నారు ఈ 'ఆర్ట్' లవర్స్. నిజానికి కళాకారుడికి తన భావాలు వ్యక్తపరిచే స్వేచ్ఛ వుండాల్సిందే. నిజానికి ఆ స్వేచ్ఛ వుందనే నేను యీ వెబ్‌సైట్‌లో రాస్తున్నానని చాలా సార్లు చెప్పాను.

అన్నట్టు వెబ్‌సైట్ అంటే గుర్తుకు వచ్చింది. నా ఆర్టికల్స్ యొక్క ఆర్కయివ్స్ సరిగ్గా లేవని నాకు రోజుకి కనీసం అయిదారు మెయిల్స్ వస్తున్నాయి. అందునా నేను సీరీస్‌లా రాస్తాను కాబట్టి మధ్యలోది కంటపడితే వెనకా, ముందూ చదవాలనుకోవడం సహజం. నిజానికి నేను యింతకు ముందు రాసే వెబ్‌సైట్‌లో అలాగే పెట్టేవారు. ఆర్టికల్‌కు కింద కితం భాగాలకు, తర్వాతి భాగాలకు లింక్స్ వుండేవి. 'ఈ మెయిల్ దిస్ ఆర్టికల్..' అంటూ ఎవరికైనా పంపించే సౌకర్యం వుండేది.

ఇక్కడ కూడా అలాగే పెట్టమని యీ వెబ్‌సైట్ మేనేజర్లకు చాలాసార్లు చెప్పాను. చేతకాకో, మనసురాకో వాళ్లా పని చేయడం లేదు. నేను యీ విషయంలో నిస్సహాయుణ్ని. (నేను యీ వెబ్‌సైట్ ఓనర్నని, ఎడిటర్ననీ, మరోటనీ అపోహపడేవాళ్లు యిప్పటికైనా కళ్లు తెరవాలి) ఆ విషయం గ్రహించని పాఠకులు మీ ఫోటో కింద ఆర్కయివ్స్ అని గొప్పగా వేశారు కానీ వాటిలో చాలాభాగం పనిచేయడం లేదు చూసుకోండి అంటూ నాకు ఫిర్యాదు చేస్తూనే వున్నారు. కొంతమంది ఆ భాగాలు తమకు డైరక్టుగా పంపమని నన్ను అడుగుతూంటారు.

పాఠకులకు నేను చెప్పేది ఒకటే – అసలు ఏనాటి ఆర్టికల్ ఆనాడు రెగ్యులర్‌గా పంపడానికే తాడు తెగుతోంది. ఇక మీ అందరికీ ముందూ వెనుకా ఆర్టికల్స్ వ్యక్తిగతంగా పంపడం నా తరమా? అప్‌లోడ్ అవగానే ఎప్పటికప్పుడు చదివేసుకుంటే హాయి. లేదంటారా, తలాతోకా లేకుండా మధ్యలోది చదివినా దానిలోనే ఓ జాయ్ వుంది.

ప్లాస్టిక్‌యుగం ప్రబలడానికి ముందు కిరాణాషాపుల్లో కాగితం పొట్లాలలో పప్పులు, వుప్పులు కట్టి యిచ్చేవారు. పప్పులు సీసాల్లో పోసేశాక ఆ పొట్లం కాగితం జాగ్రత్తగా విప్పదీసి దానిమీద వున్న సగంసగం కథ చదవడం గొప్ప ఎక్సయిటింగ్‌గా వుండేది. మన చేతిలో వున్న సుబ్బారావూ, సుందరి వరసకు ఏమవుతారో తెలియదు, కలిసి లేచిపోతారో తెలియదు, విడిపోయి 'ఆ నావా వెళ్లిపోయింది, ఆ రేవూ దాటిపోయింది' అంటూ ఎవరి గట్టుమీదే వాళ్లే వుండిపోతారో తెలియదు.

క్రైమ్ అండ్ సస్పెన్సు కథే అయితే యిహ చెప్పనే అక్కరలేదు. కథకు మనంతట మనమే బోల్డు ముగింపులు యిచ్చేసుకుంటూ మన వూహాశక్తిని పెంపొందించేసుకుంటాం. ఈ ఆధునిక యింటర్నెట్ యుగంలో కూడా కాగితం పొట్లాలనాటి యీ అనుభూతిని మీకు కలిగిస్తున్నదెవరు? – నా కాలమ్ తప్ప!

హుస్సేన్ వద్దకు వస్తే నా వుద్దేశంలో ఆయన తన స్వేచ్ఛను సెలక్టివ్‌గా వాడుతున్నాడు. నగ్నచిత్రాలు నన్నేమీ బాధించవు. అష్టకష్టాలు పడి ఖజురాహోకి వెళ్లి చూసి వచ్చినవాణ్ని. హుస్సేన్‌గారు నగ్నత్వాన్ని కొందరికే పరిమితం చేస్తున్నాడని నా బాధ. హిందూ దేవతలని మాత్రమే నగ్నంగా చూపించాలన్న ముచ్చట ఎందుకు?

ముస్లిం ప్రవక్తను నగ్నంగా కాదు కదా, మామూలుగా కూడా చూపించే ముచ్చట ఎందుకు కలగటం లేదు? భయం కదూ! అప్పుడేమైంది స్వేచ్ఛ? అంటే మన హిందువులందరం మతసహనం లేని కొందరు ముస్లిముల్లా మారాలని నా ఉద్దేశం కానే కాదు.

సహనంలో హిందూమతం ట్రాక్ రికార్డు చాలా యితర మతాలకంటె మెరుగు. మనం అలా వుండడమే సబబు.

అయితే ఈ హుస్సేన్ యీ సహనాన్ని తన మార్కెట్ ప్రమోషన్‌కు వాడుకుంటున్నాడు. తాగింది కుసింత, ఊసింది ఊరంత అన్నట్టు వేసిన ఆయన బొమ్మలు తక్కువ, ఆర్భాటం ఎక్కువ. నిజానికి హుస్సేన్ మనలో చాలామందికి తెలిశాడంటే కారణం అతని బొమ్మల వలన కాదు, ఏదో ఒకటి చేసి పబ్లిసిటీ సంపాదించుకోవడం వలన! లేకపోతే ఆయన చెప్పులేసుకుంటే ఎంత, వేసుకోకపోతే ఎంత? దాని గురించి బోల్డు ప్రచారం. 'ది బేర్ ఫుటెడ్ ఆర్టిస్టు' అని పాత్రికేయులు హెడింగ్స్ పెట్టడం.

తర్వాత మాధురీ దీక్షిత్ అంటే పడి చావడం. చస్తే చచ్చాడు కానీ మన కెందుకు చెప్పడం? ఆమె గురించి 'హమ్ ఆప్‌కే..' సినిమాను వందసార్లు చూశానని పేపరు వాళ్లకు డప్పెందుకు? అలా అయితే చిరంజీవి సినిమా వందన్నొక్కసార్లు చూసినవాడికి యింత పబ్లిసిటీ యిస్తారా? ఆమె మీద ఓ సినిమా తీసేశాడు మహానుభావుడు. ఓ వారం కూడా ఆడినట్టు లేదు. సినిమా తీద్దామనుకుంటున్నాను, తీస్తున్నాను, తీసేశాను అంటూ ఏడాది పబ్లిసిటీ ఉత్తినే కొట్టేశాడు. చాలు. కుతి తీరిపోయింది. సినిమా ఎలా అఘోరిస్తే ఆయనకేం పోయింది?

హుస్సేన్ గొప్ప చిత్రకారుడో కాదో నాకు నిజంగా తెలియదు. నాకు ప్రాచీన చిత్రకళ బాగా, ఆధునిక చిత్రకళ కొద్దిగా నచ్చుతుంది. కాస్త కాస్త అర్థమౌతుంది కూడా. హుస్సేన్ బొమ్మలు 'అద్దిరిపోయాయి' అని నాకెప్పుడూ అనిపించలేదు. హుస్సేన్ వివాదాల గురించి ఏ మాత్రం తెలియని, పారిస్ మ్యూజియాల్లో వుండే ఆర్ట్ క్రిటిక్స్, కలక్టర్లు అతనికి ఏ స్థానం యిస్తారో ఎవరైనా చెప్తే తెలుసుకోవాలని వుంది.

2

హుస్సేన్ చేస్తున్నదేమిటి? ఎలాగోలా న్యూస్‌లో వుండడానికి ఏదో ఒక వివాదం సృష్టిస్తాడు. దిగంబర హిందూ దేవతల బొమ్మలే వేయాలన్న సరదా అంతగా వుంటే ఏ రతీమన్మథులదో వేయమను, లేకపోతే మేనకా విశ్వామిత్రులది వేయమను. రాసలీల, గోపికా వస్త్రాపహరణం, ద్రౌపదీ వస్త్రాపహరణం.. యింకా బోల్డు బూతు ఘట్టాలున్నాయి, హిందూ పురాణాల నిండా.. అవి వేసుకోమను. కానీ పోయి పోయి సరస్వతీదేవి బొమ్మ వేయడం మాత్రం నేను భరించలేను. ఆవిడ బట్టలు విప్పుకున్న ఘట్టాలు ఏమీ పురాణాల్లో లేవు కదా.

కావాలంటే బట్టల్లేకుండా తాండవం చేసే కాళికాదేవి బొమ్మ వేయమను. సతీదేవి నగ్నశరీరాన్ని భుజాన వేసుకున్న పరమశివుడు బొమ్మ వేయమను. మరీ వెర్రి వుంటే వూడిపడిపోయిన శివుడి లింగం తాలూకు మొదలు, చివర అన్వేషిస్తున్న విష్ణువును, బ్రహ్మనూ వేయమను. కానీ పాపం సరస్వతి ఏం చేసిందండీ! బ్రహ్మతో ఆమె రమించిన సన్నివేశాలు కూడా ఏ కవీ వర్ణించలేదు కదా.

నగ్నదేవతను చిత్రీకరించాలంటే అమ్మవారిని నూగారుతో సహా ఆపాదమస్తకం వర్ణించిన ఆదిశంకరుడి సౌందర్యలహరి చదివి, చేవ వుంటే ఆ అందాలను యథాతథంగా కాన్వాసుమీద దింపమను. ఇదా ఆదిశంకరుడు దర్శించిన అమ్మవారి సౌందర్యస్వరూపం అని తెలుసుకుని సంతోషిస్తాం. కానీ యీ హుస్సేన్ చేసినదేమిటి? నగ్నంగా ఓ నాలుగు గీతల్లో అమ్మాయి బొమ్మ గీసేసి ఆమె చేతిలో వీణ పెట్టేసి ఆవిడే సరస్వతి అన్నాడు. పురాణాలు చదివి సరస్వతి స్వరూపస్వభావాలను అంచనా వేశాడా?

దుర్గాదేవి, కాళికాదేవి – రెండూ పార్వతి అవతారాలే. ఇద్దరి స్వభావాల్లోనూ ఎంత తేడా వుంటుంది? చిత్రకారుడు లేదా శిల్పి ఎంత భిన్నంగా తయారుచేస్తాడు? రాముడు, కృష్ణుడు – రెండూ విష్ణువు అవతారాలే. కానీ వారి ముఖకవళికల్లో, ఆహార్యంలో తేడా వుంటుంది – వారి అవతారధర్మాల బట్టి.

రాజా రవివర్మే కాదు విద్యాగంధం లేకుండా విగ్రహాలు తయారుచేసేవారు సైతం యీ విషయం గుర్తెరిగి తయారుచేస్తారు. హుస్సేన్‌గారికి ఆ పాటి శ్రద్ధ కూడా వున్నట్టు లేదు. బట్టలిప్పేస్తే ఆహార్యం సమస్య లేదు, నాలుగు గీతలే కాబట్టి వాటిల్లో భావాన్ని మనం తలకిందులుగా తపస్సు చేసినా చదవలేం.

నేను చూళ్లేదు (చూడదలచుకోలేదంటే సబబుగా వుంటుంది) కానీ హుస్సేన్‌గారు దుర్గను, భారతమాతను దిగంబరంగా చిత్రీకరించాడట. సీతమ్మవారిని రావణుడి వద్ద నగ్నంగా వున్నట్టు చూపించాడట. ఒకే బొమ్మలో పిలకబ్రాహ్మణ్ని దిగంబరంగానూ, కత్తిపట్టిన ముస్లిమును ఒంటినిండా దుస్తులతోనూ చూపించాడట.

ఏమిటీ వివక్షత? బట్టలు విప్పితే కానీ భావప్రకటన సరిగ్గా వ్యక్తీకరించలేని అసమర్థుడా హుస్సేన్? బద్‌నామ్ భీ తో నామ్ హై అన్న ఫిలాసఫీ ఆయనది. ఏదో ఒకటి చేసి అవతలివారిని రెచ్చగొట్టి పబ్లిసిటీ తెచ్చుకోవడమే ఆయన పరమావధి.

ఇది యిప్పుడా మొదలెట్టింది! 1970ల నుండి వేసుకుంటూ వచ్చాడు. బొమ్మల మార్కెట్ డౌనయినప్పుడల్లా ఓ హిందూ దేవతను లంకించుకోవడం, బట్టలిప్పేయడం. ఈ వాలకం చూసి చూసి 1996లో ఓ హిందీ మంత్లీ హుస్సేన్‌మీద ఓ ఆర్టికల్ రాసి పడేసింది. ఇతని ధోరణికి నొచ్చుకున్న వారు కోర్టులో క్రిమినల్ కేసులు పెట్టారు తప్ప శిరచ్ఛేదం చేయాలంటూ ఫత్వాలు జారీ చేయలేదు.

మొత్తం నా మీద 900 కేసులున్నాయి అంటాడు హుస్సేన్. దానిలోనూ హెచ్చులకు పోవడమే! అంతమందిని నొప్పించానన్న పశ్చాత్తాపం ఏ కోశానా లేదు. క్షమాపణలు లేవు.

ప్రస్తుతం హుస్సేన్‌గారిని వాటేసుకున్న గల్ఫ్ అరబ్బులకూ పెయింటింగ్స్‌పై, పెయింటర్స్‌పై అభిమానం కారిపోతోంది అనుకోకండి. యూరోపియన్‌లకు వున్న అటువంటి అభినివేశంలో ఒక శాతం కూడా వాళ్లకు లేదు. అసలు యిలా స్వేచ్ఛను ప్రకటించే కళాకారులంటే వాళ్లకు గిట్టదు కూడా.

విగ్రహారాధన పనికిరాదన్న ఒక్క సిద్ధాంతం కారణంగా వాళ్లు దేవుడికి కాదు కదా, ప్రవక్తకు కూడా బొమ్మ వేయనివ్వరు. సిల్‌హౌట్‌లో కాదు, కనీసం ఔట్‌లైన్ కూడా వేయనివ్వరు. విగ్రహారాధన లేని అనేక మతాలు తమ పిల్లలకు బొమ్మల కామిక్స్ ద్వారా మతం గురించి చెప్పుకోగలుగుతున్నారు. ముస్లిము పిల్లలకు అటువంటి సౌకర్యం లేదనుకుంటాను.

బరోడానుండి డా॥ హిల్డా రాజా అనే ఆవిడ రాశారు – 1991లో హిందూ పత్రికవారు స్కూలు పిల్లల గురించి వేసిన ఓ సప్లిమెంటులో ఓ గడ్డపు తెల్లద్రస్సాయన స్కూలు పిల్లలకు కురాన్ సూక్తుల గురించి చెప్తున్నట్టు ఓ బొమ్మ వేశారట. మహమ్మద్ ప్రవక్త ముఖకవళికలు చూసినవారు, తెలిసినవారు యీ తరంలో ఎవరూ లేరు. అయినా ఆ నీతిసూత్రాలు చెప్తున్నవాడు ప్రవక్త అని భావించారు కొందరు ముస్లిములు.

అంతే, హిందూ ఆఫీసుపై దాడి చేశారు. అంబూరు, వన్నియంబాడి, వెల్లూరులలో స్టాండ్స్ నుండి హిందూ పత్రికలు లాగిపడేసి తగలబెట్టేశారు. పార్లమెంటులో ప్రయివేటు మెంబరు బిల్లు ద్వారా చర్చ లేవదీస్తామని బెదిరించారు. హిందూ పత్రిక యిదంతా తట్టుకోలేక మర్నాటి పత్రికలో క్షమాపణ చెప్పుకుంది.

తన సాటి మతస్తుల ప్రవర్తనకు హుస్సేన్‌గారు నొచ్చుకుని వుంటే తన స్వేచ్ఛ నుపయోగించి వాళ్లకు ఆమోదయోగ్యమైన చిత్రాల ద్వారానే యిస్లాం మతాన్ని వ్యాప్తి చేసివుంటే ఎంతో బాగుండేది. కానీ ఆయనకు ప్రచారం కావాలి కానీ పరలోకం అక్కరలేదు. అందుకే హిందూ మతంపై పడ్డాడు.

3

2004లో ఆయన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌పై దాడి జరిగాక హుస్సేన్ దుబాయికి కాపురం మార్చాడు. అక్కడ ఆయన బొమ్మలేవీ అమ్ముడుకాకపోవడంతో యూరోప్ ఆర్ట్ గ్యాలరీలలో ప్రదర్శనలు నిర్వహించి, మళ్లీ దుబాయికి వచ్చేవాడు. అయితే ఖతార్ రాజుగారి రెండవ భార్య శేఖా మోజా (వయసు 54)కి పెయింటింగ్స్‌పై మోజుంది. 300 మిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన ఇస్లామిక్ ఆర్ట్ మ్యూజియం నిర్మించింది. ఈ హుస్సేన్‌గారు ఆవిడని యింప్రెస్ చేయగలిగాడు. అంతే ఖతార్‌లో ఆశ్రయం దొరికింది.

ఖతార్ పౌరసత్వానికి పొందాడు. తప్పులేదు. రూల్స్ ప్రకారం ఇండియన్ పాస్‌పోర్టు అప్పగించాలి. సరే అప్పగించుకోమను. కానీ దానినుండి కూడా పబ్లిసిటీ తెచ్చుకోవాలని చూశాడు మహానుభావుడు. పాస్‌పోర్టు అప్పగించడానికి ముందే హిందూ పత్రిక ఎడిటర్ ఎన్.రామ్‌కు కావాలనే యివన్నీ వెల్లడించాడు. రామ్ 'హిందూ' వ్యవస్థలో తప్పబుట్టినవాడు. ఆయనా తమ్ముడూ కలిసి హిందూని తమ మార్గంలోకి తిప్పాలని మహా తిప్పలు పడుతున్నారు.

హుస్సేన్ సమాచారం అతనికి కోతికి కొబ్బరికాయలా దొరికింది. హుస్సేన్ ఇండియన్ పౌరసత్వం వదులుకోవడంవల్ల భారతమాత తల్లడిల్లుతోందన్న బిల్డప్ యిచ్చి పూదరగొట్టేసారు రామ్. అంతే ఇండియాలో మేధావులనుకున్న వారందరూ ఇది భారత దేశానికి పూడ్చలేని గొప్ప నష్టం అని వ్యాసాలు రాసి పారేశారు.

90 ఏళ్లు భారతదేశంలో బతికి ఇక్కడ పద్మవిభూషణ్ కూడా అందుకున్న హుస్సేన్ యీనాడు ఖతార్‌లో తన యింటిని ఆ సంస్కృతి ప్రతిబింబించే పెయింటింగులతో అలంకరించడమే కాక అరబ్బుల తరహా కద్దురా (తోబ్) దుస్తులను ధరిస్తున్నారని ఆంధ్రజ్యోతి గల్ఫ్ రిపోర్టరు రాశారు. ఇదీ ఆయన భారతీయత! ఇటువంటివాడు యిక్కడ వుంటేనేం, వూడితేనేం?

కళాకారులకుండవలసిన స్వేచ్ఛ హుస్సేన్ అనుభవించలేకుండా పోతున్నాడని అంగలారుస్తున్న వీళ్లు ఓ విషయం గుర్తు పెట్టుకోవాలి. పత్రికల మీద సెన్సార్‌షిప్ విధించిన, తమకోసం పాడని కిశోర్ కుమార్ వంటి కళాకారులను జైలు పాలు చేసిన ఎమర్జన్సీ కాలాన్ని పొగిడిన హుస్సేన్ యితను. ఇందిరా గాంధీని దుర్గగా, ప్రజా వుద్యమం నడిపిన జయప్రకాష్ నారాయణ్‌ను మహిషాసురుడిగా చిత్రీకరించిన హుస్సేన్ యితను. ఇతరుల స్వేచ్ఛ గురించి పాకులాడకపోగా, స్వేచ్ఛ హరించినవారిని కీర్తించిన అతను ఇండియా వదలిపోతే ఏడవటం దేనికి?

పోనీ యిలాగైనా హుస్సేన్ పీడ ఇండియాకి వదిలిపోయిందని సంతోషించలేం. ఓ పక్క ఇండియన్ సిటిజన్‌షిప్ వదులుకుంటూనే విదేశాలలోని భారతీయ సంతతికి యిచ్చే పిఐఓ కార్డుకోసం అప్లయి చేసుకున్నాడు దొర! వీసా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇండియాకు వచ్చి వెళ్లవచ్చు. మరి ఆయన నష్టపోయినదేమిటట?

కేసులు పెట్టారని భయపడి పౌరసత్వం వదులుకున్నాడా? మన యిండియన్ పోలీసులు తలచుకోవాలే కానీ ఆ పిఐఓ కార్డుతో ఇండియాలో అడుగుపెట్టిన తక్షణం అరెస్టు చేయగల అధికారం మనవాళ్లకుంది. అయినా ఆయన ఆ కార్డుకోసం అప్లయి చేసుకున్నాడు. ఇంతకంటె కిల్లాడీతనం వుందా?

మన దేశం కిల్లాడీలతో కిటకిటలాడుతోంది. ఒకడు వదిలినా వదిలినట్టే. పోయినవాణ్ని పోనీయకుండా పట్టుకుని వేళ్లాడడం

ఎందుకు? అలాక్కాదు ఆయన వచ్చి తీరాలి అని పట్టుబట్టే వాళ్లకు నాదో సలహా – మీరు హుస్సేన్ వద్దకెళ్లి 'నీకు కాస్త కళాభిక్ష పెట్టిన సరస్వతీమాతను బట్టలూడదీసి బొమ్మలేసినట్టే యీనాడు ఆశ్రయం యిచ్చిన ఖతార్ చిన్నరాణీగారిని కూడా అదే రూపంలో చిత్రించు' అని బతిమాలండి. మీ మాట విని హుస్సేన్ గారు బొమ్మ వేయాలే గానీ ఆవిడ ఓ ఫత్వా జారీ చేయించడం, హుస్సేన్‌గారు ఉరుకుపరుగుల మీద వచ్చి మనదేశంలో వాలడం ఖాయం. వాలి, యిక్కడ కళ్లముందు కదలాడే యమధర్మరాజు నగ్నచిత్రం వేస్తాడు! సో, బ్యాక్ యిన్ యాక్షన్! మీ అచ్చటా ముచ్చటా తీరిపోతాయి.

నన్నడిగితే ఆ పిలవడం పిలవడం హైదరాబాదుకి పిలిస్తే మంచిదని. ఇప్పటికే మతకల్లోలాలతో అల్లాడుతోంది భాగ్యనగరం. సందట్లో సడేమియాలా యీ బడేమియా కూడా వచ్చి చేరితే యిక చెప్పనక్కరలేదు. ప్రపంచమంతా ముందుకుపోతూ వుంటే మనం మాత్రం జెండా లెక్కడ కట్టాలీ అన్నదానిపై కొట్టుకుని పాతరాతియుగం వైపు పోతున్నాం. నెల్లాళ్ల కితం జరిగిన మిలాదున్నబీ పండక్కి మజ్లిస్‌వాళ్లు కోటి రూపాయలు ఖర్చు పెట్టి పూరంతా ముస్లిం జెండాలు కట్టారట. ఇదివరకు రోజుల్లో అయితే పండగయిన మూడోనాటికి పోలీసులు వాటిని తీయించేసేవారట. గత మూడు, నాలుగు ఏళ్లగా వూరుకుంటున్నారట. ఈ ఏడాది మరీ వూరుకున్నారు – కార్పొరేషన్‌లో మజ్లిస్ బలం పెరిగిందిగా!

అయితే బిజెపివాళ్లు వూరుకోదలచుకోలేదు. అవి పీకేసే పండగ కోసం ఎదురుచూశారు. హనుమజ్జయంతి కనబడింది. అంతే పండగకి మూడు నాలుగు రోజుల ముందునుంచీ జండాలు కట్టడం మొదలెట్టారు. అదీ ముస్లిం జెండాలు పీకేసి మరీను. ఇంకేముంది? అగ్గి అంటుకుంది. కొట్టేసుకున్నారు. మధ్యలో మనల్ని దోచేసుకున్నారు. రోజుకూలీపై పనిచేసే అనేకమంది పొట్టకొట్టారు. రెక్కాడితే తప్ప డొక్కాడని బడుగుజీవులు ఆక్రోశాలు వాళ్ల చెవికి సోకలేదు. పోలీసులు యాక్టివ్‌గా వుండకుండా కొన్ని అదృశ్యహస్తాలు పనిచేశాయంటున్నారు.

ఇది చాలనట్టు బిజెపివారు హనుమజ్జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. పోలీసులు సరేనన్నారు. పండగనాడు ర్యాలీ ఏమిటి? ఎక్కడైనా విన్నామా? అదీ ఓల్డ్‌సిటీలోని హనుమంతుడి గుడి నుండి సికింద్రాబాద్‌లో గుడి దాకా. మధ్యలో ముషీరాబాద్‌లో రాళ్లు పడ్డాయి. పాతబస్తీ కల్చర్ కొత్త బస్తీకి పాకింది. పండగనాడు గుడిలో అర్చనలు చేసుకుంటారు. భజనలు చేసుకుంటారు. ఇదేమైనా వినాయకుడి నిమజ్జనమా? బోనాల పండగా? గుంపులు గుంపులుగా జనాలు వూరేగడానికి! దీనికి పర్మిషన్ యిచ్చిన పోలీసువాణ్ని పట్టుకుని తన్నాలి.

ఆ పోలీసుల వెనుక వున్న శక్తులను కాల్చేయాలి. ఆ శక్తులెవరన్నదానిపై హాట్ హాట్ డిస్కషన్స్ అవుతున్నాయి. కాబినెట్ విస్తరణ ఆపించాలని కాంగ్రెస్‌లోని వైరివర్గాలు అల్లర్లు చేయించారంటున్నారు. గనుల సర్వే ఆపించాలని.. అంటున్నారు. రోశయ్య గుమాస్తా పనికి తప్ప నాయకుడిగా వుండడానికి అసమర్థుడని నిరూపించడానికి (ఆ అవసరం వుందా?) యువనాయకుడు చేయించాడని అంటున్నారు. ఇలా అంటూండగానే టైమ్స్ ఆఫ్ ఇండియావారు ఓ టిడిపి కార్పొరేటర్, ఓ బిజెపి ఆపరేటర్ యిన్వాల్వ్ అయినట్టు రుజువులు దొరికాయన్నారు. బిజెపి సరే, మధ్యలో టిడిపి దేనికి? వాళ్ల అజెండా ఏమిటో మరి!

నిజనిజాలు తేలేటప్పటికి దశాబ్దాలు పట్టవచ్చు కానీ మొత్తానికి మూడు దశాబ్దాలుగా హైదరాబాదుకున్న యిమేజి మంటగలిపేశారు. ఎంతోమంది నాయకులు, యువతీయువకులు కలిసి కష్టపడి నిర్మించిన బ్రాండ్ యిమేజ్ యీ విభజనోద్యమం వలన, యిప్పుడు యీ మతకల్లోలాల వలన ధ్వంసం అయిపోతోంది. దీన్ని మళ్లీ నిర్మించడం ఎప్పటికవుతుందో! దీని గురించి వర్రీ అవుతూ ఏం చేయాలో తోచక దిగాలు పడేది మనం. ఈ మంటల్లో చలికాచుకునేది వాళ్లు.

అందుకే అంటున్నాను – హుస్సేన్ అభిమానులు అతన్ని ఏకంగా హైదరాబాదుకి తీసుకుని వచ్చేస్తే యీ మంటలు ఎప్పటికీ చల్లారకుండా చూడవచ్చు. ఆయన యిప్పటికే హనుమంతుడి తోకమీద ఓ నగ్నయువతి చిత్రం వేశాడు. ఆ యువతి సీత అని కొందరనుకున్నారు. హుస్సేన్ మహానుభావుడు అవుననలేదు, కాదనలేదు. ఇప్పుడు హైదరాబాదు పట్టుకొచ్చి మళ్లీ అలాటి బొమ్మ – హనుమంతుడు రొమ్ము చీల్చుకునే దృశ్యం వుంది కదా, రొమ్ములో సీతారామ లక్ష్మణుల బదులు ఏ మడోన్నానో, ఏ బ్రిట్నీ స్పియర్సోనో పెట్టి – మీరంతా ఆంజనేయుడు ఆజన్మబ్రహ్మచారి అనుకుంటారు కానీ ఆయన మనస్సులో వున్నది యీ న్యూడ్ స్టార్స్ అని చెప్పినట్టు – ఒకటి వేయించారా, మా హైదరాబాదు మళ్లీ పదేళ్లు లేవలేనంత దారుణంగా దెబ్బ తినేస్తుంది. హైదరాబాదు కట్టినందుకు కులీ కుతుబ్ షా, కూల్చినందుకు హుస్సేన్ చరిత్రలో మిగిలిపోతారు. ఈ హుస్సేన్‌ను భుజాన వేసుకుని మోసే మేధాజీవులు యీ సూచనను తప్పక పరిశీలిస్తారని నా నమ్మకం! **– ఎమ్బీయస్ ప్రసాద్**